www.visalaandhra.com
స్థాపితం : 1952

విశాలాంధ్ర

VISALAANDHRA Regd No.VJ/042/2018-20
అక్షరాక్షరం అభ్యుదయం

సంపుటి : 68 సంచిక : 213 | శనివారం 26-01-2019 | Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam | వెల: రూ.4.00 | పేజీలు : 12+ టాబ్లాయిడ్ | విజయవాడ ప్రచురణ

ఇక ఐక్య పోరాటం



పవన్‌తో సురవరం, రాఘవులు ముఖాముఖి

- విశాఖలో జనసేన, సీపీఐ, సీపీఎం నేతల భేటీ
- పర్యావరణం, గనులు, భూసేకరణ, విభజన హామీలపై ఉద్యమిస్తాం
- ఫిబ్రవరిలో సీట్ల సర్దుబాటుపై చర్చిస్తాం
- సురవరం, రాఘవులు, పవన్ ప్రకటన



విశాఖలో సమావేశమైన సుధాకరరెడ్డి, పవన్, రాఘవులు, మధు, రామకృష్ణ, గంగాధర్, ముప్పాళ్ల, జేవీఎస్ మూర్తి, జల్లి విల్సన్ తదితరులు

విశాలాంధ్ర బ్యూరో–విశాఖ సిటీ : రాష్ట్రంలో రాజకీయ పోరాటానికి పలు అంశాలపై తమ మధ్య ఏకాభిప్రాయం కుదిరినట్టు జనసేన అధినేత పవన్‌కల్యాణ్, వామపక్షాల అగ్రనేతలు సురవరం సుధాకరరెడ్డి, బీవీ రాఘవులు ప్రకటించారు. మూడు పార్టీలు ఇక నుంచి ఐక్యపోరాటాలను మరింత ఉధృతం చేస్తాయని స్పష్టం చేశారు. రాష్ట్రానికి మూడో ప్రత్యామ్నాయం అవసరమని పునరుద్ఘాటించారు. విశాఖలో గల రుషికొండ సమీపంలోని సాయిప్రియ రిసార్ట్స్‌లో 3 గంటల పాటు జనసేన, సీపీఐ, సీపీఎం మధ్య శుక్రవారం జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో పలు అంశాలపై ఏకగ్రీవ తీర్మానాలు చేశారు. సీట్ల సర్దుబాటుపై ఫిబ్రవరిలో మరోసారి సమావేశమై చర్చిస్తామని నాయకులు స్పష్టం చేశారు. పవన్ కల్యాణ్, సీపీఐ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకరరెడ్డి, సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు సహా సీపీఐ, సీపీఎం రాష్ట్ర కార్యదర్శులు కె.రామకృష్ణ, పి.మధు, ఇతర నాయకులు ముప్పాళ్ల నాగేశ్వరరావు, జేవీ సత్యనారాయణమూర్తి, జల్లి విల్సన్, వి.శ్రీనివాసరావు, వై.వెంకటేశ్వరరావు, సీహెచ్ నర్సింగరావు, జనసేన నేతలు నాదెండ్ల మనోహర్, పార్థసారధి,

- మిగతా 2 లో



ప్రణబ్‌కు భారత రత్న

- ప్రగతిశీల వాగ్గేయకారుడు భూపేన్ హజారికా
- ఆర్ఎస్ఎస్ నేత నానాజీకీ ఇదే అత్యున్నత పురస్కారం

ఢిల్లీ: మాజీ రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ సహా ముగ్గురు ప్రముఖులకు రాష్ట్రపతి భవన్ భారతరత్న పురస్కారాన్ని ప్రకటించింది. గణతంత్ర దినోత్సవం సందర్భంగా దేశానికి అత్యున్నత సేవలందించిన ఈ ముగ్గురిని ఎంపిక చేసింది. నానాజీ దేశ్‌ముఖ్, భూపేన్ హజారికాకు మరణానంతరం

- మిగతా 2 లో

పసుపు, కుంకుమ @ రూ.9,400 కోట్లు



- ప్రతీ చెల్లెమ్మ పారిశ్రామిక వేత్త కావాలి
- ముగ్గురు మోడీలు ఏకమై అభివృద్ధిని అడ్డుకుంటున్నారు
- పోలవరం ప్రాజెక్టు పనులు 64 శాతం పూర్తి
- డ్వాక్రా మహిళల సమ్మేళనాల్లో సీఎం

విశాలాంధ్ర బ్యూరో – కడప/అమరావతి/విశాఖ : రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 94 లక్షల మంది డ్వాక్రా మహిళలందరికీ పసుపు, కుంకుమ కింద రూ.9,400 కోట్లు చెక్కుల రూపంలో అందజేస్తామని, ప్రతీ ఒక్కరికీ స్మార్ట్ ఫోన్ ఇస్తామని, మీరంతా అండగా నిలవాలంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మహిళలను కోరారు. ఒక్కో మహిళకు పసుపు, కుంకుమ కింద ఫిబ్రవరి 1న రూ.2,500, మార్చి 3న రూ.3,500, ఏప్రిల్ 5న రూ.4 వేలు

- మిగతా 2 లో

ఎన్టీఆర్ ఇళ్లు అవినీతి గూళ్లు..!



మెట్టూరులో పునాది దశలోనే పూర్తి బిల్లు విడుదలైన నిర్మాణమిదే

ఇందిరమ్మ ఇళ్లు పోయాయి.. ఎన్టీఆర్ పథకమొచ్చింది.. పార్టీలు మారాయి ... పాలకులూ మారారు.. పేదోడికి గూడు దక్కటం లేదు. పేరేది పెట్టినా పేదోళ్ల ఇల్లు అవినీతి గూళ్లు అన్న ప్రచారం జోరుగా సాగుతోంది. గూడు దక్కేదెప్పుడు, ఆ నీడన సేద తీరేదెప్పుడో తెలీక.. పేదోడు మాత్రం విలవిల్లాడుతూనే ఉన్నాడు. పేరుకు సర్కారు వేల కోట్లు మంజూరు చేసినట్టు చెబుతున్నా... సొంతింటి కల సాకారానికి అప్పోసప్పో చేసి ఇల్లు కట్టుకుంటే... ప్రతి దశలోనూ అధికారులు పర్సంటేజీలు పిండుకొంటున్న వైనం సిక్కోలు జిల్లాలో తేటతెల్లమైంది. వసూళ్ల బాధ్యతను తెలుగు తమ్ముళ్లు భుజానికి ఎత్తుకోగా... ఇల్లు కట్టనోళ్లకీ బిల్లులు మంజూరు చేయిస్తున్న తీరు అక్రమాల తారాస్థాయిని నిరూపిస్తోందంటే ఏమాత్రం అతిశయోక్తి కాదు.

పర్సంటేజీ తప్పనిసరి.. లేదో బిల్లుకు చిల్లే..!

- ఐదుశాతం వసూలు
- వంశధార కాలనీల్లోనూ అక్రమాలే
- చేయితడపందే సొమ్ము జమాకాదు



శ్రీకాకుళం జిల్లాలో ఎన్టీఆర్ ఇళ్ల ప్రగతి :

మంజూరైన ఇళ్లు	: 17,200
గుర్తించిన అర్హులు	: 16,226
నిర్మాణం కానివి	: 4115
పూర్తయిన ఇళ్లు	: 458
శ్లాబు దశలో ఉన్నవి	: 772
పిల్లర్లు పూర్తయినవి	: 2863
పునాదుల దశలో	: 763

బిల్లు చెల్లింపు దశలు మున్సిపాలిటీలో :

పునాదులు	: రూ. 24,149
లింటల్ వరకూ	: రూ. 72,650
శ్లాబుకు	: రూ. 96,950
ఇల్లు పూర్తయితే	: రూ. 48,475

11లో

ఓటు వినియోగం పవిత్రం

- బహుళత్వం మన బలం
- రిపబ్లిక్ దినోత్సవ సందేశంలో రాష్ట్రపతి కోవింద్



న్యూఢిల్లీ : 70వ రిపబ్లిక్ దినోత్సవం సందర్భంగా దేశప్రజలకు రాష్ట్రపతి ఇచ్చిన సందేశంలో రానున్న లోక్‌సభ ఎన్నికల అంశాన్ని ముఖ్యమైనదిగా ఎంచుకున్నారు. ఓటు హక్కును వినియోగించుకోవడం 'పవిత్రమైన చర్య' అని కోవింద్ అన్నారు. 'ఈ దేశం ప్రతి ఒక్కరిదీ.. మనందరిదీ, ప్రతి గ్రూపు, ప్రతి తరగతి ప్రజలు, ప్రతి ప్రాంతం, ప్రతి ఒక్కరికీ గుర్తింపు' ఉంది. త్వరలో లోక్‌సభ ఎన్నికలు రానున్నాయి. ఎన్నికల్లో ఓటు వేయడం పవిత్రమైన కార్యక్రమం. ఈ ఏడాది ఎన్నికలను 'ఈ శతాబ్దిలో అతి ముఖ్యమైన సందర్భం' అని ఆయన అన్నారు. ఈ ఎన్నికలు 21వ శతాబ్దిలో దేశానికి ఒక రూపం ఇస్తాయని ఆయన గుర్తు చేశారు. ఎన్నికలు కేవలం రాజకీయ కసరత్తు మాత్రమేకాదు... విజ్ఞత, కార్యాచరణకు ఇది ఉమ్మడి పిలుపు, 17వ

- మిగతా 2 లో

పోరాటమే.. ద్వేషం లేదు
- అధికారమిస్తే పది రోజుల్లో రుణమాఫీ
- మోడీ, పట్నాయక్ పాలన ఒకటే
- భువనేశ్వర్‌లో రాహుల్‌గాంధీ

9లో

ఈసీ టోల్ ఫ్రీ 1050

11లో

ఈబీసీ కోటాపై కేంద్రానికి సుప్రీం నోటీసులు

11లో



విరిసిన 'పద్మ'లు






న్యూఢిల్లీ : ఈ ఏడాది 112 మంది ప్రముఖులకు రాష్ట్రపతి భవన్ పద్మభూషణ్, పద్మశ్రీ అవార్డులను ప్రకటించింది. పద్మశ్రీ వరించిన వారిలో నలుగురు తెలుగు ప్రముఖులు ఉన్నారు. వారిలో ఇద్దరు ఏపీ వారు కాగా, మరో ఇద్దరు తెలంగాణ ప్రముఖులు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన గ్రాండ్ మాస్టర్ ద్రోణవల్లి హారిక, వ్యవసాయ వేత్త యడ్లపల్లి వెంకటేశ్వరరావుకు పద్మశ్రీ అవార్డు దక్కింది. ఇక తెలంగాణకు చెందిన ఫుట్‌బాల్ క్రీడాకారుడు చెత్రి సునీల్‌కు, ప్రముఖ గేయరచయిత సిరివెన్నెల సీతారామ శాస్త్రికి పద్మశ్రీ గౌరవం దక్కింది. పద్మభూషణ్ దక్కించుకున్న వారిలో ఇస్మాయిల్ ఒమర్ గులే, అనిల్‌కుమార్ మణీభాయ్, బల్వంత్ మోరేశ్వర్ పురందరే, టీజెన్


- మిగతా 2 లో

గణతంత్ర వేడుకలకు భారీ భద్రత

- 25 వేల భద్రతా, కేంద్ర బలగాల మోహరింపు
- 32 మంది మహిళా కమాండోలు, 3 వేల మంది ట్రాఫిక్ పోలీసులతో పర్యవేక్షణ

9లో





సూడాన్‌లో వెల్లువెత్తిన నిరసన



ఖర్టౌం: అన్నిరకాల వస్తువుల ధరలను పెంచిన ప్రభుత్వానికి వ్యతిరేకంగా సూడాన్‌లో నిరసనలు వెల్లువెత్తాయి. గత డిసెంబరులోనే దేశవ్యాప్తంగా ప్రదర్శనలు నిర్వహించారు. తాజాగా ప్రభుత్వ వ్యతిరేక ప్రదర్శనలు ఉధృతమయ్యాయి. సూడాన్ రాజధాని ఖర్టౌంను ఈ ప్రదర్శనలు చుట్టుముట్టాయి. ప్రదర్శననుండి బైటకువచ్చిన ఒక డాక్టరు నిర్మానుష్యంగాఉన్న వీధుల్లోకివచ్చి ప్రభుత్వవ్యతిరేక నినాదాలు చేసారు. అతన్ని భద్రతాసిబ్బంది నిలిపివేసి గాయపరచినట్లు తెలుస్తోంది. గతవారం కూడా నిరసన ప్రదర్శనల సందర్భంగా తానుగాయపడినట్లు ఆయన చెప్పారు. దేశ అధ్యక్షుడు పదవికి రాజీనామా చేసి దిగిపోవాలని ప్రదర్శకులు డిమాండ్ చేసారు. గురువారం జరిగిన ప్రదర్శన సందర్భంగా తుపాకి కాల్పులువిన్న డాక్టర్ బేబికర్(27) తటాలున భూమిపైన పడుకున్నారు. అయితే తుపాకితూటా అతడిపైకే దూసుకువచ్చింది. తీవ్రంగా గాయపడిన డాక్టర్ ఆ తరువాత చనిపోయారు. డాక్టర్ మృతి తర్వాత నిరసనలు మరింత పెరిగాయి. ఐదునెలలుగా ప్రజల ఆందోళన కొనసాగుతూనే ఉంది. 30ఏళ్లపాటు దేశాన్ని పాలించిన అధ్యక్షుడు ఒమర్ హసన్ అల్-బషీర్‌కు పదవిని వదలడం తప్పదేమోనని భావిస్తున్నారు. బషీర్ నియంతపాలనకు వ్యతిరేకంగా ప్రజలు ఈ ఆందోళనకు పూనుకున్నారు. దేశ రాజధానిలో దాదాపు ప్రతిరోజు నిరసన ప్రదర్శనలు సాగుతూనే ఉన్నాయి. ప్రదర్శకులు నైలునది ఒడ్డున ఉన్న జాతీయ అసెంబ్లీ భవనంవద్దకు ప్రదర్శకులు చేరుకునేందుకు ప్రయత్నించి విఫలమయ్యారు. భద్రతాసిబ్బంది వారిమీద లాఠీఛార్జి జరిపి బాష్పవాయుగోళాలు ప్రయోగించడమేకాక తుపాకి కాల్పులుకూడా జరిపారు.

అమెరికాలో నిరుద్యోగ భృతి కోసం

25వేల మంది ఉద్యోగుల దరఖాస్తు



వాషింగ్టన్ : అమెరికా ఫెడరల్ ఉద్యోగులు తమకు నిరుద్యోగభృతి ఇప్పించాలని కోరుతూ ఈనెల 12వ తేదీతో ముగిసిన వారాంతానికి దరఖాస్తు చేసుకున్న వారి సంఖ్య 25,419కి చేరింది. అంతక్రితం వారానికి వీరి సంఖ్య 10,454 ఉన్నదని, తాజాగా అది మరింత పెరిగిందని కార్మికశాఖ గురువారం ప్రకటించింది. గత ఏడాది ఇదేకాలంలో కేవలం 1658 మంది మాత్రమే నిరుద్యోగ భృతికోసం దరఖాస్తు చేశారు. దరఖాస్తు చేసుకున్న ఫెడరల్ ఉద్యోగులు తమకు ఉద్యోగాలు లేవనికాకుండా మరో ప్రోగ్రాం కింద ఈ దరఖాస్తు చేసుకున్నట్టు కార్మికశాఖ తెలిపింది. ప్రభుత్వం పాక్షికంగా మూతపడినందున వేతనాలు లేకుండా పనిచేయవలసి వచ్చిందని, అందువల్ల తమకు నిరుద్యోగభృతి చెల్లించాలని వారు దరఖాస్తు చేసుకున్నారు. మామూలుగా అయితే రెగ్యులర్ ప్రోగ్రామ్స్‌కింద వీరు ఉద్యోగం చేస్తున్నందున దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం లేదు. ఫెడరల్ ప్రభుత్వ సూచనకు విరుద్ధంగానే అనేక రాష్ట్రాలు పనిచేస్తూ వేతనాలు లేకుండావున్న ఉద్యోగులకి నిరుద్యోగ భృతి చెల్లించాలని నిర్ణయించాయి. ఇలాంటి ఉద్యోగులకి నిరుద్యోగ భృతి చెల్లించనవసరంలేదని కార్మికశాఖ ఈమెయిల్ ద్వారా వివిధ రాష్ట్రాలకు సందేశాన్ని పంపిందని సిఎన్ఎన్ వార్తాసంస్థ తెలియజేసింది. ఇలా లేఖ పంపించడం అసాధారణమైన అంశమని కాలిఫోర్నియా గవర్నర్ గవిన్‌న్యూసం వ్యాఖ్యానించారు. అయితే తాము నిరుద్యోగ భృతిని చెల్లించడానికే సుముఖంగా ఉన్నామని చెప్పారు. ఇలా సందేశం పంపించడం సిగ్గుచేటని ఆయన వ్యాఖ్యానించారు. తప్పనిసరిగా పనిచేయవలసి వస్తున్న కార్మికులకు నిరుద్యోగ భృతి చెల్లిస్తామని ఆయన తెలిపారు. వాషింగ్టన్ డిసి మేయర్ మురియల్‌బౌజర్ ఒక ప్రకటనలో అర్హమైన కార్మికులకు నిరుద్యోగభృతిని ఇవ్వవలసిందిగా సిటీ కౌన్సిల్‌కు అత్యవసర లేఖను పంపారు. వెర్మాంట్ గవర్నర్ ఫిల్‌స్కాట్ కూడా తాము నిరుద్యోగ భృతిని చెల్లిస్తామని తెలియజేశారు. ఈ ఏడాది మొదటి 3 నెలలకాలంలో ఆర్థిక వృద్ధిరేటు దాదాపు సున్న అని వైట్‌హౌస్ ఆర్థిక సలహాదారుల మండలి ఛైర్మన్ కెవిన్‌హస్సెట్ సిఎన్ఎన్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో తెలిపారు.


ఇరాన్ టీవీ జర్నలిస్టు విడుదల



వాషింగ్టన్: వారంక్రితం అరెస్టుచేసిన ఇరాన్ టీవీ జర్నలిస్టు మార్జిహ్ హాషేమి(59)ని ప్రభుత్వ అధికారులు విడుదల చేసారు. ఆమె అరెస్టు అమెరికా, ఇరాన్‌ల మధ్య వారానికి పైగా ఉద్రిక్తతను కల్పించింది. హాషేమి ఇరాన్ ప్రెస్‌టీవీకి విలేకరిగా పనిచేస్తున్నారు. జనవరి13న ఆమెను ఎఫ్‌బిఐ కస్టడీలోకి తీసుకుని విచారణ జరిపిందనీ, ఎలాంటి నేరానికి పాల్పడలేదని రుజువైన తర్వాత విడుదల చేసారని ఆమె కుమారుడు తెలిపాడు. ముస్లిం విశ్వాసాలను గౌరవించకుండా ఆమె ధరించిన స్కార్ఫ్‌ను అమెరికా అధికారులు తొలగించారని పైగా ఆమెకు హలాల్ చేయని ఆహారాన్ని అందించారని ఇరాన్ నాయకులు, ఆమె కుటుంబసభ్యులు విమర్శించారు. హాషేమి లూసియానాలో జన్మించినప్పటికీ, దశాబ్దిక్రితం ఇరాన్‌కు వెళ్లిపోయారు. అప్పుడప్పుడు తమ బంధువులను చూసేందుకు వాషింగ్టన్ వెళుతుంటారు. ఈ సందర్భంగానే ఆమెను అధికారులు అరెస్టుచేసి ఎఫ్‌బీఐకి అప్పగించారు. మూడుసార్లు విచారణ జరిపిన అనంతరం ఆమెను విడుదల చేసారు.

మదురోకు సైన్యం బాసట

కొనసాగుతున్న ప్రతిష్టంభన



కారకాస్ : అమెరికా అండదండలతో వెనిజులాలో ప్రతిపక్ష నాయకుడు జాన్‌గుయిడో తిరుగుబాటు చేసిన నేపథ్యంలో ప్రభుత్వానికీ, ప్రతిపక్షానికీ మధ్య ప్రతిష్టంభన కొనసాగుతోంది. అధ్యక్షుడు నికొలస్ మదురొకు సైన్యం పూర్తిగా బాసటగా నిలుస్తున్నట్టు ప్రకటించింది. వెనిజులాకు శక్తివంతమైన సైన్యం ఉన్నది. గుయిడొకు అమెరికా అన్నిరకాల సహాయాన్ని అందించేందుకు సిద్ధంగా ఉన్నట్టు ప్రకటించగా మదురొకు రష్యా, చైనా, క్యూబా, బొలీవియా, టర్కీ, మెక్సికో తదితర దేశాలు తమ మద్దతును ప్రకటించాయి. దేశంలో రాజకీయ సంక్షోభం నెలకొనివున్నందున సమస్య పరిష్కారానికి చర్చలు జరపాలని ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి గుటెర్రస్ సూచన చేశారు. గుయిడొ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా నిరసన ప్రదర్శనల సందర్భంగా జరిగిన ఘర్షణల్లో 26 మంది చనిపోయినట్టు తెలుస్తోంది. ట్రంప్ మదురొ ప్రభుత్వం చట్టవిరుద్ధమైందని ఆరోపించారు. స్వతంత్ర దేశ వ్యవహారాలలో జోక్యం చేసుకోరాదన్న అంతర్జాతీయ చట్టాలను, నియమాలను అమెరికా ఎంతమాత్రం లెక్కచేయని సందర్భాలు అనేకం వున్నాయి. మదురొకు అనుకూలంగా సైతం భారీ ప్రదర్శనలు జరిగాయి. రెండు పక్షాలు ప్రదర్శనలో జరుపుతుండటంతో పరిస్థితి కల్లోలంగా ఉన్నది. గత ఏడాది అధ్యక్ష పదవికి జరిగిన ఎన్నికల్లో ప్రతిపక్షం పోటీ చేయకుండా మదురొను రాజీనామా చేయవలసిందిగా డిమాండ్ చేసింది. కొత్త రాజ్యాంగం రూపొందించడానికి ఏర్పాటు చేసిన రాజ్యాంగ అసెంబ్లీలోను ప్రతిపక్షం పాల్గొనకుండా అనేక ఆటంకాలు కల్పించింది. ఇదిలావుండగా మదురొనే చట్టబద్ధంగా ఎన్నికైన అధ్యక్షుడని రక్షణశాఖ మంత్రి వ్లదిమిర్‌పడ్రినొ తెలిపారు. తిరుగుబాటును అణచివేసి తమ ప్రభుత్వాన్ని కాపాడుకుంటామని ఆయన చెప్పారు. పడ్రినొతో పాటు 8 మంది సైనిక జనరల్స్ మదురొను కలుసుకొని ఆయన ప్రభుత్వానికి బాసటగా వుంటామని హామీ యిచ్చినట్టు ప్రభుత్వ టెలివిజన్ వార్తను అందించింది. సుప్రీంకోర్టు కూడా మదురొనే న్యాయబద్ధమైన అధ్యక్షుడని పునరుద్ఘాటించింది. విదేశీ ప్రభుత్వాల అండదండలతో వెనిజులాలో తిరుగుబాటు కుట్ర జరుగుతున్నదని కోర్టు అధ్యక్షుడు మైకేల్‌మొరెనొ తెలిపారు. మదురొకు సైన్యం పూర్తి మద్దతు ప్రకటించినందున ఆయన ప్రభుత్వం పడిపోయే అవకాశం తక్కువేనని అంతర్జాతీయ విశ్లేషకులు భావిస్తున్నారు. వెనిజులాలో సంక్షోభంపైన చర్చించేందుకు ఐక్యరాజ్యసమితి భద్రతామండలి తక్షణం సమావేశం కావాలని అమెరికా కోరింది.

విస్కీపై భారత సుంకం తగ్గాలి : ట్రంప్

వాషింగ్టన్ : అమెరికానుండి దిగుమతి చేసుకునే హార్లీ-డేవిడ్‌సన్‌లాంటి మోటారు సైకిళ్లపైన దిగుమతి సుంకాన్ని భారతదేశం గత ఏడాది ఫిబ్రవరిలో తగ్గించింది. ఇందుకు సంబంధించిన న్యాయబద్ధమైన ఒప్పందం హార్లీడేవిడ్‌సన్ కంపెనీతో కుదిరినట్టు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వెల్లడించారు. తమ విస్కీపైన భారతదేశం అత్యధికంగా సుంకాలు విధిస్తున్నదని ఆయన అన్నారు. వైట్‌హౌస్‌లో గురువారం రిసిప్రోకల్‌ట్రేడ్‌యాక్ట్ (ఇచ్చిపుచ్చుకునే వాణిజ్య చట్టం) చట్టం గురించి వివరిస్తూ వివిధ దేశాలు తమ వస్తువులపైన ఈ చట్టంతో నిమిత్తం లేకుండానే సుంకాలు విధిస్తున్నాయని తెలిపారు. భారత్‌కు సరఫరా చేసే మోటారు సైకిళ్లపై 100 శాతం సుంకం విధించవలసివుండగా 50 శాతం తాను తగ్గించానని చెప్పారు. న్యాయబద్ధమైన ఒప్పందం కుదిరిందని అన్నారు. అయితే తమ దేశం సరఫరాచేసే విస్కీ తదితర మద్యం ఉత్పత్తులపైన భారత్ ఎక్కువగా సుంకాలు విధిస్తున్నదని ఆయన ఆరోపించారు. చాలా ఎక్కువ సుంకాలను భారత్ విధిస్తుందని, విస్కీపైన అది 150 శాతం ప్రయోజనం పొందుతున్నదని, తమకు ఏమాత్రం ప్రయోజనం లేదని పేర్కొన్నారు. పలువురు ఎంపీలతో ఆయన మాట్లాడుతూ అమెరికాలో కార్మికులు న్యాయబద్ధంగా పనిచేస్తున్నారని వివిధ దేశాలకు సంబంధించిన వ్యవహారాలలో సమతులంగా వ్యవహరిస్తున్నారని చెప్పారు. సుంకాలను నిర్ణయించేముందు సుంకాలులేని ఆటంకాలపైన యోచించాలని ఆయన కోరారు. అనేక దేశాలు ఈ విషయంలో అమెరికాను చులకన చేస్తున్నాయన్నారు. ఆ దేశాలు తమ వస్తువులపైన సుంకాలను, పన్నులను విధిస్తున్నాయని తమను ఏ దేశమూ అర్థం చేసుకోవడంలేదని అన్నారు. సుంకాల విధింపులో అనేక దేశాలు అన్యాయంగా వ్యవహరిస్తున్నాయని చెప్పారు.

రూ.9,400 కోట్లు

(మొదటిపేజీ తరువాయి)

చొప్పున మొత్తంగా రూ.10 వేలు అందజేసి వారు డ్రా చేసుకునే వెసులుబాటు కల్పిస్తాం. ప్రతీ చెల్లెమ్మ పారిశ్రామిక వేత్తలుగా కావాలని సీఎం ఆకాంక్షించారు. కడప, అమరావతిలోని నేలపాడు, విశాఖ పట్టణంలలో శుక్రవారం జరిగిన మహిళా స్వయం సహాయకసంఘాల ప్రాంతీయ సమ్మేళన కార్యక్రమాల్లో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. కడపలోని మునిసిపల్ మైదానంలో జరిగిన సమ్మేళనానికి కడప, చిత్తూరు, కర్నూలు, అనంతపురం, నెల్లూరు జిల్లాలకు చెందిన సుమారు 40 వేల మందికిపైగా డ్వాక్రా మహిళలు తరలి వచ్చారు. మహిళలను ఉద్దేశించి సీఎం ప్రసంగిస్తూ తన హయాంలోనే డ్వాక్రా సంఘాలు రూపుదిద్దుకున్నాయని, ప్రస్తుతం 94 లక్షల మంది సభ్యులు ఉన్నారని, మరో 6 లక్షలు చేరితే కోటి మంది సైన్యం అవుతారన్నారు. వైఎస్ హయాంలో డ్వాక్రా మహిళలకు రూ.207 కోట్లు ఇస్తే, తాను రూ.20 వేల కోట్లు ఇచ్చానని చెప్పారు. రాష్ట్ర విభజన అనంతరం ఎన్నో కష్టాలు, లోటు బడ్జెట్ ఉన్నప్పటికీ అభివృద్ధి సంక్షేమ పథకాలు అమలు చేస్తూ విజన్‌తో ముందుకెళ్తున్నామన్నారు. రాష్ట్ర అభివృద్ధికి ఢిల్లీ మోడీ, హైదరాబాద్ మోడీ, పులివెందుల మోడీ అడ్డు పడుతున్నారని ధ్వజమెత్తారు.

నాలుగున్నరేళ్లలో పసుపు, కుంకుమ కింద రూ.21,116 కోట్లు అందించామన్నారు. మహిళలందరికీ స్మార్ట్ ఫోన్ అందిస్తున్నామని, దీంతో మెరుగైన జీవనం, ఇబ్బంది పడని వ్యవస్థ వారి దరి చేరుతుందని ఆయన తెలిపారు. ఎన్‌టీఆర్ భరోసా పింఛన్లను ఫిబ్రవరి నుంచి రూ.2 వేలు ఇస్తున్న ఏకైక సర్కార్ టీడీపీ ప్రభుత్వమన్నారు.

చంద్రన్న బీమా పథకంలో 95 శాతం సంతోష స్థాయి ఉండటం అభినందనీయమన్నారు. ఎంఎస్ఎంఈ పార్కులను స్థాపించి అక్కడ కరెంటు, నీరు, గోడౌన్‌లు, రోడ్లు, ఇలా అన్ని వసతి సౌకర్యాలు కల్పించి మహిళలను పారిశ్రామిక వేత్తలుగా చేస్తామన్నారు. మహిళలను పెద్ద ఎత్తున సాధికార మిత్ర, గృహ మిత్ర, బీమా మిత్ర, పశుమిత్ర, కళ్యాణ మిత్ర రకరకాలుగా నియమించి వారికి అధికారాన్ని కట్టబెట్టామన్నారు.

మెప్మాలో హెచ్ఆర్ పాలసీ అమలు చేస్తాం

సెర్ప్ ఉద్యోగులకు 30 శాతం జీతాలు పెంచుతున్నామన్నారు. మెప్మాలో హెచ్ఆర్ పాలసీని అమలు చేస్తామన్నారు. ప్రకృతి సేద్యంలో ఏపీ దేశంలోనే ముందుందని, దేశంలో 6.6 శాతం ఉండగా రాష్ట్రంలో 8 శాతం ఉందని, 2024కు 80 లక్షల హెక్టార్లలో 60 లక్షల మంది రైతులు ప్రకృతి సేద్యం చేస్తారని చెప్పారు. పోలవరం ప్రాజెక్టు పనులు 64 శాతం పూర్తయ్యాయని అన్నారు. ప్రజలకు పథకాలు సక్రమంగా అందాలన్నా, అభివృద్ధి జరగాలన్నా సులభతర ప్రభుత్వం రావాలని, అధికారంలో ఉన్న ప్రభుత్వాలకు అవకాశం ఇస్తే అభివృద్ధి కుంటుపడదన్నారు. సమావేశానికి ముందు ముఖ్యమంత్రి మహిళలతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, మంత్రులు ఆదినారాయణ రెడ్డి, పరిటాల సునీత, అఖిల ప్రియ, రాజ్యసభ సభ్యుడు సీయం రమేష్, ఎంపీ జేసీ దివాకర్ రెడ్డి, ప్రభుత్వ విప్ రామసుబ్బారెడ్డి, మాజీ మంత్రులు అహ్మదుల్లా, బ్రహ్మయ్య, కలెక్టర్ హరికిరణ్, టీడీపీ నేత శ్రీనివాస రెడ్డి, టీటీడీ చైర్మన్ పుట్టా సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఇక ఐక్య పోరాటం

(మొదటిపేజీ తరువాయి)

పి.బాలరాజు, మాదాసు గంగాధరం సమావేశంలో పాల్గొన్నారు. కాలుష్యంతో దేశం ప్రమాదంలో ఉందని, నదులు, చెరువులు కలుషితమై ప్రజల ప్రాణాలు గాలిలో కలుస్తున్నాయని నాయకులు ఆందోళన చెందారు. ఉద్దానం వంటి కిడ్నీ వ్యాధులకు వాతావరణంలో మార్పులే కారణమన్నారు. విశాఖ ఏజెన్సీలో బాక్సైట్ తవ్వకాలను మూడు పార్టీలు ముక్తకంఠంతో వ్యతిరేకించాయన్నారు. గనుల తవ్వకాలపై ఉమ్మడి ఉద్యమాలు చేపడతామని ప్రకటించారు. 2013 భూసేకరణ చట్టాన్ని సక్రమంగా అమలు చేయాలని, బలవంతపు భూసేకరణను ఆపాలని డిమాండు చేశారు. ఈవీఎంల పనితీరుపై నిపుణుల కమిటీ వేయాలని సమావేశం నిర్ణయించిందన్నారు.

భేటీ అనంతరం మీడియా సమావేశంలో సురవరం సుధాకరరెడ్డి మాట్లాడుతూ ఈవీఎంలపై వచ్చిన అనుమానాలను నివృత్తి చేయాల్సిన బాధ్యత కేంద్ర ఎన్నికల కమిషన్‌పై ఉందని అన్నారు. తెలంగాణ ఎన్నికల్లో పోలైన ఓట్లకు కౌంటింగ్ ఓట్లకు తేడా ఉందన్నారు. కొన్ని నియోజకవర్గాల్లో విజయాలు తారుమారయ్యాయన్నారు. ఈ అనుమానాలను నివృత్తి చేయడానికి నిపుణుల కమిటీ వేయాలని డిమాండు చేస్తున్నామన్నారు. పర్యావరణ పరిరక్షణ తక్షణ కర్తవ్యంగా మారిందన్నారు. కాలుష్యంపై మూడు పార్టీలు తీవ్రంగా ఆందోళన చెందుతున్నాయన్నారు. దేశంలో లక్షలాది మంది కాలుష్యం బారిన పడి చనిపోతున్నారని. మన రాష్ట్రంలో నదులు, చెరువులు కలుషితమవుతున్నాయన్నారు. నీటి కాలుష్యం కారణంగా ఉద్దానంలో కిడ్నీ సమస్యలు తలెత్తాయన్నారు. ఉత్తరాంధ్రలో అక్రమ బాక్సైట్ మైనింగ్ తవ్వకాలపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి ఉందని పేర్కొంటూ అక్రమ మైనింగ్‌పై పోరాడుతామన్నారు. మైనింగ్‌కు తాము వ్యతిరేకం కాదని, అయితే చట్టబద్ధమైన, హేతుబద్ధమైన పద్ధతుల్లో మైనింగ్ జరగాలని తీర్మానించామన్నారు. అక్రమ మైనింగ్ దేశంలో ప్రధాన సమస్యగా మారిందన్నారు. మైనింగ్ వల్ల పర్యావరణ సమస్యలు తలెత్తడంతో గోవాలో మొత్తం గనులు మూసేశారని. వేల సంఖ్యలో కార్మికులు నిరుద్యోగులయ్యారన్నారు. సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు మాట్లాడుతూ మూడు పార్టీలు కలిస్తే రాష్ట్రం పురోగమిస్తుందని, రాష్ట్రంలో రాజకీయ పోరాటం జరగాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. జగన్, బాబు కాదని, మూడో ప్రత్యామ్నాయంగా జనసేన నేతృత్వంలో వామపక్షాలు ప్రత్యామ్నాయ శక్తిగా ఆవిర్భవిస్తాయన్నారు. రాష్ట్ర రాజకీయ భవిష్యత్ మారాలంటే ప్రత్యామ్నాయ శక్తులు బలపడాలని అన్నారు. ప్రత్యేక హోదా విషయంలో కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రజలను మోసం చేసిందన్నారు. వాగ్దానాలు అమలు చేయడంలో ఘోరంగా విఫలమైందన్నారు. ఇప్పటికే మూడు పార్టీలు కలిసి అనేక ఆందోళనలు నిర్వహించాయన్నారు. ఈ సమస్యలపై ప్రజా ఉద్యమాలతోపాటు రాజకీయ పోరాటాలు చేయాల్సిన పరిస్థితి ఉందన్నారు. రాష్ట్రంలో ఉన్న వనరులు, సంపద, గనులు, నీరు భవిష్యత్ తరాలకు చెందినవేనని, రాజకీయ నాయకులు దోచుకోడానికి కాదన్నారు. యువతరానికి పవన్ కల్యాణ్ వేగుచుక్కగా ఉండాలని, రాష్ట్ర రాజకీయాల్లో నిజమైన ప్రత్యామ్నాయంగా ప్రజాపక్షంగా ముందుకు రావాలని రాఘవులు ఆకాంక్షించారు. మూడు పార్టీలు కలిస్తే రాష్ట్రంలో నూతన దృక్పథంతో పురోగమించే అవకాశం ఉందని అభిప్రాయపడ్డారు.

పవన్‌కల్యాణ్ మాట్లాడుతూ రెండు రాజకీయ పార్టీల చేతుల్లో రాష్ట్ర ప్రజలు నలిగిపోతున్నారని. బలమైన గొంతులు కలిస్తే బలమైన పోరాటం సాగుతుందని. ప్రజల్లో పోరాట స్ఫూర్తి ఉందని అన్నారు. రాష్ట్ర అభివృద్ధికి మైనింగ్ అవసరమని. అయితే ఇది ప్రజలకు ఇబ్బంది కాకూడదన్నారు. మైనింగ్ కారణంగా పర్యావరణానికి ఎలాంటి నష్టం కలగరాదన్నారు. ప్రజల తరపున మాట్లాడితే అభివృద్ధి వ్యతిరేకులుగా పాలకులు చిత్రీకరిస్తున్నారని మండిపడ్డారు. వీటికి వ్యతిరేకంగా కలిసి పని చేద్దామని వామపక్ష నేతలను కోరారు. పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అన్నారు. భూ సేకరణ అడ్డగోలుగా సాగుతోందని, విదేశాల్లో 370 హెక్టార్ల విస్తీర్ణంలో స్థాపించిన ఓ సంస్థ 30 వేల మందికి ఉద్యోగాలు ఇస్తే..ఇక్కడ 30 వేల ఎకరాలు బలవంతంగా తీసుకుని కనీసం 10 వేల ఉద్యోగాలు ఇవ్వడం లేదన్నారు. ఏ మూలకు వెళ్లినా ప్రజల్లో పోరాట స్ఫూర్తి బలంగా కనబడుతుందన్నారు. ఆ పోరాటాల్లో ప్రజలను భాగస్వామ్యం చేసేందుకు వామపక్షాలతో కలిసి పని చేస్తానన్నారు. మొదటి నుంచి తనకు సోషలిస్టు భావాలు ఉన్నాయని, వామపక్షాలతో కలిసి పని చేయడానికి అది దోహదపడుతుందన్నారు. మొత్తం ఆరు కీలక అంశాలపై రౌండ్ టేబుల్‌లో చర్చించామని పవన్ తెలిపారు. అధికార, ప్రతిపక్ష పార్టీలు రాజకీయాన్ని కలుషితం చేస్తున్నాయని పవన్ మండిపడ్డారు. హామీల అమలులో టీడీపీ విఫలం కాగా... ప్రశ్నించడంలో వైసీపీ పూర్తిగా వైఫల్యం చెందిందని ఆయన విమర్శించారు.

పవిత్రం

(మొదటిపేజీ తరువాయి)

లోక్‌సభను ఎన్నుకోవడం ద్వారా మనప్రజాస్వామ్య ఆదర్శం, భావాలు అమలులోకి వస్తాయి. 'సమ్మిళితం, బహుళత్వం స్ఫూర్తి వైవిధ్యం, ప్రజాస్వామ్యం, అభివృద్ధిపై ఆధారపడి ఉంటుంది. దేశంలో బహుళత్వం ఎంతో బలమైనది. ప్రపంచానికి ఇది గొప్ప ఉదాహరణ అని అన్నారు. 21వ శతాబ్దిలో జన్మించిన వారికి మొదటిసారిగా ఓటు హక్కును వినియోగించుకునే అవకాశం కలుగుతుంది. ఈ ఎన్నికలు వైవిధ్యానికి, ఏకత్వానికి కూడా సూచికలు. అర్హులైన ఓటర్లంతా ఓటు హక్కు వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ప్రజాస్వామ్యం ఆదర్శమైనది

'మన దేశం కీలకమైన మలుపులో ఉన్నది. 1940, 1950లలో ఉన్నట్లుగా కొన్ని అంశాలలో కీలకమైన, రూపుదాల్చుతున్న కాలంలో దేశం ఉన్నది. ప్రజల ఆకాంక్షలను నెరవేర్చేందుకు అభివృద్ధి చెందిన భారతదేశ నిర్మాణానికి ఈ ఎన్నికలు మైలురాయిలాంటివి. దేశనిర్మాణంలో పాలుపంచుకున్న అన్నితరాల ప్రజలను ఆయన ప్రశంసించారు. మనప్రయాణం పరిపూర్తి కావడానికి ఇంకా ఎంతో కాలం పడుతుంది. 'దాచేందుకు ఇంకా జలాలు ఉన్నాయి. పూడ్చేందుకు ఇంకా అంతరాలు ఉన్నాయి. తుడవాల్సి కన్నీళ్లు ఇంకా ఉన్నాయి' అని కోవింద్ అన్నారు. మన విజయాలను, సాధించినవాటిని తిరిగి అంచనా వేయాలి., పరిమాణం నుండి ప్రమాణానికి బాటలు వేయాలి.. అక్షరాస్యత సమాజం నుండి విజ్ఞాన సమాజం వైపు నడవాలి, అన్ని వర్గాలకు, విభాగాలకు ఇక్కడ చోటు ఉంది. అందరం ఒకే కుటుంబానికి చెందినవారం. 'ప్రతివ్యక్తీ, ప్రతికుమారుడు, ప్రతికుమార్తె విశిష్టతను ప్రోత్సహించాలి' అని కోవింద్ ప్రజలకు సూచించారు. దేశ నిర్మాణంలో మహాత్మా గాంధీ చెప్పినట్లుగా ప్రజలంతా ఒక్కటిగానిలిచి, సామరస్యంగా జీవించాలి.

10 శాతం రిజర్వేషన్లు

పేద కుటుంబాలలోని నైపుణ్యం కలిగిన పిల్లలకు ప్రత్యేక సౌకర్యం కల్పించేందుకుగాను ఇటీవల ఆమోదించిన రాజ్యాంగ సవరణ గాంధీజీ కన్నకలలకు అనుగుణంగానే కాక మనకలలు నెరవేర్చుకునేందుకు మరో అడుగు అని పరోక్షంగా, ఆర్థికంగా వెనుకబడినవాటికి 10 శాతం రిజర్వేషన్లు కల్పించిన అంశాన్ని ప్రస్తావించారు. చరిత్రలో అవకాశాలు లేకుండా ఉన్నగ్రూపులతో సంప్రదింపులు జరపాలని ఆయన అన్నారు. వేగంగా మారుతున్న సమాజంలో అలాంటి సంప్రదింపులకు సిద్ధం కావాలి. మనకంటే తక్కువ ప్రాధాన్యత కలిగిన వర్గాలను అంటే ఉదాహరణకు విభిన్నంగా విభిన్నంగా సమర్థులైనవారిని ఆప్యాయంగా చూడాలి అని అన్నారు. మనం రూపొందించుకున్న సూత్రాలు ఎల్లవేళలా మన మార్గాన్ని తేజోవంతం చేయాలి. మనమే ఈ రాజ్యాంగాన్ని రచించుకున్నాం..రాజ్యాంగ సూత్రాలను పరిరక్షించే బాధ్యత మనపైనే ఉంది అని రాష్ట్రపతి అన్నారు. స్త్రీ, పురుషుల మధ్య సమానత్వం, సమాన అవకాశాలు లభిస్తే అది సామాజిక మార్పునకు మంచి సూచిక అవుతుంది. రాజ్యాంగాన్ని రూపొందించుకుని 70ఏళ్లు అవుతుంది. రాజ్యాంగ రూపకర్త అంబేద్కర్‌ను గౌరవించాలి. రాజ్యాంగాన్ని గౌరవిస్తూ తగిన విధంగా మనం వేడుకలు జరుపుకోవాలి. ఈ ఏడాది మహాత్మాగాంధీ 150వ జన్మదినోత్సవాన్ని కూడా జరుపుకోవాలి అని అన్నారు. చరిత్రలో మొదటిసారిగా తీవ్రపేదరికాన్ని రూపుమాపే దశకు దగ్గరగా ఉన్నాం.. అందరికీ ఆరోగ్యం అందించడమేకాక ప్రజలకు అనుకూలమైన కార్యక్రమాలను అమలుచేస్తున్నాం..రోడ్లు నౌకాయానం,రైళ్లు,విమానాల ద్వారా ప్రయాణం చాలా మెరుగైంది. భారతదేశం సమైక్యంగా, సమ్మిళితంగా ఉంది అని రాష్ట్రపతి అన్నారు.

ప్రణబ్‌కు భారత రత్న

(మొదటిపేజీ తరువాయి)

భారతరత్నకు ఎంపిక చేసింది. రాజకీయాల్లో, ప్రభుత్వరంగంలో ప్రణబ్ ముఖర్జీ అనేక సేవలందించారు. రాష్ట్రపతిగా ఆయన సేవలను కొనియాడిన కేంద్ర ప్రభుత్వం...రక్షణ మంత్రిగా, ఆర్థికమంత్రిగా రాజకీయాల్లో తనదైన ముద్రను వేసిన వ్యక్తిగా ఆయన సేవలు అనన్యమని, అందుకు భారతరత్న పురస్కారంతో సత్కరిస్తున్నట్టు రాష్ట్రపతి భవన్ ప్రకటించింది. సుదీర్ఘ రాజకీయ జీవితంలో ఎన్నో కీలక పదవులు చేపట్టిన ప్రణబ్ ముఖర్జీ ఆర్థిక మంత్రిగా ఎనలేని కీర్తినార్జించారు. ఐదేళ్ల పాటు రాష్ట్రపతిగా సేవలందించారు. రాష్ట్రపతి అంటే కేవలం రబ్బరు స్టాంపు కాదని చాటారు. ప్రభుత్వానికి అవసరమైన సూచనలు చేస్తూ దేశం తరపున గళం విన్పిస్తూ తన ప్రత్యేకత నిలుపుకొన్నారు. గత ఏడాది నాగ్‌పూర్‌లో ఆర్ఎస్ఎస్‌కు (రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్) కార్యక్రమంలో మాట్లాడారు.

ప్రగతిశీల వాగ్గేయకారుడు హజారికా

బహుముఖ ప్రజ్ఞాశాలి, అస్సామీ నేపథ్య గాయకుడు, కవి, దర్శక నిర్మాత, మానవతావాది, ప్రగతిశీల వాగ్గేయకారుడు భూపేన్ హజారికాకు రాష్ట్రపతి భవన్ అత్యున్నత పౌర పురస్కారం 'భారతరత్న' ప్రకటించింది. భూపేన్ హజారికా సుధాకంఠుడిగా చిరపరిచితులు. అస్సామీలోనే పాటలు రాసి పాడినా ఇతర భాషల్లోనూ ఆయన పాటలు ప్రాముఖ్యం పొందాయి. బెంగాలీ, హిందీ భాషల్లోనూ ఆయన తన గానామృతాన్ని పంచారు. జానపద గీతాల్లో హజారికా తనకు తానే సాటి. 1975లో బెస్ట్ మ్యూజిక్ డైరెక్షన్‌కు గాను నేషనల్ ఫిల్మ్ అవార్డు అందుకున్నారు. 1987లో సంగీత్ నాటక్ అకాడమీ అవార్డు, 1977లో పద్మశ్రీ, 2001లో పద్మభూషణ్, 1992లో దాదా సాహెబ్ ఫాల్కే అవార్డు వంటి ఎన్నో పురస్కారాలు అందుకున్నారు. సెప్టెంబరు 8, 1926లో జన్మించిన హజారికా 5 నవంబరు 2011లో కన్నుమూశారు.

నానాజీ దేశ్‌ముఖ్

జనసంఘ్ నేత నానాజీ దేశ్‌ముఖ్ 1999-2005 మధ్య కాలంలో రాజ్యసభ సభ్యుడిగా పని చేశారు. ఆయన సేవలను గుర్తించి 1999లో పద్మ విభూషణ్ ప్రకటించారు. నానాజీ తన 93వ ఏట 2010 ఫిబ్రవరిలో కన్నుమూశారు.

ఉద్యోగాల పేరుతో

రూ.100 కోట్లు టోకరా

- హైదరాబాద్ కేంద్రంగా నిలువు దోపిడీ
- విజ్డమ్ జాబ్స్ సీఈఓ అజయ్ అరెస్టు
- రూ.23 కోట్లు స్వాధీనం.. రూ.4 కోట్లు ఫ్రీజ్


విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్ :



నెలనెలా వచ్చే జీతం కోసం వెతికే నిరుద్యోగులు.. ఒక్కసారి సాఫ్ట్‌వేర్‌లోకి ఎంట్రీ అయితే జీవితం సెటిల్ కావొచ్చని కలలు కన్నారు. అలాంటి నిరుద్యోగులకు విజ్డమ్ జాబ్స్ వెబ్‌సైట్ వరంగా కనిపించింది. విదేశాల్లో ఉద్యోగాలు కల్పించటంలో స్పెషలిస్టుగా పరిచయం చేసుకున్న విజ్డమ్ జాబ్స్ కంపెనీ.. అందుకు తగ్గట్టుగానే ఆశలు రేకెత్తించింది. నమ్మకం ఏర్పరచుకుంది. నిరుద్యోగుల బలహీనత ఆసరాగా భారీ మోసానికి తెగబడింది. ఉద్యోగం కావాలంటే ముందుగా డబ్బు చెల్లించాలనే షరతుతో.. ఏకంగా 100 కోట్ల రూపాయలు వసూలు చేసింది. ఇప్పుడు బండారం బట్టబయలు అయింది. ఉద్యోగాల ఆశ చూపి భారతత్‌తో పాటు విదేశాలకు చెందిన నిరుద్యోగులను విజ్డమ్ జాబ్స్ సంస్థ 100 కోట్ల రూపాయలకు మోసం చేసింది. విజ్‌డమ్ సంస్థకు ప్రపంచవ్యాప్తంగా 3 కోట్ల మంది సబ్ స్క్రైబర్స్ ఉన్నట్లు పోలీసులు తెలిపారు. నిరుద్యోగులను మోసం చేసిన సంస్థ డైరెక్టర్ అజయ్ కొల్లాతో పాటు సంస్థలోని 14 మందిని సైబరాబాద్ పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. విజ్డమ్‌జాబ్స్‌గల్ఫ్.కామ్, విజ్డమ్‌జాబ్స్.కామ్ అనే వెబ్ సైట్ల పేరుతో 2010 నుంచి అజయ్ ఓ రెండు సంస్థలను నిర్వహిస్తున్నాడు. ఈ వెబ్‌సైట్ల ద్వారా ఉద్యోగాల కోసం ప్రపంచవ్యాప్తంగా 3 కోట్ల మంది దరఖాస్తు చేసుకున్నారు. ప్రపంచవ్యాప్తంగా 25 ప్రాంతాల్లో ఉద్యోగాల పేరిట విజ్డమ్ సంస్థ నిరుద్యోగుల నుంచి 100 కోట్ల రూపాయలు వసూలు చేసి మోసం చేసినట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది. మాదాపూర్‌లోని సైబర్ టవర్స్‌లో విజ్డమ్ జాబ్స్ సంస్థ ప్రధాన కార్యాలయం ఉంది. ఈ సంస్థలకు ఎలాంటి అనుమతులు లేనప్పటికీ 10 సంవత్సరాల నుంచి నిరుద్యోగులను మోసం చేస్తోంది. ఏడుకొండలు అనే నిరుద్యోగి ఈ సంస్థలపై పోలీసులకు ఫిర్యాదు చేయడంతో అసలు విషయం వెలుగు చూసింది. రావన్ జనరల్ పెట్రోలియం పేరుతో ఇంటర్వ్యూలు చేస్తూ నిరుద్యోగుల నుంచి సంస్థ డబ్బు వసూలు చేసింది. వీరి వద్ద నుంచి రూ.23 కోట్ల నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఐసీఐసీఐ బ్యాంకులో ఉన్న రూ.4 కోట్లను ఫ్రీజ్ చేయమని పోలీసులు బ్యాంక్‌కు ఆదేశాలు ఇచ్చారు. హైదరాబాద్‌కు చెందిన విజ్డమ్ జాబ్స్ సంస్థ వేల సంఖ్యలో నిరుద్యోగులను మోసం చేసి..వారి నుంచి కోట్ల రూపాయలు వసూలు చేసింది.

ఈ సంస్థలో రిజిస్ట్రేషన్ చేసుకున్న నిరుద్యోగుల డేటాను ఇతర కంపెనీలకు అమ్ముకున్నట్లు పోలీసుల విచారణలో తేలింది. సంస్థకు చెందిన రికార్డులను, కంప్యూటర్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. 10 ప్రత్యేక బృందాలతో విచారణ జరిపిస్తున్నామని శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సైబరాబాద్ పోలీసు కమిషనర్ సజ్జనార్ తెలిపారు. నగరంలో రోజుకో మోసం బయట పడుతోంది. వ్యాపారాల పేరుతో మోసం జరిగేవి కొన్నైతే, దురాశతో తొందరగా డబ్బు సంపాదించాలనే తపనతో పెట్టుబడి పెట్టి మోసపోయేవారు కొందరు. చిట్టీల పేరుతో జనాల్ని మోసం చేసే వారు ఇంకొందరు. విజ్డమ్ జాబ్స్ సీఈఓ అజయ్ కొల్లాపై 420, 66ఐటీ యాక్ట్ కింద పోలీసులు కేసు నమోదు చేశారు.




విరిసిన 'పద్మ'లు

(మొదటిపేజీ తరువాయి)

బాయ్‌లు ఉన్నారు. ఇక పద్మభూషణ్ దక్కించుకున్న వారిలో ప్రముఖ నటుడు మోహన్ లాల్, పాత్రికేయుడు కుల్దీప్ నయ్యర్, డ్యాన్స్‌మాస్టర్ ప్రభుదేవా, క్రికెటర్ గౌతమ్ గంభీర్, సినీ గాయకుడు శంకర్ మహదేవన్, ప్రముఖ డ్రమ్స్ ప్లేయర్ శివమణి ఉన్నారు. మొత్తంగా 4 పద్మవిభూషణ్, 14 మందికి పద్మభూషణ్, 94 మందికి పద్మశ్రీ అవార్డులు వరించాయి. ఇందులో 21 మంది మహిళలు, 11 మంది ప్రవాస భారతీయులు, విదేశీయులు, ఒక ట్రాన్స్‌జెండర్ ఉన్నారు.

30న ఏపీ మంత్రివర్గం భేటీ

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మంత్రివర్గ సమావేశం ఈనెల 30వ తేదీన జరుగనుంది. సీఎం చంద్రబాబు అధ్యక్షతన అమరావతి సచివాలయంలోని కేబినెట్ సమావేశంలో 30వతేదీ మధ్యాహ్నం 3 గంటలకు మంత్రిమండలి సమావేశం ప్రారంభమవుతుందని రాష్ట్ర ప్రభుత్వ ప్రధానకార్యదర్శి అనిల్‌చంద్ర పునేఠ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫిబ్రవరి 10వ తేదీ తర్వాత శాసనమండలి ఎన్నికల కోడ్, ఆ తర్వాత సార్వత్రిక ఎన్నికల కోడ్ రానున్న నేపథ్యంలో మరిన్ని సంక్షేమ పథకాల అమలుపై మంత్రివర్గం నిర్ణయం తీసుకోనున్నట్లు సమాచారం. అందుకే ఈనెల 21న మంత్రివర్గ సమావేశం జరిగినప్పటికీ 10 రోజుల వ్యవధిలోనే మళ్లీ సమావేశాన్ని ఏర్పాటు చేస్తున్నారు. పింఛన్ల పెంపు, ఆటోలు, ట్రాక్టర్లకు పన్ను మినహాయింపు, డ్వాక్రా మహిళలకు పసుపు-కుంకుమ పథకం కింద రూ.10వేలు, స్మార్ట్‌ఫోన్ పంపిణీ వంటి అంశాలపై ఇప్పటికే నిర్ణయాలు జరిగాయి. రైతులను ఆదుకునేలా రైతు రక్ష పథకానికి వచ్చే కేబినెట్ గ్రీన్‌సిగ్నల్ ఇవ్వనున్నట్లు సమాచారం. అదేరోజు అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ప్రారంభమవుతాయి. ఉదయం ఉభయసభలనుద్దేశించి గవర్నర్ నరసింహన్ ప్రసంగిస్తారు.



నాబార్డ్ ఉద్యోగుల విరాళం

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి : ముఖ్యమంత్రి సహాయ నిధికి నాబార్డు ఉద్యోగులు రూ.14.5 లక్షల విరాళాన్ని అందజేశారు. ఉండవల్లిలోని సీఎం నివాసంలో రూ.14.5 లక్షల చెక్కును చంద్రబాబుకు అందజేశారు. నాబార్డ్ సీజీఎం కె.సురేష్ కుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు. నాబార్డు ఉద్యోగులను ముఖ్యమంత్రి అభినందించారు. రాష్ట్రాభివృద్ధిలో, ప్రజల సంక్షేమంలో నాబార్డ్ ఉద్యోగులను స్ఫూర్తిగా తీసుకుని ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు.

28న కలెక్టర్ల సదస్సు

విశాలాంధ్ర - అమరావతి : వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఈనెల 28న కలెక్టర్ల సదస్సును నిర్వహించాలని నిర్ణయించినట్లు ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి డాక్టర్ డి.సాంబశివరావు తెలిపారు. శుక్రవారం ఈ మేరకు పత్రికా ప్రకటన విడుదల చేశారు. నెల 28న (సోమవారం) ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ సచివాలయంలోని ఒకటో బ్లాక్ లోని కాన్ఫరెన్స్ హాల్‌లో కలెక్టర్ల సదస్సును వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సీఎం చంద్రబాబు నిర్వహించనున్నారని చెప్పారు. రాష్ట్రంలో నెలకొన్న కరవుతో పాటు వ్యవసాయం, కనీస మద్దతు ధర, పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సరఫరా, రాష్ట్రంలో అమలవుతున్న ఎన్టీఆర్ వైద్య సేవ సహా ఇతర ఆరోగ్య పథకాలపై చర్చించనున్నారని వివరించారు. వాటితో పాటు జన్మభూమి, వివిధ గ్రీవెన్స్‌ల ద్వారా అందిన రేషన్ కార్డులు, పింఛన్లు, ఇళ్ల స్థలాలు, 22ఏ చుక్కల భూములు, అన్ని రకాల భూ సమస్యలపై వచ్చిన ఫిర్యాదులు,చంద్రన్న బీమా, చంద్రన్న పెళ్లి కానుక, ముఖ్యమంత్రి యువ నేస్తం పథకాల ప్రగతి, ఇళ్ల నిర్మాణాలపైనా, అంగన్వాడీకేంద్రాలు, మధ్యాహ్న భోజన పథకం అమలు తీరుతెన్నులపైనా ఈ కాన్ఫరెన్స్ ద్వారా చర్చించనున్నట్లు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

టీడీపీ సర్వే బృందాల్లో అక్రమాలు

- ప్రభుత్వ వ్యతిరేక ఓట్లు తొలగింపు : బొత్స

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: విజయనగరం జిల్లాలో టీడీపీ సర్వేల పేరిట ప్రభుత్వ వ్యతిరేక ఓట్లను తొలగిస్తున్నారని వైసీపీ సీనియర్‌నేత బొత్స సత్యనారాయణ విమర్శించారు. ఈ విషయంపై ఎన్నికల ప్రధానాధికారి (ఈసీ) గోపాలకృష్ణ ద్వివేదీ, డీజీపీ ఠాగూర్‌లకు శుక్రవారం వేర్వేరుగా ఆయన ఫిర్యాదు చేశారు. విజయనగరం జిల్లాలో సర్వే చేస్తున్న కొందరు వ్యక్తులపై అనుమానంతో పోలీసులకు అప్పగిస్తే..వారిని అరెస్టు చేయకుండా, తిరిగి వైసీపీ నేతల్ని నిర్బంధించారని దుయ్యబట్టారు. వారి వద్ద లభ్యమైన ట్యాబ్‌లలో ఉన్న సమాచారంపై సమగ్ర దర్యాప్తు చేయాలని ఆయన డిమాండు చేశారు. వైసీపీ నేతల ఫిర్యాదులపై గోపాలకృష్ణ ద్వివేది మాట్లాడుతూ..ఓటర్ల జాబితాలో అక్రమాలు కొనసాగితే సంబంధిత సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. డీజీపీ ఠాగూర్ స్పందిస్తూ..ట్యాబ్‌లపై పూర్తి స్థాయిలో విచారణ చేస్తామని వైసీపీ నేతలకు భరోసా ఇచ్చారు.

సర్వేల పేరుతో టీడీపీపై దుష్ప్రచారం : డొక్కా

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: డబ్బా ఛానళ్లు, కరపత్రాల్లాంటి దినపత్రికల సాయంతో సర్వేల పేరుతో చంద్రబాబుపై ముగ్గురు మోడీలు దుష్ప్రచారం చేస్తున్నారని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డొక్కా మాణిక్యవర ప్రసాద్ విమర్శించారు. ఆయన శుక్రవారం విలేకరు లతో మాట్లాడుతూ ప్రధాని మోడీకి రిపబ్లిక్ టీవీ సీఈవో గోస్వామి అత్యంత సన్నిహితులని, అలాంటి వారి సర్వేలలో పారదర్శకత ఎంతమేరకు ఉంటుందో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదని అన్నారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలతో ఐదుకోట్ల మంది ఆంధ్రుల అభిమానాన్ని సీఎం చంద్రబాబు పొందారని తెలిపారు. 2014 ఎన్నికలప్పుడూ ఇదే విధంగా కొన్ని సంస్థలు వ్యతిరేక ప్రచారం చేసినా ప్రజలు చంద్రబాబుకే పట్టంకట్టారన్నారు.



స్పీడ్‌గా సీమకు..!

★ రాజధాని అమరావతితో అనుసంధానం ★ 31 నుంచి తిరుమల ఎక్స్‌ప్రెస్ కడప వరకూ...

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: రాయలసీమను రాజధాని ప్రాంతంతో అనుసంధానించే క్రమంలో ఎక్స్‌ప్రెస్ వేకు మోకాలడ్డుతున్న కేంద్రం రైళ్ల విషయంలో మాత్రం ఉదారంగా వరాలు కురిపిస్తోంది. రాష్ట్ర విభజన తర్వాత రాజధాని అమరావతిని కలుపుతూ కొత్త రైళ్లను ప్రవేశపెట్టడమే కాకుండా మరికొన్నింటిని సీమ ప్రాంతాల వరకూ పొడిగిస్తోంది. అనంత-అమరావతి ఎక్స్‌ప్రెస్ వేపై కేంద్రం ఎటూ తేల్చకుండా మీనమేషాలు లెక్కిస్తున్న సంగతి తెలిసిందే. షార్టెస్ట్ స్ట్రయిట్ (ఎస్ఎస్) ఎలైన్‌మెంట్‌పై అనేక అభ్యంతరాలు తెలిపి చివరకు అనుమతించినప్పటికీ, అటవీభూముల బదలాయింపులో జాప్యం చేస్తుండంతో ఈ పనులు ఎప్పుడు ప్రారంభమవుతాయో తెలియని పరిస్థితి. ఇదే సమయంలో రైల్వేశాఖ మాత్రం రాయల సీమ జిల్లా కేంద్రాలతోపాటు ముఖ్య ప్రాంతాలకు రైళ్ల ఏర్పాటు, పొడిగింపు కార్యక్రమాలకు అధిక ప్రాధాన్యం ఇస్తోంది. ఇప్పటికే భువనేశ్వర్-బెంగళూరు ప్రశాంతి ఎక్స్‌ప్రెస్, హుబ్లీ-విజయవాడ అమరావతి ఎక్స్‌ప్రెస్, మచిలీపట్నం-యశ్వంతపూర్ ట్రైవీక్లీ ఎక్స్‌ప్రెస్, హౌరా-సాయి ప్రశాంతి నిలయం బై వీక్లీ ఎక్స్‌ప్రెస్‌లు నంద్యాల, గుంతకల్, గుత్తి, అనంతపురము, ధర్మవరం మీదుగా నడుస్తున్న విషయం తెలిసిందే. విజయవాడ-ధర్మవరం ట్రైవీక్లీ ఎక్స్‌ప్రెస్‌ను 2016 జూలై 12వ తేదీన అప్పటి రైల్వేశాఖమంత్రిగా ఉన్న సురేష్ ప్రభాకర్ ప్రభు ప్రారంభించారు. తర్వాత నర్సాపూర్/మచిలీపట్నం-తిరుపతి లింక్ ఎక్స్‌ప్రెస్‌ను ధర్మవరం వరకూ పొడిగించారు. ఇటీవలే హౌరా-విజయవాడ మధ్య నడిచే హమ్‌సఫర్ వీక్లీ ఎక్స్‌ప్రెస్‌ను తిరుపతి వరకూ పొడిగిస్తున్నట్లు ప్రకటించారు. తాజాగా విశాఖపట్నం-తిరుపతి మధ్య నడిచే తిరుమల ఎక్స్‌ప్రెస్‌ను కడప వరకూ పొడిస్తున్నట్లు అధికారులు శుక్రవారం ప్రకటన విడుదల చేశారు. ఈ రైలు తిరుపతి నుంచి రేణిగుంట, కోడూరు, రాజంపేట, నందలూరు మీదుగా కడప చేరుతుంది. ఈ నెల 31వ తేదీ నుంచి ఈ రైలు కడప వరకూ ప్రయాణించనుంది. దీంతో రాయలసీమ ప్రాంతాలకు వెళ్లేందుకు మరో రెండు కొత్త రైళ్లు అందుబాటులోకి వచ్చినట్లయింది. ప్రస్తుతం చంద్రబాబు ప్రభుత్వం విజయవాడ, గుంటూరులలో పలు శాఖలకు చెందిన కార్యాలయాలను తాత్కాలిక భవనాల్లో నిర్వహిస్తోంది. వెలగపూడిలో సచివాలయంతోపాటు ఈ రెండు నగరాల్లో వివిధ పనులపై అనంత, కడప, కర్నూలు, చిత్తూరు జిల్లాలకు చెందిన వారి రాకపోకలు గణనీయంగా పెరిగాయి. చిత్తూరు జిల్లా వాసులు నేరుగా తిరుపతి, గూడూరు మీదుగా విజయవాడకు చేరుకునేందుకు పదుల సంఖ్యలో రైళ్లు అందుబాటులో ఉన్నాయి. అలాగే అనంతపురము, ధర్మవరం నేరుగా వెళ్లేందుకూ వివిధ రైళ్లున్నాయి. తాజాగా తిరుమల ఎక్స్‌ప్రెస్‌ను కడప వరకూ పొడిగించడంతో కోస్తా జిల్లా వాసులు నేరుగా కడప వెళ్లేందుకు అవకాశం కలుగుతోంది.

కడప, కర్నూలుకు కొత్త రైళ్లు నడపాలి

కోస్తా జిల్లాల నుంచి గుంటూరు, నంద్యాల మీదుగా కడపకు కొత్త రైళ్లను నడపాలని రైలు వినియోగదారులు విజ్ఞప్తి చేస్తున్నారు. నంద్యాల నుంచి గుత్తి-కడప సెక్షన్‌లో ఎర్రగుంట్లకు వరకూ రైలు మార్గం నిర్మాణం పూర్తయినందున విజయవాడ, మచిలీపట్నం, కాకినాడ, విశాఖపట్నం నుంచి కడపకు కొత్త రైళ్లను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని చెబుతున్నారు. అలాగే కర్నూలు నుంచి డోన్ (ద్రోణాచలం), నంద్యాల మీదుగా కూడా విజయవాడకు నేరుగా ఎక్స్‌ప్రెస్, ప్యాసింజర్ సర్వీసులు నడిపితే ఎంతో ఉపయుక్తంగా ఉంటాయని సూచిస్తున్నారు. అదీకాక మచిలీపట్నం-ధర్మవరం ఎక్స్‌ప్రెస్ తిరుపతి, పాకాల, మదనపల్లి మీదుగా వెళుతున్నందున ప్రయాణ సమయం ఎక్కువగా ఉంటోందని చెబుతున్నారు. ఈ కారణంగా కొన్ని రైళ్లను గుంటూరు, నంద్యాల మీదుగా కడప, కర్నూలు, ధర్మవరానికి నడిపితే సమయంతో పాటు చార్జీలు కలిసొస్తాయని పేర్కొంటున్నారు. ఈ దిశలో రైల్వేశాఖ చర్యలు చేపడితే రాయలసీమ అభివృద్ధి చెందడమే కాకుండా కోస్తా ప్రాంతాలకు మరింత చేరువకావడం ఖాయమని పలువురు స్పష్టం చేస్తున్నారు.

సోషల్ మీడియా హల్‌చల్

- తక్కువ సమయంలో ఎక్కువ సమాచారం
- సద్వినియోగంతో సత్ఫలితాలు
- ప్రొఫెసర్ విజయలక్ష్మి, సీపీఐ నేత హరినాథ్‌రెడ్డి



విశాలాంధ్ర-తిరుపతి : అన్ని రంగాలపై సోషల్ మీడియా తీవ్ర ప్రభావం చూపుతూ కీలక భూమిక పోషిస్తున్నదని శ్రీ పద్మావతి మహిళా వర్సిటీ మాజీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ విజయలక్ష్మి, సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పి.హరినాథ్‌రెడ్డి అన్నారు. గంధమనేని శివయ్య భవన్‌లో శుక్రవారం సీపీఐ సోషల్ మీడియా విభాగం జిల్లాస్థాయి వర్క్‌షాపు జిల్లా కన్వీనర్ ప్రసాద్ అధ్యక్షతన జరిగింది. వర్క్‌షాపులో ప్రొఫెసర్ విజయలక్ష్మి మాట్లాడుతూ సోషల్ మీడియా ద్వారా తక్కువ సమయంలో లక్షల మందికి సమాచారం చేరవేసే అవకాశాలు ఉన్నాయన్నారు. మన దేశంలో సోషల్ మీడియాను విస్తృతంగా వినియోగిస్తున్నారన్నారు. 2015లో రోజుకు సరాసరి ఓ వ్యక్తి 1.50 గంటలు వినియోగిస్తుండగా నేడు 4 గంటలు వినియోగిస్తున్నట్లు సర్వేలు చెబుతున్నాయన్నారు. సమాజానికి దోహదపడే అంశాలను పకడ్బందీగా, నాణ్యతతో పోస్టులు పెడితే జనాదరణ మెండుగా ఉంటుందన్నారు. సోషల్ మీడియా వల్ల సమాజానికి అటు మేలు, ఇటు కీడు రెండూ ఉన్నాయన్నారు. కొంతమంది సోషల్ మీడియాను వేదికగా చేసుకొని మార్ఫింగ్‌లు చేసి అసభ్యకర, అభ్యంతరకర ఫొటోలు, వీడియోలు సృష్టించి పక్కదారి పట్టిస్తున్నారని అన్నారు. ప్రధానంగా వాట్సప్‌లాంటి వాటిల్లో గ్రూపు అడ్మిన్‌లు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మనం చేరవేయాలనుకున్న సమాచారాన్ని, లక్ష్యాలను వీడియోల ద్వారా మంచి డిజైన్‌లతో ఆకట్టుకునేలా పోస్టులు చేస్తే ప్రతి ఒక్కరు ఆదరిస్తారన్నారు. వార్త కథనాలకంటే విజువల్స్‌తో కూడిన వీడియోలకు అత్యంత ఆదరణ లభిస్తుందన్నారు. విద్యార్థులు, యువత సోషల్ మీడియాను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సీపీఐ సోషల్ మీడియా రాష్ట్ర ఇన్ ఛార్జి పి.హరినాథ్‌రెడ్డి మాట్లాడుతూ సమాజంలో సోషల్ మీడియా ద్వారా అనేక ఉద్యమాలు పుట్టుకొచ్చాయన్నారు. ప్రజల్లో చైతన్యం తీసుకురా వడంలో సోషల్ మీడియా భూమిక కీలకమన్నారు. నిత్యం ప్రజలు ఎదుర్కొం టున్న సమస్యలు, మూఢన మ్మకాలు తదితర వాటిపై చైతన్యం కల్గిస్తోందన్నారు. ప్రభుత్వాలు చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలు, వాటి ఆచరణ వంటి వాటిని సోషల్ మీడియా ద్వారా ప్రజలు చాలావేగంగా తెలుసుకోగల్గుతున్నారన్నారు. ప్రభుత్వ రంగాల్లో జరుగుతున్న అవినీతిని సైతం ఆధారాలతో సహా సోషల్ మీడియాలో ఉంచడంతో వాటిని కట్టడి చేసేందుకు ఎంతగానో దోహదప డుతుందన్నారు. రాజకీయ పార్టీలు తమ వ్యూహా లను, ప్రచారాలను ప్రజల ముందుకు తీసుకెళ్లడంలో ఉపయోగపడుతుందన్నారు. విద్యా ర్థులు, యువకులు, మహిళలు వాట్సప్, ఫేస్‌బుక్, ట్విట్టర్, బ్లాగ్ లాంటి వాటిని ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. సీపీఐ చేస్తున్న ఉద్యమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు సీపీఐ సోషల్ మీడియా వింగ్‌లో భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ చిత్తూరు జిల్లా కార్యదర్శి ఎ.రామానాయుడు, జిల్లా కార్యవర్గ సభ్యులు, కౌన్సిల్ సభ్యులు, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఆటో, హమాలీల సంక్షేమ బోర్డు కోసం

ఫిబ్రవరి 6న ఆందోళన

ఏఐటీయూసీ రాష్ట్ర కార్యవర్గం నిర్ణయం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : అసంఘటిత రంగంలో లక్షల సంఖ్యలో ఉన్న హమాలీ, ఆటో కార్మికులకు భవన నిర్మాణ కార్మికుల తరహాలో సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండు చేస్తూ ఫిబ్రవరి 6న విజయవాడలో భారీ ఎత్తున ఆందోళన నిర్వహించాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యవర్గం నిర్ణయించింది. గొల్లపూడి జోశ్యభట్ల సత్యనారాయణ భవన్‌లో ఏఐటీయూసీ రాష్ట్ర కార్యవర్గ సమావేశం రాష్ట్ర అధ్యక్షులు ఆర్.రవీంద్రనాథ్ అధ్యక్షతన శుక్రవారం జరిగింది. ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు మాట్లాడుతూ రాష్ట్రంలో లోడింగ్, అన్‌లోడింగ్ పనులు చేసే హమాలీ కార్మికులు 25లక్షల మంది ఉండగా, ఆటో రంగంలో మరో 15లక్షల మంది ఉన్నారని, వీరికి ఎలాంటి చట్టాలు, హక్కులు లేవన్నారు. వీరు రాష్ట్రంలో అన్ని పట్టణ కేంద్రాల్లో పెద్ద సంఖ్యలో పనులు చేస్తూ ప్రజలకు సేవలందిస్తున్నారన్నారు. వీరిపట్ల రాష్ట్ర ప్రభుత్వం శ్రద్ధవహించి యాజమానులు, సరుకు ఉత్పత్తి కేంద్రాలు, కొనుగోలుదారులు, అమ్మకందారుల నుంచి ఒక్కశాతం సెస్ వసూలు చేయగలిగితే వందలాది కోట్లు జమ అవుతాయని, రాష్ట్ర బడ్జెట్ కేటాయింపుతో సంబంధం లేకుండానే వీరికి సంక్షేమ నిధి ఏర్పాటు చేయవచ్చని తెలిపారు. ఆటో కార్మికులకు పెట్రోల్ బంకులు, స్పేర్‌పార్ట్స్ అంగళ్లు, షోరూమ్‌ల నుంచి సెస్ వసూలు చేసే అవకాశం ఉందన్నారు. వీధి విక్రయదారులకు ఫ్రూట్ మర్చంట్స్, కోల్డ్ స్టోరేజెస్, ఫ్లవర్ మార్కెట్స్ తదితర చోట్ల సెస్ కలెక్ట్ చేయవచ్చన్నారు. ఈ మూడు రంగాలకు సంక్షేమ చట్టం ఏర్పాటు చేసి వారి జీవన ప్రమాణాలు పెంచాలని డిమాండు చేశారు. ఈ నెల 30 నుంచి జరగబోయే అసెంబ్లీ సమావేశాలలోనే సంక్షేమబోర్డుపై రాష్ట్ర ప్రభుత్వం ప్రకటన చేయాలని, లేకుంటే వచ్చే నెల 6వ తేదీన విజయవాడలో భారీ ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు. 21మాసాలు గడిచినప్పటికీ ఆర్టీసీ కార్మికులకు సంబంధించిన వేతన సవరణ చేయకుండా కాలయాపన చేయడం అన్యాయమని ఓబులేసు విమర్శించారు. ఫిబ్రవరి 6 నుంచి తలపెట్టిన ఆర్టీసీ సమ్మెకు ఏఐటీయూసీ రాష్ట్ర సమితి సంపూర్ణ మద్దతు ఇస్తుందని ప్రకటించారు. యూనియన్ గౌరవాధ్యక్షులు చలసాని వెంకట రామారావు మాట్లాడుతూ 73షెడ్యూల్స్ ఎంప్లాయిమెంట్‌లో వేతన సవరణలు చేస్తూ విడుదల చేసిన ప్రిలిమినరీ నోటిఫికేషన్‌లో ఏమాత్రం పెరుగుదల లేదన్నారు. కనీస వేతనం 18వేలు ఇవ్వాలని, డీఏ పాయింట్లు 10.5 ఉండాలని కార్మికులు అడుగుతున్నా ప్రభుత్వం పట్టించుకోపోవడం దారుణమన్నారు. దీనిపై ఈ నెల 30వ తేదీ జరుగు కనీస వేతనాల బోర్డు సమావేశంలో నిలదీస్తామని తెలిపారు. ఏఐటీయూసీ ఆధ్వర్యాన ఫిబ్రవరి 5వ తేదీన మున్సిపల్ కార్మికుల సమస్యలపై గుంటూరులో డీఎంఏ ఆఫీసు వద్ద ఆందోళన చేయాలని, ఇతర కార్మికుల సమస్యలపై దశలవారీగా పోరాటాలు సాగించి కార్మిక వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న మోడీ, చంద్రబాబు ప్రభుత్వాలకు తగిన గుణపాఠం చెప్పేవిధంగా కార్మిక పోరాటాలు నిర్వహించాలని కార్యవర్గం నిర్ణయించింది. సమావేశంలో ఏఐటీయూసీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వి.రాధాకృష్ణమూర్తి, డిప్యూటీ జనరల్ సెక్రటరీ ఎస్.వెంకట సుబ్బయ్య, రాష్ట్ర కోశాధికారి బీవీవీ కొండలరావు, జె.లలిత, జిల్లా కార్యదర్శులు పాల్గొన్నారు.

దేశ భవిత నిర్ణేతలు యువతే

జాతీయ ఓటర్ల దినోత్సవంలో గవర్నర్ నరసింహన్

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: యువత పెద్ద ఎత్తున ఎన్నికల్లో పాల్గొని దేశ భవిష్యత్తును నిర్ణయించాలని తెలుగు రాష్ట్రాల గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్ అన్నారు. ప్రజాస్వామ్యంలో అత్యంత ప్రధానమైన ఓటు హక్కును అందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన ఉద్ఘోదించారు. జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగిన వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యధా రాజా తధా ప్రజా అనే విధంగా కాకుండా యధా ప్రజా తధా రాజా రీతిలో మన భవిష్యత్తును ఓటుతో మనమే నిర్ణయించుకుందామన్నారు. సెలవు రోజున ఓటింగ్‌లో పాల్గొనకపోవడం ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు వంటిందన్నారు. ఓటరు చిరునామా మారితే ఓటును తొలగించే విధానం సరికాదన్నారు. కులం, మతం, ప్రాంతం, డబ్బు ఓటుకు ప్రామాణికం కాకూడదని నరసింహన్ ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఆయన ఎక్కువ మందిని ఓటర్లుగా నమోదు చేయడంలో ప్రతిభ చూపిన అధికారులు, సిబ్బందికి ఆయన ధృవపత్రాలు, నగదు పురస్కారాలు, జ్ఞాపికలను అందచేశారు. జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ఎన్నికల కమిషన్ సీనియర్, జూనియర్ విభాగాల్లో నిర్వహించిన వ్యాస రచన, వకృత్వపోటీలలో విజేతలకు ప్రశంసాపత్రాలు, నగదు బహుమతులను అందచేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనిల్ చంద్ర పునేఠ, రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి గోపాలకృష్ణ ద్వివేది, రాష్ట్ర ఎన్నికల కమిషనర్ ఎన్. రమేష్ కుమార్, కృష్ణా కలెక్టర్ బి.లక్ష్మీకాంతం, గుంటూరు కలెక్టర్ కోన శశిధర్, తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ కార్తికేయ మిశ్రా పాల్గొన్నారు.

31లోగా నివేదిక ఇవ్వండి : సీఎస్

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: నదుల పునరుజ్జీవంపై రూపొందించిన ముసాయిదా నివేదికలో, ఎన్‌జీటీ ఉత్తర్వులకు ముందే పర్యావరణ పరిరక్షణకు, ప్రజలకు నాణ్యమైన జీవితాన్ని అందించడానికి తెలంగాణ ప్రభుత్వం తీసుకున్న చర్యలను పొందుపర్చాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్‌కే జోషి ఆదేశించారు. శుక్రవారం సచివాలయంలో నదుల పునరుజ్జీవంపై నేషనల్ ఎన్విరాల్‌మెంట్ ఇంజనీరింగ్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ రూపొందించిన ముసాయిదా నివేదికపై జోషి అధికారులతో సమీక్షించారు. నదుల పునరుజ్జీవనంపై చర్యలు, నిధులు, ఎస్‌టీపీల నిర్మాణం, టెక్నాలజీ తదితర అంశాలను చర్చించారు. మూడేళ్ల కార్యచరణ ప్రణాళికను రూపొం దించాలని అన్నారు. ఈ సమావేశంలో అటవీ శాఖ ప్రత్యేక ప్రధానకార్యదర్శి అజయ్ మిశ్రా, ఆర్థిక శాఖ ముఖ్యకార్యదర్శి కె.రామకృష్ణారావు, మున్సిపల్ శాఖ ముఖ్యకార్యదర్శి అర్వింద్ కుమార్ పాల్గొన్నారు. సీఎస్ మాట్లాడుతూ నదుల పునరుజ్జీవంపై నివేదికను ఈనెల 31 వరకు సిద్ధం చేయాలని, ఈ నివేదికలో ఎన్‌జీటీ ఉత్తర్వులకనుగుణంగా కార్యాచరణ ప్రణాళికతో పాటుహరితహారం, మిషన్ కాకతీయ, మిషన్ భగీరథ, ఇరిగేషన్ ప్రాజెక్టుల నిర్మాణం, పార్కుల ఏర్పాటు తదితర అంశాలను పొందుపర్చాలన్నారు.

సంపాదకీయం

వెనిజులా సంక్షోభం

సంక్షోభాలు రాజేయడం, సంఘర్షణలు సృష్టించడం ద్వారా తన ఆధిపత్యాన్ని ప్రపంచ దేశాల మీద రుద్దాలన్నదే అమెరికా కుటిలనీతి. లాటిన్ అమెరికా దేశమైన వెనిజులా ప్రస్తుత సోషలిస్టు అధ్యక్షుడు నికోలస్ మదురోను కూలదోయడానికి అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ తన శక్తియుక్తులన్నింటినీ ప్రదర్శిస్తున్నారు. దీంతో కొద్ది రోజులుగా వెనిజులాలో తీవ్ర సంక్షోభ పరిస్థితులు నెలకొన్నాయి. నిరుటి మే నెలలో జరిగిన ఎన్నికల్లో మదురో గెలుపొంది ఆరేళ్లపాటు అధ్యక్షుడిగా కొనసాగే అర్హత పొందారు. ఆయన ఎన్నికను గుర్తించడంలేదని విపక్షాలతోపాటు అమెరికా బహిరంగంగా ప్రకటించింది. అప్పటినుంచీ అమెరికా అనేక విధాలా వెనిజులాపై ఆంక్షలు విధిస్తూనే ఉంది. దేశానికి ప్రధాన ఆర్థిక వనరుగా ఉన్న చమురు రంగాన్ని పలు ఆంక్షల ద్వారా దెబ్బతీసి మదురోను ఇబ్బందులకు గురిచేసేలా అమెరికా రకరకాల చర్యలు చేపట్టింది. ఈ క్రమంలో బుధవారం మదురోకు వ్యతిరేకంగా ప్రతిపక్షాలు ప్రదర్శనకు పిలుపునిచ్చాయి. అంతకుముందు అధ్యక్ష భవనానికి సమీపంలోని సైనిక అవుట్ పోస్టును స్వాధీనం చేసుకోవడానికి ప్రయత్నించిన 27మంది సైనికులను ప్రభుత్వం నిర్బంధించింది. ప్రతిపక్ష నేత జువాన్ గాయిడో తనకు తాను దేశాధ్యక్షుడిగా ప్రకటించుకొన్నారు. తాను తాత్కాలిక అధ్యక్షుడినేననీ, వెంటనే నిష్పాక్షికంగా ఎన్నికలు జరుపుతానని ప్రకటించాడు. మదురోను వదిలి వచ్చిన మిలిటరీ, ఇతర పౌర అధికారులకు క్షమాభిక్ష పెడతామని పార్లమెంటు ప్రకటించింది. ఇదంతా మదురో ప్రభుత్వాన్ని కూలదోసేందుకు అమెరికా పన్నిన ఎత్తుగడలేనని స్పష్టమవుతోంది. గాయిడో అధ్యక్షుడిగా ప్రకటించుకున్న వెంటనే అమెరికా అతనికి మద్దతు తెలిపింది. కెనడా, యూరప్ దేశాలు, లాటిన్ అమెరికాలోని అమెరికా అనుకూల ప్రభుత్వాలు కూడా గాయిడోకు మద్దతు ప్రకటించాయి. అమెరికా చర్యలను రష్యా, టర్కీ ఖండిస్తే, క్యూబా, మెక్సికో, బొలీవియా దేశాల నేతలు మదురోకు మద్దతుగా నిలిచారు. అవసరమైతే సైనిక జోక్యానికి వెనకాడమని అమెరికా ప్రకటించింది. అదే జరిగితే మరింత సంక్షోభం తప్పదని రష్యా హెచ్చరించింది. ఈ పరిస్థితుల్లోనే దేశ సుప్రీంకోర్టు కీలక ఆదేశాలిచ్చింది. మదురో అధ్యక్ష స్వీకారం చెల్లదంటూ కొద్దిరోజుల కిందట పార్లమెంటు చేసిన తీర్మానం చెల్లదనీ, రాజ్యాంగ ఉల్లంఘనకు పాల్పడిన పార్లమెంటు నేతలు నేరపూరితంగా వ్యవహరించారో లేదో దర్యాప్తు చేయాలని ఆదేశించింది.

బొలివేరియన్ విప్లవానికి కీలకమైన వెనిజులాను దెబ్బతీయడానికి అమెరికా అనేక ఏళ్లగా విఫల ప్రయత్నాలు చేస్తూనే ఉంది. లాటిన్ అమెరికాలో వామపక్షం అధికారంలో ఉన్న దేశాల్లో వెనిజులా ఒకటి. హ్యూగో ఛావెజ్ హయాంలోనూ ఆయనను గద్దె దించేందుకు అమెరికా నానా కుట్రలు, కుయుక్తులు పన్నింది. అమెరికన్ ఆయిల్ కంపెనీలను జాతీయం చేయడంలో, అమెరికా వ్యతిరేకంగా నిర్ణయాలు తీసుకోవడంలో ఆయన ఏనాడూ వెనుకాడింది లేదు. క్యూబాకు అండగానూ నిలిచారు. క్యూబా కష్టకాలంలో ఉన్నప్పుడు పంచదారను దిగుమతి చేసుకొని చమురు సరఫరా చేసి ఆదుకున్నారు. కాస్ట్రోతో చేయి కలిపి యావత్ లాటిన్ అమెరికాను ఉత్తేజపరిచారు. హ్యూగో ఛావెజ్ 2013లో మరణించడంతో ఆయన స్థానంలో మదురో అధికారం చేపట్టారు. అంతర్జాతీయంగా వచ్చిన పరిణామాల నేపథ్యంలో చమురు ధరలు తగ్గి వెనిజులా ఆర్థిక ఇబ్బందులకు గురైంది. దీన్ని ఆసరాగా చేసుకొని వెనిజులాపై అమెరికా అనేక ఆంక్షలు విధించింది. దేశంలోని బహుళజాతి సంస్థలు కూడా అస్థిరతకు తమ వంతు పాత్ర పోషించాయి. ఎగుమతులు దెబ్బతినడంతో, ఆహారం, మందుల కొరత తలెత్తింది. ద్రవ్యోల్బణం భారీగా పెరిగింది. దేశంలో అశాంతి సృష్టించడానికి మరోవైపు అమెరికా ప్రతిపక్షాలను రెచ్చగొట్టింది. 2015 ఎన్నికల్లో పార్లమెంటులో విపక్షాలకు మెజార్టీ వచ్చింది. దీంతో మదురోను తొలగించాలని ప్రతిపక్షాలు ఆందోళనకు దిగాయి. 2017లో సుప్రీం ట్రిబ్యునల్ పార్లమెంటు అధికారాలను రద్దు చేసింది. నూతన రాజ్యాంగ రచనకు, రాజ్యాంగ పరిషత్‌కు ఎన్నికలు జరిగాయి. ఈలోగా 2018 ఎన్నికలు వచ్చాయి. ఓడిపోతామనే భయంతో ప్రతిపక్షాలు ఆ ఎన్నికలను బహిష్కరించాయి. కానీ ఎన్నికలు సక్రమంగా జరగలేదంటూ అమెరికా, యూరప్ దేశాలు ఆరోపించాయి. జిమ్మీ కార్టర్ మాత్రం వెనిజులా ఎన్నికల ప్రక్రియ చక్కగా ఉందని మెచ్చుకున్నారు. ఈనెల పదో తేదీన ఆయన రెండోసారి అధ్యక్ష ప్రమాణ స్వీకారం చేశారు. పార్లమెంటు ఆ మరుసటిరోజు ఒక తీర్మానం చేసి జువాన్ గాయిడోను అధ్యక్షుడిగా నియమిస్తున్నట్లు ప్రకటించింది. వెనిజులా ఆస్తులు, బ్యాంకు ఖాతాలను స్తంభింపచేయాలంటూ 46దేశాలకు పార్లమెంటు లేఖలు రాసింది. పార్లమెంటు నిర్ణయాలు చెల్లవంటూ సుప్రీంకోర్టు తేల్చి చెప్పింది. ఈ క్రమంలో అమెరికా మరిన్ని ఆంక్షలు విధించేందుకు కసరత్తు చేస్తోంది. పార్లమెంటు తీర్మానాన్ని అమెరికా, కెనడా, బ్రెజిల్‌లు అభినందించడం ద్వారా గాయిడోను గుర్తించినట్లయింది. ఆయన నియమించే రాయబారులను గుర్తిస్తామని కూడా వెల్లడించాయి. అంటే వెనిజులాలో సమాంతర ప్రభుత్వాన్ని నడిపేందుకు అమెరికా వ్యూహ రచన చేస్తున్నట్లు స్పష్టమవుతోంది. తిరుగుబాటు ద్వారా మదురోను బర్తరఫ్ చేయాలని అమెరికా విదేశాంగ శాఖ మంత్రి మైక్ పాంపియో ఒక ప్రకటనలో వెనిజులా సైన్యానికి విజ్ఞప్తి చేశారు. మదురో పాలనలో తలెత్తిన ఆర్థిక పరిస్థితులపై ప్రజల్లో కొంత అసంతృప్తి ఉన్నా, ప్రతిపక్షాలపై మాత్రం వారికి సానుభూతి లేదు. అమెరికా, దాని మిత్రదేశాల మద్దతుతో దేశాధ్యక్షుడితో ఘర్షణకు దిగుతున్న ప్రతిపక్షాలకు వ్యతిరేకంగా కూడా ప్రజలు వీధుల్లోకి వచ్చి ప్రదర్శనలు నిర్వహించడమే ఇందుకు రుజువు. అయితే ఇదే పరిస్థితులు కొనసాగితే ఆర్థిక సంక్షోభం తీవ్రమైన రాజకీయ, సామాజిక సంక్షోభానికి దారితీసే ప్రమాదం తలెత్తుతుంది. కాబట్టి అంతర్జాతీయ సమాజం చొరవ చూపి వెనిజులాలో చట్టబద్ధమైన పాలన సాగేందుకూ, విదేశీ శక్తుల జోక్యాన్ని కట్టడి చేసేందుకూ ప్రయత్నించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

చురక

మోడీగారి అధికారం
మొత్తానికి గూకే పొద్దు
సర్వేల్లో చాటిచెప్పే
చరిష్మా తగ్గే ముద్దు

జనం బతుకు తల్లడిల్లే
జీఎస్టీ, నోట్ల రద్దు
పార్లమెంటు ఎన్నికల్లో
ప్రతీకార ఓట్ల గుద్దు

- వేల్పుల నారాయణ

మతాధార పౌరసత్వం, పౌర జాతీయ జాబితా


సంగిరెడ్డి హనుమంతరెడ్డి

లోకసభ వివాదాస్పద పౌరసత్వ సవరణ బిల్లు ఆమోదించింది. మతాధార పౌరసత్వానికి దారితీసింది. పాకిస్తాన్, బంగ్లాదేశ్, ఆఫ్ఘనిస్తాన్ల నుండి 31.12.14 లోపు దేశంలో ప్రవేశించిన ముస్లిమేతరులకు పౌరసత్వం లభిస్తుంది. "పౌర జాతీయ జాబితాలో చోటు దక్కని 8 లక్షల హిందువులు దీనితో భారత పౌరులవుతారు. పౌరసత్వ సవరణ జరక్కపోతే అస్సాం పాకిస్తాన్ భాగమవుతుంది. 17 శాసనసభ స్థానాలు పోతాయి." - అస్సాం బీజేపీ ఆర్థికమంత్రి హిమంత బిశ్వ శర్మ వివరించారు. జాతీయ పౌరసత్వ తెగింపు తేదీ 1951 కానీ ఇంకా ముందు కానీ నిర్ణయించాలని గృహ మంత్రి రాజనాథ్ సింగ్ రాజ్యసభలో అన్నారు. "పౌరసత్వ సవరణ దేశ విభజన తప్పుల ప్రాయశ్చిత్తం. నిజమైన పౌరులకు పౌర జాతీయ జాబితా (ఎన్.ఆర్.సి.)లో చోటు దక్కుతుంది." అని ప్రధాని ప్రవచించారు. నిజమైన పౌరులు హిందువులేనని మోడీ అభిప్రాయం. ఇండియన్ ఎక్స్‌ప్రెస్ రాజకీయ జంతువుగా "కీర్తించిన" అమిత్ షా, 2019లో మోడీ ఎన్నికవగానే కశ్మీర్ నుండి కన్యాకుమారి దాకా, అస్సాం నుండి గుజరాత్ వరకు అక్రమ వలసదారులుండరని ఉద్ఘాటించారు. హిందు వలసదారులు భారత పౌరులవుతారు. ముస్లింలు వెలివేయబడతారు!

ఎన్.ఆర్.సి. పౌర జాతీయత నిర్ధారణ, ప్రామాణిక భారతీయుల నమోదు పుస్తకం. 1951 జనగణనతో తయారయింది. ఇపుడు అస్సాం పౌరుల జాతీయత నిర్ధారిస్తున్నారు. 'అక్రమ వలస చట్టం 1983' ప్రకారం 1985-జూలై 2012 మధ్యలో 55,000 మందిని విదేశీయులని గుర్తించారు. 2,442 మందిని మాత్రమే తిప్పిపంపగలిగారు. వలసదారులు ఉన్నత వర్గాల దోపిడీని అడ్డుకోరు. చదువరుల ఉపాధికి పోటీ కారు. ఊడిగంచేసి అభివృద్ధికి పాటుబడ్డారు. అయినా ఉపాధి దెబ్బతిందని ఆల్ అస్సాం విద్యార్థి సంఘం, గణసంగ్రాం పరిషత్ ఉద్యమించాయి. 15.08.85 న ప్రధాని రాజీవ్ చొరవతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, ఉద్యమకారులకు ఒప్పందం కుదిరింది. దాని ప్రకారం '1951 పౌర జాతీయ జాబితా' సవరించాలి. 01.01.66-24.03.71 మధ్య అస్సాం వచ్చినవారికి ఓటు హక్కుండదు. 25.03.71 తర్వాత వచ్చిన వారిని వెళ్ళగొట్టాలి. 17.11.99న ప్రధాని వాజపేయి ఎన్.ఆర్.సి.కి రూ.20 లక్షలిచ్చారు. ఈ నేపథ్యం నేటి సంఘ్ ప్రభుత్వానికి ఊపునిచ్చింది. 25.03.71 న భారత్ పాకిస్తాన్ల మధ్య యుద్ధం మొదలయింది. 24.03.71 అర్ధరాత్రి స్థితి కొనసాగించి, '1955 పౌరసత్వ చట్టం', '2003 పౌరసత్వ నియమాల' ఆధారంగా ఎన్.ఆర్.సి.ని సవరించాలి. అస్సాంలో పుట్టుక, వారసత్వం పౌరసత్వ నిర్ధారణకు రుజువు. వలస జీవులకు ధృవీకరణ పత్రాలుండవు. 1)1951 ఎన్.ఆర్.సి.లో పేర్లు, వారి వారసుల పేర్లు, 2)24.03.71 అర్ధరాత్రి వరకు ఎన్నికల జాబితాలోని పేర్లు, 3) 24.03.71 అర్ధరాత్రికి ఉపస్థితి నిర్ధారణ పత్రాలలోని పేర్లు ఎన్.ఆర్.సి.లో చేర్చబడతాయి. పై 3 తరగతులతో పాటు 31.12.65-25.03.71 మధ్య అస్సాం వచ్చి, విదేశీ నమోదు అధికారి వద్ద నమోదు చేసుకున్నవారు, అక్రమ వలసదారులుగా, విదేశీయులుగా ప్రకటించబడనివారు ఎన్.ఆర్.సి.లో నమోదు చేసుకోవచ్చు. 2018 అస్సాం జనాభా 3.5 కోట్లు. 3,29,91,384 మంది దరఖాస్తు చేసుకున్నారు. 20.09 లక్షల పేర్లు నమోదే కాలేదు. 31.12.17 అర్ధరాత్రి 1.9 కోట్ల పేర్లతో ఎన్.ఆర్.సి. చిత్తుప్రతి మొదటి భాగం, 30.07.18 న పూర్తి చిత్తుప్రతి విడుదలచేశారు. ఇందులో 2,89,83,677 పేర్లున్నాయి. 40,70,707 పేర్లు లేవు. పేర్లు లేనివారు 30.08.18 నుండి 28.09.18 లోగా దరఖాస్తు చేసుకోవాలి. ఇతరుల నమోదుపై అభ్యంతర దరఖాస్తు చేయవచ్చు. అభ్యర్థనలను పరిశీలించి 31.12.18న తుది ఎన్.ఆర్.సి. నిర్ధారించాలి. 31.08.15 లోపు దరఖాస్తు చేసినవారే తొలగింపు వ్యతిరేక అభ్యర్థనకు అర్హులు. ఆలోపు దరఖాస్తు చేసుకోలేని 20.09 లక్షల ప్రజలు శాశ్వతంగా పౌరసత్వం కోల్పోయారు. 31.05.15 తర్వాత పుట్టిన వారు దరఖాస్తుకు అనర్హులు. వలసపాలనలో స్థానిక తెగలకు భూమి హక్కు లేదు. వీరు భూయాజమాన్య నిబంధన పూర్తిచేయలేరు.

అస్సాం స్త్రీలకు జన్మ, పెళ్ళి పత్రాలుండవు. గ్రామ పత్రాలను ఎన్.ఆర్.సి.కి అంగీకరించరు. ఇతర రాష్ట్రాల వలసదారుల పేర్లు జాబితాలో లేవు. దరఖాస్తులో తప్పనిసరిగా లెగసి డేటా కోడ్ రాయాలి. ఇది దొరకడం కష్టం. ఎన్.ఆర్.సి.లో పేర్లు లేనివారు తమ దేశానికి పోవాలి. వీరిని పంపడానికి బంగ్లాదేశ్, నేపాల్ లతో ఒప్పందాలు, చర్చలు లేవు. మా పౌరులే కానివారిని రానివ్వమని బంగ్లాదేశ్ ప్రధాని అన్నారు. అస్సాంలో 90,000 మందిని చొరబాటు దార్లుగా, 1,50,000 మందిని అనుమానాస్పద ఓటర్లుగా ప్రకటించారు. 2,000 మంది నిర్బంధ కేంద్రాల్లో మగ్గుతున్నారు. 31.12.17 నాటికి 91,206 మంది విదేశీయులుగా జైళ్ళలో ఉన్నారు. తమకు ఓటేయరనుకున్న వారిని బీజేపీ బంధించింది. 31.12.18 కి 9,70,707 మంది దరఖాస్తు చేయలేదు. 2.65 లక్షల అభ్యంతరాలు దాఖలయ్యాయి. ఈ సంఖ్య పెరగగలదు. ప్రభుత్వం ఈ పేర్లు తొలగించవచ్చు. 31 లక్షల దరఖాస్తుల్లో ఎంత మందికి పౌరసత్వం ఇస్తారో? ఎన్.ఆర్.సి. తుది జాబితా రాలేదు.

రాజ్యాంగ అధికరణ 326, ప్రజా ప్రాతినిధ్య చట్ట నిబంధన 16 ప్రకారం పౌరులు కానివారు ఓటర్లు కారు. ప్రజా ప్రాతినిధ్య చట్ట నిబంధన 19 ప్రకారం స్థానిక నివాసితుడే నియోజకవర్గ ఓటరు. దీనర్థం ఓటర్లంతా పౌరులే. బంగ్లాదేశ్ నుండి వచ్చిన హిందువులకు పౌరసత్వం, సౌకర్యాలు కల్పిస్తామని, ముస్లింలు వెళ్ళిపోవాలని బీజేపీ ప్రచారం చేసింది. తొలి 11 నెలల పాలనలో ఆఫ్ఘనిస్తాన్, పాకిస్తాన్ నుండి వచ్చిన 4,230 మంది హిందువులు, శిక్కులకు పౌరసత్వమిచ్చారు. 34,000 మందికి వీసాలిచ్చి మధ్యప్రదేశ్, రాజస్థాన్, గుజరాత్‌లలో ఓట్లిచ్చారు. దీనితో 2014 ఎన్నికల్లో బీజేపీ 7 పార్లమెంటు స్థానాలు గెలిచింది. బంగ్లాదేశ్ వలస ముస్లింలు దేశభద్రతకు ముప్పని సంఘ్ ప్రచారం. 47 ఏళ్ళుగా లేని అభద్రత బీజేపీ అధికారంలోకి రాగానే వచ్చిందా? భారత, అస్సాంల జనాభా పెరుగుదల శాతాలు చూద్దాం. బ్రాకెట్లలో అంకెలు అస్సాంవి. 1971 జనగణనలో- 24.8 (35), 1981 లో- 24.7 (23.4), 1991- 23.9 (24.2), 2001- 21.5 (18.9), 2011- 17.7 (17.1). 2011-21 మధ్య పెరుగుదల అంచనా 17.07 (11.8). అస్సాం జనాభా 1971 లో బంగ్లాదేశ్ యుద్ధం వల్ల పెరిగింది. 1991 లో 0.3% పెరిగింది. తర్వాత తగ్గింది. అస్సాంలో ముస్లిం జనాభా 1991 లో 28%, 2001 లో 31%, 2011 లో 34%. ఈ పెరుగుదల దేశ సగటు కంటే తక్కువే. 1991-11 జనగణనల మధ్య 20 ఏళ్ళలో ముస్లిం జనాభా పెరుగుదల గమనించండి. దేశంలో పెరుగుదల 70%. అస్సాంలో 68%. బీహార్- 75%, ఢిల్లీ- 143%, గుజరాత్- 61%, హరియాణా- 133%, మహారాష్ట్ర- 70%, మధ్య ప్రదేశ్- 61%, పంజాబ్- 124%, రాజస్థాన్- 76%, ఉత్తర ప్రదేశ్- 65%, కర్ణాటక- 51% కేరళ- 31%, పశ్చిమ బంగ- 53%. పేదరికంతో ఇతర రాష్ట్రాలకు వలసలు పెరిగిన బీహార్, బంగ, ఉత్తరప్రదేశ్‌లలో, రాజస్థాన్, మహారాష్ట్రల్లో కూడా ముస్లిం జనాభా పెరిగింది. ముస్లిం జనాభా పెరుగుదలకు బంగ్లాదేశ్ వలసలు కారణం కాదని, ముస్లింల నిరక్షరాస్యత, పేదరికం, అజ్ఞానం, సామాజిక, ఆర్థిక వెనుకబాటు, దోపిడీలు కారణమని అంతర్జాతీయ వేదికలు ధృవీకరించాయి. పౌరసత్వ సవరణలో ముస్లింలను వదిలేయటం రాజ్యాంగవిరుద్ధం. ఎన్.ఆర్.సి. పరమతస్తులపై బీజేపీ ఝుళిపించిన జాతీయవాద కొరడా. దేశ ప్రగతికి రక్తమాంసాలు అర్పిస్తున్న శ్రమజీవులను రాజ్యరహితులను చేయడం అమానుషం. పౌరసత్వ సవరణతో ముస్లిమేతరులు పౌరులవుతారు. జాతీయ జాబితాతో ముస్లింలను తరిమేస్తారు. హిందూ ఓట్లతో నెగ్గటం తాత్కాలిక ప్రయోజనం. భారత్‌ను హిందూ దేశంగా మార్చటం దీర్ఘకాల లక్ష్యం.

- వ్యాసరచయిత ఆల్ ఇండియా ప్రోగ్రెసివ్ ఫోరం జాతీయ కార్యదర్శి

కార్పొరేట్ కాలేజీలపై కొరడా

రావుల రాజేశం

మీ అబ్బాయి/అమ్మాయిని డాక్టర్ చేయాలా! ఇంజనీర్‌ని చేయాలా! మమ్మల్ని కలవండి. మేమే తయారు చేస్తాం అంటూ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తెలుగు రాష్ట్రాల్లో విద్యావ్యాపారులు, కార్పొరేట్ విద్యా సంస్థల యజమానులు చెవులు అదిరిపోయే విధంగా పబ్లిసిటీ చేస్తున్నారు. పాలకులు, ప్రభుత్వాలు కార్పొరేట్ మెడికల్ కోచింగ్ సెంటర్ల మీద ఎక్కడ లేని ప్రేమ కురిపించటంతో తెలుగు రాష్ట్రాల్లో పది వేల కోట్ల విద్యావ్యాపారం అక్రమంగా నిరాటంకంగా సాగుతోంది. డాక్టర్, ఇంజనీరు, చార్టెట్ అకౌంటెంట్ కావాలని సర్కారు కాలేజీల్లో చదివే విద్యార్థులకు ఎంతో శ్రద్ధ, పట్టుదల ఉన్న సర్కారు లెక్చరర్లు, ప్రైవేట్ కాలేజీలకు ధీటుగా చదువు చెప్పే స్థాయిని మరిచిపోయారు. తెలుగు రాష్ట్రాల్లో నెలకు 60 వేల మంది లక్షన్నర దాకా నెలసరి జీతం పొందుతున్న జూనియర్ లెక్చరర్లు తమ కాలేజీ పిల్లల్ని ఎంసెట్, నీట్, మెడికల్, అగ్రికల్చర్, ఫార్మసీ కోచింగ్ ఇచ్చి,సీట్లు సాధించటంలో ఎందుకు విఫలం చెందుతున్నారు.ఇంటర్‌లో సర్కారు జూనియర్ కాలేజీలో పాసు కావటం గగనం. ప్రథమ శ్రేణిలో పాసుకావటం 'గొప్పవిషయం'. కొందరు సర్కారు జూనియర్ లెక్చరర్లు 'లాంగ్‌లీవ్' పెట్టి ప్రైవేట్ కార్పొరేట్ కాలేజీల్లో "విద్యను" అమ్ముకొంటున్నారు. కార్పొరేట్ కాలేజీల్లో ఫాకల్టీగా పనిచేస్తున్న వారి మీద చర్య తీసుకునే విద్యాశాఖ అధికారులు, ప్రభుత్వాలు లేకపోవటం వల్ల తల్లిదండ్రులకు సర్కారు కాలేజీలన్నా, సర్కారు లెక్చరర్లన్నా విశ్వాసం లేదు. నమ్మకం లేదు. గాడి తప్పిన సర్కారు జూనియర్ కాలేజీలను ప్రభుత్వాలు పటిష్టం చేయటం లేదు. సర్కారు కాలేజీలో చదివితే ఫ్రీబుక్స్ ఇస్తాం.'మధ్యాహ్నం భోజనం పెడతాం' అంటూ సర్కారు జూనియర్ లెక్చరర్లు ఊరూరా ప్రచారం చేస్తున్నారు. తెలుగు ప్రభుత్వాలు, సర్కారు లెక్చరర్ల లోపాల వల్లనే ఈ దుస్థితి. పూటకు లేని పేరెంట్స్ కూడా సర్కారు జూనియర్ కాలేజీల్లో చదివించటానికి ముందుకు రావటం లేదంటే లోపాలు ఎక్కడ ఉన్నాయో ఇంటర్ అధికారులు, విద్యావేత్తలు శోధించాలి. కోట్లకు పడగలెత్తిన కార్పొరేట్ విద్యాసంస్థలు, ధనార్జనే ధ్యేయంగా విద్యా వ్యాపారాన్ని కొనసాగిస్తున్నారు. మెడికల్, ఇంజనీరింగ్ విద్యావ్యాపారం '3 కోచింగ్ సెంటర్లు 6 కోట్ల వ్యాపారం' వలే తయారైంది. గ్రామాల్లో మాయమాటలు చెప్పి పీ.ఆర్.వోలు పేరెంట్స్‌ను తమ వలలో వేసుకుంటున్నారు. సీటు రిజర్వేషన్ కోసం 5 వేల నుండి 20 వేల వరకు తీసుకుంటున్నారు. తెల్లకాగితాన్ని అడ్మిషన్ ఫారంగా భావించి 5 వందలు వసూలు చేస్తున్నారు. 2 వందలకు దొరికే ఇంటర్ మెటీరియల్ కోసం 3 వేల నుండి 5 వేల వరకు ముక్కు పిండి వసూలు చేస్తున్నారు.ఒక్కొక్క విద్యార్థి దగ్గర నుంచి రకరకాల పేర్లు పెట్టి, ప్యాకేజీలు పెట్టి ఏటా లక్షన్నర నుంచి రెండున్నర లక్షలు ఉత్తపుణ్యానికే 'జబర్‌దస్తీగా' వసూలు చేస్తున్నారు. అడ్మిషన్ సమయం చెప్పిన మాటలు అడ్మిషన్ పొందిన 2 నెలల తర్వాత యాజమాన్యాలు తుంగలో తొక్కుతున్నాయి. ఒక్కొక్క కార్పొరేట్ కాలేజీ ఇంటర్ బోర్డు నుంచి ఇంటర్ సెక్షన్ల కోసం ఎలాంటి అనుమతులు పొందటం లేదు.ఒక్కొక్క కార్పొరేట్ కాలేజీ హైదరాబాద్‌లో 5 నుండి 25 వరకు బ్రాంచీలను నిబంధనలకు విరుద్ధంగా ఇష్టారాజ్యంగా స్థాపిస్తున్నాయి. లక్షలు ఆర్జించే వారు విద్యార్థుల తల్లిదండ్రుల జేబులకు కొత్త కొత్త పేర్లతో 'కత్తెర' పెడుతున్నారు. 'దోభీ' పేరిట 3 వేలు దాకా నొక్కేస్తున్నారు. యూనిఫారం ధర మార్కెట్లో ఐదు వందలు దాటకపోయిన తమ కాలేజీలో తయారు చేసిన యూనిఫారమే కొనాలని ఒక్కొక్క దానికి 2 వేల వరకు ముక్కుపిండి వసూలు చేస్తున్నారు.

20 ఏళ్ల అనుభవజ్ఞులతో పాఠాలు చెప్పిస్తామని వందలోపు మెడికల్, ఇంజనీర్ ర్యాంకులు పొందేటట్లు కోచింగ్ ఇప్పిస్తామని

ఆశల పల్లకీలో ఊరేగిస్తారు. కానీ ఫీజు తీసుకున్నపుడు ఉన్న 'మాటల గారడి' బోధనలో ఉండదు. ఇంటర్ సిలబస్‌కు సమాంతరంగా JEE, NEET, AIMS, JIPMER, CPT వంటి కోర్సులకు అడ్వాన్స్‌డ్ టెక్నాలజీతో కోచింగ్ ఇప్పిస్తామని ముందు ప్రగల్భాలు పలుకుతారు. పీ.ఆర్.వో వచ్చి చల్లని ఉపన్యాసం ఇచ్చి అడ్మిషన్ పొందిన 6 నెలలకు అతీగతీ ఉండదు. యాజమాన్యం పట్టించుకోదు. అనుభవజ్ఞులైన లెక్చరర్లు అనే పేరు చెప్పి, కొత్తవారితో తక్కువ వేతనంతో పనిచేసే వారితో పాఠాలు చెప్పిస్తారు ఏసీ క్యాంపస్ పేరు చెప్పి రూ.50 వేలు ఎక్కువ వసూలు చేస్తారు. కాని ఏసీ క్లాసులు జరుగవు. పేరెంట్స్ అడుగుదామంటే ఏవో కుంటి సాకులు చెబుతారు. పెద్ద భవనాల్లో క్లాసులు, ల్యాబులు డైనింగ్ హాలు ఉంటాయి. పిల్లలను 24 గంటలు చదువు, ర్యాంకులు

రావాలి 'బట్టీపట్టండి అని ఒత్తిడికి' గురి చేస్తారు. వారికి ఆటపాటలు ఉండవు. యోగా, ధ్యానం, ఫిజికల్ ఎక్సర్‌సైజ్, పేపర్ రీడింగ్ కనబడదు. క్లాసులు లేకపోతే స్టడీ అవర్సు తప్ప వేరే ఎక్స్ట్రా కరికులర్ ఆక్టివిటీస్ ఉండవు. హాస్టల్ గదుల్లో పశువుల మందవలే ఇరుకుగా బెడ్స్, బల్లలు వేస్తారు. బాగా డబ్బులు కట్టినా ఇరుకైన బల్లలే గతి. మొదట్లో గదికి 5 గురినే వేస్తాం అంటారు. కొద్దికాలం గడిచాక, డబ్బులు ముట్టాక గదికి కిక్కిరిసి పోయేటంత మంది విద్యార్థులను అలాట్ చేస్తారు. హాస్టల్ విజిట్‌కి మొదట్లో పోయినపుడు చక్కని రుచికరమైన భోజనం పెడతారు.నెల రోజులు గడిచాక, రుచిలేని తినటానికి ఇష్టపడని భోజనం పెడతారు. భోజనం పేరిట ఒక్కో సంస్థ లక్షలు దోపిడీ చేస్తున్నా, నగరపాలక సంస్థలు, ఫుడ్ ఇన్స్‌పెక్టర్లు స్పందించిన పాపాన పోవటం లేదు. డబ్బులు కట్టేటపుడే పేరెంట్స్‌తో మర్యాదగా ఉంటారు. ఫీజు చెల్లింపులు పూర్తి అయ్యాక వారి మాటలు ఖాతరు చేయరు. పేరెంట్స్ మీటింగ్స్ ఉండవు. డబ్బులు ముడితే విద్యార్థుల పేరెంట్స్‌తో పని ఉండదు. అకడమిక్ సౌకర్యాలు ఉండవు.నాణ్యమైన బోధ ఉండవు. ల్యాబులు, లైబ్రరీలు పెద్దగా ఉండవు. అయినా జిల్లా కేంద్రాల నుండి మొదలుకొని హైదరాబాద్, వరంగల్, కరీంనగర్, విజయవాడ, విశాఖపట్నం, గుంటూరు, నెల్లూరు ప్రాంతాల్లో విద్యా వ్యాపారం కోట్లలో సాగుతోంది. ఇంటర్ అడ్మిషన్లు 'ఆన్‌లైన్'లో చేస్తే మంచిది. వారు కోట్లు సంపాదిస్తున్నా ఆదాయపన్ను శాఖకు సమాచారం ఇవ్వరు. లంచాలు పెట్టి ప్రాక్టికల్‌లో 'బైకి బై' మార్కులు వేయిస్తారు. తెలుగు రాష్ట్రాల్లో 80% అడ్మిషన్లు ప్రైవేట్ కాలేజీల్లో ఉంటున్నాయి. అంటే తెలుగు ప్రభుత్వాల వైఫల్యం ఏమిటో గుర్తించాలి. హైస్కూళ్లలో ఫీజుల నియంత్రణ కమిటీ వేసినట్లే ఇంటర్, ఎంసెట్, నీట్ కోచింగ్ మీద సర్కార్‌లే ఫీజు నియంత్రణ చేయాలి. మోసం, దోపిడీ చేస్తున్న కార్పొరేట్ సంస్థల మీద జూన్ నెలలో తనిఖీలు చేయాలి.

- వ్యాసరచయిత లెక్చరర్, సెల్ : 7780185674

పూణె కోర్టులో నాలుగోసారి కలలూ, కన్నీళ్లూ

వీక్షణం వేణుగోపాల్

మిత్రులారా, జనవరి 22 మంగళవారం భీమా కోరేగాం కేసు నిందితులలో అరెస్టయి జైలులో ఉన్నవారందరినీ (షోమా సేన్ ను మినహా) పూణె కోర్టుకు తీసుకువచ్చారు. మళ్లీ ఒకసారి ఆ ఎనిమిది మందినీ (సురేంద్ర గాడ్లింగ్, సుధీర్ ధావ్లే, రోనా విల్సన్, మహేశ్ రౌత్, సుధా భరద్వాజ్, వర్నన్ గోంజాల్వెస్, అరుణ్ ఫరేరా, వరవరరావు) మీ అందరి తరఫునా పలకరించాను, మాట్లాడాను, ఆలింగనం చేసుకున్నాను. ఆరోగ్యపరంగా అందరూ కాస్త నలిగినట్టు కనిపించారు. వివి అయితే గతంలో చూసినప్పటికీ ఇప్పటికీ సన్నబడ్డారు, చలి వల్ల కావచ్చు నల్లబడ్డారు, పెదాలు పగిలి, నల్లబడి ఉన్నాయి. కాని అందరికందరూ మానసికంగా ఉత్సాహంగా, ఉల్లాసంగా, మంచి స్ఫూర్తితో ఉన్నారు. పోయినసారి లాగే ఈసారి కూడా మన మిత్రులను మధ్యాహ్నం భోజనానంతర సెషన్‌కే తీసుకువస్తారని అనుకున్నాం గాని పన్నెండున్నరకే తీసుకువచ్చారు. వివి కూతురు సహజ, మనుమరాలు డా. ఉదయ, వివిని కలవడానికే (కాదు చూడడానికే) పెద్దపల్లి నుంచి వచ్చిన బాలసాని రాజయ్య, పూణె మిత్రుడు మూర్తి, నేను లిఫ్టులకు ఎదురుగా వరండాలో ఎదురుచూస్తూ కూచున్నాం. హఠాత్తుగా లిఫ్టు తెరుచుకుని బైటికి వస్తున్న వర్నన్ కనబడ్డాడు. ఆ వెనుకే వివి. మూడు గంతుల్లో మేం అక్కడికి చేరేసరికే మిగిలిన ఆరుగురూ. సుధను మరొకవైపు నుంచి తీసుకువచ్చి అప్పటికే కోర్టు హాలు ఎదురుగా కూచోబెట్టారు.

వాళ్లలో ముగ్గురిని కోర్టు హాలు ముందు వరండాలో బెంచి మీద కూచోబెట్టి చుట్టూ పోలీసులు నిలబడ్డారు. బెంచీ మీద చోటు లేక సురేంద్ర, మహేశ్, సుధీర్ నిలబడ్డారు. అక్కడ ఒక పది నిమిషాల పాటు పోలీసులు మమ్మల్ని దూరం జరుపుతూ, అదిలిస్తూ ఉన్నప్పటికీ వెనక్కీ ముందుకీ కదులుతూ దోబూచులాటలాడినట్టు ఒక్కో మాట మాట్లాడుతూ వచ్చాం. ఈలోగా సహజ వివి పక్కకు చేరి విరసం సభల కరపత్రం, మహబూబ్ నగర్ 'వివి కవిత్వంతో ఒకరోజు' కరపత్రం, జనవరి సంచిక అరుణతార చూపింది. తెలుగు అచ్చయిన కాగితాలు జైలు లోపలికి తీసుకువెళ్లడానికి వీలు లేదు గనుక వివి అక్కడే గబగబా చూసి ఇచ్చేశారు. ఆ క్షణం పాటు చూడడానికి కూడా పోలీసుల అభ్యంతరాలు. అసలు మేం తెలుగులో మాట్లాడుతుంటే ఏం మాట్లాడుతున్నామోనని పోలీసుల అదిలింపులు.

ఆ ఆరుగురితో న్యాయవాదులు మాట్లాడడం, వివి కోసం


వరవరరావు

వెళ్లిన మేం నలుగురం, గాడ్లింగ్ కోసం వచ్చిన ఒక క్లైంట్, ఆయన కూతురు, మహేశ్ కోసం వచ్చిన ఇద్దరు స్నేహితులు, అందరి కోసమూ పూణె నుంచి వచ్చిన మరొక ముగ్గురు నలుగురు స్నేహితులతో ఆ చిన్న నాలుగైదు అడుగుల కారిడార్ నిండిపోయి సభ జరుగుతున్నట్టనిపించింది. ఒక మఫ్టీ పోలీసు అధికారి యూనిఫాం కానిస్టేబుళ్లను మందలిస్తూ, మమ్మల్ని పక్కకు జరపమని ఆదేశిస్తూ, ఆగ్రహంతో ముక్కు నుంచీ నోటినుంచీ పొగలు కక్కుతూ కాలుకాలిన పిల్లిలా తిరి గాడు. కోర్టు హాల్లోకి వెళ్లి వచ్చి, 'జడ్జిగారు మూడున్నరకు తీసుకు రమ్మంటున్నారు, కస్టడీబ్లాక్‌కు తీసుకు వెళ్లండి' అని ఆదేశించాడు.

మళ్లీ పోలోమని ఊరేగింపు. వెంట ఎస్కార్ట్ ఉన్న కానిస్టేబుళ్లలో ఒక హెడ్ కానిస్టేబులో, ఎస్సైనో కావచ్చు, చాల కోపంగా, దురుసుగా ఉన్నాడు. అంతకు పావుగంట ముందు నుంచీ మమ్మల్ని మాటిమాటికీ అదిలిస్తున్నాడు. రాజయ్య వివి పక్కకు వెళ్లి ఏదో మాట్లాడుతుండగా చూపుడు వేలుతో బెదిరిస్తూ మరాఠీలో ఏదో అరిచాడు. నిన్ను కూడా లోపలేస్తాం అన్న ధ్వని వినబడింది. అలా కోర్టు ప్రాంగణంలోని పోలీసు కస్టడీ ఆవరణ (న్యాయాధీన్ బందీ కోఠడీ) దాకా మళ్లీ ఒక ఐదారు నిమిషాల నడక-మాటలు. ఆ ఆవరణ ముందు మూడుంబావు దాకా రెండు గంటల పడిగాపులు.

మూడుంబావుకు మళ్లీ కోర్టు భవనంలోకి ఊరేగింపు. మళ్లీ ఐదారు నిమిషాల నడక-మాటలు. ఈ మూడు విడతల మాటల్లోనే సుధీర్ కు ఆలస్యంగా పుట్టినరోజు శుభాకాంక్షలు చెప్పాను. తన పుట్టినరోజునాడు ఫేస్ బుక్ మీద రాశానని చెప్పాను. సహనింది తులకు కూడా అప్పుడే తెలిసి అందరూ శుభాకాంక్షలు చెప్పారు. సుధీర్ కు ఆరోజుతో యాభై నిండాయట.

తాను అరెస్టయి వెళ్లేటప్పుడు తీసుకుపోయిన గుల్జార్ కవితల ఇంగ్లిష్ అనువాదాల తాజా సంపుటం 'సస్పెక్టెడ్ పొయెమ్స్' మొత్తం పుస్తకం తెలుగు చేశానని వివి చెప్పారు. ఉరిశిక్ష కోసం ఎదురుచూస్తున్న తన సహ నిందితులైన ముస్లింల సహాయం తీసుకుని ఉర్దూ పదాలూ, గుల్జార్ సాబ్ ఉర్దూలోనే రాసి, దేవనాగరిలో అచ్చువేసిన ముందుమాట కూడా తెలుగు చేశానన్నారు. నేను పోయినసారి కలిసినప్పటికీ ఇప్పటికీ ఏ సభలు జరిగాయని, ఎవరు ఏమి రాశారనీ, ఏం జరుగుతున్నదనీ అడిగి తెలుసుకున్నారు. 'సన్నబడ్డారు' అంటే 'అసలు జైలులో అందరూ లావవుతారు. లావు కాకుండా ఉండడానికి జాగ్రత్తలు తీసుకుం టారు. నేను కూడా రోజంతా నడుస్తూనే ఉన్నాను. బ్రేక్ ఫాస్ట్ తర్వాత నడక, మధ్యాహ్న భోజనం తర్వాత నడక, సాయంత్రం నడక, రాత్రి భోజనం తర్వాత నడక" అన్నారు. బ్రేక్ ఫాస్ట్ గా పోహా (అటుకుల ఉప్మా) గాని, ఉప్మా గాని, సిరా (స్వీట్) గాని ఉంటాయట. అన్నం మెతుకులు చల్లారిపోతే తినడం కష్టమయ్యేలా ఉంటాయి గనుక రొట్టె తింటున్నారట. 'చదువూ రాతా సాగుతు న్నాయి. తెలుగు మాట్లాడేవాళ్లు లేకపోవడం, తెలుగు వినిపించక పోవడం, తెలుగు చదివే అవకాశం లేకపోవడం బాధ' అన్నారు. 'ఇతర సమస్యలేమీ లేవు. ఆరోగ్యంగా ఉన్నాను' అన్నారు. మళ్లీ వీళ్లను కోర్టు హాల్లోకి తీసుకుపోయే టప్పటికే, ఈ కేసులోనే ఆనంద్ తేల్తుంబ్డే ముందస్తు బెయిల్ పిటిషన్ మీద వాదనలు జరుగు తున్నాయి. తన మీద ఆరోపణలు ఎత్తివేయాలని ఆనంద్ వేసిన పిటిషన్ ను సుప్రీం కోర్టు పది రోజుల కింద కొట్టివేసిన సంగతి, అలా కొట్టివేస్తూనే, నాలుగు వారాల పాటు అరెస్టు చేయవద్దని, ఈ లోగా ముందస్తు బెయిల్ దరఖాస్తు పెట్టుకోవచ్చని చెప్పిన సంగతి మీకు తెలుసు. ఆమేరకు ఆనంద్ బెయిల్ దరఖాస్తు విచారణకు వచ్చింది. ఆ దరఖాస్తు మీద తమ వాదన తయారు చేసుకోవడానికి వ్యవధి కావాలని పబ్లిక్ ప్రాసిక్యూటర్ కోరారు. ఆనంద్‌కు వ్యతిరేకంగా ఎఫ్ ఐ ఆర్ లో గాని, ఇప్పటివరకూ బైటపెట్టిన సమాచారంలో గాని ఎక్కడా ఒక్క ఆరోపణ కూడా లేదని, అయినా ఈ విషయమై ఇప్పటికే ముంబై హైకోర్టులోను, సుప్రీం కోర్టులోను ప్రాసిక్యూషన్ చెప్పవలసిం దంతా చెప్పిందని, కనుక వ్యవధి ఇవ్వకుండానే విచారణ చేపట్టవచ్చునని ఆనంద్ తరఫు న్యాయవాది అన్నారు. కాని జడ్జి చివరికి ప్రాసిక్యూషన్ కు వారం రోజుల వ్యవధి ఇచ్చారు. తమపై చార్జిషీట్‌లో, తమకు ఇవ్వవలసిన సమాచారంలో, తమ బెయిల్ దరఖాస్తులలో ప్రాసిక్యూషన్ ఏ ఒక్క పద్ధతినీ పాటించడం లేదని సురేంద్ర గాడ్లింగ్ జడ్జి దృష్టికి తీసుకు వచ్చాడు. ఇవన్నీ విచారణ సమయంలో వాదించుకోవచ్చు అని ప్రాసిక్యూటర్ వాయిదా వేయడానికి ప్రయత్నించారు. జడ్జి కూడా ప్రాసిక్యూటర్ తరఫునే గాడ్లింగ్ తో వాదనకు దిగారు. జైలులో కనీస సౌకర్యాల విషయంలో స్వయంగా ఈ జడ్జి ఇచ్చిన ఉత్తర్వు లను కూడా జైలు అధికారులు పాటించడం లేదని వివి తరఫు న్యాయవాదులు జడ్జి దృష్టికి తెచ్చారు. అసలు ఇచ్చిన ఉత్తర్వులు ఏమిటి అని చర్చ జరిగి, ఆ ఉత్తర్వు కాపీ కోసం వెతికారు. పది నిమిషాల తర్వాత ఆ కాపీ దొరకబట్టి, జైలు అధికారులకు సమన్లు పంపండి అని మరొక కొత్త ఉత్తర్వు వెలువడింది!

గత మూడు సార్లూ బోనులోనుంచే "నా కుటుంబ సభ్యులు వచ్చారు, కలవడానికి అనుమతించండి" అని వివి అడగడం, అయిష్టంగానే జడ్జి ఓ ఐదు నిమిషాల అనుమతి ప్రసాదించడం జరుగుతున్నది. ఈసారి ఎందుకో వివి 'నేను అడగడం కంటే నువ్వు ఒక అప్లికేషన్ రాసి ఇవ్వు' అని సహజకు చెప్పారు. సహజ మా నలుగురికీ అనుమతి ఇమ్మని అప్లికేషన్ రాసి ఇచ్చింది. జడ్జి అది చూసి, 'భార్యకు తప్ప మరెవరికీ లేదు' అని మరాఠీలో వివీ వినబడకుండా గొణిగాడు. కూతురు, మనవరాలు, ఇతర కుటుంబ సభ్యులు వచ్చారు అని న్యాయవాది చెప్పారు. ఆ అప్లికేషన్ మీద లిఖిత ఆదేశం ఏదీ ఇవ్వకుండా, కూతురి ఐడి ప్రూఫ్ ఉందా అని జడ్జి అడిగారు. సహజ తన ఐడి ప్రూఫ్ తీసుకుని వెళ్తే, "కూతురు ఒక్కదానికే అనుమతి" అన్నారు. సహజ వెనుక ఉదయ, నేను నిలబడి ఉండగా అక్కడ కాపలాగా నిలబడిన ఆ దురుసు హెడ్ కానిస్టేబుల్ మా ఇద్దరినీ వెనక్కి నెట్టాడు.

ఒకవైపు ఇది జరుగుతుండగానే వర్నన్ ను తమ కొడుకు సాగర్ కలవడానికి న్యాయవాది కూడా అయిన సూసన్ ఏబ్రహాం అనుమతి తీసుకుంది. బోనులో వివి పక్కనే నిలబడి ఉన్న వర్నన్ దగ్గరికి సాగర్ వెళ్లాడు. సాగర్ ను ఎప్పుడో చిన్న పిల్లాడిగా చూసిన వివి ఎంత పెద్దగయ్యావు అంటూ చెయ్యి కలిపారు. జడ్జి ఎదురుగా పబ్లిక్ ప్రాసిక్యూటర్ కు సహాయం చేస్తూ నిలబడి ఉన్న ఎసిపి శివాజీ పవార్ ఒక్క గంతులో బోను దగ్గరికి వచ్చి సాగర్ ను పక్కకు లాగి, ఎవరు నువ్వు, వివిని ఎందుకు కలుస్తున్నావు అని అడిగాడు. 'జడ్జి అనుమతి ఇచ్చాడు, అసలు ఈ ముగ్గురూ మీకు తెలుసు గదా' అని వివి మా గురించి అన్నారు. "డాక్టర్ ఉదయ నాకు తెలుసు, తను ఉండవచ్చు" అని జవాబిచ్చి సాగర్ వైపు చూపెడితే, 'వర్నన్, సుసాన్ ల కొడుకు' అని చెప్పగానే, అప్పుడే తెలిసినట్టుగా "అలాగా, సరే" అన్నాడు. పక్కనే ఉన్న సనోబర్ "పవార్ డు యు హావ్ చిల్డ్రన్?" అని అడిగింది. ఇంత మహత్తర కేసు తయారు చేసిన ఆ పోలీసు అధికారి ఖంగు తిన్నాడు. చిరచిరలాడుతూ, 'యు కెనాట్ ఆస్క్ మి, ఆస్క్ ది జడ్జి' అని వెళ్లి, నన్ను వివిని కలవకుండా చేశానన్న విజయగర్వంతో నావైపు చూస్తూ మళ్లీ పిపి వెనక నిలబడ్డాడు. (వివిని తీసుకుపోవడానికి నవంబర్ 17న వచ్చినది ఆ అధికారే. ఆరోజు మా ఇద్దరికీ వాదన జరిగింది).

అప్పటికే జడ్జి ఇచ్చే ఉత్తర్వులు అయిపోయాయి కాబట్టి మళ్లీ వెనక్కి వ్యాన్ల దగ్గరికి మరొక ఐదారు నిమిషాల నడక, మాటలు. ఒక బిగి కౌగిలి. ఒక కన్నీటి వీడ్కోలు. మహారాష్ట్రలో, ప్రత్యేకించి పూణెలో ఈ నాలుగు పర్యటనల్లో వివరంగా పరిశీలించకపోయినా, మెతుకు పట్టి చూసినట్టు చూసినా ఎంతగా హిందూత్వ బ్రాహ్మణీయ భావజాలం, మతోన్మాదం విస్తరిం చాయో చూసి నాకు ఆశ్చర్యం కలుగుతున్నది. మహాత్మా జోతిబా ఫూలే, సావిత్రీబాయి, బాబా సాహెబ్ అంబేద్కర్ లు పుట్టిన నేల, వలసవ్యతిరేక ఉద్యమం నుంచి దళిత్ పాంథర్స్ దాకా ఎన్నో ఉద్యమాల పుట్టినిల్లు, నాటక, సాహిత్య రంగాలలో ఎందరో ప్రజాస్వామిక సాహిత్యకారుల భావాలు ప్రచారమైన నేల అని గర్వంగా చెప్పుకునే ఆ నేల ఇప్పుడు భయానకమైన ప్రగతి వ్యతిరేక భావనలకు స్థావరంగా ఉన్నట్టున్నది. మచ్చుకు ఒక్క సంగతి చూడండి: కోర్టు హాలులో ఏర్పాట్లు వాస్తు ప్రకారం చేశారు. ఏ ప్రభుత్వ కార్యాలయంలోనూ లేని విధంగా నాలుగు వైపుల గోడలకూ పూర్వ్, పశ్చిమ్, ఉత్తర్, దక్షిణ్ అని దిక్కులు సూచించే బోర్డులున్నాయి. వాస్తు ప్రకారం న్యాయమూర్తి దక్షిణ దిశలో కూచున్నాడు. ఆయనకు ఎదురుగా అంటే ఉత్తర దిశలో గోడ మీద 'ఆరోపీ బసన్యాచి జాగా' అని రాసి ఉంది గాని, బహుశా వాస్తు ప్రకారం నిందితులు దక్షిణాన కూచోగూడదేమో, వారి బోనును తూర్పు దిశకు మార్చి, అక్కడ అదే వాక్యాన్ని ఒక ప్రింటవుట్ తీసి అతికేశారు!

విశాలాంధ్ర
బతుకు
The Life
శనివారం
26 జనవరి 2019

మహిళా రైఫిల్స్

గణతంత్ర వేడుకల పరేడ్‌కు సిద్ధమవుతున్న అస్సాం రైఫిల్ మహిళా సైనికులు మంచును సైతం లెక్కచేయకుండా సాధన చేస్తున్న ఈ దృశ్యం న్యూఢిల్లీలోనిది.





కమ్మవారి పేట జవానుల కోట



దేశం మనకెంతో ఇచ్చింది. దేశానికి మనమేదైనా ఇవ్వాలి అనే భావన అందరిలోనూ ఉంటుంది. కానీ దేశభక్తిని ఆచరణలో చూపేది మాత్రం కొందరే. ఆ కొందరిలో నిలవడమనేది సులువేం కాదు. ఎందుకంటే మామూలు వారి కన్నా వీరికి ధైర్యసాహసాలు ఎక్కువగా ఉండాలి. అవసరమైతే దేశం కోసం ప్రాణాలను కూడా ఇచ్చే తెగింపు ఉండాలి. అలాంటి తెగింపు దేశభక్తిని ప్రత్యక్షంగా చూపించేది ఆర్మీవారే. మరి ఇలాంటి వారు ఊరికి ఒకరో ఇద్దరో ఉంటే గ్రేటే. అదే ఊరంతా ఉంటే ఆ ఊరికి సెల్యూట్ కొట్టాల్సిందే. అలాంటి ఊరు మన రాష్ట్రంలోనూ ఒకటి ఉంది. అదే కమ్మవారి పేట. శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల మండలం పొన్నాడ పంచాయితీ కమ్మవారి పేట జవాన్ల చిరునామా...

దేశ సేవ చేయాలన్న ఆసక్తితోననే...



దేశ సేవచేయాలన్న ఆసక్తితో 1989లో నేను ఆర్మీలో చేరాను. 24 ఏళ్ల పాటు ఆర్మీలో వివిధ స్థాయిల్లో పనిచేసి 2013లో పదవీ విరమణ పొందాను. శ్రీనగర్, గుల్‌మార్గ్, అస్సాం, అరుణాచల్‌ప్రదేశ్, ఢిల్లీ, లక్నో, జోధ్‌పూర్ తదితర ప్రాంతాల్లో పనిచేశాను. దేశానికి సేవ చేయడం నా అదృష్టంగా భావిస్తున్నాను.

– సువ్వారు నీలాచలం

అన్నయ్య స్ఫూర్తితోనే...



కమ్మవారి పేట నుంచి అన్నయ్య అంబటి సత్యనారాయణ తొలిసారిగా ఆర్మీలో చేరారు. అప్పట్లో పీయూసీ చదివిన అన్నయ్య ఉద్యోగ ప్రయత్నాలు చేయకుండానే ఆర్మీలో చేరారు. అన్నయ్య స్ఫూర్తితో నేను 1973లో ఆర్మీలో చేరి 1988 పదవీ విరమణ చేశాను. ఆర్మీలో పనిచేయడం నాకు ఎంతో ఆనందాన్ని ఇచ్చింది.

– అంబటి కోటి సూర్యచంద్రప్రకాశరావు

ఇద్దరు కుమారులూ ఆర్మీలోనే...



నా ఇద్దరు కుమారులు ఆర్మీలోనే ఉన్నారు. పెద్ద కుమారుడు శ్రీనివాసరావు ఆర్మీలో పనిచేసి రిటైర్ కాగా, రెండో కుమారుడు అర్జునరావు సుబేదార్‌గా పనిచేస్తున్నారు. అక్షరాలు తెలియని నాకు ఇద్దరు పిల్లలు ఆర్మీలో పనిచేయడం ఆనందంగా ఉంది.

–హనుమంతు సరస్వతమ్మ

దేశానికే గర్వకారణం..



దేశంలోని అనేక చిన్న గ్రామల్లో మా కమ్మవారి పేట కూడా ఒకటి. చూడటానికి చిన్నదైనా మనస్సు మాత్రం చాలా విశాలమైనది. ఇప్పటికే మా గ్రామం నుంచి ఆర్మీ, సీఆర్‌ఎఫ్‌లకి ఎంపికయ్యారు, ఎంపికవుతూనే ఉన్నారు. దేశ సరిహద్దుల్లో మా గ్రామానికి చెందిన యువకులు పనిచేస్తుందడడం మాకు చాలా ఆనందంగా ఉంది.

– సువ్వారు అప్పలసూరి

ఆర్మీలో 25 ఏళ్లు పనిచేశా...



1991లో ఆర్మీలో చేరి 2015 సంవత్సరం వరకు పనిచేశాను. సుమారు 25 ఏళ్లు ఆర్మీలో పనిచేసి హవల్దార్‌గా రిటైరయ్యాను, బెంగళూర్, లే, బారాముల్లా (కాశ్మీర్), కోల్‌కత్తా తదితర ప్రాంతాల్లో పనిచేశాను. ప్రస్తుతం స్వగ్రామంలోనే వ్యవసాయ పనులు చేసుకుంటున్నాను.

– హనుమంతు శ్రీనివాసరావు

చిన్న కుమారుడు ఆర్మీలోనే



నా ముగ్గురు కుమారుల్లో చిన్న కుమారుడు అనిల్‌కుమార్ ఆర్మీలో పనిచేస్తున్నాడు. ఈ గ్రామంలోని ప్రతీ ఇంటి నుంచి ఒకరిద్దరు ఆర్మీలో ఉన్నారు. 40 మంది వరకు ఆర్మీలో ఉండడంతో కమ్మవారి పేటకు గౌరవంగా ఉంది.

– కొత్తకోట లక్ష్మణరావు

సంవత్సర కాలమంతా బోర్డర్‌లో దేశరక్షణ కోసం వారి ప్రాణాలను సైతం పణంగా పెట్టి ఎంతో దయనీయమైన జీవితాన్ని గడుపుతారు. ఇవన్నీ తెలిసిన తల్లిదండ్రులు వారి బిడ్డలను ఆర్మీకి పంపాలంటే భయపడుతుంటారు. కానీ కమ్మవారి పేట మాత్రం ఇంటికొకరిని పంపి వారి దేశభక్తిని చూపడానికి పోటీపడుతున్నారు. కేవలం ఐదువందుల జనాభా కలిగిన ఆ గ్రామం నుంచి నలభై మంది జవాన్లు రావడమనేది దేశం గర్వించదగ్గ విషయం. ఇంతటి దేశభక్తి ఆ గ్రామానికి రావడం వెనుక ఓ గొప్ప వ్యక్తి ఉన్నారు. ఆయనే అంబటి సత్యనారాయణ మూర్తి(ఎఎస్‌ఎన్). ఈయన కూడా విశ్రాంత ఆర్మీ ఆఫీసర్. అంబటి 1962లోనే ఆర్మీలో చేరారు. అప్పట్లో పియూసి చదివిన వారికి కూడా ఉద్యోగాలొచ్చేవి. ఎఎస్‌ఎన్ కూడా పియూసీ పూర్తి చేయడంతో ఆర్మీలో అవకాశం లభించింది. దీంతో ఆయన దేశ సేవలో నిమగ్నమైపోయారు. ఎఎస్‌ఎన్ యూపీలోని ఝాన్సీ, ముంబాయి తదితర ప్రాంతాల్లో సేవలందించారు. తర్వాత వరల్డ్ సైగాన్(ఆర్మీలోని అయా విభాగాల్లో విజయవంతమైన వారిని సైగాన్‌లుగా గుర్తిస్తారు. ఇలాంటి సైగాన్‌లతో ఏర్పడిందే ప్రపంచ సైగాన్ బృందం)గా ఎంపికై కంబోడియాలో ఏడాదిన్నర పాటు పనిచేశారు. ఎన్‌సీసీ ఇన్‌స్ట్రక్టర్‌గానూ విధులు నిర్వహించారు. పదవీ విరమణ అనంతరం గ్రామానికి తిరిగి వచ్చిన ఎఎస్‌ఎన్ లోకల్ ఫండ్ ఆడిటర్‌గా పనిచేశారు. ఈ సమయంలో ఎఎస్‌ఎన్ కమ్మవారిపేట ప్రజలకు దేశభక్తి గురించి చాటి చెప్పారు. దీంతో గ్రామంలోని యువత ఆర్మీలో చేరారు. ఎఎస్‌ఎన్ సోదరుడు అంబటి కోటి సూర్యచంద్ర ప్రకాష్‌రావు కూడా ఆర్మీలో చేరి హిమాచల్‌ప్రదేశ్, గ్వాలియర్, డెహ్రాడూన్ తదితర ప్రాంతాల్లో విధులు నిర్వహించారు. పదవీ విరమణ పొందాక ఆర్టీసీలో డ్రైవర్‌గా కూడా పనిచేశారు.

ఎఎస్‌ఎన్ స్ఫూర్తితో....

ఎఎస్‌ఎన్ అకస్మాత్తుగా గుండెపోటుతో మరణించారు. కానీ ఆయన ఇచ్చిన స్ఫూర్తి మాత్రం గ్రామస్థుల్లో సజీవంగానే ఉంది. ఆయన నేర్పిన విషయాలు కమ్మపేట గ్రామస్థులు వారి బిడ్డలకు తెలియజేస్తూ వారిలో దేశభక్తిని మేల్కొలుపుతున్నారు. ఎఎస్‌ఎన్ స్ఫూర్తిగా తీసుకొని సువ్వారు నీలాచలం నాక్ సుబేదార్‌గా, హనుమంతు శ్రీనివాసరావు హవల్దార్‌గా, బాడాన వెంకటరమణ, రుప్ప జనగన్నాథం తదితరులు ఆర్మీలో సేవలందించారు. అన్నెపు వెంకటరమణ, సూరిబాబు, బాలరాజు, పేడాడ దశరథ రావు, పేడాడ గోవిందరావు, సువ్వారు తవిటినాయుడు, మల్లేశ్వరరావు, తమ్మినేని రాజు, బాడాన రామారావు, రమణ, హనుమంతు, అర్జునరావు, పప్పల సింహాచలం, పప్పల ఉమామహేశ్వరరావు, సువ్వారు అప్పలనాయుడు, సీపాన ఈశ్వరరావు, కొత్తకోట అనిల్‌కుమార్‌లు దేశరక్షణ కోసం పాటు పడుతున్నారు. బొడ్డేపల్లి అప్పారావు సీఆర్‌పీఎఫ్‌లో పనిచేసి చనిపోగా అతని కుమారుడు ప్రసాదరావు రెండు నెలల క్రితమే సీఆర్‌పీఎఫ్‌లో చేరాడు. పైడిపెద్ది ఆనదందరావు ఎక్సైజ్‌లో విధులు నిర్వర్తిస్తున్నారు. సువ్వారు అప్పలనాయుడు సీఆర్‌పీఎఫ్‌లో పనిచేస్తున్నారు.

ముగ్గురు అన్నదమ్ములు ఆర్మీలోనే...

ఇంటికి ఒకరిని పంపడం అనేది పెద్ద విషయం కాదు. ముగ్గురిని పంపడమనేది కమ్మవారిపేట సువ్వారు కుటుంబానికే సాధ్యమైంది. సువ్వారు నీలాచలం, మల్లేశ్వరరావు, తవిటినాయుడులు ముగ్గురు అన్నదమ్ములు ఆర్మీలోనే పనిచేస్తున్నారు. ఇందులో నీలాచలం 24 ఏళ్లపాటు ఆర్మీలో పనిచేసి 2013లో రిటైరయ్యారు. మల్లేశ్వరరావు సుబేదార్‌గా, తవిటినాయుడు హవల్దార్‌గా సేవలందిస్తున్నారు. ఇలా కమ్మవారిపేట తమదైన శైలిలో దేశ సేవలో నిమగ్నమై దేశం గర్వించ దగ్గ స్థాయికి ఎదిగింది. దేశ రక్షణ విషయంలో మిగిలిన గ్రామాలకు ఆదర్శంగా నిలిచింది. అందుకే ఈ గ్రామానికి ఒక్కసారి సెల్యూట్ చేద్దాం.

– శ్రీ పెరంబుదూరు వెంకటరమణ
శ్రీకాకుళం జిల్లా రిపోర్టర్

ఆర్మీ డేర్ డెవిల్స్ జట్టులో
మొదటి మహిళ

కెప్టెన్ శిఖా సురభి



మహిళా శక్తి పెరుగుతున్నది అనడానికి మరో నిదర్శం, మొదటిసారి ఒక మహిళా ఆర్మీ ఆఫీసర్ రిపబ్లిక్ డే రోజున జరిగే భయంకర విన్యాసాలలో ఒకటైన మోటార్ విన్యాసాలను ఆర్మీ డేర్ డెవిల్స్ జట్టులో భాగంగా ప్రదర్శించ బోతున్నారు. ఇంతవరకూ పురుషులు మాత్రమే ప్రదర్శించి 24 గిన్నీసు రికార్డులు సాధించారు. ఈ విన్యాసాలు చేయడమంటే చావుతో చెలగాటమాడినట్టే. అలాంటి విన్యాసాలు చేయాలంటే పురుషులే ఒకటికి రెండుసార్లు ఆలోచిస్తారు. అలాంటిది అసాధరణ విన్యాసాలు చేస్తున్నది బీహార్‌కు చెందిన కెప్టెన్ శిఖా సురభి.

ఆమె సిల్వర్ రాయల్ ఎన్‌ఫీల్డ్ బులెట్‌ను డ్రైవ్ చేయడంతో పాటు దానిపై రకరకాల విన్యాసాలు చేస్తున్నారు. నిజానికి సురభి ఒక సాఫ్ట్‌వేర్ ఇంజినీర్. తను పదిహేనేళ్ళ వయస్సు నుంచే బైక్ నడపడం నేర్చుకుంది. కోర్ సిగ్నల్స్ బృందం ఆమె ప్రదర్శన, ధైర్యాన్ని చూసి ఆమె జట్టులో చేరడానికి అనుమతినిచ్చారు.

సురభి తల్లి ఒక క్రీడా ఉపాధ్యాయురాలు. తను కూతుర్ని అనుక్షణం క్రీడాల్లో పాల్గొనే విధంగా ప్రోత్సహించింది. దీంతో పాటు కరాటే, జూడో, యుద్ధ కళలు నేర్పింది. ఇలా సురభి జీవితం తల్లి ప్రేరణతో సాహసోపేతంగా గడిచింది. సురభి తల్లి కూడా బైక్ నడపుతుంది.

యుద్ధ కళలు నేర్చుకోవడం సురభిలో ఆత్మవిశ్వాసాన్ని పెంచింది. దీని వల్ల తను ఏదైనా చేయగలననే ధైర్యం కలిగిందంటోంది సురభి. తను బైక్ నేర్చుకోవడానికి కారణం కూడా తల్లిదండ్రులే. పదిహేనేళ్ళ వయస్సులో ఉన్నప్పుడు వారు సురభికి బైక్ తాళాలు ఇచ్చి నేర్చుకోమన్నారు.

సురభి ఆర్మీలో చేరిన తర్వాత చాలా మంది పురుష అధికారులు బుల్లెట్‌ను నడపడం చూసింది. మొదటి సారిగా తనకు బుల్లెట్ నడపాలన్న ఆసక్తి కలిగింది. వెంటనే లడక్‌లో బైక్ నడిపింది. తర్వాత అరుణాచల్ ప్రదేశ్‌లోని తవాంగ్‌లో కూడా బుల్లెట్‌ను నడిపింది. దీంతో తన ఆత్మవిశ్వాసం రెట్టింపైంది.

సురభి బైక్ నడిపే విధానాన్ని చూసిన ఆర్మీ అధికారులు తనపై నమ్మకంతో డేర్ డెవిల్స్ మోటార్ సైకిల్ జట్టులో చేర్చుకున్నారు. సాహస విన్యాసాల్లో కూడా స్త్రీలకు అవకాశం ఇస్తే ఎలా ఉంటుందో 2019 రిపబ్లిక్ డే పరేడ్‌లో చూడాల్సిందే.

నిజాంను ఎదిరించిన పరిటాల రిపబ్లిక్

ప్రజల్లో చైతన్యం పెల్లుబికినప్పుడు ఎంతటి కసాయి శాసనమైనా, మరెంతటి నియంతృత్వమైనా, ఆ ప్రవాహంలో నామరూపాలు లేకుండా తుడిచి పెట్టుకుపోవల్సిందే. ఈ చారిత్రక సత్యానికి నిలువుటద్దంలా నిలిచిన వాటిలో మన కృష్ణాజిల్లాలోని పరిటాల ఒకటి. నందిగామకు సమీపంలో ఉన్న పరిటాలకు చాలా చరిత్రే ఉంది. ఇది స్వాతంత్ర్యం సాధించడానికి ముందు చాలా పరిణామాలే జరిగాయి. కులం, మతం అనే తేడా లేకుండా అందరూ కలిసి ఆనాటి నిజాంను ఎదిరించిన ఘనత పరిటాలకు ఉంది. గ్రామ క్షస్త్రమ ప్రమాణ పత్రిక ఆధారంగా సొంత విధానాలతో, ఉన్న కొద్దిపాటి వనరులతో ఏడాదిపాటు స్వతంత్రంగా పరిపాలన సాగించిన తెగువ ఈ ప్రాంతం సొంతం.

అప్పటి నైజాం నవాబు మీర్ ఉస్మాన్ ఆలీఖాన్ ఆధ్వర్యంలో నిజాం రాజ్యం అనేక జాగీరులుగా వుండేది. ఒక్కో జాగీరు ఒక్కొక్క జాగీర్దారు ఆధీనంలో వుండేది. నవాబు కమాలియార్ జంగ్ బహుద్దూర్ అధీనంలో వున్న జాగీరుకు చెందిన మూడు తాలూకాలలో కానాత్ తాలూకా ఒకటి. ఈ కానాత్ తాలూకాలో పరిటాల, గని ఆత్కూరు, బత్తినపాడు, మోగులూరు, ఉస్తేపల్ల, కొడవటికల్లు, మల్లవల్లి, అనే ఏడు గ్రామాలు వుండేవి. కానాత్ తాలూకా కేంద్రమైన పరిటాలలో తాలూకా కార్యాలయం, సబ్‌ట్రెజరీ, ఫస్ట్‌క్లాస్ మున్సిఫ్ మేజిస్ట్రేట్ కోర్టు, పోలీసు స్టేషన్, జైలు వుండేవి. సివిల్, క్రిమినల్, సబ్ రిజిస్ట్రార్ అధికారాలు గల తహసీల్దార్ తాలూకా కేంద్రామైన పరిటాలలో పరిపాలన సాగించేవారు. ఆయా శాఖల అధికారులు కూడా అక్కడే వుండేవారు. తాలూకా కేంద్రాల్లో ఒక పోలీస్ సబ్ ఇన్స్‌పెక్టర్, ఎనిమిది మంది పోలీసులు ఉండేవారు. ఇవిగాక శాంతిభద్రతల పరిరక్షణ నిమిత్తం గని ఆత్కూరు, కొడవటికల్లు, మల్లవల్లిలో పోలీసు నాకాలు వుండేవి. ప్రతి నాకాలోను ఒక జమీందారు, ఇద్దరు పోలీసులు ఉండేవారు. ఈ గ్రామాల వారికి ఇరుగుపొరుగున ఉన్న గ్రామాల వారితో ఆర్థికంగా, సాంఘీకంగా, బంధుత్వపరంగా మంచి సంబంధాలు ఉండేవి. రాజకీయంగా ప్రభుత్వాలు వేరైనా దాదాపు అందరూ కలిసిమెలసి వుండేవారు. నిజాం పాలనలో వెట్టిచాకిరీ, వేధింపులు, ఉద్యోగస్తులలో లంచగొండితనం, జాగీర్దారులు, దేశ్‌ముఖ్‌ల దౌర్జన్యాలకు పట్టపగ్గాలులేని రోజులవి. అధికార మదాందుల కసాయి చేష్టలను భరించి భరించి ఓర్పు నశించిన ప్రజలు సమయం కోసం వేచిచూస్తున్న రోజులవి. స్వాతంత్ర్యం కోసం 1942, ఆగస్టులో దేశమంతటా ప్రజ్వరిల్లిన విప్లవం సెగలు పరిటాల కానాత్ తాలూకా (పరిటాల)కు కూడా సోకాయి. ఈ తాలూకా ప్రజలు నైజాం ప్రభుత్వాన్ని ధిక్కరించి పోరాడటంతో నైజాం పాలకుల కళ్ళెర్రబడ్డాయి. ఫలితంగా కానాత్ తాలూకాలో భద్రతా ఏర్పాట్లు మరింత కట్టుదిట్టం చేశారు. 1947లో దేశానికి స్వాతంత్ర్యం లభించినా నిజాం ఆధీనంలో ఉన్న ప్రాంతాలకు స్వేచ్ఛ లభించని విషయం తెలిసిందే. చుట్టూ ఉన్న గ్రామాల ప్రజలు స్వాతంత్ర్య వేడుకలలో ఉత్సాహంగా పాల్గొనడంతో ఈ ప్రాంత ప్రజలనూ కదిలించింది. జాతీయ పతాకాలు ధరించి నిజాం గో బ్యాక్ అన్న నినాదాలు పరిటాలలోనూ మిన్నంటాయి. లారీలపై ఊరేగింపులు జరిగాయి. దీంతో ప్రజలను నిర్దాక్షిణ్యంగా అణచివేయడానికి నిజాం అధికారులు నడుం బిగించారు. ఫలితంగా కానాత్ తాలూకాలో నిజాం పాలకుల కసాయి శాసనం కరాళ నృత్యం చేసింది. అధికారుల దౌర్జన్యాలను భరించలేని ప్రజల్లో దెబ్బకు దెబ్బ, హింసకు హింస అనే సిద్ధాంతం బలపడింది. ఆయుధ శిక్షణ శిబిరాలు రహస్యంగా పనిచేయనారంభించాయి. దౌర్జన్యాలను ధైర్యంగా ప్రతిఘటించి, అధికారులపై తిరుగుబాటు చేసిన సంఘటనలు జరిగాయి. తాలూకా సబ్‌ఇన్స్‌పెక్టర్ కొడవటికల్లు గ్రామం వెళ్ళి కొందరిని అసభ్య పదజాలంతో దుర్భాషలాడటంలో ఆవేశపూరితులైన ప్రజలు ఆయన కాలు, చెయ్యి విరగ్గొట్టి పంపించారు. ఈ సంఘటనతో నిజాం అధికారుల ఆత్మస్థైర్యం పూర్తిగా దెబ్బతింది. దీంతో బెదిరిపోయిన అధికారులందరూ సామూహిక సెలవులు పెట్టి జమాబంది గుమస్తా గోళ్ళమూడి కృష్ణారావుకు బాధ్యతలు అప్పగించి, అదనపు పోలీసు బలగాలకై హైదరాబాదు నిజాం వద్దకు తరలివెళ్ళారు. ఈ పరిస్థితిలో పెల్లుబకిన విప్లవావేశంలో 1947 నవంబరు 15వ తేదీన మాదిరాజు దేవరాజ్, మాదిరాజు నాగభూషణరావు, వారణాశి శ్రీరామమూర్తి, అవ్వా సత్యనారాయణ, చింతల అచ్చయ్య, మాదిరాజు మాధవరావు, షేక్ మౌలానా తదితరుల నాయకత్వంలో కానాత్ తాలూకాను స్వాధీనం చేసుకున్నారు. ప్రభుత్వ ఖజానా, ఆయుధాగారంపై దాడిచేసి, వాటిని బద్దలుకొట్టి తుపాకులు, యితర ఆయుధ సామాగ్రితోపాటు 8,430 రూపాయల మూడు అణాల, ముక్కాణి నగదును కూడా వారు విజయవాడలో ఒక బ్యాంకులో దాచిపెట్టారు. ప్రభుత్వ కార్యాలయాలను హస్తగతం చేసుకుని స్వతంత్రం ప్రకటించుకున్నారు. నాయకత్వం హస్తగతం చేసుకున్న తరువాత వారు ప్రజల్లో ఆత్మవిశ్వాసాన్ని కల్గించడానికి కానాత్ తాలూకాలోని మిగతా గ్రామాలలో పర్యటించి గ్రామ పంచాయితీలు ఏర్పాటు చేశారు. ప్రతి గ్రామంలోనూ ఐదుగురి సభ్యులతో కమిటీలు నియమించి గ్రామ క్షేమ ప్రమాణ పత్రిక, ఏర్పాటు చేసుకున్నారు. నవంబరు 25వ తేదీన గ్రామానికి ముగ్గురు చొప్పున 21 మందితో కేంద్ర పంచాయతీ కమిటీని ఏర్పాటు చేసి స్వతంత్ర రిపబ్లిక్ రాజ్యానికి నాంది పలికారు. అలా పరిటాలకు నిజాం నుంచి విముక్తి దొరికింది. స్వేచ్ఛావాయువులు పీల్చుకుంది. కానాత్ తాలూకా పేరను పరిటాల తాలూకా పేరుగా మార్చారు. పరిటాల రిపబ్లిక్ అవతరణ గురించి అప్పటి దినపత్రికలు ప్రముఖంగా వార్తలను ప్రచురించాయి. రేడియోలో కూడా ప్రత్యేక వార్తగా దీనిని ప్రసారం చేశారు.

ఇక్కడితో నిజాం దౌర్జన్యాలకు తెరపడిందనుకుంటే పొరపాటే. కొంతకాలం తరువాత తిరుగుబాటుదారుల్ని దేశద్రోహులుగా, రాజద్రోహులుగా పేర్కొంటూ హైదరాబాదు నిజాం ప్రభుత్వాం కేంద్ర పంచాయితీ కమిటీ సభ్యులపై అరెస్టు వారెంట్లు జారీచేసింది. కానాత్ తాలూకాలో ఏడు గ్రామాలలో శాంతిభద్రతలను పర్యవేక్షించటానికి తమ సైన్యాలు పరిటాల వెళేందుకు ఇండియన్ గ్రామాలగుండా పయనించేదుంకు అనుమతి ఇవ్వవలసిందిగా ప్రభుత్వాన్ని కోరింది. ఇక్కడి పరిస్థితి గురించి తెలియని మద్రాసు ప్రభుత్వం నిజాం సైన్యాలకు అనుమతి ఇస్తూ ఆ విషయాన్ని కృష్ణాజిల్లా కలెక్టర్ మలయప్పన్‌కు తెలియజేసింది. నిజాం సైన్యాలు అడుగు పెడితే శిక్షణ పొందిన వలంటీర్లే కాకుండా ప్రజలు కూడా గట్టిగా ప్రతిఘటిస్తారని పంచాయితీ కమిటీ సభ్యులు కలెక్టర్‌కు చెప్పారు. వెంటనే కలెక్టర్ మలయప్పన్ ప్రభుత్వానికి ప్రత్యేక సందేశం పంపిస్తూ నిజాంకు ఇచ్చిన పర్మిషన్‌ను రద్దు చేయాలని సూచించారు. కేంద్రప్రభుత్వానికి రాయబారాలు, టెలిగ్రాములు, నాయకులకు ప్రతినిధివర్గం వివరణలతో ఎట్టకేలకు నిజాంకు ఇచ్చిన అనుమతిని రద్దు చేశారు.



ఈ విధంగా ఒకవైపు స్వతంత్రం భారతదేశంలో విలీనం కావాడానికి విశ్వప్రయత్నం చేస్తూనే మరోవైపు దాదాపుగా సంవత్సరం పాటు పరిటాల తాలూకాలో ప్రజాభిమానానికి అనుగుణంగా చక్కని పరిపాలన అందించారు. వెట్టిచాకిరీ నిర్మూలనకు తీర్మానించి గట్టిగా అమలు జరిపారు. మత్తు పానీయాలు నిషేధించారు. నల్లబజారు వ్యాపారంపై నిఘాపెట్టి, పట్టుబడిన బ్లాక్ మార్కెటీర్లకు జరిమానాలు విధించారు. పాఠశాలలు నడిపించారు. పరిటాల, మల్లవల్లి చెరువులకు మరమత్తులు చేసి, రైతులకు సాగునీరు అందించారు. తాలూకాలో శాంతి భద్రతలు నెలకొల్పి ప్రజల్లో విశ్వాసం కలిగించారు. చివరకు 1949లో ఏడు గ్రామాలతో కూడిన పరిటాల రాజ్యం భారతదేశంలో విలీనమైనది. పరిటాల తాలూకా కృష్ణా జిల్లాలో విలీనం కావటంతో 1950 జనవరి 26వ తేదీన ప్రథమ రిపబ్లిక్ దినోత్సవాన్ని పూర్తి స్వేచ్ఛవాయువులు పీలుస్తూ ప్రజలు ఘనంగా జరుపుకున్నారు.

– తోట ప్రసాద్, నందిగామ, కృష్ణా జిల్లా

నేను - సుడిగుండం (నవల) 26

పి.చంద్రశేఖర అజాద్
సెల్: 92465 73575



నిన్నటి సంచిక తరువాయి

"ప్రభాత్ గారు నిర్మొహమాటంగా సమీక్ష చేసారు. నేను నమ్మింది రాసాను. అందులో మర్యాదల గురించి నేను పట్టించుకోలేదు - ఆయన పట్టించుకోనట్లే. అలానే వుండాలి"

అప్పుడు నాకు నవ్వు వచ్చింది.

"ఈ మర్యాదల గోలతోనే సాహిత్యం భ్రష్టు పట్టిపోయిందని నేను అనుకుంటాను. నన్ను అరాచకుడిగా ముద్ర వేయించుకోవటం నాకు ఇష్టం. అసలు ఈ సమాజమే పరస్పర వైరుధ్యాలతో వుంది. అదీ సాహిత్యం లోనూ వుంటుంది" అన్నాడు.

సభ అయిపోయింది.

అప్పుడు ఓ మహిళ నా దగ్గరకు వచ్చింది.

"ప్రభాత్ గారూ... మీరు చాలా బాగా మాట్లాడారు' అన్నారామె.

"థాంక్స్ అండి"

"మీరు చెప్పిన 'మర్యాద' అంటే నాకు అర్థం అయింది. శంకర్ అర్థం చేసుకోవటానికి ప్రయత్నం చేయాల్సింది"

నేను చిన్నగా నవ్వాను.

"శంకర్ పుస్తకం తీసుకున్నాను. అది చదివాక నేను ఓ నిర్ణయానికి వస్తాను" అన్నారు.

"తను ఎలా వుండాలనుకుంటున్నాడో శంకర్ చెప్పాడు. అది నచ్చిన పాఠకులు శంకర్‌ని ఫాలో అవుతారు. మామూలుగా నాన్ సీరియస్ ఫిక్షన్ రాసేవారు డబ్బుల కోసం ఎలాంటివి రాయటానికయినా ముందుంటారు. సీరియస్‌గా రాసేవారిలో ఓ సమన్వయం వుండాలని అనుకుంటాను" అన్నాను.

"శంకర్ కి బాధ కలిగిందని అతని మాటలు చెబుతున్నాయి. మీరు సభా సంప్రదాయాల్ని పాటించలేదు అన్న ధోరణి అతని మాటల్లో వుండకూడదు. అయితే అలానే వుండాలి అన్నాడనుకోండి. నేనయితే 'మర్యాద'ని మీరు అతిక్రమించారని అనుకోను"

"మీరు రచయిత్రా?"

"పాఠకురాలిని మాత్రమే"

"మీ పేరు?"

"సులోచనా దేవి. మీరు క్రిటిక్ గానే వుండండి" అని ఎవరో పిలుస్తుంటే హడావుడిగా వెళ్లిపోయారు.

ఇంకో యిద్దరు నన్ను అభినందించారు. వివిధ రచయితలూ, కవులూ ఓ పది పుస్తకాల దాకా యిచ్చారు.

"మీ అభిప్రాయం కోసం చూస్తుంటాం" అన్నారు. .

"మీకింకా లౌక్యం తెలియదు. ముందు ముందు మీరు ఇలానే వుండగలరని నేను అనుకోను. ఈ రాత్రంతా మీ గురించి హాట్ హాట్ చర్చలు జరుగుతాయి. మీ దగ్గరకు వస్తాయి" అన్నాడో వ్యక్తి. పేరు తెలుసుకునే లోగానే వెళ్లిపోయాడు.

****

ఉదయం పనిలో వున్నాను.

"మీ ఫొటో పత్రికలో వచ్చింది" అని ఓ టీచర్ చూపించారు. నిన్నటి సభని బాగానే కవర్ చేసారు. మొదటిసారి పత్రికలో ఫొటో రావటం నాకు థ్రిల్లింగ్‌గా అనిపించింది. ఇంకొన్ని దినపత్రికలు తెప్పించుకుని అవన్నీ కట్ చేసి ఓ పేపర్ మీద అంటించాను. ఆ రాత్రి నాకు వెన్నెల గుర్తు రాలేదు.

ఈ సభ వల్ల నా జీవితంలో కొత్త మలుపులు రాబోతున్నాయి అనిపిస్తూనే వుంది.

****

వెన్నెల ఇంటికి వచ్చింది. నేను స్టేషన్‌కి వెళ్లలేదు.

"నీ అంతట నువ్వు రావాలి. ఒకప్పుడు అమిత ఒక్కతే ఎలా వచ్చింది అన్నావు. చదువుకుంటే అలాంటి నమ్మకం వస్తుంది. అన్నిటికీ నా మీద ఆధార పడకూడదు. అక్కడి విశేషాలేంటి?"

"అర్చన బాగా చదువుకుంటోంది. అర్చనకు పెద్ద చదువులు చెప్పించాలి. నాకు నువ్వు దొరికావు. అర్చనకి దొరకటం కష్టం"

"మావయ్య ఏమంటున్నారు? అప్పులు తీరినట్లేనా?"

"అలాంటివి నాకు చెప్పరు. మా బాధ పిల్లలకి చెప్పటం ఎందుకు అనుకుంటారు. ప్రస్తుతం తిండికయితే లోటు లేదు"

"మన గురించి మీ అత్తగారికి చెప్పావా?"

"బలవంతంగా అడిగితే..." అని ఆగిపోయింది.

అర్చనని చదివించాలి అంటుంది గాని తను మాత్రం శ్రద్ధ చూపించటం లేదు. మెల్లగా క్లాసు పుస్తకాలు కాకుండా సాహిత్యం పట్ల ఆసక్తి పెంచాలని నాకుంది. అది నావల్ల కావటం లేదు.

****

మావయ్య నుండి వచ్చిన ఉత్తరం నాకు షాక్ ని యిచ్చింది. మరో ఎకరం అమ్మేసాడు. ఇప్పుడు నాకు బాకీలు లేవు. అర్చన బాధ్యత వుంది. దానికో దారి చూపించాలి. మనసులో ఓ కోరిక వుంది. ఓ ఎకరం భూమి కొనుక్కోవాలి. చిన్న ఇల్లు ఏర్పాటు చేసుకోవాలి. నీకు ముందు చెప్పాలనుకున్నాను. నువ్వు ఒప్పుకోవని తెలుసు. ఈ ఎకరం మాత్రం అమ్మను. కాకపోతే నీకూ-వెన్నెలకూ ఏమీ ఇవ్వలేకపోయానన్న బాధ వుంది అనేది అందులోని సారాంశం.



ఈ విషయంలో వెన్నెలతో మాట్లాడాను.

"మా నాన్న ఏమీ ఇవ్వలేదన్న బాధ నాకు లేదు" అంది.

"మాకు సెంట్ భూమి కూడా లేదు. మీ భూమి అమ్ముకోవటానికి కారణం మేం. ఎప్పటికైనా నేను మావయ్యకు ఓ ఎకరమైనా కొనిస్తాను. నన్ను ఆయన కొడుకుననుకున్నాడు. అర్చన గర్భంలో వున్నప్పుడు నాకోసమే వద్దు అన్నాడు. ఇలాంటి బాధ్యతలు పూర్తి చేయటానికే నేను పెళ్లి వద్దన్నాను"

తను మౌనంగా వుంది.

****

స్కూల్ దగ్గరకు వచ్చిన నన్ను చూసి "మీరు యిక్కడ వున్నారేంటి" అన్నారు సులోచన.

వాళ్ల అబ్బాయి మా దగ్గర చదువుతున్నాడంట. ఆమె భర్తా, ఆడపడుచు వచ్చి ఈ మధ్యనే చేర్పించారంట. వాళ్ల అమ్మ ఆరోగ్యం బాగుండకపోతే కొంతకాలం అక్కడే వున్నానని చెప్పారు.

"ఈ స్కూల్ మీదేనా?" అన్నారు.

"ఇక్కడ పని చేస్తున్నాను"

"మీరు క్లాసులు తీసుకుంటారా?"

"ఎవరన్నా రానప్పుడు. ఈ స్కూల్ బాధ్యతలు నేనే చూసుకోవాలి"

"మనం ఏం చేయాలన్నా అది బడితో మొదలవ్వాలి. నాకూ ఓ బడి పెట్టాలనుంది. వ్యాపారం కోసం కాదు. మనదయిన వాతావరణం వుండాలి. పిల్లలు ఆడుకోవటానికి స్థలం కావాలి. చిన్నప్పటి నుండి మంచి కథలు చెప్పాలి. నైతిక విలువలకి ప్రాధాన్యం ఇవ్వాలి. సంగీతం... ముఖ్యంగా లలిత కళల మీద అభిరుచి కలిగించాలి" అన్నారు.

"ఇప్పుడు రుద్దుడు తప్ప అలాంటివి వుంటే పిల్లల్ని పంపిస్తారా?" అన్నాను.

"మనం వేలకి వేలు డొనేషన్లు అడుగుతుంటే పిల్లల్ని పంపించరు. నాకయితే అలాంటి స్కూల్ సక్సెస్ అవుతుందన్న నమ్మకం వుంది. వేలాదిమందిని మన బడిలో చేర్చాలనుకోవటం లేదు కదా"

'మనం' అవటాన్ని నేను గుర్తించాను.

"చూద్దాం. ఇప్పుడు నేను గృహిణిగా వున్నాను. బాబుని చూసుకుంటున్నాను. పుస్తకాలు చదువుకుంటున్నాను. మంచి కార్యక్రమాలు అనుకున్న వాటికి హాజరవుతున్నాను" అన్నారు.

ఆ తర్వాత శంకర్ పుస్తకం చదివాను అంటూ...

"మీ అభిప్రాయాలు నాకు నచ్చాయి. సమాజంలో వైరుధ్యాలు వుండబట్టే ఎవరయినా రాస్తారు. అవి ఎలా తొలగిపోవాలో రాయాలి. అంతేగాని నాలుగు రాళ్లు విసరటం ఎవరయినా చేస్తారు" అన్నారు.

"మీ ఆలోచనలకు ఓ రూపం రావాలని కోరుకుంటున్నాను" అన్నాను.

"మీరు బిజీగా వున్నారు. తీరిగ్గా మాట్లాడుకుందాం. ఇలా కలవగలగటం ఆనందంగా వుంది" అని సులోచన వెళ్లిపోయారు.

అలాంటి బడిని పెట్టాలంటే చిన్న విషయం కాదు. అందుకు ఓ ఆరాటంతో పని చేసే బృందం కావాలి. డబ్బు కూడా వుండాలి. సులోచన గారిది మంచి కలో, వాస్తవమో కాలం చెబుతుంది.

****

నాకు జయదేవ్ మాస్టారితో మాట్లాడాలని పించింది. ఆయనకు ఫోన్ చేసాను.

శంకర్ తో అనుభవం గురించి, మరికొన్ని అనుభవాల గురించి చెప్పాను.

"ప్రపంచీకరణ అంటే ప్రపంచాన్ని దగ్గర చేయటం కాదు. అన్ని రకాలుగా ప్రపంచాన్ని గుప్పిట్లో పెట్టుకోవటం. అది కుటుంబాల నుండి వ్యక్తుల్ని, కులాల్ని, మతాల్ని నిలువునా చీల్చేస్తుంది. ఆ ప్రభావంలో ఎంతగా పడిపోతామంటే మనం కూడా ఏదో ఒక కొసకు కొట్టుకుపోతాం. ఇప్పుడు ఇన్ని విభాగాలుగా విడిపోన వసరం లేదు. మనం వద్దనుకున్నా ఆగవు. ఏదో ఒక రోజు మళ్లీ అందరినీ కలిపేది కూడా ప్రపంచీకరణే! నా వరకు నేను అనుకుంటాను... ఈ ప్రపంచీకరణ మనల్ని పరీక్షకి పెడుతుంది. అందులో మునిగిపోతామా - ఆ ప్రభావాలకు ఎదురీదుతామా అన్నది నిర్ణయించుకోవాలి" అన్నారు.

****

ఆ రోజు నేను ఇంటికి వచ్చేసరికి పక్కింటామె వున్నారు. వెన్నెలలో ఏదో మార్పు. నీరసంగా వుంది.

"ఏమైంది" అన్నాను. (ఇంకా ఉంది)

'పంచాయతీరాజ్ దినోత్సవం'ను ఏటా ఏరోజున జరుపుకుంటారు ?

దేశంలో పంచాయతీ రాజ్ వ్యవస్థ పరిణామం బిట్‌బ్యాంక్



➠ భారత రాజ్యాంగంలోని ఏ అధికరణం గ్రామ పంచాయతీల ఏర్పాటు గురించి పేర్కొంటుంది ? - **అధికరణం 40**

➠ ఎవరి కమిటీ సూచనల మేరకు భారత ప్రభుత్వం పంచాయతీరాజ్, నగరపాలక సంస్థలకు 73,74 రాజ్యాంగ సవరణల (1993) ద్వారా రాజ్యాంగ ప్రతిపత్తి కల్పించడమైనది ? - **ఎల్.ఎం.సింఘ్వీ కమిటీ**

➠ రుగ్వేద కాలంలో స్థానిక ప్రభుత్వాలను ఏమని పిలిచేవారు ? - **సభ మరియు సమితి**

➠ కౌటిల్యుడు తన అర్థశాస్త్రంలో ఏ పేరుతో గ్రామాధికారుల గురించి పేర్కొన్నాడు ? - **గ్రామిక, గ్రామకూట**

➠ 10 గ్రామాలకు అధిపతిని ఏమని పిలిచేవారు ? - **దశ గ్రామణి**

➠ మెగస్తనీస్ తన గ్రంథం 'ఇండికా'లో ఏ నగరంలోని మున్సిపల్ ప్రభుత్వం గురించి వివరించాడు ? - **పాటలీపుత్ర**

➠ చోళులకు సంబంధించిన మొదటి పరాంతక వేయించిన ఏ శాసనం స్థానిక స్వపరిపాలనకు సంబంధించిన విషయాలు వెల్లడిస్తుంది ? - **ఉత్తర మేరూర్**

➠ మొగలుల కాలంలో పట్టణ పాలనను 'కొత్వాల్' అనే అధికారి చూసుకునేవాడు. అతనికి సహాయంగా ఏ అధికారి ఉండేవాడు ? - **మున్సబ్**

➠ రెండవ జేమ్స్ చక్రవర్తి జారీచేసిన చార్టర్ ద్వారా పన్నుల వసూలు కోసం 'మద్రాస్ మున్సిపల్ కార్పొరేషన్'ను ఈస్టిండియా కంపెనీ ఎప్పుడు స్థాపించింది ? - **1687**

➠ పన్ను విధింపును ప్రజలు వ్యతిరేకించడంతో కార్పొరేషన్ స్థానంలో మేయర్ కోర్టులను ఎప్పుడు ఏర్పాటుచేశారు ? - **1870**

➠ బ్రిటిష్ వారు జిల్లాను ఒక పరిపాలనా యూనిట్‌గా తీసుకొని 1772లో ఏ పదవిని ప్రవేశపెట్టారు ? - **కలెక్టర్**

➠ ఏ చార్టర్ ప్రకారం మద్రాస్, బొంబాయి మరియు కలకత్తా పట్టణాలలో స్థానిక ప్రభుత్వాల ఏర్పాటుకు చట్టబద్ధత కల్పించడం జరిగింది ? - **1793**

➠ ఏ చట్టం ద్వారా స్థానిక సంస్థలకు పన్నులు విధించడానికి, అవి చెల్లించని వారిపై చర్యలు తీసుకునే అధికారం కల్పించడం జరిగింది ? - **చార్టర్ చట్టం 1813**

➠ భారత గ్రామీణ సమాజాలను "లిటిల్ రిపబ్లిక్" అని వ్యాఖ్యానించింది ? - **చార్లెస్ మెట్‌కాఫ్**

➠ "ఆర్థిక వికేంద్రీకరణ" తీర్మానంగా పేరెన్నికగన్న ఒక తీర్మానం (1870) ద్వారా భారతదేశంలో మొదటిసారిగా స్థానిక ప్రభుత్వాలను ప్రవేశపెట్టింది ఎవరు ? - **లార్డ్ మేయో**

➠ భారతదేశంలో స్థానిక ప్రభుత్వాల ఏర్పాటు వికాసాలకు 'మాగ్నాకార్టా'గా వర్ణించబడినది ఏది ? - **1882లో లార్డ్ రిప్పన్ తీర్మానం**

➠ భారతదేశంలో స్థానిక ప్రభుత్వాల పనితీరును, అవి విజయవంతం కాకపోవడాన్ని సమీక్షించడానికి 1907లో ఎవరి అధ్యక్షతన 'రాయల్ వికేంద్రీకరణ' సంఘం ఏర్పడింది ? - **సర్ చార్లెస్ హబ్‌హౌస్**

➠ రాయల్ కమిటీ 1909లో సమర్పించిన నివేదికలోని ముఖ్యాంశాలు ఏమిటి ? - **ప్రతి గ్రామానికి గ్రామ పంచాయతీ, 3 స్థాయిల్లో స్థానిక ప్రభుత్వాల ఏర్పాటు, ప్రాథమిక విద్య బాధ్యత మున్సిపాలిటీలది**

➠ రాయల్ కమిషన్ సూచన మేరకు మింటో మార్లే సంస్కరణ (1909) చట్టంలో స్థానిక సంస్థల ప్రతినిధులను ప్రజల చేత ఏవిధంగా ఎన్నుకునే పద్ధతిని ప్రవేశపెట్టారు ? - **ప్రత్యక్షంగా**

➠ స్థానిక స్వపరిపాలనను ఏ సంస్కరణల ద్వారా రాష్ట్ర జాబితాలో చేర్చారు ? - **మాంటెగ్- ఛెమ్స్‌ఫర్డ్ (1919)**

➠ రాష్ట్రాలకు స్వయం పాలనాధికారం ఏ చట్టం ప్రకారం లభించడంతో స్థానిక స్వపరిపాలన మరింత పటిష్టమైనది ? - **భారత ప్రభుత్వ చట్టం - 1935**

➠ 1920లో అప్పటి పంజాబ్ రాష్ట్రంలోని గుర్గావ్ జిల్లాలో డిప్యూటీ కమిషనర్‌గా పనిచేసిన ఎఫ్.ఎల్.బేయన్ గ్రామీణాభివృద్ధి ఉద్యమాన్ని ప్రారంభించాడు. అయితే గుర్గావ్ ముఖ్య లక్షణాలు ఏమిటి ? - **వ్యవసాయ ఉత్పత్తిని, ప్రజారోగ్యాన్ని పెంపొందించడం, అభివృద్ధి పథకాలను వ్యవస్థీకరించడం**

➠ 1921లో 'ఆత్మగౌరవంతో స్వయం సమృద్ధిని సాధించడం' అనే ప్రయోగాన్ని ప్రారంభించినది ఎవరు ? - **రవీంద్రనాథ్ ఠాగూర్**

➠ బరోడా ప్రయోగాన్ని చేసినవారు ఎవరు ? - **వి.టి.కృష్ణమాచారి**

➠ సర్వోదయ, నవోదయ సిద్ధాంతాలపై ఆచార్య వినోబా బావే, లోక్‌నాయక్ జయప్రకాష్ నారాయణ్ చేసిన ప్రయోగం ఏమిటి ? - **సేవాగ్రామ్ (1933)**

➠ 1946వ సంవత్సరంలో మద్రాస్ ప్రెసిడెన్సీలో ఫిర్కా ప్రయోగం చేసినది ఎవరు ? - **టంగుటూరి ప్రకాశం**

➠ నీలోఖేరి ప్రయోగం (1948)లో ఎవరి నాయకత్వంలో వ్యవసాయ పనిముట్లను తయారుచేయడం, ఇంజినీరింగ్ వర్క్స్ మొదలగు అంశాలపై శిక్షణ ఇవ్వడం జరిగింది ? - **ఎస్.కె.డే**

➠ మొదటి పంచవర్ష ప్రణాళికలో గ్రామీణాభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇవ్వడానికి తగిన సిఫారసులు సూచించమని ఎవరి అధ్యక్షతన కమిషన్ వేశారు ? - **వి.టి.కృష్ణమాచారి**

➠ కృష్ణమాచారి సూచనల మేరకు "సమాజ అభివృద్ధి కార్యక్రమం" (కమ్యూనిటీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం) ఏ సంవత్సరంలో ప్రారంభించారు ? - **2 అక్టోబర్, 1952**

➠ సమాజాభివృద్ధి కార్యక్రమానికి ఆర్థిక సహకారం అందించినది ? - **ఫోర్డ్ ఫౌండేషన్**

➠ సమాజాభివృద్ధి కార్యక్రమం ముఖ్య లక్ష్యాలు ఏమిటి ? - **సంప్రదాయ జీవనం నుండి ప్రగతిపూర్వక జీవనానికి మార్చడం, గ్రామీణ సమస్యల పరిష్కారం, కేంద్ర ప్రభుత్వమే నిధులు సమకూర్చడం**

➠ సమాజాభివృద్ధి పథకానికి కొనసాగింపుగా దేశంలోని మిగతా ప్రాంతాలలో 2 అక్టోబర్, 1953ను ప్రారంభించిన పథకం ఏది ? - **జాతీయ విస్తరణ సేవా కార్యక్రమం (ఎన్ఈఎస్)**

➠ సమాజాభివృద్ధి పథకాన్ని ముందుగా 3 సంవత్సరాల కాలానికి రూపొందించగా, జాతీయ విస్తరణ పథకాన్ని ఏ ప్రాతిపదికపై ప్రారంభించారు ? - **శాశ్వత**

➠ సమాజాభివృద్ధి పథకాన్ని 'నిశ్శబ్ద విప్లవం'గా అభివర్ణించింది ఎవరు ? - **జె.ఎల్.నెహ్రూ**

➠ ఈ పథకం గురించి "సుశిక్షితులైన తోటమాలి నిర్వహించే చక్కటి ఉద్యానవనం" అని వ్యాఖ్యానించినది ఎవరు ? - **ఎస్.కె.డే**

➠ సమాజాభివృద్ధి పథకం, జాతీయ విస్తరణ సేవా పథకాల ద్వారా ఆశించిన ఫలితాలు కలగకపోవడం వలన ప్రణాళికా సంఘం ఎవరి అధ్యక్షతన 16 జనవరి, 1957న కమిటీ ఏర్పాటు చేసింది ? - **బల్వంతరాయ్ గోపాల్ మెహతా**

➠ "ప్రజాస్వామ్య వికేంద్రీకరణ- ప్రజల భాగస్వామ్యం" అనే అంశాలతో మూడంచెల పంచాయతీ రాజ్ వ్యవస్థ సిఫారసును బల్వంతరాయ్ మెహతా కమిటీ ఎప్పుడు అందించింది ? - **24 నవంబర్, 1957**

➠ దేశంలో పంచాయతీరాజ్ సంస్థలను ప్రవేశపెట్టిన మొదటి రాష్ట్రం ఏది ? - **రాజస్థాన్ (నాగోర్ జిల్లా సికార్‌లో)**

➠ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ వ్యవస్థను 1959లో అప్పటి ముఖ్యమంత్రి నీలం సంజీవరెడ్డి ఎక్కడ ప్రారంభించారు ? - **షాద్ నగర్ (మహబూబ్‌నగర్ జిల్లా)**

➠ సీమాంధ్ర ప్రాంతంలో మొదటగా ఏ జిల్లాలో పంచాయతీ వ్యవస్థను ఏర్పాటు చేశారు ? - **శ్రీకాకుళం**

➠ 1959లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక స్వపరిపాలన సంస్థలను ఏర్పాటు చేసినప్పటికీ ఎన్నికలు మాత్రం ఏ సంవత్సరంలో నిర్వహించారు ? - **1964**

➠ బల్వంత్‌రాయ్ మెహతా కమిటీ సిఫారసులు ఏమిటి ? - **ఎన్నికలు పార్టీ ప్రాతిపదికపై కాకుండా స్వతంత్ర ప్రాతిపదికన జరపాలి. మూడంచెల పంచాయతీరాజ్ వ్యవస్థ ఏర్పాటు, 5 సంవత్సరాలకు ఒకసారి నియమబద్ధంగా ఎన్నికల నిర్వహణ**

➠ బల్వంత్‌రాయ్ మెహతా కమిటీ సిఫారసుల ప్రకారం ఏర్పాటుచేసిన పంచాయతీరాజ్ సంస్థలు అనుకున్న లక్ష్యాన్ని సాధించలేకపోవడంతో వాటి పనితీరును సమీక్షించడానికి, పంచాయతీరాజ్ వ్యవస్థను సమగ్రంగా పరిశీలించడానికి 1977లో ఏర్పాటు చేసిన కమిటీ ఏది ? - **అశోక్ మెహతా కమిటీ**

➠ 1978లో అశోక్‌మెహతా కమిటీ చేసిన సిఫారసుల్లో ముఖ్యాంశాలు ఏమిటి ? - **రెండంచెల వ్యవస్థ ఏర్పాటు - 15,000-20,222 జనాభాతో కూడిన పంచాయతీ సమితి ఏర్పాటు, రాజకీయ పార్టీలు ప్రత్యక్షంగా పోటీచేయాలి, అన్ని పదవులకు కాల వ్యవధి 4 సంవత్సరాలు, పంచాయతీ సంస్థలకు రాజ్యాంగ పరమైన రక్షణ (కాన్‌స్టిట్యూషనల్ ప్రొటెక్షన్)**

➠ అశోక్‌మెహతా కమిటీ సిఫారసుల ఆధారంగా పంచాయతీలను ఏర్పాటు చేసుకున్న రాష్ట్రాలు ఏవి ? - **పశ్చిమ బంగ (1978), కర్ణాటక (1985), ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ (1986)**

➠ దంత్‌వాలా కమిటీ ముఖ్య సిఫారసులు ఏమిటి ? - **సర్పంచ్‌ను ప్రత్యక్ష పద్ధతిలో ఎన్నుకోవాలి, మధ్య వ్యవస్థకు ప్రాధాన్యత ఇవ్వాలి, జిల్లా ప్రణాళికలో కలెక్టర్ ప్రధాన పాత్ర పోషించాలి, బ్లాక్‌ను ఒక యూనిట్‌గా తీసుకుని ప్రణాళికలు రూపొందించాలి.**

➠ మంత్రి అధ్యక్షతన గాని లేదా కలెక్టర్ అధ్యక్షతన గాని పరిచేసేలా జిల్లా ప్రణాళికా సంఘాలను ఏర్పాటు చేయాలని, మరియు బ్లాక్ అభివృద్ధి అధికారి పోస్టులను రద్దు చేయాలని సూచించిన కమిటీ ఏది ? - **సిహెచ్.హనుమంతరావు కమిటీ (1984)**

➠ ప్రణాళికా సంఘం 1985వ సంవత్సరంలో "గ్రామీణాభివృద్ధి, పేదరిక నిర్మూలన - పరిపాలనా ఏర్పాట్లు" అనే అంశాన్ని పరిశీలించడానికి ఎవరి అధ్యక్షతన కమిటీని ఏర్పరచింది ? - **జి.వి.కె.రావు**

➠ పంచాయతీరాజ్ వ్యవస్థ గురించి "ప్రజాస్వామ్యం వేళ్లూనుకునే వ్యవస్థగా కాక, వేర్లు లేని వ్యవస్థగా మారింది (It is not a gross roots democracy, It is a grass wothout roots) అని తీవ్రంగా ఆక్షేపించినది ఎవరు ? - **జి.వి.కె.రావు**

➠ జి.వి.కె.రావు కమిటీ చేసిన ప్రధాన సిఫారసులు ఏమిటి ? - **బ్లాక్ వ్యవస్థను రద్దుచేయాలి, జిల్లా పరిషత్‌ను పటిష్టపరచాలి, క్రమం తప్పకుండా పంచాయతీ ఎన్నికల నిర్వహణ, జిల్లా స్థాయి యూనిట్‌లకు ప్రణాళికా నిధులు బదలాయించాలి.**

➠ 1986లో రాజీవ్‌గాంధీ ప్రధానమంత్రిగా ఉన్నప్పుడు పంచాయతీలను బలోపేతం చేసేందుకు అవసరమైన సిఫారసులు చేయడానికి ఎవరి అధ్యక్షతన కమిటీ వేయడం జరిగింది ? - **ఎల్.ఎం.సింఘ్వీ**

➠ 1986లో ఎల్.ఎం.సింఘ్వీ కమిటీ చేసిన సిఫారసులు ఏమిటి ? - **స్థానిక సంస్థలకు రాజ్యాంగ హోదా కల్పించడం, ఎన్నికలకు సంబంధించిన వివాదాల పరిష్కారం కోసం "జ్యుడీషియల్ ట్రిబ్యునల్" ఏర్పాటు, గ్రామ పంచాయతీలకు ఆర్థిక వనరులు కల్పించడం.**



➠ భారత ప్రభుత్వం ఆర్.ఎస్.సర్కారియా కమిషన్‌ను ఎప్పుడు ఏర్పాటు చేసింది ? - **1988**

➠ గ్రామీణాభివృద్ధి మంత్రిత్వశాఖకు సంబంధించిన పార్లమెంట్ సంప్రదింపుల కమిటీ 1988లో ఎవరి అధ్యక్షతన పంచాయతీరాజ్ సంస్థలకు రాజ్యాంగ హోదా ఇచ్చే అంశాన్ని పరిశీలించడానికి ఉపసంఘాన్ని ఏర్పాటు చేసింది ? - **పి.కె.తుంగన్**

➠ వివిధ కమిటీల సిఫారసుల మేరకు 64వ రాజ్యాంగ సవరణ బిల్లును రాజీవ్‌గాంధీ ప్రభుత్వం ఎప్పుడు ప్రవేశపెట్టింది ? - **15 మే, 1989**

➠ 73, 74 రాజ్యాంగ సవరణల బిల్లుకు 20 ఏప్రిల్ 1993న రాజ్యాంగ ప్రతిపత్తి కల్పించిన రాష్ట్రపతి ఎవరు ? - **శంకర్‌దయాళ్ శర్మ**

➠ ప్రతి సంవత్సరం "పంచాయతీరాజ్ దినోత్సవం"ను ఏరోజున జరుపుకుంటాము ? - **ఏప్రిల్ 24**

➠ పట్టణ మున్సిపాలిటీలకు సంబంధించిన 74వ రాజ్యాంగ సవరణ చట్టం ఎప్పటినుంచి అమలులోకి వచ్చింది ? - **జూన్ 1, 1993**

➠ 73వ రాజ్యాంగ సవరణ చట్టం 1993లో అమలులోకి వచ్చిన తరువాత ఆ చట్టం ప్రకారం పంచాయతీరాజ్‌ను మొట్టమొదటిసారిగా ఏర్పాటు చేసిన రాష్ట్రం ఏది ? - **కర్ణాటక**

➠ 73వ రాజ్యాంగ సవరణ చట్టం (1992) ద్వారా కొత్త పంచాయతీరాజ్ చట్టంను రాజ్యాంగంలోని ఏ భాగంలో పేర్కొన్నారు ? - **IX వ భాగం**

➠ ప్రకరణలు 243, 243 (ఎ) నుండి 243 (ఓ) వరకు గల మొత్తం ఎన్ని ప్రకరణల్లో పొందుపరిచారు ? - **16**

➠ పంచాయతీలకు సంబంధించిన 29 అధికార - విధుల గురించి ఎన్నవ షెడ్యూల్‌లో పేర్కొన్నారు ? - **XI వ షెడ్యూల్‌లో**

➠ 243వ అధికరణం ప్రకారం గ్రామస్థాయిలో పంచాయతీ పరిధిలోని ఒక గ్రామానికి సంబంధించిన ఓటర్ల జాబితాలో రిజిస్టర్ అయిన వ్యక్తుల సమూహాన్ని ఏమంటారు ? - **గ్రామ సభ**

➠ మూడంచెల పంచాయతీ వ్యవస్థ ఏర్పాటు ? - **243 బి**

➠ ఏ ప్రకరణ ప్రకారం 20 లక్షల జనాభా దాటని రాష్ట్రాలలో మాధ్యమిక స్థాయిలో పంచాయతీలను తప్పనిసరిగా ఏర్పాటు చేయనవసరం లేదు ? - **243 బి (2)**

➠ పంచాయతీల నిర్మాణం, ఎన్నికల గురించి తెలియజేసే నిబంధన ఏది ? - **243 సి**

➠ పంచాయతీలలో రిజర్వేషన్ల గురించి తెలియజేసే నిబంధన ఏది ? - **243 డి**

➠ **పంచాయతీల కాల పరిమితిని తెలియజేస్తున్న అధికరణ ఏది ?** - **243 ఇ**

➠ పంచాయతీ సభ్యుల అనర్హతలను తెలియజేసే అధికరణం ఏది ? - **243 ఎఫ్**

➠ పంచాయతీల ఆర్థికస్థితి సమీక్షకై రాష్ట్ర ఆర్థిక కమిషన్‌ను ఏర్పాటు చేయాలని సూచిస్తున్న అధికరణం ఏది ? - **243 (ఐ)**

➠ పంచాయతీల ఖాతాల ఆడిటింగ్‌ను ఏ ప్రకరణ తెలియజేస్తుంది ? - **243 (జె)**

➠ పంచాయతీ ఎన్నికల నిర్వహణ, ఏర్పాట్ల గురించి తెలియజేసే అధికరణం ఏది ? - **243 కె**

➠ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మొదటి ఎన్నికల సంఘం కమిషనర్ ఎవరు ? - **కాశీపాండ్యన్**

➠ పంచాయతీల ఏర్పాటు నుండి కొన్నిప్రాంతాలకు మినహాయింపు ఇచ్చిన అధికరణం ఏది ? - **243 ఎం**

➠ ఇప్పటికే ఉన్న పంచాయతీ చట్టాల కొనసాగింపుకు సంబంధించిన విషయాలను తెలిపే ప్రకరణ ఏది ? - **243 ఎన్**

➠ ఏ అధికరణ ప్రకారం పంచాయతీల ఎన్నికలకు సంబంధించిన అంశాలపై న్యాయస్థానాలు జోక్యం చేసుకోరాదు ? - **243 ఓ**

➠ 73వ రాజ్యాంగ సవరణలోని ఐచ్ఛిక అంశాలు ఏమిటి ? - **పార్లమెంటు, రాష్ట్ర శాసనసభ సభ్యులకు ఓటుహక్కును కల్పించడం, వెనుకబడిన వర్గాలకు రిజర్వేషన్ కల్పించడం, పంచాయతీరాజ్ సంస్థలకు స్వయంప్రతిపత్తి కల్పించడం.**

➠ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఎం.టి.రాజు కమిటీని ఏ సంవత్సరంలో ఏర్పాటు చేసింది ? - **1968**

➠ జలగం వెంగళరావు కమిటీ చేసిన ప్రధాన సిఫారసులు ఏమిటి ? - **డిస్ట్రిక్ట్ డెవలప్‌మెంట్ బోర్డు (డీడీబీ)లను రద్దుచేయాలి, ఏ స్థాయిలోని ఎన్నికలలోనైనా పార్టీ ఎన్నిక గుర్తులను ఉపయోగించరాదు, జిల్లా పరిషత్‌లకు సాలీనా తలసరి నిధులను 25 పైసల నుంచి ఒక రూపాయికి పెంచాలి.**

➠ 1971లో పంచాయతీ సంస్థలను మరింత సమర్థవంతంగా రూపొందించేందుకు రాష్ట్రప్రభుత్వం ఏ కమిటీని ఏర్పాటు చేసింది ? - **సి.నరసింహం కమిటీ**

➠ సి.నరసింహం కమిటీ సూచించిన ప్రధాన సిఫారసులు ఏవి ? - **గ్రామ పంచాయతీలలో వారి సంఖ్యను బట్టి 1 నుండి 3 సీట్లను రిజర్వ్ చేయాలి, పంచాయతీ సమితి లేదా జిల్లా పరిషత్ ఎన్నికలలో రాజకీయ పార్టీలకు గుర్తింపు నివ్వాలి, జాతీయ ఆర్థిక సంఘం వలే ఒక స్థానిక ఆర్థిక సంఘాన్ని ఏర్పాటు చేయాలి.**

➠ ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ చట్టం ప్రకారం గ్రామసభను సంవత్సరానికి ఎన్ని సార్లు తప్పనిసరిగా నిర్వహించాలి ? - **రెండు**

➠ ఏ సంవత్సరాన్ని కేంద్రప్రభుత్వం గ్రామసభల సంవత్సరంగా ప్రకటించింది ? - **2009-10**

➠ ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ చట్టం గ్రామసభ నిర్వహణకు కోరం ఎంతగా నిర్ణయించింది ? - **నిర్ణయించలేదు**

➠ గ్రామసభ విధులేమిటి ? - **గ్రామ పంచాయతీకి సంబంధించిన వార్షిక పరిపాలన, ఆడిట్ నివేదికలను పరిశీలించడం, ఆమోదించడం, అభివృద్ధి, సంక్షేమ పథకాల లబ్ధిదారుల జాబితాను ఖరారు చేయడం.**

➠ కేంద్రప్రభుత్వం పంచాయతీరాజ్ చట్టాన్ని షెడ్యూల్ ప్రాంతాలకు విస్తరిస్తూ చేసిన చట్టమే పెసా చట్టం. దిలీప్‌సింగ్ భూరియా నేతృత్వంలోని ఉన్నతస్థాయి కమిటీ సిఫారసులతో ఏ సంవత్సరంలో పెసా చట్టాన్ని అమలులోకి తెచ్చారు ? - **1996**

➠ పెసా చట్టం మాదిరిగానే గిరిజనుల హక్కుల రక్షణ కోసం అటవీ హక్కుల గుర్తింపు చట్టం (2006)ను రూపొందించి అమలులోకి తెచ్చింది ఏ ప్రభుత్వం ? - **కేంద్రప్రభుత్వం**

➠ పెసా (పి.ఇ.ఎస్.ఎ.) చట్టంలోని ముఖ్యాంశాలు ఏమిటి ? - **ప్రతి గ్రామం ఎన్నిక కాబడిన గ్రామసభను కలిగి ఉండాలి - సామాజిక ఆర్థికాభివృద్ధికి ఉద్దేశింపబడిన ప్రణాళికలను, కార్యక్రమాలను, పథకాలను ముందుగా గ్రామ సభ ఆమోదించాలి - గ్రామసభ, గ్రామ పంచాయతీలు చేసిన సిఫారసులు చట్టబద్ధమైనవిగా పరిగణింపబడతాయి.**

➠ గిరిజన ప్రాంతాల పరిరక్షణ కోసం, అక్కడి ప్రజల ప్రత్యేక అవసరాల కోసం షెడ్యూల్డ్ ప్రాంతాల్లో స్థానిక సంస్థల ఏర్పాటు వాటి విధి విధానాల గురించి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చట్టం రూపొందించింది. అయితే ఇది ఎప్పటినుండి అమలులోకి వచ్చింది ? - **16 జనవరి, 1998**

➠ జలగం వెంగళరావు కమిటీ, నరసింహం కమిటీ, దంతవాలా కమిటీ గ్రామ పంచాయతీ సర్పంచ్‌ను ప్రత్యక్ష పద్ధతిలో ఎన్నుకోవాలని సూచించడంతో ఏ సంవత్సరంలో మొట్టమొదటిసారిగా సర్పంచ్‌ను ప్రత్యక్ష పద్ధతిలో ఎన్నుకునే విధానాన్ని ప్రవేశపెట్టారు ? - **1981**

➠ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఎన్.టి.రామారావు ప్రభుత్వం పటేల్, పట్వారీ వ్యవస్థను ఏ సంవత్సరంలో రద్దుచేసి గ్రామ పరిపాలనాధికారులను నియమించింది ? - **1985**

➠ "నోటిఫైడ్ పంచాయతీ" (మేజర్ గ్రామ పంచాయతీ) వార్షికాదాయం ఎంత ఉండాలి ? - **60,000 కంటే ఎక్కువ**

➠ పంచాయతీలలో 50% రిజర్వేషన్‌ను కల్పించిన మొదటి రాష్ట్రం ? - **బీహార్**

➠ ఏ తేదీ తరువాత ఇద్దరు పిల్లలకు మించి ఉంటే స్థానిక సంస్థల ఎన్నికలలో పోటీ చేయడానికి లేదా పదవిలో కొనసాగడానికి అనర్హులు ? - **30 మే 1995**

➠ గ్రామ పంచాయతీలను రద్దు చేసే అధికారం రాష్ట్రప్రభుత్వానికి ఉన్నది. అయితే అట్టి అధికారాన్ని ఎవరికి ఇస్తూ రాష్ట్రప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేయవచ్చును ? - **కలెక్టర్**

➠ రెండు నెలల ముందస్తు నోటీసుతో గ్రామ పంచాయతీలపై కేసులను ఏ కోర్టులో మాత్రమే దాఖలు చేయాలి ? - **డిస్ట్రిక్ట్ మున్సిఫ్ కోర్టు**

విశాలాంధ్ర బిజినెస్

-169.56 ▼	-69.25 ▼	25 ▲	బంగారం (విశాఖపట్నం)	0 ◀◀	వెండి (విశాఖపట్నం)	డాలరు Vs రూపాయి
సెన్సెక్స్	నిఫ్టీ	బంగారం (విజయవాడ)	31,600	వెండి (విజయవాడ)	41,400	71.18
36,025.54	10,780.55	30,075	ప్రొద్దుటూరు 30,880	40,000	ప్రొద్దుటూరు 42,242	
		22 క్యారెట్లు, 10 గ్రాములు	22 క్యారెట్లు, 10 గ్రాములు	కిలో (రూపాయల్లో)	కిలో (రూపాయల్లో)	

టాప్ గెయినర్స్ (సెన్సెక్స్)

కంపెనీ	ప్రస్తుత ధర	మార్పు (శాతాల్లో)
భారతీ ఇన్‌ఫ్రాటెల్	279.75	6.37
హెచ్‌సీఎల్ టెక్	969.40	2.42
ఎస్-బ్యాంక్	219.60	1.95
భారతీ ఎయిర్‌టెల్	312.00	1.94
సిప్లా	508.60	1.39

టాప్ లూజర్స్ (సెన్సెక్స్)

కంపెనీ	ప్రస్తుత ధర	లాస్ (శాతాల్లో)
జీఎంటర్‌టైన్	318.40	-26.61
మారుతి సుజుకి	6,513.40	-7.49
అల్ట్రాటెక్ సిమెంట్	3,510.80	-7.38
హీరో మోటార్ కార్ప్	2,788.75	-4.30
ఇండియాబుల్స్	793.00	-3.75

విదేశీమారకం విలువ (ఫారెక్స్)

కరెన్సీ	రూ.విలువ క్రి.ముగింపు	రూ.విలువ ప్ర.ముగింపు
డాలర్	71.07	71.18
యూరో	80.67	80.65
పౌండ్	92.66	93.12
ఆస్ట్రేలియా డాలర్	50.47	50.64
సింగపూర్ డాలర్	52.24	52.48

బులియన్

బంగారం (10 గ్రాములు)	22 క్యారెట్లు రూ.	24 క్యారెట్లు రూ.
హైదరాబాద్	30,920	32,069
చెన్నై	30,920	32,069
బెంగళూరు	30,320	32,427
ముంబై	31,720	33,925
విజయవాడ	-	33,450
విశాఖపట్నం	30,890	33,700
ప్రొద్దుటూరు	30,890	32,430
ముడి చమురు	61.09	

మృగాళ్లకు కఠిన దండనే..

- బాలికలపై అత్యాచార ఘటనలు
- అదే స్థాయిలో మరణ శిక్షల విధింపు
- కఠిన చట్టం తర్వాత రెండేళ్లలో పెరిగిన శిక్షలు



న్యూఢిల్లీ : దేశంలో చిన్నారి బాలికలను చిదిమేస్తున్న మృగాళ్లకు న్యాయ వ్యవస్థ కఠిన శిక్షలు విధిస్తోంది. 2018లో దేశంలో క్రింది కోర్టులు విధించిన మరణ శిక్షల సంఖ్య పెరిగింది. ఢిల్లీలో జాతీయ న్యాయ విశ్వవిద్యాలయానికి చెందిన ప్రాజెక్టు 39ఎ రూపొందించిన 'భారత్‌లో మరణ శిక్షల విధింపు - 2018 వార్షిక గణాంకాల నివేదిక' ఈ విషయాన్ని వెల్లడించింది. 2000వ సంవత్సరం నుంచి ఒక కేలండర్ సంవత్సరంలో అత్యధికంగా గత ఏడాది విచారణ కోర్టులు 162 మరణ శిక్షలు విధించాయి. 2017లో 108 మందికి మరణ శిక్ష విధించబడింది. త్రిపుర, సిక్కిం, నాగాలాండ్, మిజోరం, మేఘాలయ, జమ్మూ కాశ్మీర్, గోవా, అరుణాచల్ ప్రదేశ్‌తోపాటు ఎనిమిది రాష్ట్రాల్లో మరణ శిక్షలు ఏవీ విధించబడలేదు. అయితే గత ఏడాది సుప్రీంకోర్టు 12 కేసుల విచారణ చేపట్టగా వాటిలో 11 కేసుల్లో మరణ శిక్షను ధ్రువీకరించింది. డిసెంబరు 16, ఢిల్లీ సామూహిక అత్యాచారం కేసులో ముగ్గురు దోషుల శిక్షను సమర్థించింది. కాగా 2018, డిసెంబరుకు భారత్‌లో మరణ శిక్షకు గురైన వారి సంఖ్య 426గా ఉంది. అదే కాలానికి 2017లో 366గా, 2016లో 400గా ఆ సంఖ్య ఉంది. చిన్నారులపై అత్యాచారానికి ఒడిగట్టడానికి సంబంధించి కఠిన చట్టం తీసుకువచ్చిన తర్వాత రెండు దశాబ్దాల్లో మరణ శిక్షల సంఖ్య పెరిగింది. హత్యేతర ఘటనల కేసుల్లోని దోషులకు కూడా మరణ శిక్ష విధించేలా గత ఏడాది చట్టాన్ని సవరించడం ఫలితంగా ఈ మరణ దండనల సంఖ్య పెరిగింది. 12 ఏళ్లలోపు చిన్నారులపై అత్యాచారం, సామూహిక అత్యాచారం కేసుల్లో దోషులకు మరణశిక్ష విధింపునకు సాధ్యమయ్యేలా ఆగస్టులో భారత నేర శిక్షాస్మృతి(ఐపీసీ)కి పార్లమెంటు సవరణ చేసింది. ఈ నేపథ్యంలో ఐపీసీ సవరణను రాష్ట్రాలు కూడా ఆహ్వానించడంతో బాలికలపై లైంగిక వేధింపులు అత్యధికంగా ఉన్న మధ్యప్రదేశ్‌లో గత ఏడాది 22 మంది దోషులకు న్యాయస్థానాలు మరణ శిక్ష విధించాయి. వీటిలో హత్యకు గురికాని 12 ఏళ్లలోపు బాలికలపై లైంగిక దాడికి సంబంధించిన కేసుల్లో ఏడుగురు మరణ దండనకు గురయ్యారు. ఇందుకు భిన్నంగా 2017లో మధ్యప్రదేశ్‌లో సెషెన్స్ కోర్టులు కేవలం ఆరుగురికి మాత్రమే ఇటువంటి కఠిన శిక్ష విధించాయి. మరణ శిక్షలు కోరే పబ్లిక్ ప్రాసిక్యూటర్లకు ఎంపీ ప్రభుత్వం రివార్డు పథకాన్ని కూడా ప్రవేశపెట్టింది. దిగువ న్యాయ స్థానాల్లో గరిష్ట శిక్షకు 100 నుంచి 200 పాయింట్లు, జీవిత ఖైదుకు 500, మరణ శిక్షకు 1,000 పాయింట్లుగా ఇప్పుడు పాయింట్ల వ్యవస్థను ప్రవేశపెట్టింది. అలాగే 2000 పాయింట్లకన్నా ఎక్కువ పొందేవారిరికి 'బెస్ట్ ప్రాసిక్యూటర్ ఆఫ్ ద మంత్', 'ప్రైడ్ ఆఫ్ ప్రాసిక్యూటషన్' వంటి టైటిల్స్ ఇస్తుంది. 500కన్నా తక్కువ పాయింట్లు పొందిన వారికి హెచ్చరిక జారీ చేస్తున్నట్లు ఆ నివేదిక పేర్కొంది. మరణ శిక్ష సంఖ్యల వెనుక విషయమేమిటంటే, దేశంలో మరణ శిక్షపై ప్రభావితం చేయగల అనేక అంశాలు 2018లో చోటుచేసుకున్న విషయాన్ని నివేదిక వివరించింది. బచన్‌సింగ్(1980) కేసులో మరణ శిక్ష యొక్క రాజ్యాంగతను సుప్రీంకోర్టు సమర్థించిన నాటి నుంచి మరణ శిక్షను పున: పరిశీలించాలంటూ సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జి ఒకరు పేర్కొన్నారు. చన్ను లాల్ వర్సెస్ చత్తీస్‌గఢ్ రాష్ట్రం కేసులో, జస్టిస్ కురియన్ జోసెఫ్(ప్రస్తుతం విశ్రాంత న్యాయమూర్తి) వ్యాఖ్యానిస్తూ, 'ఒక శిక్షగా ప్రత్యేకించి దాని ప్రయోజనం, ఆచరణకు సంబంధించి మరణ శిక్ష విధించాల్సిన సమయం ఆసన్నమైందని అభిప్రాయపడుతున్నాం. మరణ శిక్షను పున: పరిశీలించాల్సిన ఆవశక్యత ఉంది' అని తెలిపారు. 'మరణ శిక్ష న్యాయ వ్యవస్థలో గణనీయమైన అభివృద్ధి'గా మహారాష్ట్ర వర్సెస్ బాబాసాహెబ్ కాంబ్లే కేసులో సుప్రీంకోర్టు తీర్పును కూడా నివేదిక ప్రస్తావించింది. సుప్రీంకోర్టు గతంలోనే ఎటువంటి కారణాలు లేకుండానే ప్రత్యేక లీవ్ పిటిషన్లను తొలగించింది. వాటి అప్పీళ్లను కూడా అనుమతించలేదని నివేదిక పేర్కొంది. 2018, నవంబరులో కాంబ్లే కేసులో సుప్రీంకోర్టు తన తీర్పులో, మరణ శిక్ష కేసుల్లో స్పెషల్ లీవ్ పిటిషన్ల తొలగింపును చివరకు పరిమితం చేసింది. ఇదిలా ఉండగా, సహేతుక సమయం పొడిగింపునకు (అమానవీయ పరిస్థితుల్లో 1,382 మంది ఖైదీలు), మరణ శిక్ష ఖైదీల హక్కులను కూడా సుప్రీంకోర్టు గుర్తించింది. 'దోషి వ్యక్తిగత పరిస్థితులను సమాజంలోని పరిసరాలు, వారి మొత్త జీవనం సందర్భంలో చూడాలి. శిక్ష ప్రక్రియ సమయంలో వారికి తరచుగా మానసిక వైద్యుల సహాయం అవసరాన్ని కూడా పరిగణనలోకి తీసుకోవాలి' అని నివేదిక వాదించింది. జాతీయ న్యాయ విశ్వవిద్యాలయంలో మరణ శిక్షపై కేంద్రం డైరెక్టర్ అనూప్ సురేంద్ర నాథ్ దీనిపై స్పందిస్తూ, ముఖ్యంగా దిగువ కోర్టులు మరణ శిక్షలు విధింపు పద్ధతిపై కలిగే సంశయవాదం, మరణ శిక్ష చుట్టూ జరుగుతున్న చర్చల్లో ముఖ్యమైన అభివృద్ధిగా సుప్రీంకోర్టు భావిస్తుందన్నారు. సుప్రీంకోర్టు విధానం, మరణ శిక్షను చట్టపరంగా విస్తరించడానికి ప్రభుత్వ ఉత్సాహానికి విరుద్ధంగా ఉందని పేర్కొన్నారు. కతువాలో మైనరు బాలికపై అత్యాచారం, హత్య దారుణ ఘటన దేశవ్యాప్తంగా ప్రకంపనలు సృష్టించింది. ఈ నేపథ్యంలో బాలికలపై లైంగిక దాడుల కేసుల్లో మరణ శిక్ష విధించడానికి ఐపీసీకి సవరణ చేపట్టింది. అలాగే 18 ఏళ్లలోపు వారిపై తీవ్రమైన లైంగిక దాడికి పాల్పడిన వారికి మరణ శిక్ష విధించేలా ప్రభుత్వం పోస్కో చట్టానికి ఇటీవల సవరణ కూడా చేసింది. అయితే మరణ శిక్షపై నిషేధాన్ని ప్రతిపాదిస్తూ ఐక్యరాజ్య సమితి సాధారణ సభ ప్రవేశపెట్టిన ముసాయిదా తీర్మానానికి వ్యతిరేకంగా భారత్ ఓటు వేసింది.

విజ్ఞానం

మెట్లు ఎక్కితే గుండెకు మంచిదే..



మెట్లు ఎక్కడం గుండెకు మంచిదని తాజా అధ్యయనం వెల్లడించింది. కొంతసేపు విరామంతో అయినా మెట్లు ఎక్కడమే గుండెకు మంచిదని నిపుణులు సూచిస్తున్నారు. శారీరక దారుఢ్యానికి మెట్లు ఎక్కితే ఫిట్‌నెస్ పెరగడంతోపాటు పలు రోగాలకు చెక్ పెట్టేందుకు మంచిదని తెలుస్తోంది. రోజువారీ వ్యాయామం చేయనివారికి అపార్ట్‌మెంట్‌లలో ఉండేవారికి మెట్లు ఎక్కడం మంచిదే... సైక్లింగ్‌తోపాటు మెట్లు ఎక్కడం వంటివి ముఖ్యంగా మెనోపాజ్‌మహిళలకు మంచిదని సూచిస్తు న్నారు. ఇర్రిటేషన్, యాంక్జయిటీ,డిప్రెషన్ వంటి వాటికి చెక్ పెట్టేందుకు శారీరక వ్యాయామం మంచిది.

దేశంలో పెరుగుతున్న కుష్టువ్యాధి



ప్రపంచవ్యాప్తంగా సగంపైగా కుష్టు వ్యాది గ్రస్థులు మనదేశంలోనే ఉన్నట్లు ప్రపంచ ఆరోగ్యసంస్థ వెల్లడించింది. ప్రపంచ వ్యా ప్తంగా ఈ జబ్బు తగ్గ ముఖం పడుతున్నప్పటికీ, రెండు లక్షలమంది కొత్తవారు నమో దవుతున్నారు. వీరిలో భారత దేశం ముందంజలో ఉన్నట్లు ఈ నివేదిక వెల్లడించింది. కుష్టు వ్యాధిని ముందస్తుగా గ్రహించినట్లయితే దీని నివారణ సాధ్యమేనని డబ్ల్యుహెచ్‌ఓ సౌత్ ఈస్ట్ ఏసియా రీజియనల్ డైరె క్టర్ పూనమ్ క్షేత్రపాల్‌సింగ్ వెల్లడించారు. ముఖ్యంగా బ్రెజిల్, సబ్‌సహారా ఆఫ్రికా, పసిఫిక్ ప్రాంతాల్లో ఎక్కువగా ఉంది.

తగ్గిన మారుతి షేరు ధర

ముంబై: కార్ల తయారీ దిగ్గజం మారుతీ సుజుకీ డిసెంబర్ త్రైమాసికానికి నిరాశజనక ఫలితాలను ప్రకటించింది. దీంతో నేటి ట్రేడింగ్‌లో షేరు ధర కుంగింది. శుక్రవారం ఈ సంస్థ రూ.1,489 కోట్ల లాభాన్ని ప్రకటించింది. గతేడాదితో పోలిస్తే ఇది 17శాతం తక్కువ. ముడిపదార్థాల ధరలు పెరగడం, ఫారెక్స్ మార్కెట్లో ఒడిదొడుకులు మారుతీ లాభాలపై ప్రభావం చూపింది. గత ఏడాది ఇదే సమయానికి లాభం రూ.1,799 కోట్లు. మూడో త్రైమాసికంలో ప్రధాన కార్యకలాపాల నుంచి వచ్చిన ఆదాయం 19,663.3 కోట్లు. దీంతో నేటి మార్కెట్లో మధ్యాహ్నం సమయానికి మారుతీ షేరు ఒక దశలో 9 శాతం నష్టపోయి రూ.64.20కు చేరింది.

మార్కెట్లోకి బెంజ్ వీ-క్లాస్

ముంబై: జర్మనీకి చెందిన లగ్జరీ కార్ల తయారీ సంస్థ మెర్సిడెజ్ బెంజ్.. భారత మార్కెట్లోకి మల్టీ పర్పస్ వెహికిల్ (ఎంపీవీ) వీ-క్లాసను విడుదల చేసింది. స్పెయిన్‌లో తయారయ్యే ఈ కారును రెండు వేరియంట్ల (ఎక్స్‌ప్రెషన్, ఎక్స్‌క్లూజివ్)లో అందుబాటులోకి తెచ్చింది సంస్థ. ఎక్స్‌ప్రెషన్ ధర రూ.68.40 లక్షలు కాగా.. ఎక్స్‌క్లూజివ్ వేరియంట్ రూ.81.90 లక్షలకు లభించనుంది. 2.2 లీటర్ డీజిల్ ఇంజన్‌తో కూడిన ఈ కారును బీఎస్-6 ప్రమాణాలతో రూపొందించారు. ఈ కారును ఇప్పటికే ప్రపంచంలో 90కి పైగా దేశాల్లో విక్రయిస్తున్నట్లు మెర్సిడెజ్ బెంజ్ తెలిపింది. భారత మార్కెట్‌లో 40 శాతానికి పైగా మార్కెట్ వాటా కలిగిన బెంజ్ వరుసగా నాలుగేళ్ల నుంచి నం.1 కంపెనీగా కొనసాగుతోంది. గత ఏడాది ఈ సంస్థ ఇండియాలో 15,538 వాహనాలను విక్రయించగలిగింది. ఈ ఏడాదిలో విడుదల చేయనున్న పది కొత్త మోడళ్లలో వీ-క్లాస్ మొదటిదని సంస్థ తెలిపింది. ఇండియన్ మార్కెట్లోకి లగ్జరీ ఎంపీవీని ప్రవేశపెట్టడం సంస్థకు ఇది రెండో సారి. ఆశాజనక విక్రయాలు లేని కారణంగా గత లగ్జరీ ఎంపీవీ మోడల్ ఆర్-క్లాసును 2011లో మార్కెట్ నుంచి ఉపసంహరించుకుంది.

స్కోర్‌బూస్టర్‌గా 'ర్యాంక్ అప్ జేఈఈ'

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: జేఈఈ అభ్యర్థుల కోసం ర్యాంక్ అప్ జేఈఈ కోర్సును గ్రేడ్ అప్ ప్రారంభించింది. లైవ్ కోర్సులు, మాక్ పరీక్షలు, గత ప్రశ్నాపత్రాలు, ఓపెన్ డిబేట్స్ ద్వారా విద్యార్థులు మెరుగైన ర్యాంకులు సాధించేందుకు ఇది దోహదపడుతుందని సంస్థ సహ వ్యవస్థాపకులు షోబిట్ భట్నాగర్ తెలిపారు. ఇది 70 రోజుల స్కోర్‌బూస్టర్ కోర్సు అని, ఏప్రిల్‌లో జరిగే జేఈఈ మెయిన్ పరీక్షకు హాజరయ్యే విద్యార్థులకు ఇది సమగ్ర కోర్సు అని అన్నారు. జనవరిలో జరిగే జేఈఈ పరీక్షలో వచ్చిన స్కోర్‌ని దృష్టిలో ఉంచుకొని ఏప్రిల్‌లో జరిగే మెయిన్స్‌కు విద్యార్థులను తయారుచేసేలా ఈ కోర్స్‌ని తయారు చేశామన్నారు. గ్రేడ్‌అప్ ప్రకారం, ఈ కోర్సు ద్వారా విద్యార్థులకు 50-70 మార్కులు పెరగవచ్చునన్నారు. దేశవ్యాప్తంగా 2500 పైగా నగరాల నుంచి సుమారు 1.3 కోట్ల మంది గ్రేడ్‌అప్‌లో నమోదు చేసుకున్నారని తెలిపారు.

నష్టాల్లో మార్కెట్లు



ముంబై: దేశీయ స్టాక్‌మార్కెట్లు నష్టాల్లో ముగిశాయి. ప్రారంభ లాభాలన్నీ ఆవిరి కాగా ఒడుదుడుకుల మధ్య కొనసాగిన కీలక సూచీలు వారాంతంలో నష్టాల్లో ముగిశాయి. సెన్సెక్స్ 170 పాయింట్లు కోల్పోయి 0.47శాతంతో 36,025 వద్ద, నిఫ్టీ 69 పాయింట్లు క్షీణించి 0.64శాతంతో 10,780 వద్ద ముగిసింది. ఈ వారం సెన్సెక్స్ 361పాయింట్లు నష్టపోయింది. నిఫ్టీ 126పాయింట్లు దిగజారింది.మారుతి సుజుకి క్యు3 ఫలితాలు నికరలాభంలో17.21 శాతం తగ్గింది. దీని ప్రభావం షేరు విలువపై పడినట్లు తెలుస్తోంది. కంపెనీ షేర్లు 7.40శాతం తగ్గినట్లు తెలుస్తోంది. హీరో మోటాకార్ప్, ఐసిఐసిఐ, ఆసియన్ పెయింట్స్, ఎమ్అండ్ ఎమ్, టాటాస్టీల్,టాటామోటార్స్, ఎన్‌టిపిసి, ఎస్‌బీఐ షేర్లు 4.23శాతం తగ్గాయి. మీడియా, ఆటో, మెటల్, రియల్టీ రంగాలు నష్టపోయాయి. ముఖ్యంగా మిడ్‌సెషన్‌లో జీ గ్రూప్ కౌంటర్లలో అమ్మకాలు వెల్లువెత్తాయి. భూమి కొనుగోలు అంశంపై రియల్టీ దిగ్గజం డీఎల్ఎఫ్ కార్యా లయాల్లో సీబీఐ సోదాలు వంటి అంశాలు అమ్మకాలకు దారి తీసింది. ఆటో మేజర్ మారుతి సుజుకి ఫలితాల్లో నిరాశపర్చడంతో 8శాతం నష్టపోయింది. దీంతోపాటు హీరో మోటో, టీవీఎస్ మోటార్, అశోక్ లేలాండ్, ఎండ్ అండ్, ఐషర్ తదితర ఆటో షేర్లు నష్టాల్లో ముగిశాయి. ఇంకా ఐసీఐసీఐబ్యాంకు, ఏసియన్ పెయింట్స్ బాగా నష్టపోయాయి. ఇన్ ఫ్రాటెల్ 6.5 శాతం జంప్‌చేయగా.. హెచ్‌సీఎల్ టెక్, యస్ బ్యాంక్, సిప్లా, ఎయిర్‌టెల్, యూపీఎల్, టీసీఎస్, టైటన్, వేదాంతా, విప్రో లాభాల్లో ముగిశాయి. బిఎస్ఇ రియాల్టీ ఇండెక్స్ 4.9 శాతం, ఆటో ఇండెక్స్ 3.14శాతం, మెటల్ 1.08శాతం, కాపిటల్ గూడ్స్ 1.02శాతం. పవర్ 0.99శాతం తగ్గాయి. కేపిటల్ గూడ్స్ 0.84శాతం, పిఎస్‌యు 0.78శాతం, మౌలిక సదుపాయాలు 0.71శాతం, బ్యాంకెక్స్ 0.63 శాతం, ఎఫ్ఎమ్‌సిజి 0.39శాతం, హెల్త్‌కేర్ 0.36శాతం నష్టపోగా, కన్స్యూమర్ డ్యూరబుల్స్, ఐటి, ఆయిల్ అండ్ గ్యాస్ సూచీలు సానుకూలంగానే నమోదయ్యాయి. స్మాల్‌కాప్, మిడ్‌కాప్‌సూచీలు 1.58శాతం, 1.20శాతం నష్టపోయాయి. ఆసియాలో హాంగ్‌కాంగ్ హెంగ్ శాంగ్ 1.65శాతం, కొరియా కాస్పి 1.52 శాతం, జపాన్ నిక్కీ 0.97శాతం లాభపడ్డాయి. పారిస్ సిఏసి 40 0.54శాతం,లండన్ ఎఫ్‌టిఎస్ఇ 0.12శాతం లాభపడ్డాయి.

ఇండిగో కొత్త సారథి రణజయ్ దత్తా

న్యూఢిల్లీ: విమానయాన రంగంలో ఎంతో అనుభవం ఉన్న రణజయ్ దత్తాను నూతన సీఈవోగా ఇండిగో ప్రకటించింది. వీరి పదవీకాలం ఐదేళ్లు. ఆదిత్య ఘోష్ ఇండిగోను వీడిన ఎనిమిది నెలల అనంతరం సంస్థ ఈ నియామకాన్ని పూర్తి చేసింది. మాజీ చైర్మన్ ఎం.దామోదరన్‌ను కంపెనీ చైర్మన్‌గా నియమించినట్టు తెలిపింది. ఇండిగో సహ వ్యవస్థాపకుడు, తాతాల్కిక సీఈవో రాహుల్ భాటియా నుంచి దత్తా ఈ బాధ్యతలను స్వీకరించనున్నారు. అంతర్జాతీయ మార్గాల్లో ఈ ఏడాది పెద్ద ఎత్తున విస్తరణ ఉంటుందని కంపెనీ తెలిపింది. రణజయ్ దత్తా ప్రస్తుతం యునైటెడ్ ఎయిర్‌లైన్స్ ప్రెసిడెంట్‌గా ఉన్నారు. ఆ సంస్థలో ఆయన 20 ఏళ్ల నుంచి పని చేస్తూ.. సీనియర్ వైస్ ప్రెసిడెంట్ (ప్లానింగ్) సీనియర్ వైస్ ప్రెసిడెంట్ (మెయింటెనెన్స్), వైస్ ప్రెసిడెంట్ (ఫైనాన్స్), వైస్ ప్రెసిడెంట్ (ఐటీ) వంటి కీలక పదవులను నిర్వహించారు. ఎయిర్ సహారా సంస్థకు ప్రెసిడెంట్‌గా రెండేళ్లు పనిచేశారు. ఎయిర్ కెనడా, యూఎస్ ఎయిర్‌వేస్ సంస్థలకు అడ్వైజర్‌గానూ వ్యవహరించారు. "ఇండిగో ప్రపంచ స్థాయి ఎయిర్‌లైన్ సంస్థగా అపూర్వ విజయం సాధించింది. ఈ సంస్థలో నాకు భాగస్వామ్యం కల్పించినందుకు సంతోషంగా ఉంది. ప్రపంచంలోనే అధికంగా వృద్ధి చెందుతున్న సంస్థల్లో ఇండిగో ఒకటి. భవిష్యత్తులో మరింత వేగంగా వృద్ధిని సాధించేందుకు అవకాశాలు ఉన్నాయి" అని దత్తా పేర్కొన్నారు.

ఈ కామర్స్ రంగంపై అంతర్జాతీయ ఒప్పందం!

డబ్ల్యూటీఓ చీఫ్



దావోస్: వేగంగా మారుతున్న ప్రపంచంతో పాటు మారకపోతే బహుళపక్ష వాణిజ్య వ్యవస్థలు, డబ్ల్యూటీఓ వంటి సంస్థలు కనుమరుగు కాక తప్పదని డబ్ల్యూటీఓ చీఫ్ రొబెర్టో అజెవెడో హెచ్చరించారు. దీనిని నివారించడానికి తక్షణం చర్యలు తీసుకోవాలని సూచించారు. జోరుగా వృద్ధి చెందుతున్న ఈకామర్స్ కోసం అంతర్జాతీయ బహుళపక్ష ఒప్పందం అవసరమన్నారు. ఇక్కడి ప్రపంచ ఆర్థిక సదస్సులో (డబ్ల్యుఈఎఫ్) ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. దేశాల మధ్య వాణిజ్య ఉద్రిక్తతలు పెరగడం, రక్షణాత్మక విధానాలు పెరుగుతుండటం వంటి కారణాల వల్ల వాణిజ్య రంగంలో గతంలో కంటే సవాళ్లు మరింత క్లిష్టమవుతున్నాయని ఆయన అభిప్రాయపడ్డారు. మరోవైపు అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థపై ప్రభావం చూపుతున్న వాణిజ్య ఉద్రిక్తతలు నిజానికి రాజకీయ సమస్య అని ఐక్యరాజ్యసమితి సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుంటెరస్ వ్యాఖ్యానించారు. ప్రస్తుతం ప్రపంచం ఎదుర్కొంటున్న సమస్యలు ఒకదానితో ఒకటి అనుసంధానమై ఉన్నాయని, వీటిని సవ్యంగా పరిష్కరించలేకపోతే పెను విపత్తు తప్పదని ఆయన హెచ్చరించారు. కాగా ఆర్థిక వ ృద్ధికి సంబంధించిన అంశాలను దేశాలు త్వరితంగా పరిష్కరించుకోవాలని అంతర్జాతీయ ద్రవ్యనిధి (ఐఎమ్ఎఫ్) చీఫ్ క్రిస్టీనా లగార్డ్ సూచించారు. అందుకే అం తర్జాతీయ ఆర్థిక వ ృద్ధి అంచనాలను తగ్గించామన్నా రు. కాగా, కృత్రిమ మేధ నియంత్రణకు నిబంధనల ను రూపొందించాల్సిన అవసరముందని మైక్రోసాఫ్ట్ అధినేత సత్య నాదెళ్ల వ్యాఖ్యానించారు. గోప్యతను మానవ హక్కుగా పరిగణించాలని పేర్కొన్నారు.

డిజిటల్ డిక్లరేషన్...

డిజిటల్ యుగంలో నైతికంగా, బాధ్యతాయుతంగా వ్యవహరిస్తామనే డిజిటల్ ప్రతినకు 40కు పైగా అంతర్జాతీయ వ్యాపార ప్రముఖులు సంఘీభావం తెలిపారు. ఈ డిజిటల్ డిక్లరేషన్‌పై మన దేశానికి చెందిన భారతీ ఎయిర్‌టెల్ చైర్మన్ సునీల్ భారతీ మిట్టల్ తొలి సంతకం చేశారు. ఎరిక్సన్, ఐబీఎమ్, ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్, నోకియా, శామ్‌సంగ్, షార్ప్, వెరిజాన్, వొడాఫోన్, షియోమి తదితర సంస్థలు ఈ డిజిటల్ డిక్లరేషన్‌కు సంఘీభావం తెలిపాయి.

ఎలక్ట్రానిక్ వేస్ట్.. 6,200 కోట్ల డాలర్లు

ప్రతీ ఏడాదీ ఎలక్ట్రానిక్ వ్యర్థాలు విపరీతంగా పెరిగిపోతున్నాయని తాజా నివేదిక వెల్లడించింది. ప్రస్తుతం 5 కోట్ల టన్నులుకాగా (ఇప్పటివరకూ ప్రపంచవ్యాప్తంగా తయారైన వాణిజ్య విమానాల బరువు కంటే ఇది అధికం) 2050 కల్లా 12 కోట్ల టన్నులకు పెరుగుతుందని పేర్కొంది. ఫలితంగా తీవ్రమైన ఆరోగ్య, పర్యావరణ సమస్యలు తలెత్తుతాయని వివరించింది. ఏటా పేరుకుపోతున్న ఈ వ్యర్థాల విలువ 6,200 కోట్ల డాలర్ల మేర ఉంటుందని, ఇది మొత్తం ప్రపంచ వెండి ఉత్పత్తి విలువకు మూడు రెట్లకు సమానమని వివరించింది. ప్రతి ఏటా ఎలక్ట్రానిక్స్, ప్లాస్టిక్స్ ఉత్పత్తుల్లో 20 శాతం మాత్రమే రీసైకిల్ అవుతున్నట్లు తెలియజేసింది.

రేడియో మిర్చి 'కవర్‌స్టార్' పోటీలు

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: ముంబైలో నిర్వహించే 11వ మిర్చి మ్యూజిక్ అవార్డులో ప్రదర్శన అవకాశాన్ని రేడియో మిర్చి 98.3 ఎఫ్ఎం కల్పిస్తోంది. ఈ పోటీలో పాల్గొనేందుకు ఆసక్తిగల వారంతా స్మూల్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొని తమకు ఇష్టమైన గీతాన్ని పాడి పంపాలి. అలాగే, 12 నగరాల్లోని మాల్స్, క్యాంపస్‌లలో ఆన్-గ్రౌండ్ యాక్టివేషన్ ద్వారా ఎంట్రీలను పంపే అవకాశాన్ని రేడియో మిర్చి కల్పిస్తోంది.

మార్కెట్‌లోకి అదిదాస్ 'ఆల్ఫా బౌన్స్'

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: ఆల్ఫా బౌన్స్ పేరిట భారత మార్కెట్లో అదిదాస్ కొత్త ఉత్పత్తులను విడుదల చేసింది. అథ్లెట్లకు, వ్యాయామం చేసే వారికి, స్పోర్టీ లుక్ కోరుకునే వారికి ఇవి చక్కగా నప్పుతాయని సంస్థ ఒక ప్రకటనలో తెలిపింది. వీటిని టార్షన్, బౌన్స్, ఫోర్జింగ్, ట్రాక్షన్ వేరియంట్లలో అందుబాటులో ఉంచినట్టు వెల్లడించింది.

సత్యసాయి ట్రస్ట్‌కు ఓర్బ్ సౌర విద్యుత్తు వ్యవస్థ

విజయవాడ : శ్రీ సత్యసాయి మిత్ర ఫేజ్-2 కింద 2.27 మెగావాట్‌ల రూఫ్‌టాప్ సోలార్ విద్యుత్తు వ్యవస్థను ఏర్పాటు చేయటానికి ఓర్బ్ ఎనర్జీ సంస్థను ఎంపిక చేశారు. ఈ మేరకు శ్రీసత్య సాయి సెంట్రల్ ట్రస్ట్ ప్రకటించింది. ఇప్పటికే ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆసుపత్రులు, పరిశోధనా కేంద్రాలు, ఆర్చీవ్స్‌లో 2.27 మెగావాట్‌ల సౌర విద్యుత్తును వినియోగిస్తున్నారు. తాజాగా ప్రశాంతి నిలయం, రాజమహేంద్రవరం, బృందావనం, ముద్దనహళ్లిలో క్యాంపస్‌లకు మరో 2.27 సౌర విద్యుత్తు అవసరమని అంచనా వేశారు. రోజుకు 9000 యూనిట్ల శుద్ధ సౌర విద్యుత్తును ఉత్పత్తి చేయాలని నిర్ణయం తీసుకున్నారు. ఈ స్థితిలో మిత్ర ఫేజ్ -2 బాధ్యతలను ఓర్బ్ గ్రీన్ ఎనర్జీ సంస్థకు అప్పగించారు. ఈ సందర్భగా ఓర్బ్ సీఈవో డామియన్ మిల్లర్ మాట్లాడుతూ, నాణ్యమైన విద్య, వైద్యాన్ని ఉచితంగా అందించటమే కాదు, ఆంధ్రప్రదేశ్, చెన్నై నగరంలోనూ మంచినీటిని సరఫరా చేస్తున్న శ్రీసత్యసాయి ట్రస్ట్‌తో అనుబంధంగా పని చేయటం తమకు ఎంతో గర్వకారణమన్నారు. అదే విధంగా ఆంధ్రప్రదేశ్, కర్ణాటకలోని ఐదు ప్రాంతాల్లో 2.27 మెగావాట్ల రూఫ్‌టాప్ సౌరవ్యవస్థ ఏర్పాటునకు తమను ఎంపిక చేయటం ఆనందంగా ఉందన్నారు.

స్మగ్లింగ్, జంతువుల వేటపై ఉక్కుపాదం

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: అడవులు, అటవీ సంపదను కాపాడాలని, వాటి దోపిడీదారులను ఉపేక్షించరాదని తెలంగాణ ప్రభుత్వం ఇచ్చిన అదేశాల మేరకు ఉన్నతాధికారులు శుక్రవారం అటవీ శాఖలో పనిచేస్తున్న ఉద్యోగ సంఘాలతో సమావేశమయ్యారు. స్టేట్ ఫారెస్ట్ సర్వీస్, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్స్, జూనియర్ ఫారెస్ట్ ఆఫీసర్స్, తెలంగాణ ఎన్జీవో సంఘాలతో సమావేశమయ్యారు. పర్యావరణాన్ని కాపాడటం ద్వారా ప్రజలకు మెరుగైన జీవనం ఇవ్వాలన్న రాష్ట్రప్రభుత్వ సంకల్పానికి అటవీ శాఖ పనితీరే కొలమానం అవుతుందని అటవీ శాఖ చీఫ్ కన్జర్వేటర్ (పీసీసీఎఫ్) ఝా అన్నారు. కలప స్మగ్లింగ్, జంతువుల వేట, అటవీ భూముల ఆక్రమణల విషయంలో అత్యంత కఠినంగా ఉండాలని తెలిపారు. క్షేత్ర స్థాయిలో ఏమైనా సమస్యలు ఉంటే, తమ దృష్టికి తీసుకురావాలన్నారు. వన్యప్రాణులు, అటవీ సంపద రక్షణకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని, ఉద్యోగ సంఘాలు తమ పరిధిలోని ఉద్యోగులు, సిబ్బందిని ఈ దిశగా మరింత జాగృతం చేయాలని సూచించారు. అటవీ నేరాలు వెలుగులోకి వస్తుండటం బాధాకరమని, కొన్ని చోట్ల సిబ్బంది ప్రమేయం కూడా ఉందన్నారు. నేరస్తులు ఎంతటి వారైనా ఉపేక్షించేదిలేదని స్పష్టంచేశారు. విధుల్లో నిర్లక్ష్యంగా ఉన్న ఎనిమిది మంది అధికారులు, సిబ్బందిని ఇటీవల సస్పెండ్ చేసినట్లు ఝా తెలిపారు. అడవులు, వన్యప్రాణుల రక్షణ, క్షీణించిన అడవుల పునరుద్ధరణకు ప్రణాళికాబద్ధంగా పని చేయాలన్నారు. ఇటీవల చనిపోయిన రెండు పులులు చర్మాలను స్వాధీనంపై సమావేశంలో చర్చించారు. అటవీ ప్రాంతాల్లో నిరంతర నిఘా వ్యవస్థ ఏర్పాటుతో పాటు, పోలీసుల సహకారం తీసుకుని ఇలాంటివి పునరావృతం కాకుండా చూడాలని అటవీ ఉద్యోగ సంఘాలను ఆదేశించారు.

మీ ఫోన్‌లో ఇలా జరిగితే..

ఎవరో ట్యాప్ చేసినట్టే..



ఈ మధ్య ఎక్కడ చూసినా ఫోన్ ట్యాపింగ్ అనే అంశం కలకలం రేపుతోంది. దీని ద్వారా మొబైల్‌లోని వ్యక్తిగత సమాచారాన్ని ఇతరులు దొంగిలించి అక్రమ కార్యకలాపాలకు అనువుగా మలుచుకుంటున్నారు. బ్యాంక్ అకౌంట్ రహస్య వివరాలను తెలుసుకొని మీ ఖాతాల్లోని సొమ్మును స్వాహా చేస్తున్నారు. మీరే పంపించినట్లుగా అనుచిత సందేశాలను ఇతరులకు పంపి, మీపై చెడ్డ పేరు తీసుకువస్తున్నారు. ట్రాక్ వ్యూ లాంటి యాప్స్ ఇందుకు బాగా సహకరిస్తున్నాయి. అయితే దీని నుంచి మనల్ని రక్షించుకోవడం ఎలా అనే విషయంపై కొన్ని టిప్స్ గురించి తెలుసుకుందాం.

మొబైల్ నుంచి శబ్దాలు

ఫోన్‌లో మాట్లాడుతున్నప్పుడు అనవసరమైన శబ్దాలు వినిపిస్తుంటే.. మీ ఫోన్ ట్యాపింగ్‌కు గురైందని అనుమానించవచ్చు. నెట్‌వర్క్ సమస్యల వల్ల వచ్చినప్పటికీ ఫోన్ ఉపయోగించనప్పుడు కూడా ఇలాంటి శబ్దాలు వస్తుంటే అనుమానించాల్సిందే.

సౌండ్ బ్యాండ్ విడ్త్ సెన్సార్

దీన్ని మనం ఖచ్చితంగా నిర్ధారించుకోవాలంటే సౌండ్ బ్యాండ్ విడ్త్ సెన్సార్ అనే పరికరం ద్వారా నిర్ధారించుకోవచ్చు. దీనిని ట్యాపింగ్‌కు గురైన ఫోన్ దగ్గర పెట్టినట్లయితే అలారం మోగుతుంది. ఒకే నిమిషంలో ఎక్కువసార్లు అలారం మోగినట్లయితే ఫోన్ ట్యాపింగ్‌కు గురైందని నిర్ధారించుకోవచ్చు.

బ్యాటరీ లైఫ్

మనకు తెలియకుండానే బ్యాక్ గ్రౌండ్‌లో ట్యాపింగ్ సాఫ్ట్‌వేర్ రన్ అవుతుంటే బ్యాటరీ లైఫ్ భారీగా పడిపోతుంది. ఒకవేళ ఇలా జరుగుతూ ఉంటే దీనికి సరైన కాల్స్ వెతుక్కోవాలి. ఛార్జింగ్ సమయం, కాల్స్ సమయం, యాప్స్ వాడుక, నెట్ బ్రౌజ్ లాంటి అంశాలను మనం చెక్ చేసుకోవాలి.

బ్యాటరీని ఎక్కువగా వినియోగించే యాప్స్

సెట్టింగ్స్ –ῃ బ్యాటరీ సెట్టింగ్స్ –ῃ బ్యాటరీ యూసేజ్ ఆప్షన్‌తో ఈ వివరాలు తెలుసుకోవచ్చు. లేదంటే బ్యాటరీ లైఫ్, కోకోనట్ బ్యాటరీ తదితర యాప్స్ కూడా అందుబాటులో ఉన్నాయి. కొత్త ఫోన్ బ్యాటరీ సామర్థ్యం సంవత్సరం వరకు బాగా ఉంటుంది. ఆ తరువాత తగ్గిపోతుంది. అప్పుడు బ్యాటరీని ఎక్కువగా వినియోగించే యాప్స్, జీపీఎస్, వైఫై ఆఫ్ చేయడంతోపాటు, డిస్‌ప్లే స్క్రీన్ బ్రైట్‌నెస్‌ని తక్కువగా వినియోగించుకోవాల్సి ఉంటుంది.

ఫోన్ స్విచ్ఛాఫ్

మీ మొబైల్ స్విచ్ఛాఫ్ చేసిన వెంటనే షట్‌డౌన్ కావడం లేదా? స్విచ్ ఆఫ్ చేసినప్పటికీ లైట్ ఇండికేటర్ వెలుగుతూనే ఉందా? అయితే మీ ఫోన్‌ను ఎవరో ట్యాప్ చేశారని అనుమాన పడొచ్చు. ఇలాంటి సందర్భాల్లో ఫోన్‌ను ఒక్కసారి రీబూట్ చేయడం మంచిది. కొన్నిసార్లు కొత్తగా ఇన్‌స్టాల్ చేసిన యాప్స్ వల్లగానీ, అప్‌డేటెడ్ సాఫ్ట్‌వేర్‌లో ఏమైనా లోపాలున్నా సరే ఇలాంటి సమస్యలు తలెత్తవచ్చు.

ఆటోమేటిక్‌గా ఆన్/ఆఫ్

మీ ప్రమేయం లేకుండానే ఫోన్ ఆన్/ఆఫ్ అవుతోందా? అయితే మీ ఫోన్‌ను ఎవరో హ్యాక్ చేసినట్లే.. మీ మొబైల్‌లో కొన్ని స్పై యాప్స్‌ని ఇన్‌స్టాల్ చేసి మీ వ్యక్తిగత సమాచారాన్ని దొరకబుచ్చుకుంటారు. తద్వారా మీ కాల్స్‌ను ట్యాప్ చేస్తారు.

అలర్ట్స్‌ను యాక్టివేట్ చేయండి

మీకు ఇలాంటి అనుమానం వచ్చినట్లయితే వెంటనే అలర్ట్స్‌ను యాక్టివేట్ చేసుకోండి. దీని ద్వారా మన మొబైల్‌లో ఎలాంటి యాప్స్ ఇన్‌స్టాలైనా సంబంధిత ఈ మెయిల్ అకౌంట్‌కు అలెర్ట్ మెసేజ్ వెళ్తుంది.

యాప్స్ డౌన్‌లోడ్

యాప్‌స్టోర్ నుంచి గానీ, గూగుల్ ప్లేస్టోర్ నుంచి గానీ యాప్స్‌ని డౌన్‌లోడ్ చేసేటప్పుడు చాలా జాగ్రత్తగా వ్యవహరించాలి. ఆయా యాప్స్‌లో స్పైవేర్‌కి సంబంధించిన లక్షణాలు లేనప్పుడే వాటిని డౌన్‌లోడ్ చేయాలి. అయితే అధికారిక యాప్ స్టోర్ లేదా ప్లేస్టోర్‌లో ఉన్న యాప్స్ అన్నీ దాదాపు స్క్రీనింగ్ చేసినవే ఉంటాయి.


గేమింగ్ యాప్స్..

గేమింగ్ యాప్స్‌తో చాలా జాగ్రత్తగా ఉండాలి. వాటిని ఇన్‌స్టాల్ చేసినప్పుడు కాల్ హిస్టరీ, అడ్రస్‌బుక్, కాంటాక్ట్ లిస్ట్ కోసం పర్మిషన్ అడిగితే ఆలోచించుకోవాలి. మరికొన్ని చీటింగ్ యాప్స్ మనందరికీ తెలిసిన పేరుతో.. అదే లోగోతో కనిపిస్తాయి. అందువల్ల డౌన్‌లోడ్ చేసే ముందు ఆ యాప్ డెవలపర్ పేరును చెక్ చేసుకోవడం మంచిది.



ఆండ్రాయిడ్ ఫోన్ పోతే గూగుల్ మ్యాప్స్ ద్వారా వెతికి పట్టుకోవచ్చు..

ప్రస్తుతం చాలామందికి స్మార్ట్‌ఫోన్ అనేది నిత్యావసర వస్తువులా మారిపోయింది. వ్యక్తిగత డేటాతో ఫిల్ అయి ఉంటోన్న స్మార్ట్‌ఫోన్‌లను ఒక్కనిమిషం కూడా విడిచి పెట్టి ఉండలేని పరిస్థితులను మనం చూస్తున్నాం. ఇలా మనం జీవితంలో కీలక పాత్ర పోషిస్తోన్న ఫోన్ అనుకోకుండానో, అజాగ్రత్త కారణంగానో మన నుంచి దూరమైనట్లయితే భారీ మూల్యాన్నే చెల్లించుకోవల్సి ఉంటుంది. అయితే పోగొట్టుకున్న ఫోన్‌ను వెతికిపట్టుకునేందుకు అనేక చిట్కాలు, ట్రిక్స్ అందుబాటులో ఉంటున్నాయి. వాటిలో ఒకటి గూగుల్ మ్యాప్స్. గూగుల్ మ్యాప్స్ ను ఉపయోగించుకుని పోగొట్టుకున్న ఫోన్‌ను ఏ విధంగా పొందవచ్చో ఇప్పుడు తెలుసుకుందాం..



ఫైండ్ యువర్ ఫోన్ అనే ఫీచర్‌ను..

ఆండ్రాయిడ్ యూజర్లు ఫైండ్ యువర్ ఫోన్ అనే ఫీచర్‌ను ఉపయోగించుకోవటం ద్వారా వినియోగదారులు తన ఫోన్‌కు సంబంధించి అచూకీని గుర్తించే వీలుంటుంది. ఇదే సమయంలో యాపిల్ యూజర్లు కూడా ఫైండ్ మై ఫోన్ అనే ఆప్షన్‌ను ఉపయోగించుకుని తమ ఐఫోన్ అచూకీని తెలుసుకోవచ్చు. అది ఎలాగో ఇప్పుడు చూద్దాం..

స్మార్ట్‌ఫోన్ లేదా కంప్యూటర్ నుంచి....

ముందుగా స్మార్ట్‌ఫోన్ లేదా కంప్యూటర్ నుంచి www.maps.google.co.inలోకి వెళ్లాలి. ఆ తరువాత పోగట్టుకున్న ఫోన్‌కు సంబంధించిన గూగుల్ అకౌంట్‌తో గూగుల్ మ్యాప్స్‌లోకి లాగిన్ అవ్వాలి. లాగిన్ అయిన తరువాత స్క్రీన్ టాప్ రైట్ కార్నర్‌లో కనిపించే త్రీ–హారిజెంటల్ బార్ ఐకాన్ పై క్లిక్ చేయాలి.

యువర్ టైమ్‌లైన్ అనే ఆప్షన్....

ఇప్పుడు ఓపెన్ అయ్యే ఆప్షన్స్‌లో యువర్ టైమ్‌లైన్ అనే ఆప్షన్ మీకు కనిపిస్తుంది. దానిని మీరు సెలక్ట్ చేసుకావాలి. ఇప్పుడు ఓపెన్ అయ్యే మెనూలో సంవత్సరం, నెల ఇంకా తేదీ వివరాలను ఎంటర్ చేసినట్లయితే డివైస్ ట్రాక్ లొకేషన్‌ను గుర్తించే వీలుటుంది. ఈ ప్రాసెస్ విజయవంతమవ్వాలంటే పోయిన మీ ఫోన్‌లో లొకేషన్ ఆన్ అయి ఉండటంతో పాటు ఆ సమయంలో స్విచ్ ఆన్ అయి ఉండాలి.

వాట్సాప్‌లో మెసేజ్‌లు షెడ్యూల్ చేయడం ఇలా..



ఫేస్‌బుక్ సొంతమైన ఇన్‌స్టంట్ మెసేజింగ్ దిగ్గజం వాట్సప్ ఎప్పటిక ప్పుడు కొత్త ఫీచర్లతో వినియోగ దారులను అలరి స్తోంది. యూజర్ల ఆసక్తిని దృష్టిలో పెట్టుకుని కొత్త ఫీచర్లను తీసుకురాడం లేక ఉన్న ఫీచర్లను రీడిజైన్ చేయడంలాంటివి చేస్తూ ముందుకు వెళుతోంది. అయితే వాట్సాప్‌లో ఇప్పటి వరకు మెసేజులు షెడ్యూల్ చేసే ఆప్షన్ లేదు. ఒక వేళా అలా మెసేజ్ షెడ్యూల్ చేయా లంటే థర్డ్ పార్టీ యాప్స్ అయిన WhatsApp Scheduler, Do It Later, SKEDit లాంటి యాప్స్ సహాయంతో షెడ్యూల్ చేయాలి. ఈ యాప్స్ వారి బేసిక్ వెర్షన్ లేదా ఉచిత సంస్కరణలో ఉపయోగించడానికి సులభమైనవి. అయితే, ఫొటోలు, వీడియోలను పంపడం వంటి ఆధునిక లక్షణాల కోసం, వినియోగదారులు ప్రీమియం వెర్షన్‌ను కొనుగోలు చేయాలి. ఇక్కడ ఉత్తమ భాగాన్ని ఈ యాప్స్ కూడా నాన్–రూటెడ్ ఆండ్రాయిడ్ స్మార్ట్ ఫోన్లలో పని చేస్తాయి. ఆండ్రాయిడ్ ఫోన్ వినియోగదారులు వాట్సాప్‌లో మెస్సేజులు ఎలా షెడ్యూల్ చేయాలో 4 దశల్లో తెలుసుకుందాం.

స్టెప్ 1

గూగుల్ ప్లే స్టోర్ ఓపెన్ చేసి WhatsApp scheduler యాప్‌ను లేదా వెబ్‌సైట్ నుంచి WhatsApp scheduler.apk ఫైల్‌ను డౌన్లోడ్ చేయండి.

స్టెప్ 2

WhatsApp scheduler యాప్ ఇన్‌స్టాల్ అయ్యాక యాప్ బాటమ్ రైట్ లో ఉన్న 'o' ఐకాన్‌ను నొక్కండి

స్టెప్ 3

వాట్సాప్ గ్రూప్ లేదా పర్టికులర్ పర్సన్ కాంటాక్ట్‌ను ఓపెన్ చేసి టైం, డేట్‌ను సెట్ చేయండి

స్టెప్ 4

ఫ్రీక్వెన్సీని ఎంచుకోవడంతోపాటు మీ మెసేజ్‌ను టైప్ చేయండి. షెడ్యూల్ చేయడానికి టాప్–రైట్ కార్నర్‌లో ఉన్న 'Create' బటన్‌ను నొక్కండి.



'96'కు సమంత, శర్వానంద్ ఫిక్సా?



తమిళ హిట్ '96' సినిమా తెలుగు రీమేక్ హక్కుల్ని ప్రముఖ నిర్మాత దిల్‌రాజు సొంతం చేసుకున్న సంగతి తెలిసిందే. ఈ సినిమాలో త్రిష, విజయ్ సేతుపతి పాత్రల్లో ఎవరు నటించబోతున్నారనే విషయంపై కొన్ని రోజులుగా అనేక వార్తలు హల్‌చల్ చేస్తున్నాయి. నాని కథానాయకుడిగా కనిపించబోతున్నట్లు తొలుత చెప్పుకొచ్చారు. ఈ వార్తల్లో నిజం లేదని తారాగణాన్ని త్వరలో ప్రకటిస్తామని దిల్‌రాజు పేర్కొన్నారు. తర్వాత అల్లు అర్జున్, త్రిష పేర్లు కూడా వినిపించాయి. కాగా, ఇందులో శర్వానంద్, సమంత నటించబోతున్నట్లు తాజా సమాచారం. మాతృకను తీసిన సి. ప్రేమ్ కుమార్ రీమేక్‌ను కూడా తీయబోతున్నారట. కానీ స్క్రిప్టులో కొన్ని మార్పులు చేస్తున్నట్లు తెలిసింది. సమంత, శర్వానంద్ పాఠశాల రోజులపై తెలుగు రీమేక్‌లో పెద్దగా ఫోకస్ చేయడం లేదట. కాలేజీ రోజుల్లో ప్రేమను చూపించనున్నట్లు తెలుస్తోంది. మార్చి నుంచి ఈ సినిమా చిత్రీకరణ ప్రారంభం కానున్నట్లు సమాచారం. ఆగస్టులో చిత్రాన్ని విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారట. అయితే దీనికి సంబంధించి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.

బాలయ్యతో సినిమాకు ముహూర్తం ఫిక్స్

సింహా, లెజెండ్ లాంటి సూపర్ హిట్ సినిమాలను అందించిన బోయపాటి శ్రీను, నందమూరి బాలకృష్ణ కాంబినేషన్ హ్యాట్రిక్ హిట్ కోసం రెడీ అవుతోంది. 'యన్.టి.ఆర్' తరువాత బోయపాటి దర్శకత్వంలో స్వీయ నిర్మాణంలో ఓ సినిమా చేయబోతున్నట్టుగా బాలయ్య ఇప్పటికే ప్రకటించాడు. ఈ సినిమా ఫిబ్రవరిలో ప్రారంభకానుందని తెలుస్తోంది. ఇటీవల వినయ విధేయ రామ సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చిన బోయపాటి టాక్ పరంగా నిరాశపరిచినా.. భారీ వసూళ్లు సాధించి మాస్ ఆడియన్స్‌లో తనకు తిరుగులేదని మరోసారి ప్రూవ్ చేసుకున్నాడు. అదే జోరులో బాలయ్యతో సినిమాను తెరకెక్కించేందుకు రెడీ అవుతున్నాడు బోయపాటి. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ కార్యక్రమాలు జరుపుకుంటున్న ఈ సినిమాకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

'భారత్' టీజర్ వచ్చేసింది



'నీ ఇంటి పేరు ఏంటి?, జాతి ఏంటి?..'

బాలీవుడ్ అగ్ర కథానాయకుడు సల్మాన్ ఖాన్ నటిస్తున్న సినిమా 'భారత్'. కత్రినా కైఫ్ కథానాయిక. అలీ అబ్బాస్ జఫార్ దర్శకత్వం వహిస్తున్నారు. సల్మాన్ ఖాన్ ఫిల్మ్స్ అండ్ రీల్ లైఫ్ ప్రొడక్షన్ సంస్థలు సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ సినిమాను టీ–సిరీస్ సమర్పిస్తోంది. ఇందులో టబు, జాకీ ష్రాఫ్, సోనాలీ కులకర్ణి, దిశా పటానీ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ ఏడాది రంజాన్‌కు చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకురావడానికి సన్నాహాలు చేస్తున్నారు. అభిమానులు ఎంతో ఆత ృతగా ఎదురు చూస్తున్న ఈ చిత్రం టీజర్‌ను చిత్ర బ ృందం శుక్రవారం విడుదల చేసింది. టీజర్ మొత్తం సల్మాన్ ఖాన్ సన్నివేశాలతో నిండిపోయింది. ఆయన చాలా ఫిట్‌గా కనిపించారు. అనేక గెటప్‌లలో దర్శనమిచ్చారు. 'నీ ఇంటిపేరు ఏంటి?, జాతి ఏంటి? అని ప్రజలు నన్ను అడుగుతుంటారు. వారందరికీ నేను చిరునవ్వుతో చెప్పే సమాధానం ఒక్కటే. మా నాన్న గారు దేశాన్ని మనసులో పెట్టుకుని నాకు 'భారత్' అని పేరు పెట్టారు' అంటూ సల్మాన్ టీజర్‌లో చెప్పారు. ఆసక్తికర కథాంశంతో ఈ సినిమాను తెరకెక్కిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ ప్రచార చిత్రానికి యూట్యూబ్‌లో మంచి స్పందన లభిస్తోంది.

రాజకీయాల్లోకి బిగ్‌బాస్ నిత్య



బిగ్‌బాస్ 2 రియాలిటీ గేమ్ షో ద్వారా పాపులర్ అయిన యువతి నిత్య. ఈమె హాస్యనటుడు, టీవీ యాంకర్ దాడి బాలాజి భార్య అన్నది గమనార్హం. ఈ ఇద్దరూ మనస్పర్థల కారణంగా విడిపోయి కేసులు, కోర్టులు చుట్టూ తిరిగారు. దాడి బాలాజి, నిత్యలకు పోషక అనే ఒక కూతురు ఉంది. కాగా బిగ్‌బాస్ 2 రియాలిటీ గేమ్ షోలోనూ వీరిద్దరూ పాల్గొని అక్కడా గొడవలు పడి మరింత సంచలన వ్యక్తులుగా ముద్రవేసుకున్నారు. బిగ్‌బాస్ గేమ్ షో నుంచి బయటకు వచ్చిన తరువాత నిత్య సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొంటోంది. ఇటీవల ముంబైలో ప్రారంభించిన నేషనల్ ఉమెన్స్ పార్టీకి నిత్య రాష్ట్ర అధ్యక్షురాలుగా నియమితులైంది. బుధ వారం చెన్నైలో నిర్వహించిన విలేకరుల సమావే శంలో రాష్ట్ర నేషనల్ ఉమెన్స్ పార్టీ అధ్యక్షు రాలిగా నిత్య పేరును అధికారికపూర్వకంగా ప్రటించారు.

కోలీవుడ్‌లో బిజీ అవుతోన్న అంజలి!



నటి అంజలి కోలీవుడ్‌లో మళ్లీ బిజీ అవుతోంది. ఈ ఆరణాల అచ్చతెలుగు అమ్మాయి తెలుగు, తమిళం చిత్రాలు అంటూ చెక్కర్లు కొడుతున్న విషయం తెలిసిందే. 2007లో కట్రదు తమిళ్ చిత్రంతో కోలీవుడ్‌కు ఎంట్రీ ఇచ్చి తొలి చిత్రంతోనే మంచి గుర్తింపును పొందిన నటి అంజలి. ఆ తరువాత అంగాడితెరు, ఎంగేయుమ్ ఎప్పోదుమ్ చిత్రాలతో నటిగా తానేమిటో తెలియజెప్పింది. ఇక ఆ మధ్య తెలుగులో సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు, గీతాంజలి వంటి చిత్రాల విజయాలతో మంచి పేరు తెచ్చుకున్న ఈ అమ్మడు ఇటీవల మళ్లీ కోలీవుడ్‌లో చిత్రాలు చేస్తూ బిజీ అయ్యింది. బెలూన్, తరమణి చిత్రాల తరువాత అంజిలి నటించిన చిత్రం ఇక్కడ తెరపైకి రాలేదు. యువ నటుడు జయ్‌తో ప్రేమ వ్యవహారం అంటూ తరచూ వార్తల్లోకెక్కిన ఈ ముద్దుగుమ్మ ఇటీవల అలాంటి ప్రచారానికి దూరమైందని చెప్పవచ్చు. తాజాగా మరోసారి కోలీవుడ్ చిత్రాలపై ద ృష్టి పెట్టింది. ఇక్కడ తగ్గిన తన మార్కెట్‌ను మళ్లీ పొందదానికి ముమ్మర ప్రయత్నాలు చేస్తోంది. ఈ అమ్మడు మలయాళ సూపర్‌స్టార్ మమ్ముట్టికి జంటగా నటించిన పేరంబు చిత్రం ఫిబ్రవరి ఒకటవ తేదీన తెరపైకి రావడానికి రెడీ అవుతోంది. ఇది పలు అంతర్జాతీయ చిత్రోత్సవాల్లో ప్రదర్శించిన చిత్రం అన్నది గమనార్హం. దీంతో ఈ చిత్రంపై అంజలి చాలా ఆశలు పెట్టుకుంది. ఈ చిత్రం తరువాత శశికుమార్‌తో నటించిన నాడోడిగళ్ 2 చిత్రం విడుదల కానుంది. అదే విధంగా మరికొన్ని కొత్త చిత్రాల్లో నటించే విషయమై చర్చలు జరుగుతున్నాయని అంజలి పేర్కొంది. ఈమె పొంగళ్ పండగ సందర్భంగా కొన్ని ఫొటోలను, తన అభిప్రాయాలతో కూడిన విషయాలను, తను శారీరక కసరత్తులు చేస్తున్న వీడియోను సామాజిక మాధ్యమాల్లో విడుదల చేసింది. వాటిని ప్రసారం చేస్తూ నెటిజన్లు పండగ చేసుకుంటున్నారు.

బొమన్ ఇరానీపై సూపర్ స్టార్ ప్రశంసలు



ప్రముఖ బాలీవుడ్ నటుడు బొమన్ ఇరానీ నిర్మాతగా మారుతున్నారు. 'ఇరానీ మూవీటోన్' పేరుతో సొంత నిర్మాణ సంస్థను ప్రారంభించారు. బాలీవుడ్ సుపర్ స్టార్ అమితాబ్ బచ్చన్ ఈ సంస్థ లోగోను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అమితాబ్ బచ్చన్ మాట్లాడుతూ.. 'ఈ క్షణం కోసం ఎంతో కాలంగా ఎదురుచూస్తున్నాను. మీ అందరి ప్రేమాభిమానాలతో ఇరానీ మూవీటోన్ సంస్థ విజయవంతంగా కొనసాగాలని ఆశిస్తున్నా'నని తెలిపారు అమితాబ్. అంతేకాక 'మరోసారి బొమన్ ఇరానీతో కలిసి నటించాలనుకుంటున్నాను. కానీ దేవుని దయ వల్ల ఈసారి అతను నన్ను అధిగమించకూడదని ఆశిస్తున్నాను' అంటూ బిగ్ బీ చమత్కరించారు. అమితాబ్, బొమన్ ఇరానీ నటించిన 'వక్త్ : ది రేస్ ఎగెనెస్ట్ టైమ్' సినిమా ఘన విజయం సాధించింది. ఈ సినిమాలో వీరద్దరు పండించిన కామెడీ అద్భుతం. ఈ నిర్మాణ సంస్థ గురించి బొమన్ ఇరానీ మాట్లాడుతూ.. ప్రతిభావంతులైన రచయితలను గుర్తించి వారిని ప్రోత్సాహించాలనే ఉద్దేశంతోనే దీన్ని ప్రారంభిస్తున్నట్లు పేర్కొన్నారు.

'అది మా సినిమా పోస్టర్ కాదు'



చెడు ఉద్దేశంతోనే కొందరు తన సినిమాలాంటి పోస్టర్‌ను డిజైన్ చేశారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు సినీ నటుడు నిఖిల్. ఆయన కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం 'ముద్ర'. లావణ్య త్రిపాఠి కథానాయికగా నటిస్తున్నారు. సంతోష్ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమా గతేడాదే విడుదల కావాల్సి ఉంది కానీ విజువల్ ఎఫెక్ట్స్ నేపథ్యంలో వాయిదా వేశారు. అయితే తమ సినిమా పోస్టర్‌కు వాడిన లోగోనే మరో చిత్రబృందం వాడటంతో నిఖిల్ షాకయ్యారు. ఈ విషయాన్ని ఆయన ట్విటర్ ద్వారా వెల్లడిస్తూ సదరు చిత్రబ ృందంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. 'నా సినిమా ఈ వారంలో విడుదల కావడంలేదు. కొందరు చెడు ఉద్దేశంతో మా సినిమా పోస్టర్‌లో ఉన్న లోగోనే తమ సినిమా పోస్టర్‌కు పెట్టి ఈ వారంలో విడుదల అవుతోందని ప్రచారం చేస్తున్నారు. బుకింగ్ యాప్స్‌లో నా పేరు పెట్టారు. ఈ విషయంపై మా చిత్ర నిర్మాతలు చర్యలు తీసుకుంటున్నారు. త్వరలో ఏ విషయం అన్నది చెప్తాను. ఇది చాలా నీచమైన పని' అంటూ మండిపడ్డారు.



మాజీ ప్రియుణ్ని కాదు : బాలీవుడ్ హీరో

బాలీవుడ్ స్టార్ హీరోయిన్ కంగనా రనౌత్, నటుడు అధ్యాయన్ సుమన్ గతంలో ప్రేమాయణం సాగించిన సంగతి తెలిసిందే. ఆ తర్వాత వారిద్దరూ తమ ప్రేమకు బ్రేకప్ చెప్పేసుకున్నారు. కంగన ఆ తర్వాత హృతిక్ రోషన్‌తో ప్రేమలో పడి అతడి నుంచి కూడా విడిపోయింది. కంగన నుంచి విడిపోయిన అధ్యాయన్ సుమన్ ప్రస్తుతం మైరా మిశ్రాతో డేటింగ్‌లో ఉన్నాడు. వీరిద్దరి ప్రేమాయణం గురించి బాలీవుడ్ మీడియాలో వార్తలు వస్తున్నాయి. ఆ వార్తల్లో తనను కంగన మాజీ ప్రియుడిగా సంబోధించడం సుమన్‌కు నచ్చడం లేదు. దీంతో తాజాగా తన ఆవేదనను వ్యక్తం చేశాడు. మీడియాలో నా గురించి, నా ప్రేమ గురించి గాసిప్‌లు రావడాన్ని నేను తప్పుపట్టను. కానీ, నన్ను ఓ వ్యక్తికి మాజీ అని పేర్కొనడం బాధ కలిగిస్తోంది. నన్ను కేవలం ఒక్క వ్యక్తికి మాజీ ప్రేమికుడిగానే గుర్తిస్తూ అవమానిస్తున్నారు. నేను కేవలం మాజీ ప్రేమికుణ్ని మాత్రమే కాదు. నాకంటూ సొంతంగా గుర్తింపు ఉంది. నన్ను అధ్యాయన్ అని పిలిస్తే సంతోషంగా ఉంటుందని అన్నాడు.

విపక్షాలపై సీబీఐ అస్త్రం : మమత ఫైర్



కోల్‌కతా : ప్రతిష్టాత్మక దర్యాప్తు సంస్థ 'సీబీఐ' కేంద్ర ప్రభుత్వానికి మిత్రపక్షంగా మారిందని, ప్రతిపక్ష పార్టీలను వేధించేందుకు సీబీఐ అస్త్రాన్ని మోడీ సర్కార్ ప్రయోగిస్తోందని పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ శుక్రవారం విమర్శించారు. సీబీఐ డైరెక్టర్ నియామకంపై గందరగోళం నేపథ్యంలో 'నాయకుడులేని సీబీఐ, ధైర్యంలేని బీజేపీ' అంటూ ఆమె చురకలు అంటించారు. 'బీజేపీ, దాని మిత్రపక్షాలు (ప్రభుత్వంలోని వివిధ సంస్థలనుద్దేశించి) కోల్‌కతా, ఢిల్లీ తదితర రాష్ట్రాలోని ప్రతిపక్షాలపై రాజకీయ కక్షసాధింపును కొనసాగిస్తున్నాయని ఆగ్రహం వ్యక్తంచేశారు. మోడీ ప్రభుత్వం భయంతోనే ఇదంతా చేస్తోందా? అంటూ మమత ట్వీట్ చేశారు. 'అఖిలేశ్ యాదవ్ మొదలు మాయావతి వరకు ఎవ్వరినీ వదల్లేదు. ఉత్తరం నుంచి దక్షిణం వరకు.. తూర్పు నుంచి పశ్చిమం వరకు రాజకీయ కక్షసాధింపుకు బీజేపీ పాల్పడుతోంది. వాళ్లు భయపడుతున్నారా? అంతలా నైరాశ్యంలో మునిగి ఉన్నారా? సీబీఐకి నాయకత్వం లేదు.. బీజేపీకి ధైర్యం లేదు' అని ఆమె ఎద్దేవా చేశారు. ఇదిలావుండగా, హర్యానా మాజీ సీఎం భుపిందర్ సింగ్ హుడా సహా పలువురిపై కొత్త కేసును సీబీఐ నమోదు చేసింది. 2009లో గుర్‌గావ్‌లో భూకేటాయింపులో అవకతవకలు జరిగినట్లు ఆరోపించింది. ఈ నేపథ్యంలో శుక్రవారం ఢిల్లీ-ఎన్‌సీఆర్‌లోని 20ప్రాంతాల్లో సోదాలు నిర్వహించింది. రోజ్‌వ్యాలీ చిట్‌ఫండ్ కుంభకోణంతో సంబంధాలు ఉన్నాయంటూ బెంగాలీ సినిమా నిర్మాత శ్రీకాంత్ మొహతాను గురువారం అరెస్టు చేసింది. అధికార తృణమూల్ కాంగ్రెస్‌కు ఆయన సన్నిహితుడని, రూ.25 కోట్ల అవినీతికి పాల్పడ్డాడని పేర్కొంది. సీబీఐ తదుపరి డైరెక్టర్ నియామకంపై ప్రధాని మోడీ నేతృత్వంలో గురువారం జరిగిన సెలక్ట్ కమిటీ సమావేశం అసంపూర్ణంగా ముగిసిన విషయం తెలిసిందే.

పోరాటమే..ద్వేషం లేదు

- పిల్లల వల్లే ప్రియాంక రాకలో జాప్యం
- వరుణ్ చేరిక గురించి తెలియదు
- అధికారమిస్తే పది రోజుల్లో రుణమాఫీ
- మోడీ, పట్నాయక్ పాలన ఒకటే
- భువనేశ్వర్‌లో రాహుల్‌గాంధీ



భువనేశ్వర్ : ప్రధాని నరేంద్రమోడీపై పోరాటం చేస్తున్నానని, ఆయనను ద్వేషించడం లేదని కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ చెప్పారు. 'మోడీని నేను వ్యతిరేకిస్తున్నాను. నన్ను మోడీ వ్యతిరేకిస్తున్నారు. ఈ విషయం నాకు తెలుసు. నేను మోడీతో పోరాడుతున్నాను. ఆయనను ప్రధాని పదవి నుంచి దించడానికి ప్రయత్నిస్తున్నాను. మోడీని ద్వేషించడం లేదు' అని స్పష్టంచేశారు. ప్రతిరోజు మోడీపై దాడి చేయడానికిగల కారణాలను రాహుల్ వివరించారు. మోడీ ఎన్ని విమర్శలు చేసినా ఆయనను ఆలింగనం చేసుకున్నానని గుర్తుచేశారు. సిద్ధాంతపరంగా విమర్శలు ఉంటాయని, ద్వేషానికి తావు లేదని చెప్పారు. 'నేను మోడీ వైపు చూస్తాను. ఆయన నన్ను దుర్భాషలాడతారు. అప్పటికీ మోడీని ఆలింగనం చేసుకోవాలనే కోరుకుంటాను. కాంగ్రెస్‌ను ప్రధాని తీవ్రంగా అవమానిస్తున్నారు. ఆ విషయం నాకు తెలుసు. అయినా మోడీపై నాకు కోపం లేదు. అదే మా ఆకాంక్ష. ప్రజలను మేము ద్వేషించం' అని తెలిపారు. రాహుల్ శుక్రవారం భువనేశ్వర్‌లో మేధావులతో ముఖాముఖి మాట్లాడారు. ఆర్‌ఎస్‌ఎస్ సిద్ధాంతాలే రక్షగా మోడీ భావిస్తున్నారని, ఆర్‌ఎస్‌ఎస్ మోడీకి అతిపెద్ద కానుకని రాహుల్ వ్యాఖ్యానించారు. బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ నుంచి ఎన్నో దూషణలు వచ్చాయని, వాటినే దీవెనలుగా భావిస్తున్నానన్నారు. మోడీ ప్రభుత్వంలోని మంత్రులు సైతం ఆర్‌ఎస్‌ఎస్ నియంత్రణలోనే పనిచేస్తున్నారని రాహుల్ విమర్శించారు. మోడీ ప్రభుత్వంలో ఎక్కడ చూసినా ఆర్‌ఎస్‌ఎస్ ముద్రే. దేశంలోని అన్ని సంస్థలు తమ నియంత్రణలో ఉండాలని ఆర్‌ఎస్‌ఎస్ కోరుకుంటున్నదని చెప్పారు. తన సోదరుడు, బీజేపీ నాయకుడు వరుణ్‌గాంధీ కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నట్టు తనకు తెలియదని రాహుల్ ఓ ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. దీనికి సంబంధించిన ఊహాగానాలను తాను వినలేదన్నారు. గాంధీ-నెహ్రూ కుటుంబం ఒక్కటవుతున్నదని, వరుణ్‌గాంధీ కాంగ్రెస్‌లో చేరుతున్నట్టు వచ్చిన వార్తలపై రాహుల్ స్పందించారు. వరుణ్‌గాంధీ ప్రస్తుతం బీజేపీలో ఉన్నారు. యూపీలోని సుల్తాన్‌పూర్ ఎంపీగా పనిచేస్తున్నారు.

పిల్లల కారణంగానే...

పిల్లల కారణంగానే ప్రియాంక రాజకీయ ప్రవేశంలో ఆలస్యమైందని రాహుల్ వివరించారు. ప్రియాంక రాజకీయ రంగప్రవేశంపై నిర్ణయం హడావుడిగా తీసుకున్నదని కాదని స్పష్టంచేశారు. పది రోజుల క్రితమే హడావుడిగా ఈ నిర్ణయం తీసుకున్నట్టు పత్రికల్లో చదివానని, కొన్నేళ్ల క్రితమే ఈ నిర్ణయం తీసుకున్నామని, క్రియాశీల రాజకీయాల్లో చేరడంపై తన సోదరితో చాలాసార్లు చర్చించానని, పిల్లలు చిన్నవాళ్లు కావడంతో తన అవసరం వారికి ఉందని ప్రియాంక చెప్పిందని, అందుకే జాప్యం జరిగిందని రాహుల్ చెప్పారు. పిల్లలిద్దరూ ఇప్పుడు పెద్దవాళ్లయ్యారని, యూనివర్సిటీకి వెళుతున్నారని, అందుకే అక్క ఇప్పుడు రాజకీయాల్లోకి వచ్చారని వివరించారు. ప్రియాంకతో బంధం గురించి ప్రశ్నించగా తాము చాలా సన్నిహితంగా ఉంటామని, పరస్పరం అభిప్రాయాలు పంచుకుంటామన్నారు. తన తండ్రి, నానమ్మ దారుణహత్యలను గుర్తుచేసుకున్నారు. నాడు చాలా కష్టపరిస్థితుల్లో ఉన్నామని, తామిద్దరం బాగా కలిసి ఉండటానికి అది కూడా కారణమన్నారు. ప్రియాంక ఒడిశాలో ప్రచారం చేస్తారా అని అడుగగా ఆమె ఎక్కడ ప్రచారం చేయాలనే విషయం ఇంకా చర్చించుకోలేదని, తర్వాత దీనిపై నిర్ణయం తీసుకుంటామని రాహుల్ చెప్పారు.

పది రోజుల్లో రుణమాఫీ

కాంగ్రెస్ ర్యాలీలో రాహుల్ ప్రసంగిస్తూ నరేంద్రమోడీ, ఒడిశా ముఖ్యమంత్రి నవీన్‌పట్నాయక్‌పై విమర్శలు గుప్పించారు. ప్రజలతో భేటీ కావడానికి ఆ ఇద్దరూ భయపడుతున్నారని అన్నారు. కేంద్రం, ఒడిశా ప్రభుత్వం రెండూ రైతులను మోసగిస్తున్నాయని ఆరోపించారు. రైతుల విషయంలో మాటలేగానీ ఆచరణ శూన్యమని వ్యాఖ్యానించారు. నవీన్ పట్నాయక్‌ను మోడీకి జూనియర్ భాగస్వామిగా అభివర్ణించారు. రాష్ట్రంలో కాంగ్రెస్‌కు అధికారం కట్టబెడితే పది రోజుల్లో రైతు రుణాలు మాఫీ చేస్తామని కాంగ్రెస్ అధ్యక్షుడు హామీ ఇచ్చారు. అధికారం చేపట్టిన పది రోజుల్లోనే మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్‌లో పదిరోజుల్లోనే రైతు రుణాలు మాఫీ చేశామని గుర్తుచేశారు. ప్రభుత్వాలు నడిపే విషయంలో మోడీ, పట్నాయక్ ఇద్దరూ ఒకటేనని అన్నారు. బీజేపీ మోడల్, బీజేడీ మోడల్ రెండూ ఒకటే. దీనిని గుజరాత్ మోడల్‌గా చెప్పుకుంటారు. రాష్ట్రానికి చెందిన బడా పారిశ్రామికవేత్తల ద్వారా ముఖ్యమంత్రి మార్కెటింగ్ చేస్తున్నారరు. రాష్ట్రాన్ని కొంతమంది అధికారుల గుప్పెట్లో ముఖ్యమంత్రి పెట్టారు. ప్రజల మాటలు వినే పరిస్థితి ఇద్దరికీ లేదు. కాంగ్రెస్ విధానం అది కాదని రాహుల్ చెప్పారు. అధికారుల నియంతృత్వాన్ని తాము కోరుకోబోమన్నారు. ప్రజలు కేంద్రంగా ప్రజాస్వామ్యయుతంగా ఉండాలన్నది తమ ఆకాంక్ష అన్నారు. మోడీ కేబినెట్ మొత్తం ఆయనను అంగీకరించదని ఆరోపించారు. అయినా నోరు తెరిచే ధైర్యం ఒక్కరికీ లేదన్నారు.

రాజకీయ ప్రత్యర్థులను వదలట్లేదు



న్యూఢిల్లీ : ప్రధాని మోడీ దర్యాప్తు సంస్థలను అడ్డం పెట్టుకుని వాటిద్వారా రాజకీయ దాడులకు పాల్పడు తున్నారని ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ ట్విట్టర్‌లో విమర్శించారు. ప్రధాని, బీజేపీ అధ్యక్షుడు అమిత్‌షా ఏ ప్రతిపక్షపార్టీని వదలట్లేదని ట్వీట్ చేశారు. యూపీలో సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేష్ యాదవ్‌ని, బీఎస్పీ అధినేత్రి మాయవతి, పశ్చిమబెంగాల్ సీఎం మమతా బెనర్జీని, ఢిల్లీలో తమ ఆమ్‌ఆద్మీ పార్టీని ఎవ్వరినీ వీళ్ళు వదలట్లేదన్నారు. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, హర్యానా మాజీ ముఖ్యమంత్రి భూపిందర్ సింగ్ హుడా నివాసాలపై సీబీఐ దాడులు జరుపుతున్న నేపథ్యంలో బీజేపీపై మమతాబెనర్జీ మండిపడిన కొన్ని గంటల్లోనే కేజ్రీవాల్ ఈ విధంగా ట్వీట్ చేశారు.

'అభివృద్ధిని అడ్డుకోవడం దేశ ద్రోహమే '

ఆప్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనులకు అడ్డంకులు సృష్టిస్తున్నారని, ఇది దేశ ద్రోహమే అవుతుందని కేజ్రీవాల్ అన్నారు. గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ఢిల్లీలోని ఛత్రసాల్ స్టేడియంలో జరిగిన రాష్ట్ర ప్రభుత్వ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కొందరు అడ్డంకులు సృష్టించడం వల్ల నగరంలో పాఠశాల భవనాలు, ఆసుపత్రులు, మొహల్లా క్లీనిక్‌ల భవన నిర్మాణ పనులు నిలిచిపోయాయని తెలిపారు. స్వాతంత్ర్యోద్యమాన్ని నీరుగార్చేందుకు ఆ రోజుల్లో కొంతమంది బ్రిటీష్ వారికి తోడ్పడినట్టు, ప్రస్తుతం కొందరు అభివృద్ధి పనులకు ఆటంకం కలిగిస్తున్నారన్నారు. ప్రజల కోసం తాను పాఠశాలలు, ఆసుపత్రులు, మొహల్లా క్లీనిక్‌లను ఏర్పరుస్తున్నాను, ఇంతకంటే దేశభక్తి మరేముం టుంది, ఇవన్నీ చేయడం తప్పా అని ప్రశ్నించారు.


చిట్‌ఫండ్ కంపెనీ ఆస్తులను ఈడీ అటాచ్

న్యూఢిల్లీ : రాజస్థాన్‌కు చెందిన చిట్‌ఫండ్ కంపెనీ షాపింగ్ కాంప్లెక్స్‌లను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టరేట్ (ఈడీ) అటాచ్ చేసింది. పీఎంఎల్ఏ చట్టం కింద ఓరో ట్రేడ్ నెట్‌వర్క్ ఇండియా (లిమిటెడ్) కంపెనీకి చెందిన మొత్తం రూ.2.09 కోట్ల అక్రమాస్తులను అటాచ్ చేసినట్లు అధికారులు తెలిపారు. రాజస్థాన్ పోలీసులు ఈ కంపెనీపై 48 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారన్నారు. చిట్‌ఫండ్ కంపెనీ డైరక్టర్లు రూ.44 కోట్లు సేకరించి, కస్టమర్లను మోసగించినట్టు దర్యాప్తులో తేలిందని తెలిపారు. ఈ కేసులో మొత్తం రూ.7.55 కోట్లు ఆస్తులను అటాచ్ చేసినట్టు చెప్పారు. కంపెనీ డైరక్టర్ సత్యేంద్ర శర్మను అరెస్టు చేసినట్టు తెలిపారు.

16 నెలలు 3వేల ఎన్‌కౌంటర్లు.. 78 హత్యలు

ఇదీ యోగి ఆదిత్యనాథ్ పాలనాతీరు

- ప్రభుత్వ విజయంగా గొప్పలు
- యూపీ సర్కారు ప్రచారం



లక్నో : ఉత్తరప్రదేశ్..దేశంలోనే అతి పెద్ద రాష్ట్రం..ఆ రాష్ట్రానికి ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్.. ఆయన సీఎంగా బాధ్యతలు చేపట్టి సరిగ్గా 16 మాసాలైంది. నాటి నుంచి నేరస్తుల పేరుతో రాజకీయ ప్రత్యర్థులను, బీజేపీ వ్యతిరేకులను ఎన్‌కౌంటర్లు చేయిస్తున్నారనేది ప్రధాన ఆరోపణ. ఇప్పటికి రాష్ట్రంలో దాదాపు 3000 ఎన్‌కౌంటర్లు జరిగాయి. అందులో 78 మందిని పిట్టల్లా కాల్చి చంపారు. అందులో నేరస్తుల కన్నా ప్రత్యర్థుల జాబితానే అధికం. ఎన్‌కౌంటరు హత్యలను యోగీ ప్రభుత్వం విజయంగా చెప్పుకుం టున్నది. రాష్ట్రంలో మానవహక్కులను కాలరాశారు. నియంతృత్వం రాజ్యమేలు తోంది. బీజేపీ నాయకులు ఇష్టానుసారం వ్యవహరిస్తున్నారు. పాలనపై కనీస పరిజ్ఞానం సంపాదించలేకపోయారు. మత రాజకీయాలు తప్ప పాలనపై శ్రద్ధలేదు. సొంత పార్టీ నాయకులే యోగీపై కారాలు, మిరియాలు నూరుతున్నారు. ఇకపోతే 16 మాసాల కాలంలో జరిగిన 3 వేల ఎన్‌కౌంటర్లు, 78 మంది హత్యలపై ప్రభుత్వం గొప్పగా ప్రచారం చేసుకుంటుంది. ఇది తమ ప్రభుత్వం సాధించిన ఘనవిజయంగా చెప్పుకుంటున్నది. దీనికి సంబంధించిన జాబితాను రిపబ్లిక్‌డే వేడుకలకు ముందు యూపీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అనుప్ చంద్ర పాండే అన్ని జిల్లాల మేజిస్ట్రేట్‌లకు పంపారు. రిపబ్లిక్ డే వేడుకల ప్రసంగంలో దీనిని పెద్దఎత్తున ప్రచారం చేయాలని ఆదేశించారు. యోగి 2017 మార్చి 17న సీఎంగా బాధ్యతలు చేపట్టారు. ఆయన హయాంలో యూపీ పోలీసులు 3 వేల ఎన్‌కౌంటర్లు చేశారని, 78 మంది నేరస్తులను కాల్చిచంపారని డీజీపీ కార్యాలయం అధికారి ఒకరు వెల్లడించారు. 2017 మార్చి నుంచి 2018 జూలై మధ్య కాలంలో జరిగిన ఈ ఎన్‌కౌంటర్ల డేటాపై అనేక ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఎన్‌కౌంటర్లు, నేరస్తుల హత్యలు, అరెస్టులకు సంబంధించిన జాబితాను రిపబ్లిక్‌డే సందర్భంగా ప్రచురించాలని పాండే ఆదేశించారు. వాంటెడ్ క్రిమినల్స్‌ను అరెస్టు చేయడం ద్వారా రాష్ట్రంలో నేరాలను సమర్థవంతంగా అదుపు చేసినట్టు ప్రచారం చేయాలని కలెక్టర్లకు రాసిన లేఖలో పాండే విజ్ఞప్తి చేశారు. ఆ లేఖ ప్రకారం 2018 జూలై నాటికి రాష్ట్రంలో 3,026 ఎన్‌కౌంటర్లు జరిగాయి. అందులో 69 మంది క్రిమినల్స్ చనిపోయారు. 838 మంది గాయపడ్డారు. 7,043 మందిని అరెస్టు చేశారు. ఇదేకాలంలో 11,981 మంది క్రిమినల్స్ బెయిల్‌ను రద్దు చేయించారు. కోర్టుల్లో లొంగిపోయేలా చేశారు. దీనికి అదనంగా సీఎస్ లేఖలో చాలా విషయాలు ప్రస్తావించారు. ప్రత్యేక టాస్క్ ఫోర్సు(ఎస్టీఎఫ్) పేరుతో జరిగిన ఎదురుకాల్పుల్లో మరో 9మంది నేరస్తులను కాల్చిచంపగా, 139 మందిని అరెస్టు చేసినట్టు లేఖ తెలిపింది. ఎదురుకాల్పుల్లో ప్రతినెలా నలుగురు నేరస్తులను కాల్చిచం పారు. రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన డేటాను విశ్లేషిస్తే..ప్రతిరోజు ఆరు ఎన్‌కౌంటర్లు జరిగాయి. 14 మంది నేరస్తులు అరెస్టయ్యారు. మొదటి 9 మాసాల్లో 17మంది క్రిమినల్స్‌ను హతమార్చారు. నెలకు సరాసరిన 1.8మందిని చంపారు. ఆ తదుపరి ఏ మాసాల్లో ఎన్‌కౌంటర్లు విచ్చలవిడిగా జరిగినట్టు సంఖ్యలు తెలుపుతున్నాయి. ఇందులో 61మంది క్రిమినల్స్ హతమయ్యారు. అంటే నెలకు సరాసరిన 8.71 మంది మరణించారు. గతేడాది సైతం రిపబ్లిక్ డేకు ఇదే తరహాలో కలెక్టర్లకు ప్రభుత్వం సమాచారం పంపింది. అందులో యాంటీ రోమియో దళాలు అరెస్టు చేసిన నిందితుల జాబితా ఉంది. ఈ ఏడాది దీనిని విస్మరించారు. రాష్ట్రంలో యాంటీ రోమియో దళాలు పనిచేస్తున్నాయని, అవి చేపట్టిన చర్యల డేటాను పంపామని, ఎందుకో తెలియదు కానీ..సీఎస్ లేఖలో దానిని పొందుపర్చలేదని సీనియర్ అధికారి ఒకరు వెల్లడించారు. రుణాల రద్దు, చెరకు రైతులకు చెల్లింపులకు సంబంధించిన వివరాలను సైతం ఆ లేఖలో పంపారు.

చిదంబరాన్ని అప్పగించండి : సీబీఐ, ఈడీ

న్యూఢిల్లీ : కేంద్ర ఆర్థికశాఖ మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు పి.చిదంబరాన్ని ఐఎన్‌ఎక్స్ కేసులో విచారించేందుకు అనుమతివ్వాలని ఢిల్లీ హైకోర్టును కేంద్ర దర్యాప్తు సంస్థ(సీబీఐ), ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) కోరాయి. ఐఎన్‌ఎక్స్ మీడియా కేసులో మనీలాండరింగ్, అవినీతి కేసుల నుంచి ముందస్తు బెయిలు మంజూరు కోసం జస్టిస్ సునీల్ గౌర్ ఆధ్వర్యంలోని ధర్మాసనానికి చిదంబరం దరఖాస్తు చేసుకున్నారు.ఈ కేసులో మధ్యంతర తీర్పు వెలువరించే వరకు ఆయనను అరెస్టు చేయరాదని హైకోర్టు ఆదేశించింది. చిదంబరం విచారణను తప్పించుకునేందుకు ప్రయత్నిస్తున్నారని సీబీఐ,ఈడీ తరపును హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా కోర్టుకు తెలిపారు. చిదంబరం సంతృప్తికరమైన జవాబులు ఇవ్వనందునే కస్టడీకి ఇవ్వాలని కోరుతున్నామని ఆ రెండు సంస్థలు కోర్టుకు తెలిపాయి. ఆయనను అరెస్టు చేసేందుకు రెండు సంస్థలకున్న హక్కులను పరిశీలిస్తున్నా మన్నారు. చిదంబరం తరపున సీనియర్ అడ్వకేట్ కపిల్ సిబాల్ కోర్టులో వాదనలు వినిపిస్తూ 2018 జూన్‌లో ఆయనను సీబీఐ ప్రశ్నించిందని, ఎఫ్ఐఆర్‌లో ఆయన పేరులేకుండా ఎలా కస్టడీకి తీసుకుంటారని ప్రశ్నించారు. జనవరి 24 వరకు కోర్టు ఆయనకు బెయిలు మంజూరు చేసింది. మనీలాండరింగ్ కేసులో సీబీఐ, ఈడీలు పిలిచినప్పుడెల్లా సిబాల్, చిదంబరం అనేక సార్లు హాజరయ్యామన్నారు.రూ. 3,500 కోట్ల ఎయిర్‌సెల్, మాక్సిస్ డీల్‌లో ఐఎన్‌ఎక్స్ మీడియా రూ305 కోట్లకు అవకతవకలకు పాల్పడిందని దర్యాప్తు సంస్థలు ఆరోపిస్తున్నాయి. యూపీఏ 1 ప్రభుత్వంలో ఆయన ఆర్థిక మంత్రిగా ఉండగా ఎయిర్‌సెల్, మాక్సిస్‌కు విదేశీ పెట్టుబడుల ప్రమోషన్ బోర్డు (ఎఫ్ఐపీబీ) నుంచి క్లియరెన్స్ ఇవ్వడానికి తమ మంత్రి పదవిని అడ్డుపెట్టుకున్నారని సీబీఐ ఆరోపిస్తోంది. గతేడాది ఆయనపై ఈడీ మనీలాండరింగ్ కేసును దాఖలు చేసింది. సీబీఐ దాఖలు చేసిన చార్జిషీటులో చిదంబరం కుమారుడు కార్తీ పేరును నమోదు చేసింది. ఈ కేసులో ఈడీ ఇంతవరకు తనకు సమన్లు జారీ చేయలేదని, అయినప్పటికీ అరెస్టు చేసేందుకు ప్రయత్నించడంతో ముందస్తు బెయిలుకు పిటిషన్ దాఖలు చేశామని చిదంబరం చెబుతున్నారు.

'ప్రియాంక మహారాణే' : శివసేన



ముంబై : క్రియాశీల రాజకీయాల్లోకి ప్రియాంక గాంధీ రావడాన్ని బీజేపీ మిత్రపక్షమైన శివసేన స్వాగతించింది. సరైన నిర్ణయాలతో ముందుకెళితే ఆమె 'మహారాణి'గా ఆవిర్భవించే అవకాశాలు ఉన్నాయని అభిప్రాయపడింది. ఆమె చేరికతో రానున్న సార్వత్రిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేస్తున్న కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీకి మరింత బలం చేకూరుతుందని పేర్కొంది. భర్త రాబర్ట్ వాద్రాపై కేసుల గురించి ఏ మాత్రం బెంగపడకుండా క్రియాశీల రాజకీయాల్లోకి వచ్చినందుకుగాను ప్రియాంకను శివసేన అభినందించింది. 'ప్రియాంక తన నానమ్మ ఇందిరాగాంధీని పోలి ఉంటారు. పోలికలతో పాటు మాట తీరు కూడా ఇందిరలానే ఉంటుంది. ఇవి కాంగ్రెస్‌కు కలిసిరావచ్చు' అని పేర్కొంది. గెలుపే లక్ష్యంగా ముందుకు వెళుతున్న కాంగ్రెస్ విసిరిన సవాల్ బీజేపీని భయపెడుతోందని, రాఫెల్ యుద్ధ విమానాల కొనుగోలు ఒప్పందంపై ప్రశ్నలతో బీజేపీ ప్రభుత్వాన్ని రాహుల్ ఇరకాటంలో పెట్టారని సామ్నా సంపాదకీయం వ్యాఖ్యానించింది. 'రాఫెల్ ఒప్పందంలో మోడీ ప్రభుత్వ అవినీతిపై రాహుల్ విసుర్లను విస్మరించడమే కాకుండా అసెంబ్లీ ఎన్నికల్లో మూడు రాష్ట్రాల్లో కాంగ్రెస్ గెలిచినందుకు ఆయనకు ఘనత ఇవ్వకపోవడం ప్రభుత్వ సంకుచిత భావజాలాన్ని వ్యక్తపరుస్తోంది. ఉత్తరప్రదేశ్‌లో ఎస్పీ, బీఎస్పీ మహాగట్బంధన్ ఏర్పాటు చేసుకున్నాయి. అందులో కాంగ్రెస్‌కు స్థానం కల్పించలేదు. అయినా రాహుల్ ప్రశాంతంగా, సహనంగా ఉన్నారు' అని సామ్నా పేర్కొంది. ఉత్తరప్రదేశ్‌లోని అన్ని స్థానాల్లో కాంగ్రెస్ పోటీ చేస్తుందన్న కాంగ్రెస్ ప్రకటన, ప్రియాంక రంగప్రవేశం, అవసరమైన చోట్ల ఎస్పీ, బీఎస్పీకి మద్దతివ్వడం హస్తం పార్టీకి కలిసివచ్చే అంశాలుగా శివసేన అభిప్రాయపడింది. ఓ కటుంబాన్ని ప్రజలు ఆదరిస్తే.. కొందరికి కడుపుమంట ఎందుకో.. అంటూ ఎద్దేవా చేసింది. నెహ్రూ-ఇందిరా కుటుంబంపై బీజేపీకి అక్కసు ఉందని, ఆ కుటుంబాన్ని బద్ధశత్రువుగా భావిస్తుందని పేర్కొంది. ఇందిర వలె ప్రియాంక కూడా మహారాణిగా ఆవిర్భవిస్తారని శివసేన పేర్కొంది.

మలయాళ దర్శకుడిపై పేడతో దాడి



త్రిస్సూర్ : ఆవుపేడను నీళ్లలో కలిపి తనపై దాడి చేశారని, ఇది బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ వర్గాల పనేనని జాతీయ అవార్డు గ్రహీత, మలయాళం చిత్రదర్శకుడు ప్రియానందన్ శుక్రవారం ఆరోపించారు. శబరిమల వివాదం నేపథ్యంలో ఫేస్‌బుక్‌లో చేసిన పోస్టు కారణంగా ఈ దాడి జరిగినట్లు అనుమానించారు. అయితే ఈ దాడితో తమకు సంబంధం లేదని బీజేపీ పేర్కొంది. త్రిస్సూర్ జిల్లాలోని చేర్పులోని తన ఇంట్లో నుంచి ఉదయం 9 గంటలకు బయటకు రాగానే పేడనీళ్లు పోశారని ప్రియానందన్ విలేకరులకు తెలిపారు. 'ఇంట్లో నుంచి బయటకు వచ్చినప్పుడు ఓ వ్యక్తి నా వైపు పరిగెత్తుకుంటూ వచ్చి తలపై, ముఖంపై కొట్టాడు. ఆ వెంటనే పేడనీళ్లు పోసి పారిపోయాడు. నన్ను బలహీనపర్చడమే ఈ దాడి ఉద్దేశం. దీని వెనుక బీజేపీ/ఆర్‌ఎస్‌ఎస్ హస్తం ఉందన్నది నా అనుమానం' అని అన్నారు. దర్శకుడి ఫిర్యాదు మేరకు పోలీసులు విచారణ చేపట్టారు.

సీఎం ఖండన : ప్రియానందన్‌పై దాడిని సీఎం పినరయి విజయన్ ఖండించారు. ఇది దర్శకుడి భావప్రకటన స్వేచ్ఛపై దాడి, దీనిని ఎట్టిపరిస్థితుల్లోనూ సహించేది లేదు అని సీఎం ఒక ప్రకటనలో తెలిపారు. ఫేస్‌బుక్ పోస్టు నేపథ్యంలో సైబర్ దాడి చేయిస్తామని సంఘ్‌పరివార్ సంస్థలు ప్రియానందన్‌ను హెచ్చరించినట్టు తెలుస్తోంది.

కేంద్రానికి పంజాబ్ సీఎం లేఖ

చండీగఢ్ : సిక్కుల మతగురువు గురునానక్ దేవ్ 550వ జయంతిని పురస్కరించుకుని పంజాబ్ ప్రభుత్వం మౌలికరంగాల అభివృద్ధికి శ్రీకారం చుట్టింది. ఈ క్రమంలో రాష్ట్ర రోడ్డు, హైవేల శాఖ ఫాస్ట్‌ట్రాక్ రోడ్లను నిర్మించాలని యోచిస్తోంది. ఇందుకోసం ఆర్థికసాయం కోరుతూ ముఖ్యమంత్రి అమరీందర్ సింగ్ కేంద్ర రోడ్డు, హైవేల శాఖ మంత్రి నితిన్‌గడ్కరీకి లేఖ రాసినట్టు అధికారవర్గాలు శుక్రవారం తెలిపాయి. అత్యంత ప్రాధాన్యత కలిగిన కర్తార్‌పూర్ కారిడార్ ప్రాజెక్టు నిర్మాణంపై ప్రత్యేక దృష్టి సారించాలని సీఎం ఆయన్ను కోరారని వెల్లడించాయి. జాతీయ రహదారిగా నిర్ణయించిన బియాస్- బాటలా- దేరాబాబా నాయక్ రోడ్డును నాలుగు లేన్లుగా విస్తరించాలని ముఖ్యమంత్రి తన లేఖలో పేర్కొన్నారని తెలిపాయి. సీఆర్ఎఫ్ పథకం కింద రోడ్డు విస్తరణకు అదనంగా రూ.150 కోట్లు కేటాయించాలని సీఎం కోరారన్నాయి.

గణతంత్ర వేడుకలకు భారీ భద్రత

- 25 వేల భద్రతా, కేంద్ర బలగాల మోహరింపు
- 32 మంది మహిళా కమాండోలు, 3 వేల మంది ట్రాఫిక్ పోలీసులతో పర్యవేక్షణ
- మెట్రో, రైలు, బస్టాండ్లలో నిశిత నిఘా
- హాట్ బెలూన్లు, పారా గ్లైడర్లపై నిషేధం



న్యూఢిల్లీ : గణతంత్ర వేడుకలకు దేశరాజధాని సిద్ధమైంది. ఈ సందర్భంగా భారీఎత్తున భద్రతా ఏర్పాట్లు చేశారు. 25వేల భద్రతా దళాలను మోహరించారు. ఉగ్రవాద కార్యకలాపాలకు వ్యూహరచన చేసిన ఇద్దరిని ఢిల్లీ పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. వారిని జైషే మహమ్మద్ ఉగ్రసంస్థకు చెందిన అబ్దుల్ లతీఫ్ గనియో (29)అలియాస్ ఉమర్ అలియాస్ దిలావర్; హిలాల్ అహ్మద్ భట్ (26)గా గుర్తించినట్టు పోలీసులు వెల్లడించారు. లాజ్‌పత్ నగర్ మార్కెట్ వద్ద వీరిని గుర్తించారు. హజ్ మంజిల్, తుర్క్‌మెన్ గేట్, పహార్‌గంజ్, ఇండియాగేట్, తూర్పు ఢిల్లీలోని ఐజీఎల్ గ్యాస్ పైప్‌లైన్‌ల వద్ద భద్రతను పెంచడంతో పాటు సునిశిత ప్రాంతాల్లో బహుళ అంచెల భద్రతా ఏర్పాట్లు చేశారు. రాజ్‌పథ్‌లో సీసీటీవీలు, ముఖ గుర్తింపు కెమేరాలు అమర్చామని న్యూఢిల్లీ డిప్యూటీ కమిషనర్ మాధుర్ వర్మ తెలిపారు. రాజ్‌పథ్ నుంచి ఎర్రకోట వరకు సాగే పరేడ్‌ను పర్యవేక్షించేందుకు మొబైల్ టీములు, యాంటీ ఎయిర్ క్రాఫ్ట్ గన్నులతోపాటు షూటింగ్ నిపుణులను రంగంలోకి దించామన్నారు. గతేడాది స్వాతంత్ర్య వేడుకలకు 32 మంది ఢిల్లీ మహిళా కమాండోలు ప్రత్యేక ఆయుధాలు, టాక్టిక్స్(స్వాత్) యూనిట్‌లతో భద్రతను ఏర్పాటు చేశారు. ఎన్ఎస్‌డీలో శిక్షణ పొందిన కమాండోలు కీలకప్రాంతాల భద్రతను పరిరక్షిస్తున్నారు. పరేడ్ ప్రాంతంలోని ప్రజల కదలికలను గమనించే విధంగా బహుళ అంతస్థుల భవనాలపై స్నిప్పర్ డాగ్స్‌తోపాటు సీసీటీవీ కెమేరాలు పనిచేస్తాయి. గగనతలాన్ని పర్యవేక్షణ కోసం యాంటీ ఎయిర్‌క్రాఫ్ట్ గన్నులను సిద్ధంచేశారు. 25 వేల భద్రతా దళాలతో పాటు, కేంద్ర బలగాలను సెంట్రల్ ఢిల్లీలో మోహరించారు. ఆకస్మిక దాడులను ఎదుర్కొనేందుకు కౌంటర్ డ్రోన్ టెక్నాలజీని ఉపయోగిస్తున్నామని సీనియర్ పోలీసు అధికారి వెల్లడించారు. రద్దీగా ఉండే కూడళ్లు, మార్కెట్లు, రైల్వేస్టేషన్లు, బస్టాండ్‌లలో భద్రతను కట్టుదిట్టం చేసినట్టు తెలిపారు. 3వేలమంది సిబ్బంది ట్రాఫిక్‌ను పర్యవేక్షిస్తున్నారన్నారు. గణతంత్ర దినోత్సవానికి తరలివచ్చే అతిథుల కోసం విజయ్ చౌక్, ఎర్రకోట మధ్య ట్రాఫిక్‌ను మళ్లించామని అధికారులు వెల్లడించారు. ప్రయాణికులకు మెట్రోసర్వీసులు అందుబాటులో ఉంటాయన్నారు. కేంద్ర సచివాలయానికి, ఉద్యోగుల భవన స్టేషన్లలో ఉదయం 5 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు; రేస్‌కోర్స్ రోడ్డు, పటేల్ చౌక్ మెట్రోస్టేషన్లలో ఉదయం 8.45 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు ఎవరినీ అనుమతించబోమన్నారు. ఉదయం 9.50 గంటలకు విజయ్ చౌక్ నుంచి పరేడ్ ప్రారంభమవుతుంది. తిలక్‌మార్గ్, బహదూర్ షా జఫర్ (బీఎస్‌జెడ్) మార్గ్, నేతాజీ సుభాష్ మార్గాల నుంచి ఎర్రకోటకు చేరుతుంది. ఉదయం 9 గంటలకు ఇండియాగేట్ వద్ద వేడుక నిర్వహిస్తామని ట్రాఫిక్ పోలీసులు తెలిపారు. రాజ్‌పథ్ మార్గంలో వాహనాలను అనుమతించరు. సి హెక్సగాన్- ఇండియాగేట్ వద్ద శనివారం ఉదయం వరకు పరేడ్ వాహనాలను అనుమతించరు. రిపబ్లిక్ డేలో తిలక్ మార్గ్, సుభాష్‌మార్గాల్లో ఉదయం 10గంటల తర్వాత ప్రయాణికులను అనుమతిస్తామని ట్రాఫిక్ జాయింట్ కమిషనర్ అలోక్ కుమార్ తెలిపారు. దేశరాజధానిలో జనవరి 9 నుంచి ఫిబ్రవరి 9 వరకు ఆకాశంలో ఎగిరే పారాగ్లైడర్స్, పారా మోటార్స్, హాంగ్ గ్లైడర్స్, యూఏవీ, యూఏఎస్ఎస్, మైక్రోలైట్ ఎయిర్ క్రాఫ్ట్, రిమోట్ పైలేట్ ఎయిర్‌క్రాఫ్ట్, హాట్ బెలూన్స్, చిన్నతరహా హాట్ బెలూన్లు, క్వాడ్‌కోప్టర్స్, పారా జంపింగ్ ఎయిర్‌క్రాఫ్ట్‌లను నిషేధించారు. బహిరంగ ప్రదేశాల్లో తనిఖీలను ముమ్మరం చేశారు.

855 మందికి పతకాలు

గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని 855 మంది పోలీసు, పారామిలిటరీ సిబ్బందికి కేంద్రం శుక్రవారం పోలీసు పతకాలను అందజేసింది. వీరిలో 149 మందికి గ్యాలంట్రీ పతకాలను అందజేసింది. వివరాల్లోకి వెళితే, జమ్మూ.కాశ్మీర్, నక్సల్స్ ప్రభావిత ప్రాంతాలు, ఇతర ప్రాంతాల్లో విధులు నిర్వహిస్తున్న పోలీసు, పారామిలిటరీ సిబ్బందికి కేంద్రం పతకాలు అందజేసింది. ధైర్య, సాహసాలు ప్రదర్శించిన సీఆర్‌పీఎఫ్ సిబ్బందికి 44 పురస్కారాలను అందజేసింది. వీరిలో ఒడిశా పోలీసులకు 26 పతకాలు, జమ్మూ, కాశ్మీర్ పోలీసులకు 25 పతకాలు, చత్తీస్‌గఢ్ పోలీసులకు 14 పతకాలు లభించాయి. అత్యున్నత పురస్కారం రాష్ట్రపతి పోలీసు పతకం (పీపీఎంజీ)ను సీఆర్‌పీఎఫ్ సిబ్బంది అందుకుంది. రాష్ట్రాల వారీగా ఇతర గ్యాలంట్రీ పతకాలు సాధించిన వాటిలో వరుసగా, మేఘాలయ (13), ఉత్తరప్రదేశ్ (10), బీఎస్ఎఫ్ (8), ఢిల్లీ (4), జార్ఖండ్ (3), అసోం రైఫిల్స్ (1), ఇండో-టిబెటన్ సరిహద్దు పోలీసు (1)ఉన్నాయి. మొత్తం 146 మంది పోలీసులకు గ్యాలంట్రీ పతకాలు, 74 రాష్ట్రపతి పతకాలు, 632 పోలీసు పతకాలు అందజేసింది.

ఏసీబీ వలలో సీనియర్ అసిస్టెంట్



విశాలాంధ్ర - లింగపాలెం : పశ్చిమ గోదావరి జిల్లా లింగపాలెం మండల పరిషత్ కార్యాలయంలోని సీనియర్ అసిస్టెంట్ కేవీ కృష్ణారావు లంచం తీసుకుంటుండగా శుక్రవారం ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. కొన్ని నెలల క్రితం ఎంపీడీఓగా పని చేసి పదవీ విరమణ చేసిన ఎమ్. కృష్ణకుమారికి ప్రభుత్వం నుంచి రావాల్సిన బిల్లుల విషయంలో సీనియర్ అసిస్టెంట్ ఇబ్బందులు పెడుతున్నాడన్న ఆరోపణల నేపథ్యంలో స్వయంగా జెడ్పీ సీఈవో జోక్యం చేసుకుని బిల్లులు చేయాలని ఆదేశాలు ఇచ్చారు. అయినప్పటికీ సీనియర్ అసిస్టెంట్ రూ.10,000 లంచం డిమాండ్ చేసినట్టు ఏసీబీ డీఎస్పీ వి. గోపాలకృష్ణ తెలిపారు. పదవీ విరమణ చేసిన ఎంపీడీవో సోదరుడు ఎమ్.చినబాబు రూ.5 వేలు ఇస్తుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. కృష్ణారావును కస్టడీలోకి తీసుకున్నారు. దాడిలో ఏసీబీ సీఐ కె. శ్రీనివాసరావు పాల్గొన్నారు. పూర్తి స్థాయి దర్యాప్తు చేస్తున్నట్టు డీఎస్పీ వివరించారు.

విశాఖ బీడీఎల్‌లో అకౌస్టిక్ టాంక్‌టెస్ట్ ఫెసిలిటీ



విశాలాంధ్ర - విశాఖసిటీ : భారత్ డైనమిక్స్ లిమిటెడ్ (బీడీఎల్) విశాఖ యూనిట్‌లో అకౌస్టిక్ టాంక్‌టెస్ట్ ఫెసిలిటీని శుక్రవారం డిఫెన్స్ ప్రొడక్షన్ కార్యదర్శి డాక్టర్ అజయ్‌కుమార్ ప్రారంభించారు. టార్పెడోస్, మైన్స్, సోనోబ్యుయ్స్, డెసియోస్, సంబంధిత నీటిలోపల ఆయుధాలను ఈ విధానం ద్వారా పరీక్షిస్తారు. నీటి అడుగున ఆయుధాల ధ్వని వ్యవస్థను నీటి వాతావరణంలో పరీక్షించడం సాధ్యపడుతుంది. ఈ నూతన ఆన్‌సైట్ పరీక్షా సౌకర్యం ఉత్పాదక సామర్థ్యాలను విస్తృతంగా పెంచుతుంది. ప్రత్యేకంగా భారత నౌకాదళానికి నీటి అడుగున ఆయుధాల తయారీ కోసం ఏర్పాటు చేసిన సంస్థ బీడీఎల్. టార్పెడోస్, ఆకాష్ వెపన్ సిస్టమ్, యాంటీ ట్యాంక్ గైడెడ్ మిస్సైల్స్, కౌంటర్ మెజర్ డిస్పెన్సింగ్ సిస్టమ్‌ను స్నేహ పూర్వక దేశాలకు అందించడం ద్వారా ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందింది. బీడీఎల్ సీఎండీ వి.ఉదయభాస్కర్, ఎన్ఎస్‌టీఎల్ డైరెక్టర్లతో పాటు డిఫెన్స్ రంగాల అధికారులు పాల్గొన్నారు.

15 నుంచి ఛీఫ్ మినిస్టర్ కప్ పోటీలు



విశాలాంధ్ర - విజయవాడ స్పోర్ట్స్ : ఫిబ్రవరి 15 నుంచి 17 వరకు ఆంధ్రప్రదేశ్ క్రీడాప్రాధికార సంస్థ (శాప్), రాష్ట్ర క్రీడాసంఘాల సహాయ సహకారాలతో రాష్ట్రస్థాయి ఛీఫ్ మినిస్టర్ కప్ -2019 పోటీలను స్త్రీ, పురుషుల విభాగాలలో నిర్వహించనున్నట్లు శాప్ ఛైర్మన్ డాక్టర్ పి.అంకమ్మచౌదరి తెలిపారు. ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలోని ఆంధ్రప్రదేశ్ క్రీడాప్రాధికార సంస్థ (శాప్) కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ టోర్నీని రూ. 2 కోట్ల 16 లక్షల వ్యయంతో 18 క్రీడాంశాలలో నిర్వహిస్తున్నామన్నారు. ఈ పోటీలలో పాల్గొనేందుకు రాష్ట్రస్థాయి సీనియర్ ఇంటర్ డిస్ట్రిక్ట్‌లో (టీమ్, వ్యక్తిగత విభాగాలలో) మొదటి 8 స్థానాలలో నిలిచిన జట్లు అర్హత సాధిస్తా యన్నారు. ఈ పోటీలలో పాల్గొనే క్రీడాకారులందరికీ క్రీడాదుస్తులు, మొదటి మూడు స్థానాలలో గెలిచిన క్రీడాకారులకు రూ. 5 వేలు, 3 వేలు, 2 వేలు అంద జేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో శాప్ ఓఎస్‌డీ పి.రామకృష్ణ పాల్గొన్నారు.

రోడ్డుప్రమాదంలో ముగ్గురు మృతి



విశాలాంధ్ర - హనుమాన్‌జంక్షన్ : కృష్ణాజిల్లా బాపులపాడు మండలం కోడూరుపాడు గ్రామ సమీపంలో జాతీయ రహదారిపై శుక్రవారం తెల్లవారుజామున జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ముగ్గురు దుర్మరణం చెందారు. మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. తూర్పుగోదావరి జిల్లా రాయవరానికి చెందిన బద్ది వెంకటేశ్వరరావు (25) అలియాస్ శ్రీను రావులపాలెంలోని ఒక ప్రైవేటు పాఠశాల వ్యాన్ డ్రైవర్. తెలిసిన వ్యక్తి తన ఇన్నోవా కారును గుంటూరులో కారు గ్యారేజీలో అప్పచెప్పి రావాలని వెంకటేశ్వరరావును కోరాడు. దీంతో స్నేహితుడైన రాయవరం గ్రామస్తుడు బొడ్డు రాంబాబు(22)ను తీసుకుని వెంకటేశ్వరరావు ఇన్నోవా కారులో గురువారం రాత్రి గుంటూరు బయలుదేరారు. రావులపాలెం సెంటర్‌లోని ఆర్టీసీ బస్‌స్టాండ్ ఎదుట విజయవాడ వెళ్ళే ముగ్గురు ప్రయాణికులను కారులో ఎక్కించు కున్నారు. శుక్రవారం తెల్లవారుజామున కోడూరుపాడు గ్రామ పరిధిలోని సర్కార్ జూట్‌మిల్లు సమీపంలో అతివేగంగా దూసుకొస్తున్న కారు జాతీయ రహదారి మధ్యలోని డివైడర్‌ను బలంగా ఢీకొని అవతలివైపునకు దూసుకెళ్ళి విజయవాడ నుంచి ఏలూరు వైపు వస్తున్న లారీని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారు డ్రైవర్ వెంకటేశ్వరరావు, అతని స్నేహితుడు రాంబాబు, నిజామాబాద్ బాన్సువాడకు చెందిన ప్రయాణికుడు గుంతక్ సంఘమేశ్వర్ (59) ఘటనాస్థలిలోనే ప్రాణాలు కోల్పోయారు. విజయవాడ కోమలాసెంటర్‌కు చెందిన శ్రీనివాసరావు, రావుల పాలేనికి చెందిన రమణారావు, గుంటూరు ఏటిఅగ్రహారానికి చెందిన జాషువా ఐన్‌స్టీన్ తీవ్రంగా గాయపడ్డారు. హనుమాన్‌జంక్షన్ సీఐ ఎస్.రాజశేఖర్, వీరవల్లి ఎస్ఐ చంటిబాబు సిబ్బందితో ఘటనా స్థలాన్ని పరిశీలించారు. క్షతగాత్రులను చికిత్స కోసం విజయవాడలోని హెల్ప్ ఆస్పత్రికి తరలించారు. మృతదేహాలను గన్నవరం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. తెల్లవారుజామున మంచు ఎక్కువ ఉండటంతో రోడ్డు మధ్య డివైడర్ కనిపించకపోవడం, డ్రైవర్ నిద్రమత్తు కారణంగా ఈ ప్రమాదం జరిగి ఉంటుందని ప్రాథమిక నిర్ధారణకు వచ్చారు.

చిక్కుల్లో రామసింగవరం భూములు

ప్రభుత్వశాఖల మధ్య సమన్వయలోపం పరిపాలనలో డొల్లతనాన్ని బహిర్గతం చేస్తోంది. కోటి ఆశలతో పరిశ్రమలు నెలకొల్పేందుకు ముందుకొచ్చిన యువ పారిశ్రామికవేత్తలను నిరుత్సాహానికి గురిచేస్తోంది. అటవీ, రెవెన్యూ శాఖల అధికారులు భూమి మాదంటే మాదనడం వివాదాస్పదంగా మారింది.

- మాదంటున్న అటవీశాఖ.. కాదంటున్న 'రెవెన్యూ'
- 175 ఎకరాలను ఏపీఐఐసీకి కేటాయించిన రెవెన్యూ
- భూముల్లో నిషిధిత ఫ్లెక్సీలు పెట్టిన అటవీశాఖ
- అయోమయంలో యువ పారిశ్రామికవేత్తలు



నిషేధిత భూమిగా ఫ్లెక్సీ ఏర్పాటు చేసిన అటవీ శాఖ అధికారులు

విశాలాంధ్ర - పెదవేగి : పశ్చిమగోదావరి జిల్లా రామసింగవరం భూముల వివాదం రెవెన్యూ, అటవీ శాఖల మధ్య తేలకపోవడంతో లబ్ధిదారులు అయోమయంలో పడ్డారు. అటవీశాఖకు సంబంధించిన 182 ఎకరాల భూముల్లో 175 ఎకరాలను రెవెన్యూశాఖ ఏపీఐఐసీకి కేటాయించింది. ఆ భూమి రెవెన్యూశాఖకు సంబంధించినది కాదంటూ అటవీశాఖ అధికారులు నిషేధిత భూమిగా ఫ్లెక్సీలు పెట్టడంతో వివాదం మరింత రాజుకుంది. ఈ భూమిలోకి ఎవరైనా అక్రమంగా చొరబడి నిర్మాణాలు చేపడితే శిక్షార్హులంటూ ఆ ఫ్లెక్సీపై అటవీశాఖ హెచ్చరించింది. ఇప్పటికే రెవెన్యూశాఖ రికార్డుల ఆధారంగా 175 ఎకరాలను ఏపీ పరిశ్రమల శాఖకు కేటాయించింది. పరిశ్రమలశాఖ ద్వారా ప్రభుత్వం లేఅవుట్లు వేయించి ప్లాట్లుగా విభజించింది.

ఫేజ్ వన్‌లో ఆటోనగర్ ఏర్పాటుకు యువ పారిశ్రామికవేత్తలను ఆహ్వానిస్తూ పత్రికల్లో ప్రకటనలు జారీ చేసింది. ఈ ప్లాట్లలో పరిశ్రమ నెలకొల్పే ఒక్కో పారిశ్రామికవేత్తకు కనీసం 300 గజాల స్థలాన్ని ఇచ్చేలా ప్రణాళికలు రూపొందించింది. రిజర్వేషన్ల కులాల పారిశ్రామికవేత్తలకు ప్లాట్ల కేటాయింపులో సబ్సిడీ ఇవ్వాలని నిర్ణయించారు. గజం స్థలం రూ.991 చొప్పున రేటు నిర్ణయిస్తూ ఏపీఐఐసీ 328 ప్లాట్లను సిద్ధం చేసింది. ఈ దశలో అటవీశాఖ ఈ భూమి తమదంటూ 175 ఎకరాల చుట్టూ యంత్రాలతో గాడి పెట్టడంతో యువ పారిశ్రామికవేత్తలు కంగుతిన్నారు. పొరపాటున ఏపీఐఐసీకి సొమ్ము చెల్లించి ఉంటే తమ పరిస్థితి ఏమయ్యేదోనని అనుకుంటున్నారు.

భూమి అటవీశాఖదే.. కోర్టులో కేసు నడుస్తోంది

రామసింగవరంలోని నూట ఎనభై రెండున్నర ఎకరాల భూమి అటవీశాఖకు చెందినదే. గతంలో ఈ భూమిని పెదవేగి రెవెన్యూ అధికారులు బడా పారిశ్రామికవేత్తలకు విక్రయించే ప్రయత్నం చేశారు. ఆ సమయంలో అయిదుగురు రెవెన్యూ అధికారులను అప్పటి జిల్లా రెవెన్యూ ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు. ఆ తర్వాత అదే భూమిని రాజకీయ నాయకులు స్వార్థ ప్రయోజనాల కోసం ఒక్కొక్కరికి అరెకరం చొప్పున 350 మంది పేదలకు పంపిణీ చేశారు. సుమారు 16 బోరు బావులను నిర్మించారు. 182 ఎకరాలను సాగు చేసిన పేదలు అరటి, మొక్కజొన్న వంటి కమర్షియల్ పంటలు పండించారు. కొంతకాలం తర్వాత ఆ భూములను తిరిగి స్వాధీనం చేసుకున్న అటవీశాఖ కామవరపుకోట మండలం పోలసిగూడెం గ్రామానికి వన సంరక్షణ సమితిగా అందజేసింది. అటవీ ఉత్పత్తుల మొక్కలను నాటించింది. కొందరు ఆ మొక్కలను పీకివేయడంతో అటవీశాఖ అప్పట్లో కేసులు కూడా పెట్టింది. ఈ వివాదం ఇప్పటికీ ఏలూరు కోర్టులో పెండింగ్‌లో ఉంది. ఇటువంటి పరిస్థితులలో పెదవేగి మండల రెవెన్యూ అధికారులు ఈ భూమి తమదేనంటూ ప్రభుత్వానికి సమాచారమిచ్చి పరిశ్రమల శాఖకు కేటాయించారు. సమాచారం తెలియడంతో అటవీశాఖ భూములని తెలిసేలా ఫ్లెక్సీలు ఏర్పాటుచేశాం.

సత్యనారాయణరాజు
డిప్యూటీ రేంజి అధికారి, ఏలూరు

ఈ భూమి రెవెన్యూశాఖదే

రామసింగవరంలో ఏపీ పరిశ్రమలశాఖకు కేటాయించిన 175 ఎకరాల భూమి రెవెన్యూ శాఖదే. అందుకు సంబంధించి ఆధారమైన రెవెన్యూ రికార్డులు కూడా ఉన్నాయి. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఏపీఐఐసీకి అందజేశాం.

జీజేఎస్ కుమార్
తహశీల్దార్, పెదవేగి

ఏనుగు దాడిలో రైతుకు గాయాలు

విశాలాంధ్ర - కొమరాడ : ఏనుగుల దాడిలో రైతుకు తీవ్ర గాయాలైన సంఘటన శుక్రవారం విజయనగరం జిల్లా కొమరాడ మండలం దుగ్గి గ్రామంలో చోటుచేసుకుంది. కళ్లికోట గ్రామానికి చెందిన బొద్దాన గంగులు దుగ్గి గ్రామ సమీపంలో వ్యవసాయ పనుల నిమిత్తం పొలానికి నీరు కడుతుండగా వెనుక నుంచి వచ్చిన ఏనుగు తొండంతో ఒక్కసారిగా గంగులును పైకిలేపి తీవ్రంగా గాయపరిచింది. దీంతో పైనుండి కిందకు పడిపోయాడు. దీనిని గమనించి క్రేకర్స్ బాంబులు పేల్చగా, అక్కడ నుంచి ఏనుగు వెళ్లిపోవడంతో పెనుప్రమాదం తప్పింది. స్థానికుల సహాయంతో గాయపడ్డ రైతును పార్వతీపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఏనుగుల గుంపు నుంచి తప్పిపోయి, కనిపించిన ప్రతిఒక్కరిపై దాడి చేస్తుందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఏయూ వీసీకి కల్నల్ హోదా

ఎన్‌సీసీ డీడీజీ చేతుల మీదుగా ప్రదానం



విశాలాంధ్ర - విశాఖసిటీ : ఆంధ్ర విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య జి.నాగేశ్వరరావుకు ఎన్‌సీసీ హానరరీ కల్నల్ హోదా లభించింది. విశాఖలోని ఏయూ ఇంజనీరింగ్ కళాశాల వైవీఎస్ మూర్తి ఆడిటోరియంలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఎన్‌సీసీ డీడీజీ ఎన్.ఎన్. రెడ్డి కల్నల్ హోదాను వీసీ నాగేశ్వరరావుకు ప్రదానం చేశారు. ముందుగా ఏయూ వీసీ ఆచార్య జి.నాగేశ్వరరావు ఎన్‌సీసీ దుస్తులలో ఎన్‌సీసీ విద్యార్థుల గౌరవ వందనం స్వీకరించి వేదికపైకి చేరుకున్నారు. ఎన్‌సీసీ అధికారులు కాలర్ ర్యాంక్ బ్యాచ్, క్యాప్‌ను వీసీ నాగేశ్వరరావుకు ప్రదానం చేశారు. ఇకపై ఆయన వర్సిటీ ఎన్‌సీసీకి కల్నల్ కమాండెంట్‌గా వ్యవహరిస్తారు. ఈ సందర్భంగా ఆచార్య జి.నాగేశ్వరరావు మాట్లాడుతూ నేడు తాను కల్నల్ హోదాను సాధించడం ఏయూకి లభించిన గౌరవమన్నారు. నేడు త్రివిధ దళాలలో ఆంధ్ర విశ్వవిద్యాలయం భాగంగా మారిందన్నారు. 1975- 78 సంవత్సరాలలో తాను ఎన్‌సీసీ క్యాడెట్‌గా పనిచేసి సి సర్టిఫికేట్‌ను సైతం సాధించానన్నారు. తాను ఎస్ఎస్‌బీ పరీక్షలో ఉత్తీర్ణత సాధించి రక్షణ రంగాలలో పనిచేయా లని ఆకాంక్షించానన్నారు. ఎస్ఎస్‌బీలో విజయం సాధించి సెకండ్ లెఫ్టినెంట్‌గా ఎంపికైనా కొన్ని కారణాల వలన తాను వెళ్లలేకపోయానన్నారు. ఏయూ రక్షణ రంగాలకు విద్యను అందించే కేంద్రంగా నిలవాలని తాను ఆకాంక్షిస్తున్నానన్నారు.

ఎన్‌సీసీ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ ఎన్.ఎన్. రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు తాము ఎంపిక చేసుకున్న రంగంలో నాయకత్వ లక్షణాలతో ఉన్నతంగా ఎదగాలన్నారు. ఇటువంటి వ్యక్తులు దేశానికి అవసరమన్నారు. దేశ రక్షణకు ఆయుధాలే ప్రధానం కాదని, మేధస్సు ఎంతో కీలకమన్నారు. వీసీ నాగేశ్వరరావు నేటి యువతకు మార్గదర్శకులుగా నిలుస్తారన్నారు. కార్యక్రమంలో వర్సిటీ రెక్టార్ ఆచార్య ఎం.ప్రసాదరావు, రిజిస్ట్రార్ ఆచార్య ఎన్.నిరంజన్, ఎన్‌సీసీ గ్రూప్ కమాండర్ వి.వి. ఎస్ రాజు, ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య పేరి శ్రీనివాసరావు తదితరులు ప్రసంగించారు. వర్సిటీ పాలకమండలి సభ్యులు, కళాశాలల ప్రిన్సిపాల్స్, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.


నకిలీ జీఎస్టీ బిల్లుల సవాళ్లను అధిగమిస్తాం

- దేశవ్యాప్తంగా పలు కేసులు నమోదు
- ఏపీలో నకిలీ రిజిస్ట్రేషన్లు గుర్తింపు
- సీజీఎస్టీ చీఫ్ కమిషనర్ హరేరామ్



విశాలాంధ్ర - విశాఖసిటీ : వస్తు సేవల పన్ను (జీఎస్టీ)కు సంబంధించి ఫేక్ ఇన్‌వాయిస్ (నకిలీ బిల్లులు) ఛాలెంజ్‌ను అధిగమించేందుకు కృషి చేస్తున్నట్టు సీజీఎస్టీ చీఫ్ కమిషనర్ బి.హరేరామ్ తెలిపారు. ఈ మేరకు విశాఖలో ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన జీఎస్టీ కాన్‌క్లేవ్‌లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ నకిలీ బిల్లులకు సంబంధించి దేశవ్యాప్తంగా తమిళనాడు, గుజరాత్, ఒడిశా, అహ్మదాబాద్, చండీఘర్ సహా మరికొన్ని ప్రాంతాల్లో చలామణి అవుతున్నట్టు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఇప్పటికే పలు చోట్ల తనిఖీలు చేసి కొంత మందిని అరెస్ట్ చేశామని, కొంత మొత్తాన్ని రికవరీ చేశామన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించి నకిలీ జీఎస్టీ రిజిస్ట్రేషన్లను గుర్తించామన్నారు. తమిళనాడు, కర్ణాటక దరి ఏపీ సరిహద్దు ప్రాంతాల్లో గుర్తించామన్నారు. వీటిపై నిఘా ఉంచామని, తగు చర్యలు తీసుకుంటామన్నారు. పన్ను విషయంలో కచ్చితంగా రికవరీ చేస్తామన్నారు. ఆన్‌లైన్ సమస్యలు కొన్ని ఉన్నాయన్నారు. తమ వద్ద ఉన్న డేటా, సాంకేతిక సహాయంతో అధిగమిస్తామన్నారు. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి జీఎస్టీలో నూతన విధానాలు ప్రవేశపెడుతున్నామ న్నారు. కాంపోజిషన్ స్కీమ్‌ను తీసుకు వస్తున్నామన్నారు. రూ. కోటి వరకు ఉన్నదాన్ని రూ.కోటిన్నరకు పెంచుతు న్నామన్నారు. ఏడాది మొత్తానికి పన్ను వర్తించేలా త్రైమాసిక చెల్లింపులు చేసుకునే వెసులుబాటు ఉంటుందన్నారు. జీఎస్టీలో 28 శాతం పన్ను పరిధిలోకి వచ్చే వస్తువుల సంఖ్య బాగా తగ్గుముఖం పట్టిందన్నారు. రియల్ ఎస్టేట్ రంగానికి సంబంధించి మంత్రుల గ్రూప్ చర్చలు జరుపుతుందని, వచ్చే జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో కీలక నిర్ణయం తీసుకునే అవకాశం ఉందన్నారు.

గుండెపోటుతో 'అగ్రి' బాధితుడు మృతి



విశాలాంధ్ర- పాలకొల్లు : అగ్రిగోల్డ్ బాధితుల సమస్య పరిష్కారంలో ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరితో మనస్తాపం చెందిన పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లు అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు కొత్త ఆంజనేయులు(68) గురువారం రాత్రి గుండెపోటుతో మృతి చెందారు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. 'అగ్రి'ఉద్యమంలో చురుగ్గా పాల్గొంటున్న ఆయన అగ్రిగోల్డ్ యాజమాన్యానికి ప్రభుత్వం తొత్తుగా మారడాన్ని జీర్ణించుకోలేక పలువురి వద్ద ఆవేదన చెందినట్లు సన్నిహితులు చెబుతున్నారు. ప్రభుత్వ తీరును ఆవేశంగా ప్రశ్నించిన ఆయన చివరికి ఇలా తనువు చాలించారని కుటుంబసభ్యులు వాపోతున్నారు. ఆంజనేయులు మృతి వార్త తెలిసిన వెంటనే శుక్రవారం ఉదయం అసోసియేషన్ ప్రతినిధులు పాలకొల్లులోని ఆయన నివాసానికి చేరుకుని మృతదేహం వద్ద శ్రద్ధాంజలి ఘటించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. నివాళులు అర్పించిన వారిలో అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు శేఖర్, సంతోష్‌కుమార్, కనకం, సుబ్బారావు ఉన్నారు.

ఎన్నికల బరిలోకి బాలయోగి తనయుడు

- అసెంబ్లీకా.. పార్లమెంట్‌కా అన్నది సందిగ్ధం
- తూర్పుగోదావరి టీడీపీ నేతలకు అధిష్టానం సంకేతాలు
- రాబోయే ఎన్నికల్లో పోటీ చేస్తారంటున్న 'తూర్పు' తమ్ముళ్లు



విశాలాంధ్రప్రతినిధి - కాకినాడ : లోక్‌సభ మాజీ స్పీకర్, దివంగత నేత జీఎంసీ బాలయోగి తనయుడు గంటి హరీష్ ప్రత్యక్ష రాజకీయాల్లోకి రానున్నారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేసేందుకు రంగం సిద్ధమయ్యింది. ఇప్పటివరకూ రాజకీయాలకు దూరంగా ఉంటున్న బాల యోగి కుటుంబం హరీష్ రాకతో మరోసారి ప్రజల మధ్యకు రానుంది. హరీష్‌ను ఎన్నికల బరిలోకి దించాలని తెలుగుదేశం పార్టీ అధినాయకత్వం నిర్ణయించింది. అన్ని వర్గాల్లోనూ మంచి పేరున్న బాలయోగి చరిష్మాను రాబోయే ఎన్నికల్లో పార్టీకి అనుకూలంగా మార్చుకోవాలని టీడీపీ నేతలు భావిస్తున్నట్టు సమాచారం. ఈ క్రమంలో బాలయోగి తనయుడి రాజకీయ రంగప్రవేశంపై ఆ పార్టీ ముఖ్యనేతలు పావులు కదుపుతున్నారు. అసెంబ్లీ అభ్యర్థిగానా, పార్ల మెంటు అభ్యర్థిగా పోటీ చేస్తారా అనేది తేలలేదు. శాసనసభ నియోజకవర్గం నుంచి పోటీచేసే అవకాశాలు ఎక్కువ ఉన్నాయని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

దేశ, రాష్ట్ర రాజకీయాల్లో కీలక పాత్ర పోషించిన బాలయోగి 2002 మార్చి మూడవ తేదీన మరణించారు. ఆయన సతీమణి విజయకుమారి ఆ తర్వాత జరిగిన ఉప ఎన్నికల్లో పోటీ చేసి సంవత్సరం మాత్రమే పార్లమెంటు సభ్యురాలిగా కొనసాగారు. ఆ తర్వాత జిల్లాను వదిలి విశాఖకు మకాం మార్చేశారు. అప్పటినుండీ బాలయోగి కుటుంబం రాజకీయాలకు దూరంగా ఉంటోంది. పార్టీ కార్యక్రమాల్లోనూ ఎప్పుడూ ఎవ్వరూ భాగస్వాములు కాలేదు. బాలయోగి తనయుడు హరీష్‌ను రంగంలోకి తీసు కొస్తే పార్టీకి ఎంతో ఉపయోగపడుతుందని టీడీపీ జిల్లా నేతలు ఎప్పటినుండో ఆలోచన చేస్తున్నారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి చినరాజప్ప స్వయంగా హరీష్‌ను రాజకీయాల్లోకి తీసుకొచ్చేలా ప్రోత్సహిస్తున్నారు. చివరికి హరీష్‌కు టీడీపీ సభ్యత్వాన్ని కూడా రాజప్ప ఇంటి నంబరుతోనే నమోదు చేయించారు. టీడీపీ జిల్లా పార్టీ కార్యాలయంలో ఇటీవల జరిగిన ఎన్టీఆర్ వర్ధంతి కార్యక్రమానికి హరీష్‌ను తీసుకువచ్చారు. వచ్చే ఎన్నికల్లో పోటీ చేస్తారని ఆ పార్టీ నాయకత్వం జిల్లాలోని ముఖ్య కార్యకర్తలకు సమాచారం ఇస్తోంది. ప్రస్తుత అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావుపై ప్రజల్లో వ్యతిరేకత ఉందంటూ ఆ పార్టీ నాయకులు ప్రచారం చేస్తున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేయించిన సర్వేలోనూ ఆయనపై వ్యతిరేకత ఉన్నట్టు పార్టీ నాయకులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో రాబోయే ఎన్నికల్లో ఆనందరావును పోటీ నుంచి తప్పుకోవాలని సూచిస్తున్నారనే ప్రచారం సాగుతోంది. అలాగే పార్లమెంటు సభ్యులు పండుల రవీంద్ర బాబును తప్పించి హరీష్‌ను రంగంలోకి దించితే కోనసీమ అంతా టీడీపీకి మేలు జరిగే అవకాశాలు ఉన్నాయంటూ ఆ పార్టీ నాయకులు అంచనాలు వేస్తున్నట్టు వినికిడి. కానీ రవీంద్ర బాబు మాత్రం తాను ఎంపీగానే పోటీ చేస్తానని, ఎమ్మెల్యేగా పోటీ చేయబోనని పార్టీ అధినాయకత్వం వద్ద తేల్చిచెప్పినట్టు తెలిసింది. పి గన్నవరం ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేయాలని కూడా నాయకత్వం కోరినట్లు సమాచారం. అయినప్పటికీ ఎంపీ రవీంద్రబాబు ససేమిరా అనడంతో ఆనందరావును తప్పించి హరీష్‌ను పోటీచేయించాలని చూస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. బాలయోగి కుటుంబం నుంచి హరీష్ పోటీ చేయడం ఖాయమని టీడీపీ వర్గాలు చెబుతున్నాయి.

29న రైతు సమస్యలపై రౌండుటేబుల్ సమావేశం

కేవీవీ ప్రసాద్, పెద్దిరెడ్డి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రైతుల సమస్యల పరిష్కారంపై ఈ నెల 29 మంగళవారం ఉదయం 10గంటలకు విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో రౌండుటేబుల్ సమావేశాన్ని నిర్వహిస్తామని ఏపీ రైతు సంఘాల రాష్ట్ర ప్రధానకార్యదర్శులు కేవీవీ ప్రసాద్, పి.పెద్దిరెడ్డి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం సంయుక్త ప్రకటన విడుదల చేశారు. కేంద్ర, రాష్ట్ర పాలకులు అనుసరిస్తున్న వ్యవసాయ విధానాలకు ప్రత్యామ్నాయ విధానాలను రూపొందించి రైతాంగాన్ని ఆదుకోవాలని కిసాన్ సంఘర్ష్ కో-ఆర్డినేషన్ కమిటీ పిలుపులో భాగంగా రౌండుటేబుల్ సమావేశాన్ని ఏర్పాటు చేస్తున్నామన్నారు. 2019 పార్లమెంటు, అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న దశలో రాజకీయ పార్టీలు తమ ఎన్నికల మేనిఫెస్టోల్లో రైతాంగ సమస్యలకు ప్రాధాన్యతనిచ్చి నిధులు కేటాయించాలనే తదితర అంశాలపై సమావేశంలో చర్చిస్తామని వివరించారు. ఈ సమావేశానికి వివిధ రైతు సంఘాలు, రాజకీయ పార్టీల నేతలను ఆహ్వానించ నున్నామని వెల్లడించారు.

విశిష్ట సేవలు అందించినందుకు పోలీసు పతకాలు

రిపబ్లిక్‌డేను పురస్కరించుకుని నేడు అందజేత

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : రిపబ్లిక్‌డేను పురస్కరించుకుని విజయవాడలో జరిగే గణతంత్ర దినోత్సవ వేడుకల్లో ఉద్యోగంలో విశిష్ట సేవలందించిన పోలీసులకు పతకాలు అందించనున్నారు. పోరంకి స్పెషల్ ఇంటెలిజెన్స్‌బ్రాంచ్ ఎస్పీ అద్దాల వెంకటరత్నం, విశాఖపట్నం డీఎస్పీ కింజరపు వెంకట రామకృష్ణప్రసాద్‌లకు ప్రెసిడెంట్స్ పోలీసు పతకాలు అందిస్తు న్నారు. అలాగే విజయవాడ ఇంటెలిజెన్స్ ఎస్పీ ఎన్.హరికృష్ణ, రాజమహేంద్రవరం డీఎస్పీ వరుపుల సత్తిరాజు, కర్నూలు ఎస్పీఎస్టీసెల్ డీఎస్పీ కొత్తపల్లి వినోద్ కుమార్‌లు పోలీసు పతకాలను అందుకుంటున్నారు. తిరుపతి డీఎస్పీ కె.జనార్ధన్ నాయుడు, విశాఖపట్నం ఏపీఎస్పీ అడిషనల్ కమాండెంట్ పి.మోహన్‌ప్రసాద్, హైదరాబాద్ గ్రేహౌండ్స్ అసాల్ట్ కమాండర్ పి.కిరణ్‌కుమార్, విజయవాడ సీఐ సెల్ ఇన్‌స్పెక్టర్ వి.వేణు గోపాల్ రెడ్డి, ఒంగోలు ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీసు బండారు రాజశేఖర్, విశాఖపట్నం ఏసీబీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీసు మంత్రిప్రగడ వెంకట గణేష్, బంగారుపాలెం సబ్‌ఇన్‌స్పెక్టర్ రోడ్డు సేఫ్టీ ఎన్.గుణశేఖర్, హైదరాబాద్ సీపీఎల్ ఏఆర్ఎస్ఐ షేక్‌ముస్తాక్ అహ్మద్‌భాషా, విశాఖ పట్నం హెడ్‌కానిస్టేబుల్ జి.వెంకట రామారావు, విజయవాడ ఆర్మ్‌డ్ రిజర్వు హెడ్‌కానిస్టేబుల్ జి.సుబ్బారావు, పోరంకి హెడ్‌కానిస్టేబుల్ వై.వీం వెంకట సత్యసాయిప్రకాష్, విజయవాడ రైల్వేపోలీసు కానిస్టేబుల్ బి.వెంకటేశ్వరరావులకు పోలీసు పతకాలను ప్రధానం చేయనున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న దుర్గాభవాని

అన్నింటా విఫలం

- రాష్ట్ర వ్యాప్తంగా ఏరులై పారుతున్న మద్యం
- మహిళలపై పూర్తి వివక్ష చూపుతున్న ప్రభుత్వాలు
- మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెన్మెత్స దుర్గాభవాని

విశాలాంధ్ర బ్యూరో-ఏలూరు : ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య 14వ రాష్ట్ర మహాసభలు జనవరి 29,30,31 తేదీలలో ఏలూరులో జరగుతాయని మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెన్మెత్స దుర్గాభవాని తెలిపారు. స్థానిక జిల్లా సీపీఐ కార్యాలయం స్ఫూర్తి భవన్‌లో గురువారం ఆమె విలేకరులతో మాట్లాడారు. 29న ఏలూరులో 5వేల మంది మహిళలతో మహా ర్యాలీని నిర్వహిస్తామని చెప్పారు. ర్యాలీ ఏలూరులోని టుబాకో కల్యాణమండపం నుంచి బయలుదేరి ప్రధాన వీధుల మీదుగా బహిరంగ సభ జరిగే మునిసిపల్ కార్యాలయం వద్దకు చేరుకుంటుందన్నారు. 13 జిల్లాల నుంచి మహిళలు పెద్ద ఎత్తున తరలి వస్తున్నారని ఆమె తెలిపారు. మహాసభలకు భారత మహిళల జాతీయ సమాఖ్య (ఎన్ఎఫ్ఐడబ్ల్యు) జాతీయ ప్రధాన కార్యదర్శి అనీ రాజా, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ ముఖ్య అతిథులుగా పాల్గొంటారని తెలిపారు. వివిధ జిల్లాల నుంచి వచ్చిన మహిళలతో ప్రదర్శన బహిరంగ సభ అనంతరం 30,31 తేదీలలో టుబాకో మర్చంట్స్ అసోసియేషన్ హాల్‌లో ప్రతినిధుల మహాసభలు జరుగుతాయని తెలిపారు. మహిళల హక్కులు, వారి రక్షణ అంశంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తున్నాయని ఆరోపించారు. దేశంలో ఆహార భద్రత కింద గర్భిణీలకు, పసికందులకు పౌష్టికాహారం అందించాల్సిన కేంద్ర ప్రభుత్వం ఈ విషయంలో పూర్తిగా పట్టనట్లు వ్యవహరిస్తోందని ఆరోపించారు. మధ్యాహ్న భోజన పథకం, అంగన్‌వాడీ కేంద్రాలు, తదితరాల్లో నాసిరకం ఆహారం పిల్లలకు అందిస్తున్నారని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా అన్ని నిత్యావసరాలను తక్కువ ధరలకు అందిస్తామని హామీ ఇచ్చిన చంద్రబాబు ప్రభుత్వం ఈ విషయంలో ఘోరంగా విఫలం చెందడమే కాకుండా, ప్రజా పంపిణీ వ్యవస్థను నిర్వీర్యం చేసిందని విమర్శించారు. రాష్ట్ర వ్యాప్తంగా మద్యం ఏరులై పారుతోందని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్రంలోని నరేంద్రమోడీ ప్రభుత్వం మతతత్వాన్ని పెంచి పోషిస్తూ, లౌకికతత్వానికి తూట్లు పొడుస్తోందని విమర్శించారు. దళితులు ఇతర వర్గాలపై మోడీ హయాంలో దాడులు పెరిగాయన్నారు. మహిళలపై దాడులు పెరుగుతున్నా కేంద్రం పట్టించుకోవడం లేదన్నారు. మరోవైపు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మహిళల పట్ల పూర్తి వివక్ష చూపుతున్నాయన్నారు. సమానపనికి సమాన వేతనం కాగితాలకే పరిమితమైందన్నారు. అసంఘటిత కార్మిక రంగంలో వున్న మహిళలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. ఈవ్‌టీజింగ్‌లో ఆంధ్రప్రదేశ్ ప్రథమ స్థానంలో ఉందని ఆమె ఆరోపించారు. మహిళా సాధికారత కోసం 33 శాతం రిజర్వేషన్ల బిల్లును వెంటనే ఆమోదించాలని, మహిళలపై జరిగే అత్యాచారాలు, దాడులను అరికట్టాలని మహిళా సమాఖ్య డిమాండ్ చేస్తోందన్నారు. దేశవ్యాప్తంగా మహిళలకు ఉచిత విద్య అందించాలని, అశ్లీల వెబ్‌సైట్లను నిషేధించాలని ఆమె డిమాండ్ చేశారు. ఈ అంశాల న్నిటినీ మహాసభల్లో చర్చించి పటిష్ట కార్యాచరణను రూపొందిస్తామన్నారు. విలేకరుల సమావేశంలో మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు నెక్కంటి జగదాంబ, కార్యదర్శి గాళ్ళ శారద, జిల్లా నాయకులు రేమల్లె రోజా, కొండేటి బేబి, ఏలూరు కమిటీ అధ్యక్షురాలు గోపాలుని వినోదిని, కార్యదర్శి అడ్డగర్ల లక్ష్మీ ఇందిర పాల్గొన్నారు.

అవినీతి పునాదులపైనే

(విశాలాంధ్ర బ్యూరో - శ్రీకాకుళం)

ఎన్టీఆర్ గృహ నిర్మాణ పథకంలో అవినీతి తారా స్థాయికి చేరింది. ప్రతిదశలోనూ అధికారులు పర్సంటేజీలు పిండేస్తున్నారు. ఇలా అనధికార కప్పం కట్టలేక.. ఇళ్ల నిర్మాణం మధ్యలోనే లబ్ధిదారులు విరమించు కుంటున్నారు. ఫలితంగా ఒక్క శ్రీకాకుళం జిల్లాలోనే (పట్టణాలు మినహాయిస్తే) వేలాది ఇళ్ల నిర్మాణానికి బ్రేక్ పడింది. ఉభయగోదావరి జిల్లాలు మినహా రాష్ట్రంలో శ్రీకాకుళం జిల్లాకే అత్యధికంగా 17వేలకు పైగా ఇళ్లు మంజూరు చేశామని, సుమారు రూ.6,857 కోట్లు ఖర్చు చేస్తున్నట్టు ప్రభుత్వం గొప్పలు పోతోంది. కానీ ఇప్పటికి కేవలం 458 ఇళ్లే పూర్తయింది. ఆర్థికంగా కాస్తో, కూస్తో బలమైనవాళ్లే ఇళ్ల పని పూర్తి చేయగలిగారు. ఇప్పటికీ పునాదుల స్థాయిలోనే పది వేలకు ఇళ్లు నిలిచిపోయాయి. 4115 మంది లబ్ధి దారులు అసలు పునాదులే వేయలేదు. దీనికితోడు అధి,కారుల చేతివాటానికి అంతూపొంతూ లేదంటే కేవలం ఆరోపణ కాదు. కడకు టీడీపీ కార్యకర్త కూడా ప్రతీ దశలోనూ బిల్లుకు ఐదు శాతం ముడుపులు చెల్లించక తప్పటం లేదు. లేకపోతే బిల్లుల కోసం నెలల తరబడి ఎదురు చూడాల్సిందే. ప్రతీ ఇంటికీ ఎలా లేదన్నా ఓ పాతిక వేలు పర్సంటేజీల రూపంలో చెల్లించా ల్సిన స్థితిలో... లబ్ధిదారులు వెనుకంజ వేస్తున్నారు. దీనికి తోడు లబ్ధిదారుని వాటాగా బ్యాంకులకు ముందే రూ. పాతిక వేలు చెల్లిస్తే రూ.లక్ష వరకూ రుణం మంజూరు చేయాలి. జిల్లాలో ఏ ఒక్క బ్యాంకు ముందుకు రాలేదు.

రెల్లి వీధిలో....!

జిల్లా మొత్తం భారీ వసూళ్ల పర్వానికి తెరలేచింది అన్ని స్థాయిల్లోనూ వాటాలు పంచుకుంటున్నారన్న ఆరోపణలున్నాయి. శ్రీకాకుళం నగరం నడిబొడ్డున రెల్లి వీధిలో జరుగుతున్న వసూళ్లపై అంతా ముక్కున వేలేసు కుంటున్నారు. హయాతినగరం, రెల్లివీధిలలో రెండు చోట్ల ఎన్టీఆర్ అర్బన్ హౌసింగ్ కింద ఇరవై నాలుగు ఇళ్లు నిర్మిస్తున్నారు. ప్రతి ఇంటి నుంచి ఐదుశాతం చొప్పున మంగళవారం ఒక్కరోజే రూ.రెండు లక్షలు వసూళ్లు చేసారు. వీటి వసూళ్లకు టీడీపీకి చెందిన కొందరు మధ్యవర్తులు బయలుదేరి మరో రెండు శాతం అదనంగా 50వేలకు పైగా వసూళ్లు చేసినట్లు తెలుస్తోంది. ఇక్కడ దారిద్ర్యరేఖకు దిగువున ఉండే వారే అధికం. ఇంటి నిర్మాణం పూర్తయితే ఎస్సీల కోసం అదనంగా రూ.50 వేలను చెల్లించాలి. ఆ విషయాన్ని అధికారులు స్పష్టంగా చెప్పకపోవడంతో రెల్లివీధిలోని చాలా మంది లబ్ధిపొంద లేకపోయారు. ఇంటి నిర్మాణం పూర్తి చేసుకున్నా చివరిలో ఇంటి ముందు వేసుకోవాల్సిన లబ్ధిదారుడి పేరుతో పలకకు రూ.1400 (ఉచితంగా ఇవ్వాల్సి ఉంది) చెల్లించాల్సి వస్తోంది. ప్రభుత్వమిచ్చే సబ్సిడీ సొమ్ములకు అదనంగా మరో మూడ్నాలుగు లక్షల రూపాయలు ఖర్చు చేస్తేనే గాని పేదవారి సొంతింటి కల సాకారం కావడం లేదు.

ఇళ్లు కట్టకపోయినా బిల్లు :

వంశధార నిర్వాసిత కాలనీ అయిన మెట్టూరు (కొత్తూరు)లో పరిస్థితి మరింత దయనీయం. ఇక్కడ ఇళ్ళు కట్టకపోయినా కట్టినట్లు నడ్పినోళ్లకి.. ముడుపులు ఇచ్చినోళ్లకి బిల్లులిచ్చేస్తున్న వైనం ఆలస్యంగా వెలుగు చూసింది. వంశధార ప్రాజెక్టు కోసం అసలే ఇళ్లు కోల్పోయి దిక్కుతోచని స్థితిలో అప్పులు చేసి మరీ ఇళ్లు నిర్మిస్తున్న వందలాది మందికి బిల్లులు సకాలంలో చెల్లించటం లేదు. కానీ ఇక్కడ ఎం.శంకరరావు అనే స్థానిక నాయకుడికి మాత్రం పునాది వేసిన వెంటనే బిల్లును అకౌంట్లో జమ చేయించుకున్నట్టు ఆరోపణలు హల్‌చల్ చేస్తున్నాయి. వివిధ దశలలో నిర్మాణంలోని వేర్వేరు ఇళ్ల ఫోటోలు అప్‌లోడ్ చేయించి బిల్లులు కాజేసారని గ్రామస్థులు చెబుతున్నారు. వర్క్ ఇన్‌స్పెక్టర్‌కు ఫిర్యాదు చేస్తే ఇదిగో, అదిగో అంటూ ఆరునెలలు కాలం గడిపేసారని చెబుతున్నారు. బిల్లు కోసం ఎదురు చూస్తున్న లబ్ధిదారులు స్థానిక డిఇని కలిస్తే బిల్లు మంజూరైంది. కానీ వేరే వ్యక్తికి ఖాతాకు జమ చేసిన వైనం బయటపడింది. ఆరునెలలు గడిచినా ఇప్పటికీ వారికి న్యాయం జరగలేదు. మెట్టూరు పరిధిలో పాడలి, దుగ్గపురం, పెద్దమడి, ఇరపాడు, చిన్నకొల్లివలస, చిన సంకిలి, సంకిలి, పెద సంకిలి, కృష్ణాపురంలకు చెందిన నిర్వాసితులకు మొత్తం 640 ఇళ్లు మంజూరయ్యాయి. ఇంటికి తలా రూ.ఐదు వేలు చొప్పున సగం మంది లబ్ధిదారుల నుంచి అధికారులకు ముట్టజెప్పారని ప్రచారం జరుగుతోంది. వాస్తవానికి వీరి ఇండ్లకు జియో ట్యాగింగ్ ఆధారంగా ఒకేసారి డబ్బులు చెల్లించేయ వచ్చు. దశల వారీగా డబ్బులు విడుదల చేసే పద్ధతిని జిల్లా కలెక్టర్ ఇక్కడ రద్దు చేయించారు. మురపాక సరస్వతి, బసవల సరోజని, బసవల రమణమ్మ, పొట్నూరు మిన్నమ్మ, మురపాక భవాని ఇలా ఓ పది మంది వరకూ బిల్లుల కోసం ఎదురు చూస్తున్న వారే. అసలే ఇళ్లు కోల్పోయి నిర్వాసితులయ్యామని, తమపై ఎలాంటి జాలి లేకపోవడం దారుణమంటూ లబ్ధిదారులు బాధ పడుతున్నారు.



రెల్లివీధిలో నిర్మాణంలో ఉన్న అర్బన్ హౌసింగ్ ఇళ్లు



ధర్నాలు సక్సెస్ : ఆర్టీసీ జేఏసీ

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: సిబ్బందికి వేతన సవరణలో న్యాయం చేయాలని కోరుతూ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (ఏపీఎస్ఆర్టీసీ) జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన సమ్మె సన్నాహక ధర్నాలు విజయవంతం అయ్యాయి. వేతనాల పెంపులో భాగంగా 2017 ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి జరగాల్సిన వేతన సవరణపై పే కమిటీ చేస్తున్న జాప్యం, ఫిట్‌మెంట్ 50 శాతం చెల్లించేందుకు యాజమాన్యం అంగీకరించక పోవడం, నష్టాల్లో నడుస్తున్న సంస్థను ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవడం, ప్రభుత్వంలో విలీనం చేయాలనే డిమాండ్లతో ఫిబ్రవరి 6 నుంచి సమ్మెకు పిలుపునిచ్చిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా 128 ఆర్టీసీ డిపోలు, వర్క్‌షాపుల వద్ద జేఏసీ నేతృత్వంలో జరిగిన ధర్నా కార్యక్రమాలకు వివిధ కార్మిక సంఘాల నాయకులు, కార్మికులు పెద్ద సంఖ్యలో హాజరైనట్లు జేఏసీ కన్వీనర్ పలిశెట్టి దామోదరరావు, కో-కన్వీనర్లు సి.హెచ్. సుందరయ్య, వి.వరహాల నాయుడు తెలిపారు. సమ్మె సన్నాహాల్లో భాగంగా శనివారం ఉద్యోగులంతా నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరవుతారని వారు పేర్కొన్నారు. డిమాండ్ల సాధన కోసం ఈనెల 28న రాష్ట్రవ్యాప్తంగా సామూహిక నిరాహార దీక్షలు చేపట్టనున్నట్లు వారు వివరించారు.

నేడు ఈయూ రాష్ట్ర కార్యవర్గ సమావేశం

విజయవాడలోని వై.వి.రావు ఎస్టేట్ సమీపంలోని ఈయూ రాష్ట్ర కార్యాలయంలో రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్వహిస్తున్నట్లు ప్రధాన కార్యదర్శి పలిశెట్టి దామోదర రావు ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు ప్రారంభమయ్యే సమావేశంలో సమ్మె సన్నాహాలు ఏ విధంగా చేయాలని, యాజమాన్యం అవలంభిస్తున్న మొండివైఖరి, ఒకవేళ సమ్మె అనివార్యమైతే ఏవిధంగా ముందుకు వెళ్లాలనే విషయాలపై యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు వై.వి.రావు దిశానిర్దేశం చేస్తారన్నారు. యూనియన్‌పై కార్మికులు పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా సమ్మెనోటీసులో పేర్కొన్న సమస్యలను పరిష్కరించేందుకు కృషిచేస్తామని ఆయన హామీ ఇచ్చారు.

ఏపీ హైకోర్టు పనివేళలు ఇవే

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : ఏపీ హైకోర్టు పనివేళలను మార్పు చేస్తూ హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ నోటిఫికేషన్ ఇచ్చారు. దీని ప్రకారం ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30గంటల వరకు పనిచేస్తుంది. 1.30గంటల నుంచి 2.15గంటల వరకు మధ్యాహ్న భోజన విరామం ఉంటుంది. మరలా మధ్యాహ్నం 2.15గంటల నుంచి సాయంత్రం 4.15గంటల వరకు హైకోర్టు పనిచేస్తుంది. ఈ కొత్త షెడ్యూల్ ఈనెల 28వతేదీ నుంచి అమలులో ఉంటుందని పేర్కొన్నారు.

ఈసీ టోల్‌ఫ్రీ 1950 : సందేహాలకు సమాధానం

విశాలాంధ్ర బ్యూరో-అనంతపురం: భారత ఎన్నికల సంఘం ఒక అడుగు ముందుకేసింది. దేశంలోని ఓటర్లను ఒకే తాటిపైకి తెచ్చేందుకు బృహత్తర కార్యక్రమాన్ని సిద్ధం చేసింది. దేశరాజధాని డిల్లీ నుంచి గల్లీ వరకు ఓటు హక్కు వివరాలు తెలుసుకోవచ్చు. టోల్ ఫ్రీ 1950 నంబరును ప్రారంభించింది. ఈ నంబరుకు ఫోన్‌చేసి సందేహాలు, సమస్యలు చెప్పవచ్చు. సూచనలు, సలహాలు కూడా పొందవచ్చు. తమ జిల్లా ల్యాండ్‌లైన్ ఫోన్ నంబరు కోడ్ డయల్‌చేసిన తర్వాత పై నాలుగు నంబర్లను డయల్ చేయాలి. దాని కోసం కొత్త లైన్ ఏర్పాటుకు చురుగ్గా పనులు సాగుతున్నాయి. లైన్ మ్యాపింగ్ జరుగుతోంది. ఒక ట్రెండు రోజుల్లో లైన్ అందుబాటులోకి వచ్చే వీలుందని అధికార వర్గాలు తెలిపాయి. జిల్లా నిర్వహణ కేంద్రం... భారతదేశంలోని అన్ని కలెక్టర్ కార్యాలయాల్లో జిల్లా నిర్వహణ కేంద్రం (డీసీసీ) ఏర్పాటు చేస్తున్నారు. ఈ కేంద్రం డిల్లీలోని ఎన్నికల సంఘం కార్యాలయానికి అనుసంధానం చేస్తున్నారు. కలెక్టరేట్‌లో ఎన్నికల విభాగంలోని 220000 అనే నంబరును నిర్వహణ కేంద్రానికి ఫోన్ నంబరుగా కేటాయించారు. ఫోన్‌చేసే ప్రతిఒక్కరి సమస్య నమోదవుతుంది.

ఓటర్ల నమోదు, జాబితాను పారదర్శకంగా నిర్వహించాలన్నదే ఎన్నికల సంఘం ప్రధాన ఆశయం. నమోదుకు సంబంధించిన సమస్యలు ఏదైనా ఎస్ఎంఎస్ చేయాలంటే 8374451419నంబరుకు సమాచారం పంపుకోవచ్చు. సమస్యకు రిప్లై కూడా ఇస్తారు. అంతేకాకుండా ఎలెక్షన్స్ ఏటీపీ, ఎన్ఐసీ, ఇన్ అనే వెబ్‌సైట్‌కు సమాచారం పంపవచ్చు.

ఈబీసీ కోటాపై కేంద్రానికి సుప్రీం నోటీసు

స్టేకు నిరాకరణ - మూడు వారాల్లోగా వివరణకు ఆదేశం

న్యూఢిల్లీ : ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు విద్య, ప్రభుత్వోద్యోగాల్లో 10శాతం రిజర్వేషన్ కల్పించాలన్న కేంద్రప్రభుత్వ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లను పరిశీలించిన సర్వోన్నత న్యాయస్థానం వాటిపై కేంద్రప్రభుత్వం సమాధానాన్ని కోరింది. ఈ మేరకు సీజేఐ రంజన్ గొగోయ్, జస్టిస్ సంజీవ్ ఖన్నాతో కూడిన ధర్మాసనం కేంద్రానికి నోటీసు జారీచేసింది. మూడు వారాల్లోగా సమాధానమివ్వాలని ఆదేశించింది. 'ఈ వ్యవహారాన్ని తర్వాత పరిశీలిస్తాం. ముందు నోటీసు ఇవ్వండి' అన్న ధర్మాసనం ఈబీసీ రిజర్వేషన్ల చట్టంపై స్టే ఉండదన్న విషయాన్ని స్పష్టంచేసింది. కేంద్రప్రభుత్వం తరపు సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా కోర్టులో వాదనలు వినిపించారు. ఈ ఫిర్యాదులను విచారించా ల్సిన అవసరం లేదన్నారు. కేంద్రప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంపై స్టే విధించే వీలు ఉండకూడదని గట్టిగా వాదించారు. దీనిపై స్పందించిన ధర్మాసనం.. ప్రస్తుతానికి నోటీసు మాత్రమే ఇచ్చామని పేర్కొంది. మరికొందరు న్యాయవాదులు ఒకేసారి వాదనలు మొదలు పెట్టడంతో 'ఇబ్బందులు సృష్టించేందుకు కోర్టుకు రావద్దు.. తదుపరి కేసును ప్రవేశపెట్టండి' అంటూ సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈబీసీలకు రిజర్వే షన్లు కల్పిస్తూ కేంద్ర ప్రభుత్వం చట్టం చేయడాన్ని సవాల్ చేస్తూ జనహిత్ అభియాన్, యూత్ ఫర్ ఈక్వాలిటీ అనే సంస్థలు దాఖలు చేసిన పిటిషన్లను సర్వోన్నత ధర్మాసనం శుక్రవారం విచారించింది. ఆర్థిక ప్రాతిపదికన వెనుకుబాటుతనాన్ని పరిగణనలోకి తీసుకోలేమని, ఈ బిల్లును కొట్టివేయాలని యూత్ ఫర్ ఈక్వాలిటీ అధ్యక్షుడు కౌషల్ కాంత్ మిశ్రా న్యాయస్థానాన్ని కోరారు. 50శాతానికి మించి రిజర్వేషన్లు ఉండరాదని రాజ్యాంగం స్పష్టంచేయగా, ఆ నిబంధనను ఈ బిల్లు అతిక్రమిస్తోందని పేర్కొన్నారు. 1992లో సంచలనం సృష్టించిన ఇందిరా స్వాహ్నీ కేసులో నాడు తొమ్మిది మంది న్యాయమూర్తులతో కూడిన సుప్రీం ధర్మాసనం తీసుకున్న నిర్ణయాన్ని ప్రస్తావించారు. 'ప్రసుత రూపంలో ఈ బిల్లు రిజర్వేషన్లను 60శాతం వరకు పెంచింది. దీంతో మరిన్ని రాజకీయ పార్టీలు / కుల సంఘాలు కోటా పెంపు కోసం డిమాండు చేయొచ్చు. తద్వారా కేంద్రస్థాయిలోనే కాదు రాష్ట్రస్థాయిలోనూ కోటా డిమాండు తీవ్రతరమయ్యే అవకాశం ఉంది' అని పిటిషనర్ పేర్కొన్నారు. ఇదే తరహాలో వ్యాపారవేత్త తెహ్‌సీన్ పూనావాలా మరో పిటిషన్‌ను దాఖలు చేశారు. ఈ బిల్లును కొట్టివేయాలని కోరారు. అయితే ఆయన పిటిషన్ శుక్రవారం విచారణకు రాలేదు. కాగా, ఈనెల 8,9 తేదీల్లో పార్లమెంటు ఆమోదం పొందిన ఈబీసీ కోటా బిల్లుపై రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ సంతకం చేసిన విషయం తెలిసిందే.

రాఫెల్ స్వల్పకాలిక రాజకీయ వివాదం

ఫ్రెంచ్ రాయబారి అలెగ్జాండర్

న్యూఢిల్లీ : రాఫెల్ ఒప్పందంపై జరుగుతున్న వివాదం స్వల్పకాలిక రాజకీయ వివాదమేనని, దీని ప్రభావం భారత్-ఫ్రాన్స్ మధ్య సంబంధాలపై పడబోదని ఫ్రెంచ్ రాయబారి అలెగ్జాండర్ జీగ్లర్ చెప్పారు. జైపూర్ సాహిత్య ఉత్సవాల్లో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ఇరు దేశాల మధ్య సంబంధాలు 70 ఏళ్లకు పైగా చరిత్రను కలిగినవని తెలిపారు. ఒడుదొడుకుల్లో కూడా ఉభయ దేశాల మధ్య సత్సంబంధాలు కొనసాగాయని తెలిపారు. భారత దేశంలో సుమారు 3 లక్షల మందికి ఫ్రాన్స్ ఉద్యోగావకాశాలు కల్పిస్తోందన్నారు. పర్యాటక, విద్య, రక్షణ రంగాల్లో సహకరిస్తోందన్నారు.

10,061 మందికి ఉద్యోగాలు

ఏపీఎస్ఎస్‌డీసీ ఎండీ కృతిక శుక్లా

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఎ.పి.ఎస్.ఎస్.డి.సి) ఆధ్వర్యంలో అడ్వాంటేజ్ ఏపీ కెరీర్ ఎక్స్‌పో పేరుతో రాష్ట్ర వ్యాప్తంగా రెండు రోజులపాటు నిర్వహించిన మెగా జాబ్ మేళాలో 10,061 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించినట్టు ఎండీ డాక్టర్ కృతిక శుక్లా తెలిపారు. ఈ నెల 23, 24 తేదీల్లో 13 జిల్లాల్లోని 26 ప్రాంతాల్లో మెగా జాబ్ మేళా నిర్వహించామన్నారు. ఈ జాబ్ మేళాకు మొత్తం 37,671 మంది నిరుద్యోగులు హాజరయ్యారు. వివిధ సంస్థలకు చెందిన ప్రతినిధులు హాజరై ఇంటర్వ్యూలు నిర్వహించారు. వీరిలో 10,061 మందికి నియామక పత్రాలు అందజేసినట్టు శుక్లా తెలిపారు. అమెరికన్ ఎక్స్ ప్రెస్, కోరమాండల్ ఫెర్టిలైజర్స్, టెక్ మహీంద్ర, టాటా బిజినెస్ సపోర్ట్ సర్వీసెస్, స్పందన స్ఫూర్తి ఫైనాన్స్, ఎడికో ఇంటిగ్రేటెడ్ సిస్టమ్స్, కోవలెంట్ ల్యాబ్స్, రాక్సా సెక్యూరిటీ సర్వీసెస్ తదితర కంపెనీల ప్రతినిధులు హాజరై ఇంటర్వ్యూలు నిర్వహించారని చెప్పారు

29వరకూ పీఎస్ పోస్టుల గడువు...!

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: పంచాయితీ సెక్రటరీ పోస్టులకు దరఖాస్తుల గడువు తేదీని ఈ నెల 29వరకూ ఏపీపీఎస్సీ పొడిగించింది. ఈ నెల 28లోగా అభ్యర్థులు ఫీజు చెల్లింపునకు అవకాశం కల్పించింది. జిల్లాల వారీగా పంచాయితీ సెక్రటరీల పోస్టుల వివరాలు, ఆన్‌లైన్ దరఖాస్తును వెబ్‌సైట్‌లో పొందుపరిచామని కమిషన్ వెల్లడించింది. పూర్తి వివరాలకు 'పీఎస్‌సి.ఏపీ.గౌవ్.ఇన్' వెబ్‌సైట్‌ను సంప్రదించాలని ఏపీపీఎస్సీ కార్యదర్శి తెలిపారు.

ఎన్నికల కమిషన్ నియంతృత్వ ధోరణి

పీసీసీ ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎన్.తులసిరెడ్డి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఏపీ ఎన్నికల కమిషన్ నియంతృత్వ ధోరణితో వ్యవహరిస్తోందని పీసీసీ ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎన్.తులసిరెడ్డి ఎద్దేవా చేశారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఈవీఎంలపై 22 రాజకీయ పార్టీలకు, కొందరు సైబర్ నిపుణులకు, కొందరు ఓటర్లకు అనుమానాలున్నాయని పేర్కొన్నారు. 120 దేశాల్లో ఎన్నికలు బ్యాలెట్ ద్వారా, 20దేశాల్లో ఈవీఎంల ద్వారా కొనసాగుతున్నాయని వివరించారు. ఈవీఎంలతోనే రాబోయే సార్వత్రిక ఎన్నికలను నిర్వహిస్తామని కేంద్ర ఎన్నికల కమిషన్ చెప్పడం నియంతృత్వమే అవుతుందని తెలిపారు.

మోడీ ఓటమి తప్పదు: జంగా గౌతమ్

రాబోయే ఎన్నికల్లో బీజేపీ అధికారం కోల్పోవడం తథ్యమని పీసీసీ ప్రధాన కార్యదర్శి జంగా గౌతమ్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా ప్రస్తుత రాజకీయ వాతావరణం యూపీఏకు అనుకూలంగా ఉందని..ఇండియా టుడే, సీఓటర్ సర్వేలు తేల్చిచెప్పాయని తెలిపారు. రాహుల్ ప్రధాని కావాలని 75శాతం మంది విశ్వసిస్తున్నారని పేర్కొన్నారు.


డేటా సమర్పణకు గడువు పెంచాలి : ఎస్టీయూ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : రాష్ట్రప్రభుత్వం ఉద్యోగుల వేతనాల చెల్లింపునకు అవసరమైన డేటా సమర్పణకు ఫిబ్రవరి 15వరకూ గడువు పెంచాలని ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సీహెచ్.జోసఫ్ సుధీర్‌బాబు, గాజుల నాగేశ్వరరావు డిమాండు చేశారు. ఈ మేరకు శుక్రవారం వారిద్దరూ ఒక సంయుక్త ప్రకటన విడుదల చేశారు. సమగ్ర ఆర్థిక విధానం(సీఎఫ్ఎంఎస్) ద్వారా గత ఏప్రిల్ నుంచి వేతనాలు చెల్లిస్తున్నారని, ప్రస్తుత డేటా సమర్పణలో అనేక సాంకేతిక ఇబ్బందుల్ని ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు.

హుడా నివాసంలో సీబీఐ సోదాలు

భూసేకరణ కుంభకోణంలో చర్యలు

న్యూఢిల్లీ : హర్యానా ముఖ్యమంత్రి భూపిందర్ సింగ్ హుడా తాజాగా మరోసారి చిక్కుల్లో పడ్డారు. గుర్గావ్‌లో 2009లో 1,417 ఎకరాల భూసేకరణకు సంబంధించిన అవినీతి కేసులో కేంద్ర దర్యాప్తు సంస్థ(సీబీఐ) ఆయన నివాసంలో సోదాలు నిర్వహించింది. ఇందుకు సంబంధించి రోహతక్‌లోని హుడా నివాసంతో సహా గుర్గావ్, ఢిల్లీలోని 20 ప్రాంతాల్లో సీబీఐ బృందాలు సోదాలు నిర్వహించినట్లు అధికారులు శుక్రవారం తెలిపారు. డీఎల్ఎఫ్, ఎమ్మార్ ఎంజీఎఫ్, బిజ్ హోటల్స్, అన్సాల్స్, ఇతరులతో సహా ఈ కేసులో 15 మంది బిల్డర్లతోపాటు హుడా, అప్పటి చీఫ్ అడ్మినిస్ట్రేటర్, ప్రభుత్వ అదనపు ప్రధాన కార్యదర్శి త్రిలోక్ చంద్ గుప్తాలపై కేసులు నమోదు చేసింది. శుక్రవారం ఉదయం ఆయా ప్రాంగణాల్లో సోదాలు జరిపింది. 2009, జనవరి 2న గుర్గావ్‌లో 58-63, 65-67 సెక్టార్‌కు, 2009-2012 మధ్య 1,417 ఎకరాల భూసేకరణ ప్రక్రియలో అవకతవకలపై ఆరోపణలపై సీబీఐకి దర్యాప్తు అప్పగిస్తూ 2017, నవంబరులో సుప్రీంకోర్టు ఆదేశించింది. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు దర్యాప్తు సంస్థ అధికారులు తెలిపారు. 2009, జూన్ 2న గుర్గావ్ సెక్టార్ 58-63, 65-67 వద్ద 1,417.07 ఎకరాల భూసేకరణకు ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసిందన్నారు. అదే సమయంలో 2010, మే 31న 850.10 ఎకరాల భూ సేకరణకు మరో నోటిఫికేషన్ ఇచ్చినట్లు అధికారులు వెల్లడించారు.



సమాజంలోని ఆర్థిక వెనుకబడిన వర్గాలకు సరసమైన ధరలకు అందించేందుకు హర్యానా అర్బన్ డెవెలెప్‌మెంట్ అథారిటీ(హుడా) భూసేకరణ ఉద్దేశించబడినప్పటికీ ఆ లక్ష్యంగా దిశగా సాగలేదు. భూయజమానులను మోసం చేసే ఉద్దేశంతో అప్పటి ముఖ్యమంత్రి భూపిందర్ సింగ్ హుడా, చీఫ్ అడ్మినిస్ట్రేటర్ త్రిలోక్ చంద్ గుప్తాలతో ప్రైవేటు బిల్డర్లు కుమ్మక్కయ్యారని సీబీఐ ఆరోపించింది. ప్రైవేటు మార్కెట్ ధరలకన్నా తక్కువ ధరలకు ప్రైవేటు బిల్డర్లకు భూమిని అమ్మేందుకు ప్రభుత్వం భూసేకరణ నోటిఫికేషన్ జారీ చేయడం ద్వారా కుట్రకు తెరతీసిందని అధికారులు పేర్కొన్నారు. ఇప్పటికీ చాలా భూభాగం ఉపయోగించబడలేదన్నారు. భూసేకరణ ప్రక్రియ నుంచి ఆ భూములు తీసుకునేందుకు హుడాపై బిల్డర్లు ప్రభావం చూపారన్నారు. నోటిఫికేషన్ సమయంలో డెవెలపర్లకు అనుకూలంగా 616.40 ఎకరాల భూమి కేటాయించబడింది. ఆర్ఎస్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, మార్షియల్ బుల్కిన్, మార్కోని ఇన్‌ఫ్రాటెక్, కమాండర్ రియాల్టర్స్, ఎస్‌యూ ఎస్టేట్ ప్రైవేటు లిమిటెడ్, క్రిష్ బిల్డ్‌టెక్, జేఎండీ లిమిటెడ్, గుప్తా ప్రమోటర్స్, హెచ్ఎస్ రియాల్టీ, డీఎస్ఎస్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, సనా రియాల్టర్స్‌లతో సహా ఇతర బిల్డర్లపై సీబీఐ కేసులు నమోదు చేసింది.

'అయోధ్య'పై నూతన రాజ్యాంగ ధర్మాసనం

న్యూఢిల్లీ: అయోధ్య వివాదంపై పిటిషన్లను విచారించడానికి సుప్రీంకోర్టు ఐదుగురు న్యాయమూర్తులతో నూతన రాజ్యాంగ ధర్మాసనాన్ని ఏర్పాటు చేసింది. తొలుత ఏర్పాటు చేసిన రాజ్యాంగ ధర్మాసనంలో ప్రధాన న్యాయమూర్తి రంజన్ గొగోయ్ మార్పులు చేశారు. ఆ ధర్మాస నంలో సభ్యులుగా ఉన్న జస్టిస్ ఎన్వీ రమణ, జస్టిస్ లలిత్ స్థానంలో కొత్తగా జస్టిస్ భూషణ్, జస్టిస్ నజీర్‌లను తీసుకున్నట్టు ప్రకటించారు. జస్టిస్‌లలిత్ గతంలో అయోధ్య కేసులో లాయర్‌గా ఉన్నందున.. తాను ఈ ధర్మాసనంలో కొనసాగలేనని తెలిపారు. జస్టిస్ రంజన్ గొగోయ్ నేతృత్వంలోని ఈ ధర్మాసనంలో జస్టిస్ బాబ్డే, జస్టిస్ భూషణ్, జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ నజీర్‌లు సభ్యులుగా ఉంటారు. ఈ ధర్మాసనం ఈనెల 29 నుంచి అయోధ్య వివాదంపై విచారణ చేపట్టనుంది. జస్టిస్ దీపక్‌మిశ్రా ప్రధాన న్యాయమూర్తిగా ఉన్న సమయంలో అయోధ్య వివాదంపై విచారణ జరిపిన ధర్మాసనంలో జస్టిస్ భూషణ్, జస్టిస్ నజీర్ సభ్యులుగా ఉన్నారు.

మహిళా ఎస్పీ పై మంత్రి దురుసుతనం

బెంగళూరు: సిద్ధగంగ మఠాధిపతి శివకుమారస్వామి అంత్యక్రియల్లో ఓ మంత్రి మహిళా ఎస్పీపై దురుసుగా వ్యవహరించడం వివాదాస్పదమైంది. ఈ ఘటనపై బీజేపీ విమర్శలు గుప్పించింది. జనతాదళ్ ఎమ్మెల్యే మహేశ్ పర్యాటకశాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. మంగళవారం శివకుమారస్వామి అంత్యక్రియల్లోకి పాల్గొనేందుకు తుమ్‌కూర్‌లోని మఠంలోకి వెళుతున్న ఆయనను అక్కడే విధులు నిర్వహిస్తున్న ఎస్పీ దివ్య గోపినాథ్ ఆపారు. దీంతో కోపోద్రిక్తుడైన మంత్రి ఆమెను తీవ్రంగా మందలించారు. ఈ ఘటనతో మనస్తాపానికి గురైన మహిళా అధికారిణి కన్నీళ్లు తుడుచుకుంటూ కనిపించారు. ఈ విషయాన్ని పెద్దది చేయవద్దంటూ మంత్రి ఆమెతో అన్నట్లు సమాచారం. అయితే ఈ ఘటనలో ఎలాంటి విషయం లేదు. భారీ బందోబస్తులో అదొక భాగం మాత్రమే'నని మహిళా ఎస్పీ అన్నారు.



ఫేవరెట్‌గా భారత్

- న్యూజిలాండ్‌తో రెండో వన్డే
- 0-1 తేడాతో లీడ్‌లో టీమిండియా
- సమం చేసేందుకు కివీస్

మౌంట్ మౌంగనుయ్ : న్యూజిలాండ్ పర్యటనను ఏకపక్ష విజయంతో ఆరంభించిన టీమిండియా పూర్తి స్థాయిలో టోర్నీ ఫేవరెట్‌గా మారిపోయింది. పేసర్లు స్పిన్నర్ల జోరుతో బలమైన బ్యాటింగ్ ఆర్డర్ ఉన్న న్యూజిలాండ్‌ను చిత్తు చేసింది. అదే ఊపుతో రెండో వన్డేకు సిద్ధమవుతోంది. తొలివన్డేలో కివీస్ జట్టు తేలిపోయినా.. సొంత గడ్డపై వారిని తక్కువగా చూడలేం. భారత బౌలర్లు రాణించడంతో నేపియర్ వన్డేలో ప్రత్యర్థి తక్కువ లక్ష్యమే నిర్దేశించింది. దీంతో భారత బ్యాటింగ్‌కు పూర్తి స్థాయిలో ఆడే అవకాశం రాలేదు. శిఖర్ ధావన్ తిరిగి ఫాంలోకి రావడం శుభపరిణామమే కానీ మరో ఓపెనర్ రోహిత్ విఫలమైయాడు. న్యూజిలాండ్ పేస్‌ను ఎదుర్కోవడానికి ఇబ్బంది పడి 11 పరుగులకే వెనుదిరిగాడు. భారీ స్కోరు చేయాలంటే రోహిత్ తప్పకుండా రాణించాల్సి ఉంది. కోహ్లి ఎప్పటిలాగే సొగసైన బ్యాటింగ్‌తో ఆకట్టుకున్నాడు. కానీ ఇంకెవరూ బ్యాటింగ్ చేయలేదు. మిడిలార్డర్‌ను పరిక్షించుకునే అవకాశం దక్కలేదు. రెండో వన్డేకు మిడిలార్డర్‌లో నాలుగు, ఐదు స్థానాలలో రాయుడు, కేదార్ జాదవ్‌ను కొనసాగించే అవకాశం ఉంది. పాండ్యపై నిషేధం ఎత్తివేయడంతో అతడు జట్టుతో కలుస్తాడు. కానీ అతడు మూడో వన్డే నుంచే అందుబాటులో ఉంటాడు. మూడో బౌలర్‌గా విజయ్ శంకర్‌ను ఉపయోగించారు. కానీ బే ఓవల్ మైదానంలో పిచ్ స్పిన్‌కు సహకరిస్తుండడంతో విజయ్ స్థానంలో స్పిన్ ఆల్‌రౌండర్ జడేజాను తీసుకునే అవకాశం ఉంది. బౌలింగ్ విభాగంలో భువీ, షమీ, చాహల్, కుల్దీప్‌లు కొనసాగే అవకాశం ఉంది. తొలి వన్డేలో దెబ్బతిన్న కివీస్ రెండో వన్డేలో గట్టి పోటీనిచ్చే అవకాశం ఉంది. షమీ రాణించడంతో ఓపెనర్లు త్వరగానే కోల్పోయినా వారి కెప్టెన్ కేన్ విలియమ్సన్ భారత్ బౌలర్లను సమర్థవంతంగా ఎదుర్కొని అర్థ శతకం సాధించాడు. వారి మిడిలార్డర్ కూడా ఎదురు దాడికి దిగే అవకాశం ఉంది. బ్యాటింగ్‌కు అనుకూలించే ఈ పిచ్‌పై భారీ స్కోరులు వచ్చే అవకాశం ఉంది. ఈ పిచ్‌పై న్యూజిలాండ్ ఈ మధ్యనే శ్రీలంకపై 371 పరుగుల భారీ స్కోరు చేసింది. టీమిండియా మాత్రం ఈ గ్రౌండ్‌లో తొలిసారి ఆడనుంది. ఏదిఏమైనా రెండో వన్డే ఇరు జట్లకు కీలకం కానుంది.



భారత్-ఏ ఘనవిజయం

- ఇంగ్లండ్ లయన్స్‌పై 2-0 ఆధిక్యం
- రాణించిన విహారీ, రహానె

తిరువనంతపురం : భారత్-ఏ ఇంగ్లండ్ లయన్స్ జట్టుపై 138 పరుగుల భారీ విజయం అందుకుని 5 వన్డేల సిరీస్‌లో 2-0 ఆధిక్యంలో నిలిచింది. తొలిత బ్యాటింగ్‌కు దిగిన భారత్-ఏ కెప్టెన్ అజింక్యా రహానే(91), మిడిలార్డర్‌లో హనుమ విహారి (92), శ్రేయస్ అయ్యర్ (65) అర్ధ శతకాలతో రాణించడంతో నిర్ణీత 50 ఓవర్లలో ఆరు వికెట్లు కోల్పోయి 303 పరుగులు చేసింది. లక్ష్య ఛేదన ఆరంభించిన ఇంగ్లండ్ లయన్స్ జట్టు భారత్-ఏ బౌలర్లు థాకూర్, మార్కండే, అక్సర్ పటేల్ రాణించడంతో 37.4 ఓవర్లలో 165 పరుగులే చేసి ఆలౌటైంది. ఇంగ్లండ్ జట్టులో ఓపెనర్ డేవీస్ (48), గ్రెగరీ (39) టాప్ స్కోరర్లగా నిలిచారు. భారత బౌలర్లలో ఠాకూర్ 2 వికెట్లు, మార్కండే 3 వికెట్లు, అక్సర్ పటేల్ 2 వికెట్లు, ఛహర్, విహారీ, కౌల్‌కు ఒక్కో వికెట్టు దక్కింది.



విదర్భ గెలుపు

12 వికెట్లతో మెరిసిన ఉమేశ్

వయనాడ్ : విదర్భ రంజీ జట్టు అదరగొట్టింది. రంజీ ట్రోఫీ ఫైనలో అడుగుపెట్టింది. విదర్భ జట్టుకు ఆడుతున్న టీమిండియా పేసర్ ఉమేశ్ యాదవ్ మ్యాచ్‌లో 12 వికెట్లతో తీసి కీలక పాత్ర పోషించడంతో విదర్భ కేరళ జట్టుపై ఇన్నింగ్స్ 11 పరుగుల తేడాతో విజయం సాధించింది. తొలిసారి రంజీ సెమీస్ ఆడుతున్న కేరళకు నిరాశే మిగిలింది. రెండు రోజుల్లోనే మ్యాచ్ ముగిసిపోయింది. టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకున్న విదర్భ కేరళను తొలి ఇన్నింగ్స్‌లో 106 పరుగులకే ఆలౌట్ చేసింది. ఉమేశ్ 48 పరుగులు ఇచ్చి 7 వికెట్లు పడగొట్టాడు. విదర్భ కూడా 208 పరుగుల తక్కువ స్కోరుకే అలౌట్ అయింది. కెప్టెన్ ఫాజల్ (75) పరుగులతో రాణించాడు. రెండో ఇన్నింగ్స్ ఆరంభించిన కేరళ కేవలం 91 పరుగులకే కుప్పకూలిపోయింది. రెండో ఇన్నింగ్స్ బౌలింగ్‌లోనూ రాణించిన ఉమేశ్ 5 వికెట్లు తీశాడు. దీంతో విదర్భ ఇన్నింగ్స్ విజయం సాధించి ఈ సీజన్ రంజీ ట్రోఫీ ఫైనల్ చేరిన తొలి జట్టుగా నిలిచింది.

మళ్లీ అదే కథ

- మారిన్ చేతిలో ఓడిన సింధు
- సెమీస్‌లో సైనా, శ్రీకాంత్ ఔట్



జకార్తా : భారత స్టార్ షట్లర్ పీవీ సింధు స్పెయిన్ క్రీడాకారిణి కరోలినా మారిన్ చేతిలో మళ్లీ ఓడింది. ఇండోనేషియా మాస్టర్స్ టోర్నీ క్వార్టర్స్ మ్యాచ్‌లో రెండో సీడ్ సింధూ మారిన్ చేతిలో 21-11, 21-12 తేడాతో ఓడి టోర్నీ నుంచి నిష్క్రమించింది. సింధూ రెండు సెట్లలోనూ మారిన్‌కు ఏమాత్రం పోటీ ఇవ్వలేక పోయింది. మరో క్వార్టర్స్ మ్యాచ్‌లో సైనా గెలిచి సెమీస్‌లో అడుగ ుపెట్టింది. 8వ సీడ్ సైనా థాయిలాండ్‌కు చెందిన చౌచువాంగ్‌పై 21-7, 21-18 తేడాతో గెలిచింది. తొలిసెట్‌ను సైనా ఏకపక్షంగా గెలుచుకోగా, రెండో సెట్‌లో ప్రత్యర్థి నుంచి పోటీ ఎదురైనా సైనా 21-18తో సెట్‌ను మ్యాచ్‌ను గెలుచుకుంది. పురుషుల క్వార్టర్స్‌లో శ్రీకాంత్‌కు చుక్కెదురైంది. ఇండోనేషియా ఆటగాడు జొనాటన్ క్రిస్టీ చేతిలో 21-18, 21-19 తేడాతో ఓటమి పాలైయాడు. దీంతో భారత్ తరపున సైనానే టోర్నీలో కొనసాగుతోంది. సెమీస్‌లో సైనా చైనాకు చెందిన 6వ సీడ్ హీ బింగ్‌జియోతో తలపడనుంది.

ఆ ముగ్గురే లక్ష్యం : ట్రెంట్ బౌల్ట్



మౌంట్ మాంగనూయి: రెండో వన్డేలో టీమిండియా టాప్ ఆర్డర్‌ను త్వరగా పెవిలియన్ పంపించడమే తమ ప్రధాన లక్ష్యమని న్యూజిలాండ్ పేసర్ ట్రెంట్ బౌల్ట్ అన్నాడు. శిఖర్ ధావన్, రోహిత్ శర్మ, విరాట్ కోహ్లి వన్డే ఫార్మాట్‌లో ఎలాంటి విధ్వంసం సృష్టించగలరో అందరికీ తెలుసన్నాడు. 'ఒక బౌలింగ్ విభాగంగా మేం ప్రత్యర్థి టాప్ ఆర్డర్‌ను కకావికలం చేసి భారత మిడిలార్డర్‌పై ఒత్తిడి పెంచేందుకు ప్రయత్నిస్తాం. బహుశా వారి రహస్యమూ ఇదే కావొచ్చు. పది ఓవర్లలోపే మూడు వికెట్లు పడగొడితే టీమిండియా శిబిరంలో ఎంత ఒత్తిడి ఉంటుందో మాకు తెలుసు. తొలి వన్డేలో మమ్మల్ని చిత్తుగా ఓడించారు. మేమెక్కడ పొరపాటు చేశామో తెలుసుకున్నాం. కొన్ని తప్పులను దిద్దుకునేందుకు బ్యాట్స్‌మెన్ ప్రయత్నిస్తున్నారు. బ్యాట్స్‌మెన్ వచ్చి నిలదొక్కుకొని భారీ లక్ష్యాలను నిర్దేశిస్తే ఆ తర్వాత ఏం జరుగుతుందో చూడొచ్చు' అని బౌల్ట్ అన్నాడు. గతంలో తమ బ్యాట్స్‌మెన్ క్రీజులో నిలిస్తే భారీ స్కోర్లు చేశారని బౌల్ట్ గుర్తు చేశాడు. ఈ ఫార్మాట్‌లో ముందుగానే వికెట్లు చేజార్చుకుంటే పరిస్థితి ఘోరంగా ఉంటుందన్నాడు. మంచి భాగస్వామ్యాలు లభిస్తేనే చివరి ఓవర్లలో భారీ పరుగులు చేయొచ్చని వెల్లడించాడు. భారత జట్టులో అద్భుతమైన బ్యాట్స్‌మెన్ ఉన్నారని వారిని త్వరగా ఔట్ చేయడం కష్టమేనని పేర్కొన్నాడు. కాగా అందరూ మనుషులే కాబట్టి ఎక్కడో ఓ చోట తప్పు చేయకపోరని ఆశాభావం వ్యక్తం చేశాడు.

నాదల్‌తో పోరుకు జోకో సై

సెమీస్ పౌలీపై ఘన విజయం



మెల్‌బోర్న్ : ప్రతిష్టాత్మక ఆస్ట్రేలియన్ ఓపెన్‌ను రికార్డు స్థాయిలో ఏడోసారి ముద్దాడేందుకు జోకోవిచ్ ఒక్కడుగు దూరానికి వచ్చేశాడు. సెమీస్ ఫైనలో ప్రత్యర్థి లూకాస్ పౌలీపై ఎటువంటి జాలీ చూపకుండా చిత్తుగా ఓడించి టోర్నీ ఫైనలో అడుగుపెట్టేశాడు. చిరకాల ప్రత్యర్థి నాదల్‌ను ఢీ కొట్టడానికి సిద్ధమైయాడు. ఏకపక్షంగా సాగిన సెమీస్‌లో టాప్ సీడ్ జోకో ఫ్రాన్స్‌కు చెందిన 28 సీడ్ లూకాస్ పౌలీని 6-0, 6-2, 6-2 తేడాతో ఓడించాడు. తొలిసెట్‌లో పూర్తి ఆధిపత్యం చూపుతూ పౌలీకి ఎటువంటి అవకాశం ఇవ్వకుండా 6-0 గెలుచుకున్నాడు. రెండు, మూడు సెట్లలో కలిపి పౌలీ కేవలం నాలుగు గేమ్‌లే గెలవగలిగాడు. పౌలీ జోకోకు కనీస పోటీ కూడా ఇవ్వలేకపోయాడు. ఇప్పటికే జోకోవిచ్ ఆస్ట్రేలియన్ ఓపెన్‌ను అత్యధికంగా 6సార్లు గెలుచుకుని ఫెదరర్‌తో సమానంగా ఉన్నాడు. ఈ ఏడాది గెలిస్తే అత్యధిక ఆస్ట్రేలియన్ ఓపెన్ల వీరుడిగా రికార్డు కెక్కనున్నాడు. కానీ జోకోవిచ్‌కు ఫైనలో రఫా గట్టిపోటీనే ఇవ్వనున్నాడు. దీంతో నెంబర్ 1, నెంబర్ 2ల మధ్య అదివారం జరిగే తుదిపోరు అభిమానులను అలరించనుంది. ఇదిలా ఉంటే శుక్రవారం జరిగిన మహిళల డబుల్స్ ఫైనలో జ్యాంగ్-సమాంతా స్టోసర్ జోడీ టోర్నీ విజేతగా నిలిచింది. వీరి జోడీ మ్లదెనోవిచ్-బబోస్ జోడీపై 6-3, 6-4 తేడాతో విజయం సాధించింది.



టీమిండియాకు వినూత్న స్వాగతం

మౌంట్ మాంగనుయ్: టీమిండియా-న్యూజిలాండ్ జట్ల మధ్య జరుగుతున్న వన్డే సిరీస్‌లో భాగంగా కోహ్లిసేన మౌంట్ మాంగనుయ్ చేరుకుంది. ఈ సందర్భంగా భారత జట్టుకు అక్కడ ఘన స్వాగతం లభించింది. అక్కడి మావోరి తెగ కోహ్లిసేనకు వినూత్నంగా స్వాగతం పలికింది. వారి సంప్రదాయం ప్రకారం 'కాపా హాకా' నృత్యం చేసి భారత జట్టును ఆనందర పర్చారు. మావోరీ తెగకు చెందిన వ్యక్తులు ఒక జట్టుగా చేరి పెద్దగా అరుస్తూ లయబద్ధంగా కాలుపదపడమే 'కాపా హాకా' నృత్యం ప్రత్యేకత. బే ఓవల్ పరిసర ప్రాంతాల్లో ఈ తెగ ప్రజలకు నివసిస్తూ ఉంటారు. కోహ్లిసేన రెండో వన్డే సందర్భంగా అక్కడికి చేరుకోవడంతో వారిని సాదరంగా ఆహ్వానించారు. దీనికి సంబంధించిన ఫొటోలను, వీడియోలను బీసీసీఐ ట్విటర్ ద్వారా పంచుకుంది. మరోవైపు టీమిండియా కోచ్ రవిశాస్త్రి సైతం ఇన్‌స్టాగ్రామ్ వేదికగా ఈ ఫొటోను షేర్ చేశాడు. దీంతో ఇవి వైరల్‌గా మారాయి. టీమిండియా-కివీస్ జట్ల మధ్య రెండో వన్డే శనివారం మౌంట్ మాంగనుయ్‌లో జరగనుంది.

'ఏపీపీఎస్సీ' ముట్టడికి యత్నం

- ముదిరిన 'ఓపెన్'లో మెరిట్ రిజర్వుడు వివాదం
- విద్యార్థి, యువజన, కేవీపీఎస్, మాలమహానాడు ఆందోళన
- నేతల అరెస్టు.. పోలీసుస్టేషన్‌కు తరలింపు



విశాలాంధ్ర బ్యూరో - అమరావతి : ప్రభుత్వ ఉద్యోగాల ఎంపిక ప్రక్రియలో మెరిట్ రిజర్వుడు అభ్యర్థులను ఓపెన్ కేటగిరిలోకి అనుమతించకుండా ఏకపక్ష నిర్ణయాలకు పాల్పడుతున్న ఏపీపీఎస్సీ ఛైర్మన్ ఉదయ్‌భాస్కర్‌ను పదవి నుంచి తొలగించాలని డిమాండు చేస్తూ శుక్రవారం ఆ కార్యాలయం ముట్టడికి విద్యార్థి, యువజన, సామాజిక సంఘాలు ప్రయత్నించాయి. రాజ్యాంగ విరుద్ధమైన నిర్ణయాలకు పాల్పడుతున్న ఏపీపీఎస్సీ ఛైర్మన్ వైఖరిని తూర్పారబట్టాయి. విజయవాడ ఎంబీవీకే భవన్ నుంచి బందరురోడ్డు మీదుగా ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్, ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ, పీడీఎస్‌యూ, కేవీపీఎస్, మాలమహానాడు తదితర ప్రజాసంఘాల నేతలు ఏపీపీఎస్సీ కార్యాలయం ముట్టడికి బయలుదేరారు. దీంతో పోలీసులు వారికి ఎదురుగా వచ్చి అడ్డుకునేందుకు ప్రయత్నించారు. ఆందోళనకారులు పోలీసుల వలయాన్ని దాటుకుని ఏపీపీఎస్సీ కార్యాలయం వద్దకు చేరుకున్నారు. ఏపీపీఎస్సీని వ్యాపార సంస్థగా మారుస్తున్నారని, రిజర్వేషన్ వర్గాలకు వ్యతిరేకంగా ఛైర్మన్ పని చేస్తున్నారని మండిపడ్డారు. యూపీఎస్సీ తరహా సిలబస్‌తో నిర్వహిస్తున్న గ్రూప్-1, 2 పరీక్షలకు సిద్ధమయ్యేందుకు అభ్యర్థులకు సమయం సరిపోదని, తక్షణమే వాటిని వాయిదా వేయాలని డిమాండు చేశారు. ఏఐవైఎఫ్, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు సయ్యద్ అఫ్సర్, ఎం.సుబ్బారావు, డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు రామన్న, ఎం.సూర్యారావు, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు ఎ.అశోక్, పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు రవిచంద్ర, కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆండ్ర మాల్యాద్రి ఆందోళనకు నాయకత్వం వహించారు. పోలీసులు అక్కడకు చేరుకుని ఉద్యమకారులను అరెస్టు చేశారు. ఈ సమయంలో పోలీసులకు, యువజన, విద్యార్థి సంఘాల నేతల మధ్య తీవ్ర వాగ్వివాదం నెలకొంది. వారిని అరెస్టు చేసి విజయవాడ గవర్నరుపేట పోలీసుస్టేషన్‌కు తరలించారు.

ఏపీపీఎస్సీ ఛైర్మన్ ఏకపక్ష నిర్ణయాలు

అఫ్సర్, సుబ్బారావు, ఏఐవైఎఫ్, ఏఐఎస్ఎఫ్ నేతలు

ఉదయ్‌భాస్కర్ అనుసరిస్తున్న ఏకపక్ష నిర్ణయాల వల్ల రిజర్వుడు అభ్యర్థులకు తీవ్ర నష్టం వాటిల్లుతోంది. తక్షణమే ఆయన్ని పదవి నుంచి తొలగించాలి. యూపీఎస్సీ తరహాగా గ్రూప్-1, 2 పరీక్షలకు భారీగా సిలబస్ రూపొందించారు. ఏడాదిపాటు చదవాల్సిన సిలబస్‌కు రెండు నెలల్లోగా పరీక్షలకు షెడ్యూలు నిర్వహించి అభ్యర్థులను గందరగోళానికి గురిచేస్తున్నారు. తక్కువ పోస్టులతో నోటిఫికేషన్లు విడుదల చేసి, లక్షలాది మంది అభ్యర్థుల నుంచి ఫీజులు వసూలు చేస్తున్నారు.

రాజ్యాంగ విరుద్ధ నిర్ణయాలు

సూర్యారావు, అశోక్, డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ నేతలు

గ్రూప్-1, 2 మెయిన్ పరీక్షల్లో టాపర్‌గా నిలిచిన రిజర్వుడు అభ్యర్థులకు ఓపెన్ కేటగిరీలకు అర్హత లేదంటూ ఛైర్మన్ ఉదయ్‌భాస్కర్ రాజ్యాంగ విరుద్ధమైన నిర్ణయాలకు పాల్పడుతున్నారు. గతంలో ఎన్నడూ లేనంతగా గ్రూప్-1, 2 పరీక్షలకు ఏపీపీఎస్సీ సిలబస్ ప్రవేశపెట్టారు. మార్చి 10 నుంచి పరీక్షలు ప్రారంభమైతే.. అభ్యర్థులు అర్హత సాధించడం కష్టమవుతుంది. తక్షణమే గ్రూప్-1, 2 పరీక్షలను వాయిదా వేసి, సమయం పెంచాలి.

ఛైర్మన్‌ను తొలగించాలి

ఆండ్ర మ్యాల్యాద్రి, కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

ఛైర్మన్ ఉదయ్‌భాస్కర్‌ను తక్షణమే తొలగించాలి. ఈయన బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి రిజర్వేషన్ వర్గాలకు వ్యతిరేకంగా నిర్ణయాలు తీసుకుంటున్నారు. ఓపెన్ కేటగిరీలోకి ప్రతిభ గల ఎస్సీ, ఎస్టీ, బీసీ, మహిళా అభ్యర్థులు రాకుండా అడ్డుకున్నారు.

ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు రవిచంద్ర, కేవీపీఎస్ నాయకుడు నటరాజ్, మాలమహానాడు రాష్ట్ర కార్యదర్శి జి.మనోహర్, విద్యార్థి, యువజన సంఘాల నేతలు చరణ్‌సాయి, మల్లేష్, సుందరయ్య, రాజేష్, క్రాంతి పాల్గొన్నారు.

డిమాండ్లు ఇవీ..

- ఏపీపీఎస్సీ ఆధ్వర్యాన నిర్వహించే అన్ని ఉద్యోగాల భర్తీ ప్రక్రియ పరీక్షలకు ఓపెన్ కేటగిరిలోకి మెరిట్ రిజర్వుడు అభ్యర్థులను తీసుకోవాలి.
- సమయం తక్కువగా ఉన్నందున గ్రూప్-1, 2 పరీక్షలను తక్షణమే వాయిదా వేయాలి.
- ఆఫ్‌లైన్లోనే అన్ని ఏపీపీఎస్సీ పరీక్షలను నిర్వహించాలి.
- ఎస్టీ కమిషన్ ఆదేశించిన విచారణకు ఈ నెల 31న ఏపీపీఎస్సీ ఛైర్మన్, కార్యదర్శులు హాజరవ్వాలి.
- ఏపీపీఎస్సీ ఛైర్మన్ పదవికి ఐఏఎస్ స్థాయి కేడర్ అధికారిని నియమించాలి.

ఆర్‌బీఐకి సుప్రీం నోటీసులు

న్యూఢిల్లీ : రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ)కు సుప్రీంకోర్టు శుక్రవారం నోటీ సులు జారీ చేసింది. ఆర్టీఐ దరఖాస్తు కింద కోరిన సమాచారం ఇవ్వకపోవడమే కోర్టు ఆగ్ర హానికి కారణమైంది. కొన్ని బ్యాంకుల్లో జరిపిన తని ఖీలు, సహారా గ్రూపునకు చెందిన కంపె నీల్లో జరిగిన అవకతవలకు సంబంధించి సమాచార హక్కు చట్టం కింద ఓ దరఖాస్తు దారుడు కోరిన నివేదికలను ఇవ్వడానికి ఆర్బీఐ నిరాకరించింది. కోరిన సమాచారం ఇవ్వడా నికి కేంద్ర బ్యాంకు నిరాకరించిందని దరఖా స్తుదారుడు వేసిన పిటిషన్ ఆధారంగా జస్టిస్ నాగేశ్వర్‌రావు నేతృత్వంలోని ధర్మాసనం ఆర్‌బీఐకి నోటీసులు జారీ చేసింది. ఏప్రిల్, 2011 నుంచి ఐసీఐసీఐ బ్యాంకు, యాక్సిస్ బ్యాంకు, హెచ్‌డీఎఫ్‌సీ, ఎస్‌బీఐల్లో చేపడుతున్న తనిఖీల వివరాలను వెల్లడించాలంటూ 2015 లో ముంబైకు చెందిన గిరిష్ మిట్టల్ తన దరఖాస్తులో కోరారు. అలాగే సహారా గ్రూప్, బ్యాంక్ ఆఫ్ రాజస్థాన్‌లో ఆర్‌బీఐ గుర్తించిన అవకతవకలకు సంబంధించిన కాపీలు ఇవ్వా లని కోరారు. అందుకు ఆర్‌బీఐ నిరాకరిం చింది. ఇది 'సమాచార నిరాకరణ' కిందికే వ స్తుందని పిటిషనర్ తన పిటిషన్‌లో పేర్కొ న్నారు. ప్రభుత్వ, ప్రైవేటు రంగాలకు చెందిన బ్యాంకులతో కేంద్ర బ్యాంకు ఎటువంటి అను చితమైన సంబంధాలు నెరపరాదని గతంలో సర్వోన్నత న్యాయస్థానం ఇచ్చిన రూలింగ్‌ను పిటిషనర్ ఈ సందర్భంగా ప్రస్తావించారు.



సీపీఐ జిల్లా కార్యదర్శి దేగా ప్రభాకర్‌కు రూ.25 వేలు విరాళాన్ని అందచేస్తున్న ఎంపీ మాగంటి బాబు

మహాసభలకు ఎంపీ విరాళం

విశాలాంధ్ర - ఏలూరు : ఏలూరులో ఈ నెల 29,30, 31 తేదీలలో జరగనున్న ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య రాష్ట్ర 14వ మహాసభలకు సీపీఐ, మహిళా సమాఖ్యల ఆధ్వర్యంలో ఏలూరు నగరంలో శుక్రవారం విరాళాలు సేకరించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి దేగా ప్రభాకర్ ఆధ్వర్యంలో మహిళా నాయకులు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ బృందం ఏలూరు ఎంపి మాగంటి వెంకటేశ్వరరావును కలుసుకుని మహాసభలకు విరాళం ఇవ్వాలని కోరారు.ఎంపీ బాబు రూ.25,000లను దేగా ప్రభాకర్‌కు అందచేశారు. ఈ సందర్భంగా మాగంటి బాబుకు ప్రభాకర్ కృతజ్ఞతలు తెలిపారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : MUTYALA PRASAD. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2018-20, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.